# జాతీయ స్ఫూర్తి


పక్షపత్రిక

RNI Regn No. 52879/93

2021 జనవరి 1-31

వెల : రూ. 50


## రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం




## రిపబ్లిక్ దినోత్సవ ప్రత్యేక సంచిక

## 2021 జనవరి 26

# ఈ రిపబ్లిక్ డే ప్రత్యేకతలు

**సంపాదకీయం**

మన రిపబ్లిక్ దినోత్సవాలు వస్తున్నాయి. సంబరాలతో సాగిపోతున్నాయి. సామాన్యులకి మాత్రం అచ్చేదిన్ రావడం లేదు. ఇక ముందువచ్చే జాడ కూడా కనిపించడం లేదు. ఈ రిపబ్లిక్‌డే కోవిడ్ నేపథ్యంలో జరుగుతున్నది. ఈ విపత్తు కూడా సామాన్యుల నెత్తినే పడింది. లక్షలాది మంది ఉపాధిని కోల్పోయారు. కోట్లాది మంది బతుకు బజారుపాలైంది. ఇంతటి కల్లోలంలోనూ కార్పొరేట్‌లు మాత్రం లబ్ధి పొందారు. ఆర్థిక ప్యాకేజీలో ఉద్దీపనల పేరుతో అయిన కాడికి దండుకున్నారు. అభివృద్ధి, ప్రజాస్వామ్యానికి సంబంధించిన అన్ని సూచీలలోనూ భారత్ స్థానం దిగజారింది.

దీనికి తోడు రిపబ్లిక్ చుట్టూ హిందూత్వ నీలినీడలు కమ్ముకొస్తున్నాయి. హిందూత్వ లక్ష్యాలను సాధించడానికి మోదీ ప్రభుత్వం వడివడిగా పావులు కదుపుతున్నది. చట్టాల మీద చట్టాలను చేస్తున్నది. ఇప్పటికే ఒకే దేశం ఒకే పన్ను చట్టాన్ని తెచ్చింది. పన్నులు వేసే హక్కును రాష్ట్రాలకు లేకుండా చేసింది. ఒకే దేశం ఒకే భాష అన్న నినాదాన్ని అదను దొరికినప్పుడల్లా దేశం మీద రుద్దడానికి సిద్ధపడుతోంది. పౌరసత్వ చట్టాల పేరుతో ప్రజల్ని మతప్రాతిపదికపై చీల్చడానికి పూనుకుంది. ఇప్పుడు ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో ప్రాంతీయ వైవిధ్యాలను ప్రాంతీయ పార్టీల అస్తిత్వాన్ని బలహీనపర్చి దేశాన్ని ఒకే రాజకీయ ముద్దగా చేసి మెజారిటీవాదాన్ని, హిందూత్వ మత జాతీయవాదాన్ని ఎన్నికల ఎజెండా చేయడానికి గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది. కాదన్న వాళ్ళ నోరు నొక్కే చట్టాలను, ఈ మూస పద్ధతిని వ్యతిరేకించే వారిని భయభ్రాంతులను చేసే మూకదాడులను ప్రత్యేకించి కొన్ని మతపరమైన, సామాజికపరమైన వర్గాల మీద సాగుతున్నది. ప్రజల సమస్యల చుట్టూ తిరగాల్సిన రాజకీయాన్ని హిందూత్వ చుట్టూ తిప్పడాన్ని సాగిస్తున్నది. దేశ రాజ్యాంగం మీద, రిపబ్లిక్ లక్ష్యాల మీద నిస్సిగ్గుగా దాడి చేస్తున్నది.

ఇలాంటి విపత్కర పరిస్థితులలోనూ కొన్ని ఆశాకిరణాలు కనిపిస్తున్నాయి. కార్మికులు, కర్షకులు మోదీ ప్రభుత్వ విధానాలపై పోరుబాట పట్టారు. 2020 నవంబరు 26 భారత ప్రజా ఉద్యమ చరిత్రలో కొత్త అధ్యాయానికి తెర తీసింది. కార్మిక హక్కుల్ని కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు-కర్షకులు ఉమ్మడి కార్యాచరణకు దిగారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ జరగని రీతిలో 25 కోట్ల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

నవంబరు 26 నుండి నేటి వరకూ రైతులు ఆందోళన కొనసాగుతూనే వున్నది. గడ్డకట్టే చలిలో ప్రాణాలను పణంగా పెట్టి రహదారుల దిగ్బంధాన్ని కొనసాగిస్తున్నారు. మోదీ ప్రభుత్వాన్ని ఒక్కొక్క మెట్టు కిందతీవికి దిగేలా ఈ ఉద్యమం సాగుతున్నది. రైతు చట్టాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం మలిదశలో కార్పొరేట్లను బోనులో నిలబెట్టింది. కార్పొరేట్ రంగం నిజ స్వరూపాన్ని మొత్తం దేశం చర్చించే స్థితిని తెచ్చింది. రైతులు, కార్మికులు సాగిస్తున్న ఈ ఉద్యమాలు ఆర్థిక సమస్యల నుండి రాజకీయ విధానాల వైపు నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులు, కార్మికుల సమస్యలకు ప్రత్యామ్నాయ రాజకీయమే మార్గం అన్న స్పృహ ప్రారంభం అయింది.

కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యలు దేశ ప్రజలకు మరో మార్గాన్ని సూచిస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్మికుల కనీస వేతనాలను కేరళ ప్రభుత్వం 1800కు పెంచింది. కేంద్రం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరపై స్వామినాధన్ కమీషన్ చేసిన సిఫారసుకు అనుగుణంగా 50 శాతం మద్దతు ధరను పెంచి కొనుగోలు చేస్తున్నది. ప్రత్యామ్నాయ రాజకీయ ఆవశ్యకతను ఇది నిరూపిస్తున్నది.

దేశంలో తొలిసారి ప్రముఖంగా ముందుకొచ్చిన కార్మిక కర్షక ఐక్యతను స్థిరపరచుకోవడం, బలపర్చుకోవడం మీదే ఈ ప్రత్యామ్నాయ రాజకీయ ముందుకు సాగుతుంది. ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా ఈ ఉద్యమాలు ప్రత్యామ్నాయ రాజకీయానికి పోరాడే శక్తులుగా ముందుకు సాగాలి. ఈ ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటాన్ని కార్మికులు, కర్షకుల ఐక్యతలో విశాల ప్రజానీకాన్ని సమీకరించే దిశగా అడుగులు వెయ్యాలి. ఈ ఉద్యమాల ఆశాజ్యోతి పురోగమిస్తే రిపబ్లిక్‌ను చుట్టు ముడుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. ❑

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక
వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు
2021 జనవరి 1-31 సంపుటి : 29 సంచిక : 7,8

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 50/- రూపాయలు

## ఈ సంచికలో...


3 రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్
6 భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు – విధులు
10 భారతదేశ ప్రజలమగు మేము... కె. శ్రీనివాస్
12 రాజ్యాంగ సందేహం మాడభూషి శ్రీధర్
18 రాజ్యాంగం భగవద్గీత కాదు హెచ్చార్కె
22 ఫాసిస్టు పాలనలోరాజ్యాంగం సంగిరెడ్డి హనుమంత రెడ్డి
27 చట్ట వ్యతిరేకమైన కేంద్రీకృత పాలన దిశగా! ప్రభాత్ పట్నాయక్
29 రాజ్యాంగ ఫలాలు దక్కాలంటే ఉమ్మడి పోరే మార్గం డాక్టర్ అబ్దుల్ నూర్ బాషా
32 ఆర్థిక, మత శక్తుల జమిలి ఎజెండా ఎ. కృష్ణారావు
34 హిందూత్వ ఎజెండాలో భాగమే జమిలి ఎన్నికలు డి వి వి ఎస్ వర్మ
37 మోదీకి ప్రత్యామ్నాయం అంకురిస్తుందా ? కొండుభట్ల రామచంద్రమూర్తి
42 మరో భారతదేశం ఇప్పటికీ సాధ్యమేనా ? అవిజిత్ పాథక్
45 అన్నదాతలకే కాదు.. అందరికీ ముప్పే పి. సాయినాథ్
47 వ్యవసాయదారుని కోణంలో రైతు సమస్యలు డా॥ సి. కృష్ణమోహనరావు
51 కార్మిక చట్టాలను పాతరేస్తున్న మోడీ సర్కార్ పాలడుగు భాస్కర్
53 మతాలు కాదు, మనిషే ప్రమాదంలో ఉన్నాడు డాక్టర్ దేవరాజు మహారాజు
55 అసత్యాలే ఆయుధాలుగా రామ్ పునియాని
57 రాజ్యాంగ పరిరక్షణకు మరో జాతీయోద్యమం డి సోమసుందర్
60 మీడియాను మింగేస్తున్న కార్పొరేటీకరణ, కాషాయీకరణ కోసూరి అమర్‌నాథ్
63 చరిత్ర, విద్య, సాంస్కృతిక రంగాలలో కాషాయీకరణ వకుళాభరణం రామకృష్ణ
70 విద్యలో కాషాయీకరణ డి రమేష్ పట్నాయక్
73 సంపూర్ణ ఆరోగ్య భారతం కావాలి డా॥ యం.వి. రమణయ్య
75 అడకత్తెరలో ఆధునిక మహిళ డా॥ పి. సంజీవమ్మ
78 ఈ దీనత్వాన్ని తొలగించలేమా ? చందు సుబ్బారావు
80 ఓ స్వేచ్ఛా ! గొంతెత్తి గర్జించు కొత్తపల్లి రవిబాబు


## కృతజ్ఞతలు

జాతీయస్ఫూర్తి పత్రికను, ప్రత్యేక సంచికలను ఆదరిస్తున్న పాఠకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. ఈ పత్రికకు వ్యాపారదృష్టి లేదు. అందుకే పత్రిక కావాలన్న ఆసక్తి గలవారు పోస్టల్ అడ్రస్ పంపితే వారందరికీ ఉచితంగా పత్రికను అందిస్తున్నాం. ఎవరైనా విరాళాలు ఇస్తే సంతోషిస్తాం.

ప్రగతిశీల భావాలతో వివిధ స్రవంతులకు ఈ పత్రిక వేదికగా వుంటుంది. ఈ ప్రయత్నంలో వైవిధ్యంతో పాటు భావవైరుధ్యాలు వుంటాయి. అయితే వాటి కలబోతకు ఇదొక సాధనం మాత్రమే. ఇలా వివిధ స్రవంతుల రచయితల యిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

రాష్ట్రంలో వివిధ పత్రికలలో వస్తున్న కొన్ని వ్యాసాలను కూడా పాఠకులకు అందుబాటులో ఒకే చోట ఉండేలా ప్రచురిస్తున్నాం. ప్రత్యేకించి ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవ తెలంగాణా, ప్రజాపక్షం పత్రికల యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. ఇంగ్లీషులో వస్తున్న వ్యాసాలను కూడా తగిన సంఖ్యలో అందించాలన్న కోరిక వున్నా అనువాదకులు అంతగా లేని లోటు వుంది. అనువాదాలు చెయ్యగల మిత్రులు ముందుకు వస్తే అదీ నెరవేరుతుందని ఆశిస్తున్నాం. అందరికీ మరోసారి కృతజ్ఞతలు.

సంపాదకవర్గం
జాతీయ స్ఫూర్తి

సమాచారం కోసం 8500 678977, 8374 101719

# రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్

**రాజ్యాంగ నిర్ణయసభ చివరి సమావేశంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 1949 నవంబర్ 25న చేసిన ముగింపు ఉపన్యాసం**

(లాంచనప్రాయమైన కృతజ్ఞతలు, స్థూల అంశాలు, ఉపోద్ఘాతం ముగిసిన తర్వాత)

జనవరి 26, 1950న భారతదేశం స్వతంత్ర దేశంగా మారుతుంది. ఆ స్వాతంత్ర్యానికి ఏమవుతుంది? భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోగలుగుతుందా, లేదా మరొకసారి కోల్పోతుందా? నా మదిలో మెదులుతున్న మొదటి ఆలోచన ఇది. భారతదేశం గతంలో స్వాతంత్ర్యం అనుభవించిన దేశమే. కాని అది తన స్వాతంత్ర్యాన్ని ఒకసారి కోల్పోయింది. అది తన స్వాతంత్ర్యాన్ని రెండోసారి కోల్పోతుందా? ఈ ఆలోచనే భవిష్యత్తు పట్ల నన్ను ఆందోళనలో ముంచెత్తుతున్నది.



భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని ఒకసారి కోల్పోయిందనే విషయం మాత్రమే కాదు, ఆ ఓటమి తన సొంత ప్రజల అవిధేయత వల్లా, విద్రోహం వల్ల జరిగిందనే విషయం నన్ను తీవ్రంగా కలచివేస్తున్నది.

సింధ్‌ను మహమ్మద్ బిన్ కాసిం దురాక్రమిస్తున్నప్పుడు రాజు దహర్ దగ్గర పనిచేస్తుండిన సైనికాధికారులు మహమ్మద్ బిన్ కాసిం తైనాతీల నుంచి లంచాలు తిన్నారు. తమ సొంత రాజు కోసం యుద్ధం చేయడం మానుకున్నారు. మహమ్మద్ ఘోరీ భారతదేశం మీద దండెత్తుతున్నప్పుడు ఆహ్వానించినవాడూ, పృథ్వీరాజు మీద యుద్ధం చేయమనీ, తానూ, సోలంకి రాజులూ సహకరిస్తామని చెప్పినవాడూ జైచంద్. శివాజీ హిందువుల విముక్తి కోసం పోరాడుతున్నప్పుడు ఇతర మరాఠా ప్రభువులూ రాజపుత్ర రాజులూ మొఘల్ చక్రవర్తుల పక్షం వహించారు. సిక్కు పాలకులను మట్టి కరిపించడానికి బ్రిటిష్ వారు ప్రయత్నిస్తు న్నప్పుడు సిక్కుల ప్రధాన సైనికాధికారి గులాబ్ సింగ్ మౌనంగా కూచుని, సిక్కు రాజ్యాన్ని కాపాడకుండా ఉండిపోయాడు. 1857లో భారతదేశంలో అత్యధికభాగం బ్రిటిష్ వారి మీద స్వాతంత్ర్య యుద్ధం ప్రకటించినప్పుడు, సిక్కులు ఆ పరిణామాలకు మౌనసాక్షులుగా నిలిచిపోయారు.

ఆ చరిత్ర పునరావృతమవుతుందా? ఆ ఆలోచనే నాలో ఆందోళన నింపుతున్నది. కులాలు, మతాల రూపంలోని మన పాత శత్రువులతో పాటు, ఇక ముందు మనకు విభిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన రాజకీయ అభిమతాల రాజకీయ పార్టీలెన్నో ఉండబోతున్నాయనే వాస్తవం గుర్తిస్తే నా ఆందోళన మరింత పెరుగుతున్నది. భారతీయులు తమ దేశాన్ని తమ మతం కన్న ముందు పెడతారా, లేక మతాన్నే దేశం కన్న ముందు పెడతారా? నాకు తెలియదు. కాని నిశ్చితంగా చెప్పగలదేమంటే రాజకీయ పార్టీలు గనుక దేశం కన్న మతాన్నే పైన పెట్టేట్టయితే, మన స్వాతంత్ర్యం రెండోసారి కూడ ప్రమాదం లో పడుతుంది. బహుశా ఎప్పటికీ కోల్పోయే స్థితి వస్తుంది. ఈ దుష్పరిణామం రాకుండా మనందరమూ నిర్ణయాత్మకంగా పనిచేయవలసి ఉంది. మన చివరి రక్తపు బొట్టు వెచ్చించి అయినా సరే మన స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి మనం దృఢదీక్ష తీసుకోవలసి ఉంది.

1950 జనవరి 26న భారతదేశం ఒక ప్రజాస్వామిక దేశంగా మారనున్నది. అంటే ఆ రోజు నుంచి భారతదేశం ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు ఉండే ప్రభుత్వాన్ని చూడబోతున్నది. ఇక్కడ కూడ నాలో అదే ఆలోచన తలెత్తుతున్నది. భారత ప్రజాస్వామిక రాజ్యాంగానికి ఏమవుతుంది? భారతదేశం ఆ రాజ్యాంగాన్ని నిర్వహించుకో గలుగుతుందా లేక దాన్ని కూడ కోల్పోతుందా? నా మదిలో మెదులుతున్న రెండో ఆలోచన ఇది. మొదటి ఆలోచనలాగనే ఇది కూడ నన్ను ఆందోళన పరుస్తున్నది.

భారతదేశానికి ప్రజాస్వామ్యం అంటే తెలియదని కాదు. ఒకానొక కాలంలో భారతదేశం నిండా గణతంత్ర రాజ్యాలుండేవి. రాచరికాలు ఉన్నప్పుడు కూడ అవి ఎన్నికల ద్వారానో, పరిమిత అధికారాలతోనో ఉండేవి. ఎప్పుడూ సంపూర్ణ నిరంకుశాధికారాలు లేవు. భారతదేశానికి ప్రజా ప్రాతినిధ్య సభలూ పార్లమెంటరీ పద్ధతులూ కూడ తెలియనివేమీ కావు.

బౌద్ధుల భిక్కు సంఘాలను అధ్యయనం చేస్తే, ఆ సంఘాలు పార్లమెంట్లుగా వ్యవహరించాయని మాత్రమే కాదు, ఆధునిక కాలానికి తెలిసిన పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలన్నీ ఆ సంఘాలకు కూడ తెలుసుననీ, అవి వాటిని పాటించాయనీ కూడ అర్థమవుతుంది. ఎవరు ఎక్కడ కూచోవాలో సూత్రాలున్నాయి.

ప్రతిపాదనలు ఎలా పెట్టాలో, తీర్మానాలు ఎలా ప్రవేశపెట్టాలో, కనీసం ఎంత మంది ఉంటే నిర్ణయాలు తీసుకోవాలో చెప్పే సూత్రాలు, ఒక వైఖరి తప్పనిసరిగా తీసుకోవాలని నియంత్రించే సూత్రాలు (విప్), వోట్ల లెక్కింపు, రహస్య వోటింగ్, అభిశంసించే తీర్మానాలు, క్రమబద్ధీకరణ, నిర్ణయం జరిగిపోయిన అంశం మీద చర్చను నియంత్రించే సూత్రాలు వగైరా ఎన్నో ఉన్నాయి. స్వయంగా బుద్ధుడే సంఘ సమావేశాలలో ఈ పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలను వర్తింపజేసినప్పటికీ, ఆయన తన కాలంలో దేశంలో ఉనికిలో ఉండిన రాజకీయ ప్రాతినిధ్య సభల సూత్రాలనే గ్రహించి ఉంటాడు.

ఆ ప్రజాస్వామిక వ్యవస్థను భారతదేశం కోల్పోయింది. మరి రెండోసారి కూడ దాన్ని కోల్పోతుందా? నాకు తెలియదు. కాని సుదీర్ఘకాలంగా వినియోగంలో లేని, ఏదో కొత్తగా వచ్చినదిగా గుర్తించబడుతున్న ప్రజాస్వామ్యాన్ని పాటిస్తున్న భారతదేశంలో ప్రజాస్వామ్యం స్థానంలో నియంతృత్వం తలెత్తే ప్రమాదం ఎంతగానో ఉంది. ఇప్పుడు కొత్తగా జన్మిస్తున్న ప్రజాస్వామ్యం కేవలం రూపంలో మాత్రమే మిగిలిపోయి, వాస్తవంలో నియంతృత్వం తలెత్తడానికి చాల అవకాశం ఉంది. ఏదో ఉత్పాతం జరిగితే, ఈ రెండో ప్రమాదం వాస్తవంగా మారే అవకాశం మరింతగా ఉంటుంది.

మనం ప్రజాస్వామ్యాన్ని కేవలం రూపంలో మాత్రమే కాక, వాస్తవంగా నిలుపుకోవాలంటే ఏం చేయవలసి ఉంది?

నా అంచనాలో మనం చేయవలసిన మొట్టమొదటి పని మన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి ఉండాలి. దాని అర్థమేమంటే మనం విప్లవపు రక్తపాత పద్ధతులను వదిలివేయాలి. దాని అర్థమేమంటే మనం పౌర శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి పద్ధతులను వదిలివేయాలి. ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సాధించడానికి రాజ్యాంగబద్ధ పద్ధతులకు అవకాశం లేనప్పుడు, రాజ్యాంగేతర పద్ధతులు ఉపయోగించడానికి చాల సమర్థనీయమే. కాని రాజ్యాంగబద్ధమైన పద్ధతులకు అవకాశం ఉన్నప్పుడు, రాజ్యాంగేతర పద్ధతులు ఉపయోగించడానికి సమర్థన లేదు. ఆ పద్ధతులు కేవలం అరాచక పద్ధతులు మాత్రమే అవుతాయి. వాటిని మనం ఎంత తొందరగా వదులుకుంటే అంత మంచిది.

రెండో విషయం, ప్రజాస్వామ్య నిర్వహణ మీద ఆసక్తి ఉన్న వాళ్లందరికీ జాన్ స్టువార్ట్ మిల్ చేసిన హెచ్చరికను పాటించడమే మనం చేయవలసిన పని. అదేమంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎంత గొప్ప వారి పాదాల దగ్గరైనా పెట్టకపోవడం, ఎంత గొప్పవారినైనా నమ్మి ప్రజాస్వామిక వ్యవస్థలను తిరగదోయగల అధికారాన్ని వారి చేతుల్లో పెట్టకపోవడం. దేశానికి తమ యావజ్జీవిత సేవలు అందించిన మహానుభావుల పట్ల కృతజ్ఞత చూపడం తప్పేమీ కాదు. కాని కృతజ్ఞతకు కూడ పరిమితు లున్నాయి. ఐరిష్ దేశభక్తుడు డానియెల్ ఓకానెల్ సరిగ్గా చెప్పినట్టుగా, ఏ పురుషుడూ తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేంత, ఏ మహిళా తన శీలాన్ని పోగొట్టుకునేంత, ఏ దేశమూ తన స్వేచ్ఛను త్యాగం చేసేంత కృతజ్ఞత ఉండగూడదు. భారతదేశం విషయంలో ఏ దేశం కన్నా మరింత ఎక్కువగా ఈ హెచ్చరిక అవసరం. ఎందుకంటే, భారతదేశపు రాజకీయాల్లో భక్తి లేదా ఆరాధనా మార్గం, లేదా వీరపూజ ప్రపంచంలోని మరే దేశ రాజకీయాల్లో కన్న ఎక్కువ పాత్ర వహిస్తాయి. మతంలోనైతే భక్తి అనేది ఆత్మ విమోచనకు మార్గం కావచ్చు. కాని రాజకీయాల్లో భక్తి లేదా వీరపూజ పతనానికి కచ్చితమైన మార్గం. అంతిమంగా అది నియంతృత్వానికే దారి తీస్తుంది.

మనం చేయవలసిన మూడో విషయం , కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతృప్తి చెందకుండా ఉండడం. మనం మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తయారు చేయవలసి ఉంది. పునాదిలో సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు. సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? అంటే స్వేచ్ఛను, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని జీవనసూత్రాలుగా గుర్తించే జీవన విధానం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఈ సూత్రాలను వేరువేరుగా ఉండే త్రిమూర్తులుగా భావించగూడదు. అది మూడు మూర్తులు కలిసిన ఒకే ఐక్యసూత్రం. వాటిలో ఒకదాని నుంచి మరొకదాన్ని వేరు చేస్తే అసలు ప్రజాస్వామ్య ప్రయోజనమే దెబ్బ తింటుంది.

స్వేచ్ఛను సమానత్వం నుంచి వేరు చేయడానికి వీలులేదు. సమానత్వాన్ని స్వేచ్ఛ నుంచి వేరు చేయడానికి వీలు లేదు. స్వేచ్ఛనూ, సమానత్వాన్ని సౌభ్రాతృత్వంతో వేరు చేయలేము. సమానత్వం లేకుండా స్వేచ్ఛ మాత్రమే ఉంటే అది అనేకుల మీద కొందరి ఆధిపత్యాన్ని సృష్టిస్తుంది. స్వేచ్ఛ లేకుండా సమానత్వం మాత్రమే ఉంటే అది వ్యక్తిగతచొరవను చంపివేస్తుంది. సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛా సమానత్వాలు సహజంగా వికసించలేవు. వాటిని అమలు చేయడానికి సౌభ్రాతృత్వం రక్షక భటుడుగా ఉండాలి.

భారత సమాజంలో ఈ మూడింటిలో రెండు ఎంతమాత్రం లేవనే గుర్తింపుతో మనం ప్రారంభిద్దాం. ఆ రెంటిలో ఒకటి సమానత్వం. సామాజిక తలంలో భారత సమాజం తారతమ్య అసమానత సూత్రం పునాదిగా ఉంది. ఈ సమాజంలో కొందరికి అపార సంపద, అసంఖ్యాకులు దుర్భర దారిద్ర్యంలో జీవించే స్థితి ఉంది.

జనవరి 26, 1950న మనం ఒక వైరుధ్యమయమైన జీవితంలో ప్రవేశించబోతున్నాం. రాజకీయాలలోనేమో మనకు సమానత్వం ఉంటుంది. సామాజిక ఆర్థిక జీవనంలో మాత్రం మనకు అసమానత్వం ఉంటుంది. రాజకీయాలలో మనం ఒక మనిషికి ఒక ఓటు ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తాం. కాని మన సామాజిక, ఆర్థిక జీవనంలో మన సామాజిక ఆర్థిక వ్యవస్థ కారణంగా ఒక మనిషికి ఒక విలువ అనే సూత్రాన్ని నిరాకరించడం కొనసాగిస్తాం. ఈ వైరుధ్యమయమైన జీవితాన్ని ఎంత కాలం కొనసాగించగలం? మన సామాజిక, ఆర్థికజీవనంలో సమానత్వాన్ని నిరాకరిస్తూ ఎంత కాలం కొనసాగగలం? ఆ నిరాకరణను మనం ఎంత ఎక్కువ కాలం కొనసాగనిస్తే, అంత ఎక్కువ కాలం మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో ఉంచుతూనే ఉంటాం. వీలైనంత త్వరగా మనం ఈ వైరుధ్యాన్ని రద్దు చేయవలసి ఉంది. అలా జరగకపోతే, అసమానత వల్ల బాధలు అనుభవిస్తున్నవారు ఈ రాజ్యాంగ నిర్ణయ సభ సుదీర్ఘ కాలం కష్టపడి నిర్మించిన మన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పేల్చివేస్తారు.

మనలో కొరతగా ఉన్న రెండో అంశం సౌభ్రాతృత్వ భావనను గుర్తించకపోవడం. సౌభ్రాతృత్వం అంటే ఏమిటి? సౌభ్రాతృత్వం అంటే భారతీయులందరి మధ్య ఒక ఉమ్మడి సోదర భావన. భారతీయులందరమూ ఒకటే అనే భావన. మన సామాజిక జీవనానికి ఐక్యతను, సంఘీభావాన్ని ఇచ్చే సూత్రం అది. కష్ట సాధ్యమైన సూత్రం అది. ఈ సౌభ్రాతృత్వాన్ని సాధించడం ఎంత కష్టమో అమెరికా సంయుక్త రాష్ట్రాల విషయంలో అమెరికన్ కామన్వెల్త్ గురించి జేమ్స్ బ్రైస్ రాసిన సంపుటంలో తెలుస్తుంది.

ఆ కథను బ్రైస్ రాసిన మాటల్లోనే వివరిస్తాను. "కొన్ని సంవత్సరాల కింద అమెరికన్ ప్రొటెస్టెంట్ ఎపిస్కోపల్ చర్చ్ తన త్రిశతజయంతి సమావేశంలో తన ప్రార్థనా గ్రంథానికి సవరణలు చేయాలని తలపెట్టింది. దాని చిన్న వాక్యాల ప్రార్థనలలో యావత్ ప్రజా సమూహానికీ వర్తించే మాటలు చేర్చాలని అనుకున్నారు. ఒక ప్రముఖ మతాచార్యుడు 'భగవంతుడా, మా దేశాన్ని దీవించు' అనాలని ప్రతిపాదించాడు. ఆ మధ్యాహ్నం తక్షణమే ఆ మాటను అందరూ ఆమోదించారు. మర్నాడు ఆ వాక్యం పునఃపరిశీలనకు వచ్చింది. ఎందరెందరో ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'దేశాన్ని' అనే మాట వాడితే జాతీయ ఐక్యత గురించి ఒక నిశ్చిత గుర్తింపు ధ్వనిస్తున్నదని, అది కుదరదని అభ్యంతరాలు వచ్చాయి. ఆ మాటను వదిలేశారు. చివరికి అందరికీ ఆమోదయోగ్యమైన 'భగవంతుడా, సంయుక్త రాష్ట్రాలను దీవించు' అనే వాక్యాన్ని అంగీకరించారు. ఈ ఘటన జరిగినప్పుడు అమెరికా సంయుక్తరాష్ట్రాల మధ్య సంఘీభావం అంత తక్కువగా ఉండింది. అమెరికాప్రజలు తమను తాము ఒక దేశంగా కూడ గుర్తించుకోలేదు. అమెరికా ప్రజలే అలా తమది ఒక దేశం అని గుర్తించలేకపోయినప్పుడు, భారతీయులు తమను తాము ఒక దేశం అని గుర్తించడం ఎంత కష్టం?

రాజకీయ అభిప్రాయాలున్న భారతీయులు భారతదేశ ప్రజలు' అనే మాటను అంగీకరించని రోజులు ఉండేవని నాకింకా గుర్తుంది. ఆ మాట బదులు వాళ్లు 'భారత జాతి' అనాలని భావించేవారు. కాని మనం ఒక జాతి అని అనుకోవడంలో మనం ఒక పెద్ద భ్రమలో బతుకుతున్నామని నాకనిపిస్తుంది. వేలాది కులాలుగా విభజింపబడిన ప్రజలు ఒక జాతిగా ఎలా ఉండగలరు? జాతి అంటే ఉండే సామాజిక, మనస్తత్వపరమైన అర్థంలో మనం ఇంకా ఒక జాతి కామని మనం ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. అలా గుర్తించినప్పుడు మాత్రమే మనం ఒక జాతిగా రూపొందవలసిన అవసరాన్ని గ్రహించగలం. ఆ గమ్యాన్ని చేరడానికి ఉన్న మార్గాలూ సాధనాలు ఏమిటో తీవ్రంగా ఆలోచించగలం. ఆ లక్ష్యాన్ని సాకారం చేసుకోవడం నిజంగా చాల కష్టతరమైనది. అది అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కన్న ఎక్కువ కష్టతరమైనది. అమెరికాలో కులసమస్య లేదు. భారత దేశంలో కులాలు ఉన్నాయి. కులాలు దేశద్రోహకరమైనవి. అవి ఎందుకు దేశద్రోహకరమైనవంటే, మొట్టమొదట అవి సామాజిక జీవనంలో వేర్పాటును తీసుకువస్తున్నాయి. అలాగే అవి ఎందుకు దేశద్రోహకరమైనవంటే అవి కులానికీ కులానికీ మధ్య ఈర్ష్యాసూయలనూ, వైమనస్యాన్నీ సృష్టిస్తాయి. కాని వాస్తవంగా మనం ఒక దేశంగా, జాతిగా మారాలని కోరుకుంటే ఈ అవరోధాలన్నిటినీ అధిగమించవలసి ఉంది. ఎందుకంటే ఒక్క దేశం, ఒక్క జాతి ఉన్నప్పుడు మాత్రమే సౌభ్రాతృత్వం అనేది సాధ్యమవుతుంది. సౌభ్రాతృత్వం లేకుండా సమానత్వమూ స్వేచ్ఛా అనేవి పైన వేసిన రంగుల కన్న ఎక్కువ లోతుకు పోజాలవు.

మన ముందు ఉన్న కర్తవ్యాల గురించి ఇవీ నా ఆలోచనలు. ఇవి కొందరికి అంత సంతోషకరంగా ఉండకపోవచ్చు. కాని ఒక మాట చెప్పక తప్పదు. ఈ దేశంలో రాజకీయాధికారం అనేది సుదీర్ఘ కాలంగా అతి కొద్ది మంది గుత్తాధిపత్యంగా ఉండిపోయింది. అశేష ప్రజానీకం కేవలం గొడ్డుచాకిరీకి మాత్రమే కాదు, వేటాడబడే జంతువులుగా కూడ ఉండిపోయారు. కొందరికి ఉన్న గుత్తాధిపత్యం వల్ల అశేష ప్రజానీకానికి తన జీవన పరిస్థితులు మెరుగుపరచుకునే అవకాశాలు నిరాకరించబడడం మాత్రమే కాదు, వారి జీవన ప్రాధాన్యత అనేదే వారి నుంచి కొల్లగొట్టబడింది. ఈ అణగారిన వర్గాలు ఇంకెంతమాత్రమూ పాలించబడడానికి సిద్ధంగా లేవు. తమను తాము పాలించు

☞ మిగతా 9వ పేజీలో

# భారత రాజ్యాంగం

# ప్రాథమిక హక్కులు - విధులు

## భారతదేశంలో ప్రాథమిక విధులు

**(ఆంగ్లం : Fundamental Duties)**

1976 భారత రాజ్యాంగ 42వ సవరణ ప్రకారం భారతదేశపు పౌరులకు ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. అధికరణ 51-ఏ, ప్రకారం పది ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. పౌరులకు ఇవ్వబడిన ఈ పది విధులు, వ్యక్తగత, పరిసరాల పట్ల, సమాజం పట్ల మరియు దేశం పట్ల తమ విద్యుక్త ధర్మాన్ని తెలియజేస్తాయి.[1] 2002 భారత రాజ్యాంగ 86వ సవరణ ప్రకారం 11వ విధి ఇవ్వబడింది. ఈ విధి, "తండ్రి గాని, సంరక్షకుడు గాని, తమ బిడ్డలకు 6-14 వయస్సు వరకు విద్యా బోధన చేపట్టాలి", అని బోధిస్తుంది.

పౌరులందరూ తమకు ఇవ్వబడిన విధులను గౌరవించి, దేశం పట్ల, సమాజం పట్ల, పరిసరాల పట్ల తమ వ్యక్తిగత బాధ్యతను గుర్తించి మసలుకోవలెను.

## అధికరణ 51-ఏ ప్రకారం ప్రాథమిక విధులు

**భారతదేశంలో ప్రతి పౌరునికి గల ప్రాథమిక విధులు :**

1. భారత రాజ్యాంగాన్ని గౌరవించవలెను. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించవలెను.
2. భారత స్వతంత్ర సంగ్రామంలో, ప్రోత్సహింపబడ్డ ఆదర్శాలను గౌరవించాలి.
3. భారతదేశపు సార్వభౌమత్వాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని గౌరవించి, పెంపొందింపవలెను.
4. అవసరం లేదా అవకాశం గలిగితే భారతదేశానికి సేవ చేయుటకు ఎల్లవేళలా సిద్ధంగా వుండవలెను.
5. భారతదేశంలో, కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదాలు లేకుండా ప్రజలందరినీ గౌరవించవలెను. సోదరభావాన్ని, సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించవలెను. స్త్రీల యొక్క గౌరవమర్యాదలను భంగపరిచే అమర్యాదకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి.
6. మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతినీ, మిశ్రమ మరియు అద్భుత వారసత్వాన్ని కాపాడుకొనవలెను.
7. ప్రకృతీ పరిసరాలైన అడవులను, సరస్సులను, నదులను మరియు వన్యప్రాణులను మరియు ఇతర జీవులను సంరక్షించుకొనవలెను.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి జ్ఞానాభివృద్ధి కొరకు ఎల్లవేళలా పాటుపడవలెను.
9. ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలెను. హింసను విడనాడవలెను.
10. భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తిగతంగాను, సామాజికంగాను లేదా మిశ్రమంగానూ పాటుపడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, దానిని సాధించుటకు కృషి చేయవలెను.

## భారత రాజ్యాంగం - ప్రాథమిక హక్కులు

### ప్రాముఖ్యత మరియు లక్షణాలు

ప్రాథమిక హక్కులు, పౌరులకు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకొనుటకు, మరియు బాధ్యతగలిగిన పౌరులుగా హుందాగా జీవించుటకు, ప్రభుత్వపరంగా, చట్టరీత్యా ఇవ్వబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. ఇక్కడ ప్రభుత్వమనగా, భారతదేశంలో అధికారం గల అన్ని అంగాలు. వీటిలో భారత ప్రభుత్వము, పార్లమెంటు, భారతదేశంలోని రాష్ట్రాలూ, రాష్ట్రాలలో గల, జిల్లాపరిషత్తులూ, కార్పొరేషన్లు, నగరపాలికలు, పంచాయతీలు, గ్రామపంచాయతీలు వగైరా.

### సమానత్వపు హక్కు

సమానత్వపు హక్కు, రాజ్యాంగం అధికరణలు 14, 15, 16, 17 మరియు 18ల ప్రకారం ప్రసాదించబడింది. ఈ హక్కు చాలా ప్రధానమైనది, స్వేచ్ఛా సమానత్వాలు ప్రసాదించే ఈ హక్కు క్రింది విషయాల గ్యారంటీనిస్తుంది.

**చట్టం ముందు సమానత్వం :** రాజ్యాంగ అధికరణ (ఆర్టికల్) 14 ప్రకారం, బారత భూభాగంలో ఉన్న వ్యక్తులందరూ సమానంగా, భారతచట్టాల ప్రకారం కాపాడబడవలెను. అనగా ప్రభుత్వం వ్యక్తుల పట్ల కుల, మత, వర్గ, వర్ణ, లింగ మరియు పుట్టిన ప్రదేశాల ఆధారంగా ఏలాంటి వివక్ష చూపరాదు.

**పౌరప్రదేశాలలో సామాజిక సమానత్వం మరియు సమాన ప్రవేశాలు :** అధికరణ 15 ప్రకారం, పౌరులు పౌర (పబ్లిక్) ప్రదేశాలయిన, పార్కులు, మ్యూజియంలు, బావులు, స్నానఘట్లు మరియు దేవాలయాలు మొదలగు చోట్ల ప్రవేశించుటకు సమాన హక్కులు కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. కానీ కొన్ని సందర్భాలలో ప్రభుత్వం, స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించవచ్చు. అలాగే సామాజికంగా వెనుకబడిన వారికి ప్రత్యేక సదుపాయాలు, ప్రభుత్వాలు కలుగజేయవచ్చు.

**పౌర ఉద్యోగాల విషయాలలో సమానత్వం :** అధికరణ 16 ప్రకారం, ఉద్యోగాలు పొందేందుకు, ప్రభుత్వాలు

పౌరులందరికీ సమాన అవకాశాలు మరియు హక్కులు కల్పించవలెను. ప్రభుత్వాలు, పౌరులకు ఎలాంటి వివక్షలూ చూపరాదు. 2003 'పౌర (సవరణ) బిల్లు' ప్రకారం, ఈ హక్కు, ఇతర దేశాల పౌరసత్వాలు పొందిన భారతీయులకు వర్తించదు.

**అంటరానితనం నిషేధాలు** : అధికరణ 17 ప్రకారం, అంటరానితనాన్ని ఎవరైనా అవలంబిస్తూ వుంటే చట్టం ప్రకారం శిక్షార్హులు. అంటరానితనం నేర చట్టం (1955), 1976లో పౌర హక్కుల పరిరక్షణా చట్టం పేరు మార్పు పొందింది.

**బిరుదుల నిషేధాలు** : అధికరణ 18 ప్రకారం, భారత పౌరులు, ఏలాంటి బిరుదులూ పొందరాదు. ఇతరదేశాలనుండి కూడా ఏలాంటి బిరుదులు పొందరాదు. ఉదాహరణకు బ్రిటిష్ ప్రభుత్వం, రాయ్ బహాదుర్, ఖాన్ బహాదుర్ లాంటి, "ప్రభుత్వ లేక రాజ్య సంబంధ బిరుదులు", సైన్యపరమైన బిరుదులూ ప్రకటించేది, ఇలాంటివి నిషేధం. కానీ విద్య, సంస్కృతీ, కళలు, శాస్త్రాలు మొదలగు వాటి బిరుదులు ప్రసాదించనూవచ్చు మరియు పొందనూవచ్చు. భారత రత్న మరియు పద్మ విభూషణ్ లాంటి వాటిని పొందినవారు, వీటిన తమ "గౌరవాలు"గా పరిగణించవచ్చు గాని, 'బిరుదులు'గా పరిగణించరాదు. 1995, 15 డిసెంబరు న సుప్రీంకోర్టు, ఇలాంటి బిరుదుల విలువలను నిలుపుదల చేసింది.

## స్వాతంత్ర్యపు హక్కు

భారత రాజ్యాంగము, తన అధికరణలు 19, 20, 21 మరియు 22 ల ద్వారా స్వాతంత్ర్యపు హక్కును ఇస్తున్నది. ఇది వైయుక్తిక హక్కు. ప్రతి పౌరుడూ ఈ హక్కును కలిగివుండడం, రాజ్యాంగ రచనకర్తల అసలు అభిలాష. అధికరణ 19, క్రింది ఆరు స్వేచ్ఛలను పౌరులకు ఇస్తున్నది :

1. వాక్-స్వాతంత్ర్యపు హక్కు మరియు భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం
2. సమావేశాలకు స్వేచ్ఛ, ఈ సమావేశాలు శాంతియుతంగా, ఆయుధాలు కలిగి వుండరాదు. దేశం మరియు ప్రజా శ్రేయస్సులను దృష్టిలో వుంచుకుని, ప్రభుత్వాలు వీటి అనుమతులు నియంత్రించనూవచ్చు.
3. సంస్థలు, సొసైటీలు స్థాపించే హక్కు. దేశ మరియు ప్రజా శ్రేయస్సుల దృష్ట్యా ప్రభుత్వం వీటిని నియంత్రించనూవచ్చు లేదా నిషేధించనూవచ్చు.
4. భారత పౌరుడు, భారతదేశం అంతర్భాగంలో ఏప్రాంతంలోనైనా పర్యటించవచ్చు. కాని కొన్నిసార్లు ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అంటురోగం గల సమయాలలో వాటిని అరికట్టే ప్రయత్నాలలో, పౌరుల ప్రయాణాలను నిషేధించవచ్చు.
5. భారత అంతర్భాగంలో ఏ ప్రదేశంలోనైనా, పౌరులు, నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు. కానీ, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల పరిరక్షణ దృష్ట్యా, ప్రభుత్వం కొన్ని నియంత్రణలు చేయవచ్చును.
6. భారతదేశంలోని ఏప్రాంతంలోనైనా, పౌరులు వ్యాపారాలు, వర్తకాలూ, ఉద్యోగాలూ చేపట్టవచ్చును. కానీ, నేరాలుగల వ్యాపారాలు, చీకటి వ్యాపారాలు మరియు నీతిబాహ్య వ్యాపారాలు చేపట్టరాదు.

ప్రాణాలు కాపాడే మరియు కాపాడుకునే హక్కునూ రాజ్యాంగం కల్పిస్తున్నది. అధికరణ 20, ఈ విషయాన్నీ చర్చిస్తుంది. ప్రాణాలు కాపాడుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందనే పరిగణింపబడుతుంది. అధికరణ 21 ప్రకారం, ఏ పౌరుడూ తన స్వేచ్ఛనూ, జీవితాన్ని కోల్పోయే హక్కు కలిగి లేదు, చట్టాన్ని తప్పించి.

## దోపిడిని నివారించే హక్కు

The right against exploitation, అధికరణలు 23 మరియు 24 ల ప్రకారం, కట్టు బానిసత్వం మరియు బాలకార్మిక విధానాలు నిషేధం మరియు 14 సంవత్సరాలకు లోబడి గల బాలబాలికలకు అపాయకరమైన పనులు (కర్మాగారాలలో, గనులలో) చేయించుట నిషేధం. బాలకార్మిక విధానం, రాజ్యాంగ ఊపిరికే విఘాతం లాంటిది. కట్టు బానిసత్వం, విధానంలో భూస్వాములు లేదా పెత్తందార్లు, మానవహక్కులకు విఘాతాలు కలుగజేసేవారు. మానవులకు కట్టుబానిసలుగా ఉంచుకుని, తరతరాల స్వాతంత్ర్యాన్ని హరించివేసేవారు. ఈ దురాగతాన్ని మాన్పించడానికే ఈ హక్కు కల్పించబడింది. మానవులకు 'బానిస వర్తకాలు', 'వ్యభిచారం' లాంటి అశ్లీల వృత్తులయందు బలవంతంగా ప్రవేశించేలా చేయువారికి చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. కానీ కొన్ని అత్యవసర సమయాలలో ప్రభుత్వాలు, జీతభత్యాలు లేని ఉద్యోగాలు మరియు, తప్పనిసరి సైనిక భర్తీలను చేపట్టుట లాంటి వాటిని, ప్రత్యేక పరిస్థితులలో అనుమతించవచ్చును.

## మత స్వాతంత్రపు హక్కు

భారతదేశంలో పౌరులందరికీ మతస్వాతంత్ర్యపు హక్కును, అధికరణలు (ఆర్టికల్స్) 25, 26, 27 మరియు 28 ల ప్రకారం ఇవ్వబడింది. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యం సెక్యులరిజం సూత్రాలను స్థాపించుటకు ఉద్దేశించినవి. భారత రాజ్యాంగం ప్రకారం, భారతదేశంలోని అన్ని మతాలు సమానమే, ఏమతమూ ఇతర మతంపై ప్రాధాన్యతను కలిగి లేదు. ప్రతి పౌరుడు తన ఇష్టానుసారం మతాన్ని అవలంభించుటకు స్వేచ్ఛ కల్పింపబడ్డాడు. పౌరులు తమ మతాల గూర్చి ఉపన్యసించవచ్చు, అవలంబించ వచ్చు మరియు మతవ్యాప్తి కొరకు పాటుపడవచ్చు. అలాగే, మతపరమైన సంప్రదాయాలను ఉదాహరణకు సిక్కులు కిర్పాన్‌లను తమ ఉద్యోగాలు చేయు సమయాన ధరించడానికి, ప్రజల శ్రేయస్సును, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి, నిరోధించవచ్చు.

ధార్మిక సంస్థలు, ప్రజాపయోగ స్వచ్ఛంద సంస్థలను స్థాపించుకొనవచ్చు. ఇతరత్రా, మతసంబంధం కాని

కార్యకలాపాలను, ప్రభుత్వం నిర్దేశించిన చట్టాల ప్రకారం చేపట్టవచ్చు. చారిటబుల్ సంస్థలను కూడా ప్రజాపయోగం, సుహృద్భావన మరియు నియమాలను పునస్కరించుకొని, తమ కార్యకలాపాలు చేయునట్లుగా ప్రభుత్వం నిర్దేశించవచ్చును. మతపరమైన కార్యకలాపాల కొరకు ఏలాంటి పన్నులను విధించగూడదు మరియు నిర్దేశించగూడదు. ప్రభుత్వాలు నడిపే విద్యాసంస్థలలో, ప్రత్యేక మతాన్ని రుద్దే బోధనలు చేపట్టకూడదు. అలాగే, ఈ ఆర్టికల్స్‌లోని విషయాలు, ప్రభుత్వాలు చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలపై ఏలాంటి విఘాతాలు కలిగించ గూడదు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలలో, ధార్మిక సంస్థల కార్యకలాపాలు అడ్డంకులుగా వుండరాదు.

## సాంస్కృతిక మరియు విద్యాహక్కులు

భారతదేశం, అనేక మతాలకు, భాషలకు మరియు సంస్కృతులకు నిలయం. రాజ్యాంగం వీరికి కొన్ని ప్రత్యేక హక్కులను ఇస్తూంది. అధికరణ 29 మరియు 30 ల ప్రకారం, మైనారిటీలకు కొన్ని హక్కులు ఇవ్వబడినవి. ఏ మైనారిటీలకు చెందినవాడైననూ, ప్రభుత్వం వీరికి, ప్రభుత్వ మరియు ప్రభుత్వసహాయం పొందిన సంస్థలలో ప్రవేశానికి నిషేధించరాదు.

మైనారిటీలు, అనగా మతం, భాష మరియు సాంస్కృతిక పరమైన మైనారిటీలు, తమ మతాన్ని, భాషలనూ, సంస్కృతినీ రక్షించుకొనుటకు, మైనారిటీ సంస్థలు స్థాపించుకొనవచ్చును. ఆ సంస్థలద్వారా వారు, తమ అభ్యున్నతికి పాటుపడవచ్చును. ఈ సంస్థలలో దుర్వినియోగాలు జరుగుతున్న సమయాన ప్రభుత్వాలు తమ ప్రమేయాలు కలుగజేసుకోవచ్చును.

## రాజ్యాంగ పరిహారపు హక్కు

ప్రాథమిక హక్కులకు ఏపాటియైనా భంగం కలిగితే, రాజ్యాంగ పరిహారపు హక్కును కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఉదాహరణకు, పౌరుడు, జైలు శిక్షను పొందితే, ఆ వ్యక్తి, న్యాయస్థానాలను ఆశ్రయించి, ఇది దేశ చట్టాలనుసారంగా వున్నదా లేదా అని ప్రశ్నించే హక్కును కలిగి ఉన్నాడు. ఒకవేళ, న్యాయస్థానం నుండి జవాబు "కాదు" అని వస్తే, ఆ వ్యక్తికి తక్షణమే విడుదలచేయవలసి వస్తుంది. పౌరుల హక్కులను వాటి సంరక్షణలను గూర్చి న్యాయస్థానాలను అడిగే విధానాలు కొన్ని ఉన్నాయి. న్యాయస్థానాలు కొన్ని దావాలను ప్రవేశపెట్టవచ్చు. ఆ దావాలు, హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో వారంటో మరియు సెర్టియోరారి. ఒక వేళ దేశంలో అత్యవసర పరిస్థితి యేర్పడితే, ఈ హక్కులన్నీ కేంద్ర ప్రభుత్వంచే 'సస్పెండు' చేయబడుతాయి.

## ఆస్తి హక్కు - క్రిత ప్రాథమిక హక్కు

భారత రాజ్యాంగం, ఆర్టికల్ 19 మరియు 31 వరకు గల విషయాలలో ఆస్తి హక్కును పౌరుల ప్రాథమిక హక్కుగా పరిగణించింది. ఆర్టికల్ 19, పౌరులందరికీ, ఆస్తులను సంపాదించడం, వుంచుకొనడం, అమ్మడం లాంటి హక్కులను కలుగజేసింది. ఆర్టికల్ 31 'పౌరులెవ్వరూ తమ ఆస్తి హక్కును, ప్రభుత్వాల ద్వారా కోల్పోగూడదు'. ప్రభుత్వం ప్రజల అవసరాల రీత్యా పౌరుల ఆస్తిని గైకొన్న యెడల, ఆ ఆస్తిదారునికి 'కాంపెన్జేషన్' చెల్లించవలెనని కూడా నొక్కి వక్కాణిస్తుంది.

కానీ భారత రాజ్యాంగ 44వ సవరణ ద్వారా, 1978 లో ఈ ఆస్తి హక్కును, ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించింది. ఓ క్రొత్త ఆర్టికల్ 300-ఏ, సృష్టింపబడింది. ఈ ఆర్టికల్ ప్రకారం "చట్టం ప్రకారం, పౌరుడు పొందిన ఆస్తిని, భంగం కలిగించరాదు". ఆస్తి హక్కు రాజ్యాంగపరమైన హక్కుగా పరిగణించబడుతున్ననూ, ప్రాథమిక హక్కు హోదాను కోల్పోయింది.

## విమర్శాత్మక విశ్లేషణ

ఈ ప్రాథమిక హక్కులను చాలా మంది పలువిధాలుగా విమర్శించారు. రాజకీయ సముదాయాలు, ప్రాథమిక హక్కులలో పని హక్కు, నిరుద్యోగస్థితి మరియు వయసు మీరిన స్థితులలో ఆర్థిక సహాయ హక్కు, మున్నగునవి చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ హక్కులన్నీ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక విధులులో క్రోడీకరించియున్నవి. స్వాతంత్ర్యపు హక్కు మరియు స్వీయస్వతంత్రం కూడా కొన్నిసార్లు విమర్శలకు లోనైనవి. ఇవి పరిధులకు మించి స్వేచ్ఛలు కలిగి వున్నవని విమర్శింపబడినవి. ఈ పౌరహక్కులు ఎమర్జెన్సీ యందు, నిలుపుదల చేయబడుతాయి, ఇలా నిలుపుదల చేసే చట్టాలకు ఉదాహరణ 'మీసా' (MISA Maintenance of Internal Security Ac) మరియు జాతీయ రక్షణా చట్టం ఎన్.ఎస్.ఏ. NSA (National Security Act). జాతీయ విపత్తుల (దేశ రాజకీయ

## రాజ్యాంగ పీఠిక

**భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి, వారందరిలో వ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మన ఈ రాజ్యాంగ పరిషత్‌లో 1949, నవంబర్ 26వ తేదీన ఎంపిక చేసుకొని, శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.**

అంతర్గత సంక్షోభం) సమయాలలో 'అత్యవసర పరిస్థితి' ని ప్రకటించి, ఈ కాలంలో పౌరహక్కులను తాత్కాలికంగా వెనక్కి తీసుకుంటారు.

"పత్రికా స్వేచ్ఛ" స్వాతంత్ర్యపు హక్కులలో మిళితం చేయబడలేదు, ప్రజల ఉద్దేశ్యాల ప్రకటన, భావ ప్రకటనా స్వాతంత్ర్యం మున్నగు విషయాల కొరకు పత్రికాస్వేచ్ఛ అవసరం. అపాయకర పనులలో బాలల చాకిరి కొంచెం తగ్గుముఖం పట్టినా, అపాయాలులేని పనులలో బాలల చాకిరి (Child Labour) అనేవి, భారతరాజ్యాంగ విలువలను కాలరాస్తున్నాయి. 1.65 కోట్లమంది బాలబాలికలు నేటికీ భారతదేశంలో వివిధ పనులలో ఉద్యోగాలు చేస్తున్నారు. 2005 'ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్' అనే పత్రిక ప్రచురించిన ప్రచురణల ఆధారంగా, ప్రపంచంలో లంచగొండితనం గల 159 దేశాల జాబితాలో భారత్ 88వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఈ లంచగొండులలో అధికారులు, రాజకీయనాయకులూ ఉన్నారు. 2003 'పౌర బిల్లు' (సవరణ) ప్రకారం, ఉద్యోగ ప్రయత్నాలు చేసేందుకు సమాన హక్కులు పొంది వుంటారు గాని, ఉద్యోగాలు పొందే విధానంలో సమానత్వపు హక్కు పరిగణనలోకి రాదు. పోటీలో నెగ్గినవారే ఉద్యోగాలు పొందే అర్హత గలిగి వుంటారు.

## సవరణలు

ప్రాథమిక హక్కులలో మార్పులు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఈ రాజ్యాంగ సవరణ పార్లమెంటు ఆమోదం పొందాలి. పార్లమెంటు ఆమోదానికి మూడింట రెండొంతుల పార్లమెంటు సభ్యుల ఆమోదం అవసరం. ఈ ఆమోదానికి పార్లమెంటులో ఓటింగ్ అవసరం.

ఆస్తి హక్కు ప్రథమ దశలో ప్రాథమిక హక్కుగా పరిగణింప బడింది. కాని 1978 లో జరిగిన భారత రాజ్యాంగ 44వ సవరణ ప్రకారం దీనిని ఓహక్కుగా కాకుండా, ప్రతి పౌరుడు తన ఆస్తిని కాపాడుకోవడానికి చట్టం ప్రకారం హక్కును కలిగి వున్నాడని చట్టం చేయబడింది. ఈ చట్టం, ప్రజాస్వామిక విలువలను కాపాడడానికి సామ్యవాద ఉద్దేశాలు సాధించడానికి, చేయబడింది.

విద్యా హక్కును, 2002 లో, భారత రాజ్యాంగ 86వ సవరణ ప్రకారం ప్రాథమికహక్కుగా చేయబడింది. ఈ హక్కు ప్రకారం, ప్రతి బాలురు/బాలికలు, పౌరులు, ఎలిమెంటరీ స్థాయిలో ప్రాథమిక విద్యను ఓ హక్కుగా కలిగి వుంటారు. ❑

## రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్

**(5వ పేజీ తరువాయి)**

కోవాలనే అసహనం వారిలో ముప్పిరిగొంటున్నది. ఈ అణగారిన వర్గాలలో స్వీయ ఆకాంక్షల సాకారం కోసం తపన వర్గపోరాటం గానో, వర్గ యుద్ధంగానో మారడానికి మనం అనుమతించ గూడదు. అదే జరిగితే మన గృహం, ఈ రాజ్యాంగ నిర్ణయసభ ముక్కలైపోతుంది. అది నిజంగా విధ్వంస దినంగా మిగిలి పోతుంది. ఎందుకంటే, అబ్రహాం లింకన్ సరిగ్గా చెప్పినట్టు, తనలో తాను ముక్కలైన గృహం ఎక్కువ కాలం నిలబడి ఉండజాలదు. అందువల్ల, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి ఎంత తొందరగా అవకాశాలు కల్పిస్తే, కొద్ది మందిగా ఉన్నవారికి అంత మేలు. దేశానికి అంత మేలు. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి అంత మేలు. దేశ ప్రజాస్వామిక నిర్మాణాలను నిర్వహించడానికి అంత మేలు. అది సాధించాలంటే సమస్త జీవన రంగాలలో సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని స్థాపించడం ఒక్కటే మార్గం. అందువల్లనే నేను ఆ అంశాల మీద అంతగా నొక్కి చెపుతున్నాను.

ఈ సభా సమయాన్ని నేనింకా ఎక్కువగా తీసుకోదలచలేదు. నిస్సందేహంగా స్వాతంత్ర్యం అనేది సంతోష సందర్భమే. కాని ఈ స్వాతంత్ర్యం మన ముందుకు అనేక బాధ్యతలు తెస్తున్నదని మనం మరచిపోగూడదు. ఇంతకాలంగా ప్రతి తప్పుకూ బ్రిటిష్ వాళ్లను కారణంగా చూపే అవకాశాన్ని ఈ స్వాతంత్ర్యం ద్వారా మనం కోల్పోతాం. ఇకనుంచి ఏదైనా తప్పు జరిగితే మనం నిందించడానికి ఎవరూ లేరు. మనను మనం నిందించు కోవలసిందే. పైగా తప్పులు జరగడానికి మరింత ఎక్కువ అవకాశం ఉంది కూడ. కాలం వేగంగా మారుతున్నది. మన ప్రజలతో సహా ప్రజలందరూ కొత్త భావజాలాలతో ప్రేరణ పొందుతున్నారు. ప్రజల చేత ఏర్పడిన ప్రభుత్వం అనేదానితో వారు విసిగి పోతున్నారు. ప్రజల కొరకు ఏర్పడిన ప్రభుత్వాలు కావాలని వారు అనుకుంటున్నారు. అవి ప్రజల చేత, ప్రజల వల్ల ఏర్పడిన ప్రభుత్వాలు కాకపోయినా సరే అనుకుంటున్నారు. ప్రజల చేత, ప్రజల వల్ల, ప్రజల కొరకు ప్రభుత్వం అనే సూత్రం ఆధారంగా మనం రూపొందించిన ఈ రాజ్యాంగాన్ని మనం సంరక్షించుకోవాలంటే, మన మార్గంలో అడ్డుగా ఉన్న చెడులను గుర్తించడంలో ఏమరపాటు లేకుండా ఉందామని ప్రతిజ్ఞ చేసుకుందాం. ఆ చెడులు మన ప్రజలను ప్రజల చేత ప్రభుత్వం నుంచి మళ్లించి ప్రజల కొరకు ప్రభుత్వం వైపుగా ఆకర్షిస్తాయని గుర్తిద్దాం. ఆ చెడులను తొలగించడంలో మన కర్తవ్యదీక్షలో బలహీనంగా ఉండబోమని ప్రతిజ్ఞ చేద్దాం. దేశానికి సేవ చేయడానికి అది ఒక్కటే మార్గం. అంతకంటే మెరుగైన మార్గం నాకు తెలియదు.

రాజ్యాంగ నిర్ణయ సభ చర్చలు, పదకొండో సంపుటం నుంచి (http://164.100.47.194/Loksabha/Debates/ cadebate files/C25111949.htm) ❑


# భారతదేశ ప్రజలమగు మేము...



**కె. శ్రీనివాస్**
ఆంధ్రజ్యోతి సంపాదకులు

రాజ్యాంగాన్ని చదువుదాం. దాని విస్తృతిని, ఔదార్యాన్ని, పరిమితిని కూడా అవగాహన చేసుకుందాం. వాటికి తరువాతి వారు చేసిన సవరణల మంచిచెడ్డలను తెలుసుకుందాం. ఇష్టమొచ్చిన అన్వయాలు ఇచ్చి, వక్రీకరణలు చేసి రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ప్రభుత్వాలు ఎట్లా నడిచాయో, ఎట్లా మౌలిక విధానాలనే మార్చాయో విశ్లేషించుకుందాం. రాజ్యాంగ గ్రంథం అట్ట మీద దేవుళ్ల బొమ్మలుండేవని ప్రేలాపనలు పేలే ప్రజా ప్రతినిధుల స్థాయిని తెలుసుకుందాం. సమాజంలో చెలరేగుతున్న ప్రతీపధోరణులకు రాజ్యాంగంతోనే చికిత్స చేద్దాం.

బాగా తెలిసిన పుస్తకమే. చాలా సార్లు చూసి ఉంటాను. కొన్ని సార్లు తిరగేసి కూడా ఉంటాను. కొన్ని సార్లు అవసరమైన చోట్ల శ్రద్ధగా చదివి ఉంటాను. కొన్ని భాగాల మీద వ్యాఖ్యలు, విశ్లేషణలు కూడా చేసి ఉంటాను. అనేక సందర్భాలలో ఉటంకించి ఉంటాను. గౌరవించిన పుస్తకమే. అంతగా జీర్ణించుకున్న పుస్తకమో, హత్తుకున్న పుస్తకమో కాకపోయి ఉండవచ్చు. కానీ, ఈ మధ్య నిజామాబాద్‌లో ఒక సదస్సుకు హాజరైనప్పుడు నిర్వాహకులు మెమెంటోగా ఆ పుస్తకం ఇస్తున్నప్పుడు మాత్రం అనిర్వచనీయమైన ఉద్వేగం కలిగింది.




## భారత రాజ్యాంగం

ఆ తరువాత హైదరాబాద్‌లో జరిగిన ఒక సాహిత్య సమావేశంలో కూడా అదే మెమెంటోను అందుకున్నప్పుడు అక్కడి వాతావరణంలోనే ఒక ఉద్విగ్నత కనిపించింది. ప్రవేశికను పఠిస్తున్నప్పుడు, విస్మృతంగా అజ్ఞాతంగా ఉండిపోయిన మహోన్నత సంకల్పాన్ని, ఆశయాన్ని పునర్దర్శిస్తున్నట్టు అనిపించింది.

డెబ్బయి రెండేళ్ల కిందట స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ఆ సంతోషం ఎంతో రక్తసిక్త విషాదంతో మసకబారి ఉండింది. భారతదేశ ప్రజ తమను తామొక, ఒకే ఒక జాతిగా తీర్చిదిద్దుకోగలరా, తమలోని విభిన్నతను ఆరోగ్యకరమైన వైవిధ్యంగా నిర్వహించుకోగలరా, నిరక్షరాస్యత, భూస్వామ్యం, మూఢత్వం, స్వార్థం, కులోన్మాదం, మతతత్వం గూడుకట్టుకుని ఉన్న ఒక సమాజం సొంతంగా, ప్రగతిశీలంగా ముందుకు నడవగలదా అన్న అనుమానాలు. స్వతంత్రత నుంచి గణతంత్రతకు మూడేళ్ల ప్రయాణం. భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి, సమాజపు ప్రతినిధులంతా కూర్చుని, చర్చించి, ప్రస్థానానికి కావలసిన పునాదిని నిర్మించుకున్నారు. భారతదేశపు పురోగతికి ఒక అభ్యుదయ మార్గాన్ని రచించి, ప్రయాణాన్ని ఉన్నత ఆదర్శాలకు, ఆశయాలకు బద్ధం చేసిన వాడు బాబాసాహెబ్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు, కాలం చెల్లిన విలువలకు, అనవసరపు గందరగోళానికి ప్రాతినిధ్యం వహించే అనేకానేక ప్రతిపాదనలను కాచి, వడబోసి, ఆధునిక ప్రజాస్వామిక విలువల నైతికతను జోడించి రాజ్యాంగ సూత్రాలను ఖరారు చేసినవాడు అంబేడ్కర్.

కొందరు భావిస్తున్నట్టు, రాజ్యాంగపు రాయసకాడు కాదు. ఆయన భారతరాజ్యాంగానికి తీర్పరి, కూర్పరి, మార్గదర్శి, దానికొక నైతికతను ప్రామాణికతను అందించిన స్మృతికారుడు. అంబేడ్కర్ తాను స్వీయరచనగా మాత్రమే ఒక నమూనా రాజ్యాంగాన్ని రాయవలసి వస్తే, అది ఇప్పుడున్న రాజ్యాంగం కంటె ఎంతో మెరుగుగా ఉండేది. తాను సమర్పించిన రాజ్యాంగ పాఠ్యంపై అంబేడ్కర్‌కు పూర్తి ఏకీభావంకానీ, సంతృప్తికానీ లేదు. అయితే, ఆయన తనకు అప్పగించిన బాధ్యత మేరకు, ఒక సామాజిక విప్లవకారునిగా తన కర్తవ్యం మేరకు పరిమితులకు లోబడి, ఉత్తమమైన రాజ్యాంగాన్ని ఇచ్చారు. ఆయనకే అవకాశం ఉండి ఉంటే, ఆస్తిహక్కుకు ఎంతో కొంత పగ్గం వేసి ఉండేవారేమో? సామాజిక న్యాయానికి సంబంధించి ప్రవేశికలోనూ, ఆదేశిక సూత్రాలలోను పేర్కొన్నదానికి, రిజర్వేషన్ల వంటి సానుకూల వివక్షలకు మించిన ప్రతిపాదనలు చేసి

ఉండేవారేమో? రాజ్యాంగం కరదీపికగా ఉన్నప్పటికీ, అనేక చట్టాలలో ఉన్న వివక్షను ఆయన గమనించారు. హిందూకోడ్ బిల్లుపై ఆయన పట్టింపు అటువంటి వివక్షను తొలగించడానికే. రాజ్యాంగం అనేక కర్తవ్యాలను తన పీఠిక ద్వారా, ఆదేశిక సూత్రాల ద్వారా భవిష్యత్తుకు వదిలివేసింది. వాటిని తరువాతి తరాలు ముందుకు తీసుకు వెళ్లాలని, అప్పటికి కానీ రాజ్యాంగ లక్ష్యం సంపూర్ణం కాదని అంబేద్కర్‌కు తెలుసు.

అంబేద్కర్ సిద్ధాంతాలకు ఆదరణ, ప్రాచుర్యం పెరుగుతున్న కారణంగా రాజ్యాంగానికి కొత్త గౌరవం లభిస్తున్నదా? అది కూడా ఒక కారణమే. కాదనలేము. దళిత, బహుజన శ్రేణులు అంబేద్కర్ తమకు ఇతరత్రాను, రాజ్యాంగం ద్వారానూ చేసిన మేళ్లను, కల్పించిన హక్కులను సగౌరవంగా స్మరించుకోవడం సహజం. ఆ హక్కులకు, ప్రయోజనాలకు నెలవుగా ఉన్న రాజ్యాంగాన్ని ఆరాధించడం సహజం. ఆ ప్రేమాభిమానాలతో పాటు, కొద్ది కాలంగా, రాజ్యాంగాన్ని తిరిగి అధ్యయనం చేసి, దాని స్ఫూర్తిని గుర్తు చేస్తున్నవారు, రాజ్యాంగ నైతికతను ఒక ఉన్నత విలువగా ప్రతిపాదిస్తున్నవారు పౌరసమాజంలో పెరుగుతున్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి ఎడంగా జరుగుతున్న కొద్దీ, రాజ్యాంగాన్ని ఆశ్రయించవలసి రావడం సహజం. గత ఆరేళ్ల కాలంలో, జాతీయస్థాయిలో రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక భావనలకు ప్రమాదం తీవ్రస్థాయిలో పెరిగినందువల్ల కూడా తరచు రాజ్యాంగ పాఠ్యంలోకి తొంగిచూడవలసి వస్తున్నది.

రాజ్యాంగ స్ఫూర్తికి, ఆశయాలకు, రాజ్యాంగాంశాలకు ఉల్లంఘనలు పెరుగుతున్న క్రమంలో, ప్రజాస్వామిక ఉద్యమాలు రాజ్యాంగాన్నే ఆయుధంగా ధరించవలసి వస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాగుతున్న పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక ఉద్యమంలో భారత రాజ్యాంగమే పతాకం, రాజ్యాంగ ప్రవేశికే నినాదం. దళిత, మైనారిటీ ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్ 'రావణ్' ఒక చేత్తో త్రివర్ణ పతాకాన్నీ, మరో చేత్తో రాజ్యాంగాన్నీ ధరించి ఢిల్లీ జామామసీద్‌లో తెలిపిన నిరసన చరిత్రాత్మకమైనది. షహీన్‌బాగ్‌లో, జామియా మిలియా కేంపస్ దగ్గర ఆందోళనకారులు, ఉద్యమకారులు అందరూ మువ్వన్నెల పతాకాలనే చేతపడుతున్నారు. యువకులు రాజ్యాంగాన్ని, భారతీయ జెండాను ధరించడం ఒక మోసమని, ఈ దేశ ప్రధాని వ్యాఖ్యానించడం, అందులోనూ ఒక రాష్ట్ర ఎన్నికల సందర్భంగా వ్యాఖ్యానించడాన్ని ఏమనగలం?

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిస్థితులు త్వరితగతిని మెరుగుపడకపోవడం, ఆశాభంగాన్నే కలిగించింది. అంతకు ముందు నుంచే కాంగ్రెస్ తరహా రాజకీయాలను వ్యతిరేకిస్తూ వస్తున్నవారు ఎట్లాగూ ప్రతిపక్షంగా వ్యవహరించారు. తీవ్ర ఆచరణలను ఎంచుకున్నవారు దేశ స్వతంత్రతను విశ్వసించేవారు కాదు, రాజ్యాంగాన్నీ పెద్దగా లెక్కలోకి తీసుకునేవారు కాదు. రాజ్యాంగ యంత్రాన్ని వ్యతిరేకించడం వేరు, రాజ్యాంగాన్ని వ్యతిరేకించడం వేరు. ఎన్నికల దగ్గర నుంచి ప్రభుత్వంతో ప్రమేయం ఉన్న ప్రక్రియలన్నిటిని నిరాకరించడం ఒక వైఖరిగా కొన్ని రాజకీయ మార్గాలలో ఉన్నది, ఉంటున్నది. కానీ, కొత్తగా విద్యావంతులైన దళిత, బహుజన శ్రేణులు, ఔత్సాహికులైన ఇతరులు పాలనా ప్రక్రియల్లో, అభివృద్ధిలో భాగస్వామ్యం కోరుతున్నారు. ఎన్నికల ద్వారా సాధికారత లభిస్తుందని ఆశిస్తున్నారు. బహిరంగంగా చేయగల ప్రజాస్వామిక ఆందోళనల ద్వారా వ్యతిరేకులలో స్పందన తేగలమని నమ్ముతున్నారు.

వీరందరివీ భ్రమలు మాత్రమే అనలేము. రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో స్వాయత్తం చేసుకుని తామనుకునే న్యాయం వైపు ప్రయాణించాలని సాగుతున్న ప్రయత్నాలన్నిటికీ భారతరాజ్యాంగం నుంచే స్ఫూర్తి లభిస్తున్నది. "సామాజిక, ఆర్థిక, రాజకీయ– న్యాయాన్ని, ఆలోచనల్లో స్వేచ్ఛను, భావప్రకటనా స్వేచ్ఛను, విశ్వాసంలో, ధార్మికతలో, ఆరాధనలో స్వేచ్ఛను, అంతస్థులోను, అవకాశంలోను సమానత్వాన్ని" పెంపొందించేందుకు సత్యనిష్ఠాపూర్వకంగా తీర్మానించుకుని భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్న రాజ్యాంగంలోని శక్తిని ఇప్పటి తరం ఆవాహన చేసుకుంటున్నది. వారి ప్రయత్నం వారిని చేయనిద్దాం. బహుశా, ఈ సారి విశాల ప్రజానీకం ఈ ప్రయత్నంలో భాగస్వాములవుతారు. ప్రజాస్వామ్యాన్ని తమవైపు నుంచి సాధన చేస్తారు.

రాజ్యాంగాన్ని చదువుదాం. దాని విస్తృతిని, ఔదార్యాన్ని, పరిమితిని కూడా అవగాహన చేసుకుందాం. వాటికి తరువాతి వారు చేసిన సవరణల మంచిచెడ్డలను తెలుసుకుందాం. ఇష్టమొచ్చిన అన్వయాలు ఇచ్చి, వక్రీకరణలు చేసి రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ప్రభుత్వాలు ఎట్లా నడిచాయో, ఎట్లా మౌలిక విధానాలనే మార్చాయో విశ్లేషించుకుందాం. రాజ్యాంగ గ్రంథం అట్ట మీద దేవుళ్ల బొమ్మలుండేవని ప్రేలాపనలు పేలే ప్రజా ప్రతినిధుల స్థాయిని తెలుసుకుందాం. సమాజంలో చెలరేగుతున్న ప్రతీపధోరణులకు రాజ్యాంగంతోనే చికిత్స చేద్దాం. ❑



# రాజ్యాంగ సందేహం

## భారతీయపౌరసత్వాన్నే అనుమానిస్తే మనం మనమై మిగులుతామా?

మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

"వి ది పీపుల్ ఆఫ్ ఇండియా" అని చెప్పుకోగల పరిస్థితుల్లో ఉన్నామా? మన పౌరసత్వం అనుమానించే దశలో, మన పౌరసత్వం మనం రుజువు చేసుకోవలిసిన, రుజువు చేసుకోలేని దశలో మనం ఈదేశ ప్రజలుగా భావింపబడతామా? మనం పౌరులమే కాకపోతే రాజ్యాంగం మనకు వర్తిస్తుందా? రాజ్యాంగహక్కులు మనకు లభిస్తాయా లభించకుండా పోతాయా?

మన రాజ్యాంగం మనం మనకోసం రాసుకుని మనకు మనమే సమర్పించుకున్న ఒక మార్గదర్శిని మన సంవిధానం. పార్టీలు, వ్యక్తులు అసంగతం, వస్తారు పోతారు. వ్యవస్థలు ముఖ్యం. స్వతంత్రం వచ్చిన ఆగస్టు 15వ రోజును మనం జాతీయ పండుగగా జరుపుకుంటున్నాం. రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమల్లోకి తీసుకొచ్చిన జనవరి 26న ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవాన్ని ఇప్పటివరకు జరుపుకుంటూ వస్తున్నాము. ఇది మన గణతంత్రం. ఈ సంవత్సరం కొన్ని అనుమానాలు, ఆందోళనల మధ్య జరుపుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. దేశ ప్రజలు వేరు, పౌరులు వేరు, భారతీయులు వేరు అనే కొత్త వితండవాదాన్ని కేంద్ర ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. సిఎఎ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్‌లు కేవలం ముస్లిముల సమస్య మాత్రమే అని అనుకుంటే పొరపాటని, ఇది మన భారతీయులందరి సమస్య.

మనం మనకు ఇచ్చుకున్న రాజ్యాంగం. భారత రాజ్యాంగానికి డెబ్బయ్ ఏళ్లు పూర్తయింది. అదొక డైనమిక్ డాక్యుమెంట్. చికాగో యూనివర్శిటీ 800 రాజ్యాంగాలపై ఇటీవల జరిపిన పరిశోధనలో కేవలం 19 శాతం రాజ్యాంగాలు మాత్రమే 50ఏళ్లకు మించి మనుగడ సాధిస్తున్నాయని, ఏడు శాతం రాజ్యాంగాలు రెండో పుట్టిన రోజు జరుపుకోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో భారత రాజ్యాంగం 70 సంవత్సరాలు నిలిచింది. సగటున రాజ్యాంగాల ఆయుష్షు 17 సంవత్సరాలని చికాగో లా స్కూల్ వారు ఒక పరిశీలనలో తేల్చారు. మన రాజ్యాంగం మనను 70 ఏళ్ల నుంచి నడిపిస్తున్నది. ఇది చాలా గొప్ప విషయం.

మనం అంటే అర్థం ఏమిటి? 'వి' అంటే మనం. కాళోజీ నారాయణరావు అనేవారు "నేనింకా నానుంచి మా వరకే రాలేదు, మన అన్నపుడు కదా ముందడుగు..." అటువంటి వి...మనం... ది పీపుల్ ఆఫ్ ఇండియా. మనం భారతదేశ జనులము అంటున్న రాజ్యాంగం ప్రమాదంలో పడింది. కాని ఆ ప్రమాదం దాటుకునే శక్తి ఈ రాజ్యాంగానికి ఉంది. వి ది పీపుల్ ఆఫ్ ఇండియా అనే మాటను ప్రభుత్వ చట్టపరంగా అనుమానిస్తున్నది. నాకే అనుమానం లేదు. నేను, మనం అంతా భారతీయులమే. కాని ప్రభుత్వం సిఎఎ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్ ద్వారా అనుమానిస్తున్నది. నేను పౌరుడినా, భారతీయుడినా, నివాసినా, శరణార్థినా, వలసదారుడినా, అక్రమవలసదారుడినా అనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. మనం ఈ దేశ నివాసులమనీ, పౌరులమనీ, భారతీయులమని రుజువు చేసుకోవలసిన బాధ్యతను భారాన్ని మన మీద మోపుతున్నది, మన ప్రభుత్వం. అదీ సర్వసత్తాక, సార్వభౌమిక, గణతంత్ర, ప్రజాస్వామిక, సామ్యవాద రాజ్యాంగం వచ్చి డెబ్బయ్ ఏళ్లయిన తరువాత. ఇది నా అనుమానం కాదు. కొందరు చెప్పినట్టు నేను జనాన్ని భయపెట్టడానికి చెప్పిన పుకార్లు కావు "ఏ వ్యక్తికీ పౌరసత్వం తనంతట తానే రాదు. పౌరుడినని రుజువు చేసుకోవాలి" అని స్వయంగా హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సిఎఎ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్ లతో ఈ పరిస్థితులు తెచ్చి పెట్టింది ప్రభుత్వం.

కరోనాతో 2020 పూర్తిగా వృథా అయిపోయింది. 2021 రిపబ్లిక్‌డే వచ్చేసింది. కరోనా వచ్చి ఉండకపోతే ఏప్రిల్ 1, 2020 నుంచి మన ప్రజా రిజిస్టర్, మన పౌర నమోదు పట్టిక కోసం వివరాల సేకరణ ప్రారంభం అయి ఉండేది. సిఎఎ ఇంకా పోలేదు. నియమాలు చేస్తాం మీముందుకు వస్తాం అని కేంద్రం అడపాదడపా ప్రకటిస్తూనే ఉంది.

ఎవరికైనా పౌరసత్వం సర్టిఫికెట్ ఉంటుందా? ఇక్కడున్న వారిలో ఎవరికీ అటువంటి పత్రాలే లేవు. ఏ విధంగా రుజువు చేసుకోవడం? పుట్టుక సర్టిఫికెట్లు కూడా చాలా మందికి ఉండవు. కనీసం 19 శాతం మంది ప్రజలకు బర్త్ సర్టిఫికెట్లు లేవు. మనం పుట్టినట్టు ఒప్పుకుంటారా లేదా? ప్రతినెలా జీవించి ఉన్నట్టు రుజువు చూపితేనే పెన్షన్ ఇస్తారు. పుట్టినట్టు బతికి ఉన్నట్టు రుజువు చేసుకోవలసినట్టే, ప్రతివాడు ఈదేశ నివాసి అనీ, పౌరుడనీ, భారతీయుడనీ రుజువు ఎవరిస్తారు? ఎక్కడినుంచి తేవాలి.

తల్లి దండ్రుల పుట్టుక తేదీ పుట్టిన చోటు తెలుసుకోవడం, వాటికి రుజువులు కనుక్కోవడం కోట్లాది మంది ప్రజలకు సాధ్యం కాదు. పత్రాలు లేకపోతే సాక్షులు తేవాలనడం మరొక వింత.

తండ్రి పుట్టిన నాడు సాక్షులు ఉండిన వారు ఈనాటికీ బతికి ఉండి సాక్ష్యం చెప్పడానికి వస్తారనుకోవడం అవివేకం, అసాధ్యం. నేను జజీఖానా (హైదరాబాద్ హైకోర్టు పక్కనున్న ఆస్పత్రి)లో పుట్టాను. నేను చదువుకున్నవాడినే అయినా నా పుట్టినరోజు ధృవపత్రం నాకు లేదు. దానికి సాక్షులను నేను తేలేను. అప్పట్లో సర్టిఫికెట్లు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు అక్కడికి వెళ్లి అందులో ఎక్కడ పుట్టానో చూపడం సాధ్యం కాదు. అప్పుడు నేను డౌట్ ఫుల్ భారతీయుడినేనా? ఒకవేళ నాస్కూల్ సర్టిఫికెట్ ఆధారంగానా పుట్టిన తేదీ పుట్టిన చోటును చూపగలిగినా, మా నాన్నగారు ఎక్కడ ఎప్పుడు పుట్టారో చూపడం, దాంతో పాటు మా అమ్మ పుట్టిన వివరాలు తేవడం, రుజువు చూపడం సాధ్యం అవుతుందా? మా నాన్నగారే ఈ లోకంలో లేరు. వారికన్న పెద్దవారు ఇప్పుడు దొరుకుతారా? తల్లిదండ్రుల పుట్టుక వివరాలు చూపలేదన్న సాకుతో నా భారతీయత డి (డౌట్)లో పడిపోవడం లేదా?

ఇదివరకు 15 ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలన్నారు. 2019 లో అదనపు ప్రశ్నలు చేర్చారు. జనపట్టిక కోసం తన పుట్టిన రోజును, పుట్టినచోటుకు రుజువులు చూపడమే కాకుండా అదనంగా తల్లిదండ్రుల పుట్టిన చోటు, పుట్టిన తేదీలను కూడా రుజువు చేయవలసిన బాధ్యత దేశ నివాసుల మీద ఉందని చెబుతున్నారు. ఇదీ సమస్య.

కాగితాల రుజువులు లేకపోతే ఎవరైనా ఒకరిద్దరు సాక్షులను తీసుకు రావచ్చని అంటున్నారు. మా నాన్నగారు పుట్టినప్పుడు ఆయన కన్న పెద్ద వయసున్న వారు సాక్ష్యం చెప్పాలంటే, సాధ్యమా

ఒక వ్యక్తి తగిన పత్రాలు ఇవ్వలేదని అతని పౌరసత్వాన్ని అనుమానించే డి మార్కు పెట్టాలనడం మూల చట్టంలో లేదు. మూల చట్టంలో లేని నియమాలు రూపొందిస్తే ఆ నియమాలు చెల్లవనేది అంతటా ఆమోదించిన న్యాయసూత్రం. దానికి విరుద్ధంగా డి మార్కుతో ప్రజలను పౌరులు కాదని నిర్ణయించే అతి అధికారాన్ని అత్యంత కీలక విచక్షణాధికారాన్ని ఒక చిన్న రెవిన్యూ ఉద్యోగికి ఇచ్చారు. డౌట్ ఫుల్ సిటిజన్ అంటే ఎవరో మూల చట్టంలో నిర్వచనం లేదు. రూల్స్‌లో నిర్వచనం లేదు. ఎప్పుడు ఏ సందర్భంలో డౌట్ చేయాలో వివరించలేదు. ఏ సమాచారం లేకపోతే అతన్ని అనుమానించాలో చెప్పలేదు. ఇంత అధికారాన్ని ఒక కింది స్థాయి ఉద్యోగికి దఖలు పరచడం వల్ల ఇది అత్యంత విపరీత అధికారాల బదిలీ అనే అభ్యంతరకరమైన పని అవుతుంది. ఇది చెల్లదు. తను పుట్టిపెరిగిన నేలలో ప్రతి వ్యక్తి తాను ఏదేశపు వాడో తెలియని గందరగోళ స్థితిలో పడిపోయే దుర్మార్గపు చట్టం ఇది.

కాలికి మట్టి బురద అంటిందని, అందరి కాళ్లు శుభ్రంగా ఉండడానికి మొత్తం భూమిమీద తివాచీ పరచాలని ఒక మేధావి ఆలోచన చేసాడు. మరో మేధావి అన్నాడట, మొత్తం భూగోళ మంతా తివాచీ పరచడం కన్న మనకాళ్లకు చెప్పులు తొడుక్కోవడం సరిపోతుంది కదా అన్నాడు. మొత్తం దేశమంతా పౌరులను, జనాలను లెక్కించి నమోదు చేయబోవడమంటే నేలంతా తివాచీ పరచే వృధా పరిశ్రమే అవుతుంది. అనుమానాస్పద పౌరుల వివరాలు సేకరించి వారిని బయటకు పంపడం మాత్రమే కావలసింది. కాని జనపట్టిక పౌరపట్టిక తయారుచేసే ప్రయత్నం చేస్తున్నాం.

దేశంలో సుమారు 20శాతం మంది ప్రజలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సిల కోసం ఏర్పాట్లు చూస్తుంటే ఒక విషయం గుర్తు కొస్తున్నది. వెనకటికెవడో ఒక మేధావి తన కాలికి బురద, మట్టి అంటిందని భూమండలం అంతా తివాచీ పరిస్తే బాగుంటుందని అన్నాట్ట. తన కాలికి చెప్పులు వేసుకుంటే సరిపోయే దానికి భూ గోళాన్ని మొత్తంగా తివాచీతో కప్పేయాలని అనుకోవడం ఎంత అవివేకమో, కేంద్ర ప్రభుత్వ చర్య కూడా అంత అవివేకంగా ఉంది. కొద్ది మంది విదేశీయులను, చొరబాటుదారులను గుర్తించేందుకు దేశ ప్రజలందరినీ తమ పౌరసత్వాన్ని నిరూపించు కోవాలనడం దారుణమైన విషయం.

మనకు జనపట్టిక (ఎన్‌పిఆర్) ప్రస్తుతం అవసరం. అందుకు వివరాల సేకరణ జరగాలని పౌరసత్వ నియమాలు 2003 కింద నిర్ణయించారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి ఈ వివరాల సేకరణ జరుగుతుందని జులై 2019న ఒక నోటిఫికేషన్ కూడా జారీ చేసారు. ప్రతి వ్యక్తి పేరును వివరాలను నమోదు చేసి రిజిస్టర్ తయారు చేయడం, ఆ వివరాల ఆధారంగా ఒక పౌర పట్టిక (రిజిస్టర్) చేయడం దాని ఆధారంగా కొందరిని విదేశాలకు పంపడం అనే కార్యక్రమం పూర్తిగా అనవసరమయిన పని. ఆరు నెలలు నివసించి మరో ఆరునెలలు నివసించే ఉద్దేశం ఉన్నవారిని ఈ దేశ నివాసులుగా భావిస్తారు. ఆ విధంగా దేశంలో నివసించే వారి పట్టికను జన పట్టికగా రూపొందిస్తామని అంటున్నారు.

జనాభా లెక్కల సేకరణ, జనపట్టిక చేయడం ఒకటే అని ప్రభుత్వం, హోంమంత్రిత్వ శాఖ వాదిస్తున్నది. ఒకటే అయితే మళ్లీ జనపట్టిక పేరుతో వివరాల సేకరణ ఎందుకంటే జవాబు లేదు. జనాభా లెక్కల వారికి జనం స్వచ్ఛందంగా వివరాలు ఇస్తారు. ఇవ్వకపోతే ఏ చర్యలూ ఉండవు. కాని జనపట్టిక కోసం సమాచారం ఇచ్చి తీరాలి. ఇవ్వకపోయినా, తప్పుడు సమాచారం

ఇచ్చినా జరిమానాలు విధించే అవకాశం ఉంది. అంతే కాదు ఈ వివరాల ఆధారంగానే పౌర పట్టిక తయారవుతుంది. ఈ రెండు వేరు వేరని తెలుసుకోవాలి. మరో ప్రమాదం ఏమంటే మీరిచ్చిన వివరాలు నమ్మశక్యం కాకపోతే అధికారి మన పేరు పక్కన 'డి' అనే అక్షరం చేరుస్తారు. డి అంటే డెమాక్రసీ కాదు డెత్ పెనాల్టీ కాదు. డి అంటే డౌట్ ఫుల్ అని సూచించడం. ఈ డి వ్యక్తిని పక్కన బెడతారు. ఇంకా విచారిస్తారు. ఆ వ్యక్తికి చెప్పుకునే అవకాశం ఇస్తారు. వారితో పాటు ఇంకా ఎవరైనా కూడా అభ్యంతరాలు తెలియజేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఒకవేళ అనుమానాలు తీరితే సిటిజన్ పత్రం ఇస్తారు. లేకపోతే డిటెన్షన్ సెంటర్ కు బందీగా వెళ్లాల్సి వస్తుంది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్సి, సిఎఎ, ఎన్పిఆర్ లు భారత ప్రజల జీవించే హక్కుకే ప్రమాదంగా పరిణమించాయి. సిఎఎ,ఎన్ఆర్సి,ఎన్పిఆర్లు రాజ్యాంగ విరుద్ధమైనవని, వీటిని వ్యతిరేకించే చట్టపరమైన హక్కు ప్రజలకు ఉంది.

ప్రభుత్వాలు తెచ్చే ఏ చట్టాలైనా రాజ్యాంగంలోని పీఠికలో పేర్కొన్న లక్ష్యాలకు మౌలిక స్వరూపానికి లోబడి ఉండాలి. 1973లో సుప్రీం కోర్టు కేశవానంద భారతీ కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు ఈ దేశంలో ఎవరికీ లేదని స్పష్టంగా చెప్పింది. ఆ తీర్పును సైతం కేంద్ర ప్రభుత్వం లెక్క చేయడం లేదు. ప్రభుత్వానికి పార్లమెంటులో పూర్తి మెజార్టీ ఉంది కాబట్టి ఏదైనా చేయొచ్చు అనడం సరికాదన్నారు. రాజ్యసభ సభ్యులను కొనుగోలు చేయడానికి, వారు అమ్ముడు పోవడానికి కూడా వెనుకాడడంలేదు. ఓటర్లను ప్రలోభపెట్టడం, అభ్యర్థులను కొనుగోలు చేయడం వంటి కార్యకలాపాలు జరుగుతున్నా, అమ్ముడు పోయిన వ్యక్తి తనను కొనుగోలు చేశారని చెప్పనంత వరకు అది శిక్షార్హమైన నేరంగా పరిగణించలేమని చట్టాలు చెబుతున్నాయి. వీటిని మార్చుకోవడానికి ఆ నేరాలను తమంత తామే గుర్తించే నేరాలుగా ప్రకటించడానికి మన ప్రభుత్వాలు పార్టీలు సిద్ధంగా లేవు. ఇదే మన దేశ చట్టాల్లో, రాజకీయ పార్టీల్లో ప్రభుత్వాల్లో ఉన్న మౌలికమైన లోపం.

ఎన్పిఆర్ కేవలం పౌరపట్టికేనని, దీనికి ప్రజలు భయ పడాల్సిన పనిలేదని, జనాభాలెక్కలు, పౌర పట్టిక ఒకటే అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెబుతున్నారు. అయితే జనాభా లెక్కలు పదేళ్లకోసారి సేకరిస్తూ ఉండగా ఎన్పిఆర్ ఎందుకు? అని ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నారు.

ఎన్పిఆర్ ద్వారా మన పూర్వీకుల పుట్టుపూర్వోత్తరాల వివరాలను అడుగుతోంది. ఎన్పిఆర్‌లో అడిగే 6 ప్రశ్నలకు మనం సరైన ఆధారాలు, సమాచారం ఇవ్వకుంటే మన పేరు వద్ద (డి) అని గుర్తు పెడతారట, డి- అంటే డౌట్‌ఫుల్(అనుమానాస్పదం) పౌరులట. అయితే డి-అని గుర్తుపెట్టిన ప్రతి వ్యక్తి పౌరసత్వం ప్రమాదంలో పడినట్టే అయిపోతుంది.

## అక్బర్-బీర్బల్ కథ

"అక్బర్ ఆస్థానంలో మంత్రి బీర్బల్ ఒక రోజు దర్బార్‌కు ఆలస్యంగా వచ్చాడు. ఎందుకు ఆలస్యంగా వచ్చావని అక్బర్ అడిగాడు. తులసిమాత పూజవల్ల ఆలస్యమైందన్నాడు. తులసి మాత ఏంటి? అని అక్బర్ ఆశ్యర్యంగా ముఖం పెట్టాడు. తులసిమాత ఒక మొక్క అని బీర్బల్ చెప్పాడు. ఒక మొక్క దేవతా అయితే ఆ మొక్కను తీసుకురా అని అక్బర్ బీర్బల్‌ను ఆదేశించాడు. తులసి మొక్కను తెచ్చారు. ఈమొక్క దేవతామాతా? చూడు ఏం చేస్తానో అని దాన్ని అక్బర్ ముక్కలు ముక్కలుగా తుంచి పడేసాడు. చూడు నీ మొక్క నీ దేవుడు నీ మాత నన్నేమీ చేయలేదు అంటాడు. దీంతో నొచ్చుకున్న బీర్బల్ అక్బర్‌కు ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంటాడు. మరుసటి రోజు బీర్బల్ కావాలనే ఆలస్యంగా దర్బార్‌కు వెళ్లాడు. మళ్లీ ఈరోజు ఆలస్యం ఏంటి అని అడగ్గా, మా నాన్నకు పూజ చేసి వస్తున్నాను అన్నాడు. మీ నాన్నకు పూజ ఏంటి అని అడగ్గా, అది ఒక మొక్క జహాపనా అని బీర్బల్ సమాధానమిచ్చాడు. ఆహా..నాన్న కూడా ఒక మొక్కేనా, ఆ మొక్కా దేవుడేనా అయితే సరే ఆ మొక్కను కూడా తీసుకురా అని దాని పని చెప్తాను అన్నాడు. ఆ మొక్కను కూడా తెప్పించుకుని, ఆ మొక్కనూ ఇష్టానుసారంగా చింపి పోగులు వేశాడు అక్బర్. అంతే. కాసేపటికి అక్బర్‌కు తట్టుకోలేనంత దురద ప్రారంభమైంది. దురదను భరించలేక బట్టలు విప్పి, దొర్లి దొర్లి గోక్కుంటున్నాడు. ఇదేంటి బీర్బల్.. ఇంత దురద పుడుతోంది అని అడగ్గా మా అమ్మ సౌమ్యురాలండి, తనను ఏం చేసినా ఏమీ అనదు, కానీ మా నాన్న మాత్రం అలా కాదండీ.. తనను ఏమైనా చేస్తే ఊరుకోడు అని బీర్బల్ బదులిచ్చాడు. అదేంటయ్యా.. అని అడగ్గా ఇది దూలగొండి మొక్క అని చల్లగా సమాధానమిచ్చాడు. మరి దీనికి పరిష్కారమే లేదా? అని అడగ్గా, ఉంది ప్రభూ మీరు మా అమ్మను(తులసి మొక్కను) అడగండి కరుణిస్తుంది అని బీర్బల్ అంటాడు. అక్బర్ అర్థం కాలేదు అని అనడంతో, మరి కొన్ని తులసి మొక్కలను తీసుకొచ్చి, వాటి రసాన్ని తీసి రాసుకోండి అని బీర్బల్ పరిష్కారం చూపించాడు".

ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తులసి మొక్కలా ప్రజలు ఏమీ అనట్లేదు కదా అని, ఇష్టానుసారంగా చట్టాలు చేస్తే దూలగొండి మొక్కలా ప్రజలు నిరంకుశ పాలకులకు తగు బుద్ధి చెబుతారనేది ఈ కథ సారాంశం.

ఎన్ఆర్సి, సిఎఎ, ఎన్పిఆర్ చట్టాలంటే దూలగొండి మొక్కల్లాంటివని, వాటితో ఆడితే నియంతల తల పొగరును అణచివేస్తాయి. ఇతర దేశాల నుండి మన దేశానికి వలసదారులు గానో, శరణార్థులుగానో వచ్చి 11 సంవత్సరాలు పైబడి నివసిస్తున్న వారికి మనదేశ పౌరసత్వం సహజంగానే లభిస్తుంది. 1950 నుండి ఇంతవరకు కేవలం 3,311 మందికే పౌరసత్వం ఇచ్చిందని ఆయన తెలిపారు. సిఎఎలో పేర్కొన్నదానిని బట్టి మన దేశంలో 5 సంవత్సరాల పైబడి నివసిస్తున్న హిందూ క్రైస్తవ, బౌద్ధ, జైను, సిక్కు, పారశీ మతాల వారికే పౌరసత్వాన్ని ఇస్తామని, ముస్లిములకు ఇవ్వడం కుదరదంటున్నారు. మూల చట్టంలోని అంశాలకు భిన్నంగా, రాజ్యాంగంలోని ఆర్టికిల్స్ 5 నుంచి 10కి విరుద్ధంగా, ఆర్టికిల్ సమానతకు వ్యతిరేకంగా, 25 కింద మైనారిటీ మత హక్కులకు భిన్నంగా, సిఎఎను రూపొందించారు. ఇది మన లౌకిక వాదానికి కూడా విరుద్ధం.

ఆర్టికల్ 14ని మరోసారి క్షుణ్ణంగా చదవడం మంచిది. ఆర్టికల్ 14 మొదటి వాక్యం చెప్పేదేమంటే, ప్రభుత్వం ఏ వ్యక్తులకైనా చట్టం ముందు సమానత అమలు చేయించి తీరాలని షరతు విధిస్తున్నది. ఏ వ్యక్తులకయినా అంటే పౌరులు కాని వారికి కూడా అని అర్థం. ఈ దేశంలో తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చి 1948 నుంచి నివసిస్తున్న లక్షలాది మందిని సమానంగా చూడకుండా అందులో ఆరుమతాల వారికే పౌరసత్వం ఇస్తామని అనడం రాజ్యాంగ విరుద్ధం.

## ప్రజలకు అవాస్తవాలు పంచుతున్న ప్రభువులు

ప్రభువులు ప్రజలకు అవాస్తవాలు చెబుతారని అందరికీ తెలుసు కాని మరీ ఇన్ని అవాస్తవాలా? ఇంత దారుణమా, అసత్యాలు చెప్పి ప్రజలను నమ్మించడం ప్రజాస్వామ్యానికే ద్రోహం చేయడం. పౌరసత్వం సవరణకు సంబంధించిన నిజానిజాలు ఇవిగో ఇవి :

## మొదటి అబద్ధం

**పౌరసత్వ సవరణ చట్టం 2019తో జాతీయ పౌర రిజిస్టర్ తో సంబంధం లేదు. రెండూ విడివిడిగా చూడాలి. వాటిని పోల్చి చెప్పడం అసత్యం** **- ప్రధాని**

"మొదట సిఎబి వస్తుంది, వలసవచ్చిన వారందరికీ పౌరసత్వం లభిస్తుంది. తరువాత ఎన్ఆర్సి వస్తుంది. కనుక వలస వచ్చిన వారెవరూ భయపడాల్సిన పని లేదు. చొరబాటు దార్లంతా భయపడాలి. ఏది ముందు వస్తుందో జాగ్రత్తగా గమనించండి, ముందు సిఎబి, తరువాత ఎన్ఆర్సి, ఎన్ఆర్సి కేవలం బెంగాల్కు మాత్రమే కాదు. మొత్తం దేశంలో అమలు చేస్తాం" అని ఏప్రిల్ 2019లో హోంమంత్రి ప్రకటించారు. డిసెంబర్ 9, 2019 నాడు కూడా హోం మంత్రి పార్లమెంట్లో దేశమంతటా జాతీయ పౌర రిజిస్టర్ ను అమలుచేసే ముందే సిఎఎ సిద్ధమవుతుందనీ. దేశవ్యాప్తంగా పౌరుల పట్టిక రూపొందు తుందనీ, ఒక్క చొరబాటుదారుడుకూడా తప్పించుకోలేదనీ ప్రకటించారు. డిసెంబర్ 19, 2019 : జెపి నడ్డా బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదే చెప్పారు.ఎవరు చెప్పింది అవాస్తవం?

## రెండో అబద్ధం

**"నా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎన్ఆర్సి గురించి ఎక్కడా చర్చించనే లేదు"**

**- ప్రధాని డిసెంబర్ 22**

రాష్ట్రపతి ఏం చెప్పారో చూడండి. జూన్ 20, 2019నాడు పార్లమెంటు సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి "...నా ప్రభుత్వం ప్రపథమంగా జాతీయ పౌరసత్వ రిజిస్టర్ విధానాలను అమలు చేయాలని నిర్ణయించింది.ముందుగా చొరబాటుదారులతో నిండిన ప్రాంతాలలో ఈ విధానం అమలు అవుతుంది..." నవంబర్ 21, 2019న రాజ్యసభలో హోంమంత్రి ఇదేరకంగా ప్రకటించారు. ఎవరు చెప్పింది అవాస్తవం?

## మూడో అబద్ధం

**"దేశవ్యాప్తంగా ఎన్ఆర్సిని ఇంతవరకు నోటిఫై చేయలేదు"**

**- కేంద్రహోం శాఖ సహాయమంత్రి, డిసెంబర్ 2019**

2003లో చేసిన పౌర సవరణ చట్టం ప్రకారం జాతీయ పౌరపట్టిక (రిజిస్టర్) శాసనంలో భాగం. అందులోని క్లాజ్ 14ఎ (2) కేంద్రప్రభుత్వం జాతీయ పౌర పట్టికను రూపొందించాలి. అందుకోసం జాతీయ పౌర నమోదు అధికారి రిజిస్ట్రేషన్ అధికార సంస్థ (అథారిటీ) ని ఏర్పాటు చేయాలి. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియానే జాతీయ రిజిస్ట్రేషన్ అథారిటీగా ప్రకటించారు. పౌరుల నమోదు కార్యక్రమానికి ఆయనే రిజిస్ట్రార్ జనరల్గా వ్యవహరిస్తారు. ఈ ప్రక్రియ కోసం నియమాలను (రూల్స్) కూడా 2003 లోనే ఏర్పాటు చేశారు. ఏది అవాస్తవం?

## నాలుగో అబద్ధం

**"జాతీయ స్థాయిలో ఎన్ ఆర్ సి ని ప్రకటించలేదు"**

**- హోంశాఖ సహాయమంత్రి**

జులై 31, 2019న ఎన్ఆర్సి జాతీయ స్థాయిలో రూపొందించం ఆరంభమైందని అధికారిక గెజిట్లో నోటిఫై చేశారు. పౌరనమోదు, జాతీయ గుర్తింపు కార్డుల జారీ నియమాలు 2003 రూల్ 3(4) ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇందుమూలముగా

జనాభా పట్టిక (పాపులేషన్ రిజిస్టర్) ను తయారుచేయడానికి, నవీకరించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఏప్రిల్ 1, 2020 నుంచి సెప్టెంబర్ 30, 2020 వరకు స్థానిక పరిధిలో నివసించే వారి పేర్లను ఇంటింటికీ తిరిగి నమోదు చేస్తూ స్థానిక రిజిస్టర్‌ను తయారు చేసే క్షేత్ర కార్యాలను అస్సాంలో తప్ప, దేశమంతటా నిర్వహించాలని నిర్ణయించింది అని ప్రకటించింది. నోటిఫికేషన్ ఇంత స్పష్టంగా ఉంటే లేదంటున్నారు. జులై 23, 2014 నాడు పార్లమెంటులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఇటువంటి ప్రకటనే చేశారు. జులై 31, 2019న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ జనరల్ గారు, ఇంటింటి ప్రజల పేర్ల నమోదు చేసే రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏప్రిల్ 1, నుంచి సెప్టెంబర్ 30, 2020 వరకు కొనసాగించాలని ప్రకటన చేసారు. ఎవరు చెప్పింది అవాస్తవం?

## అయిదో అబద్ధం

**ఎన్ఆర్‌సి కి జాతీయ ప్రజా పట్టిక కు మధ్య ఏ సంబంధమూ లేదు. ఎన్ పి ఆర్ తో ఎన్ ఆర్ సి ముడిబడి లేదు – అమిత్ షా**

ఎన్ఆర్‌సి కోసం 2003 నియమాలలో జాతీయ పౌర పట్టికను రూపొందించే ప్రక్రియ మొదలవుతుందని స్పష్టంగా ఉంది. క్లాజ్ 4 ప్రకారం ప్రజా పట్టిక కోసం ఇంటింటా వివరాల సేకరణ మొదలవుతుందనీ ఉంది. రూల్ 3 ప్రకారం భారత జాతీయ పౌర రిజిస్టర్ ప్రతి పౌరుడికి సంబంధించి ఈ కింది వివరాలను సేకరించాలి. 1. పేరు, 2. తండ్రి పేరు, 3. తల్లి పేరు, 4. లింగం, 5. పుట్టిన తేదీ, 6. పుట్టిన చోటు, 7. నివాసం (శాశ్వత లేదా తాత్కాలిక), 8 వివాహితులా కాదా, భాగస్వామి పేరు, 9. కనిపించే గుర్తింపు చుక్క, 10. పౌరుడుగా నమోదయిన తేదీ, 11. రిజిస్ట్రేషన్ సంఖ్య, 12 జాతీయ గుర్తింపు సంఖ్య. భారత జాతీయ పౌర పట్టిక ఎన్ఆర్ఐసి దిశలో ప్రజల పట్టిక రూపకల్పన గెజిట్ నోటిఫికేషన్ తొలిఅడుగు. 2003 నియమాల్లో ఈ అంశం రూల్ 3(5) లో ఉంది. ఏది అవాస్తవం?

## ఆరో అబద్ధం

**"జాతీయ జన పట్టికకు ఎన్ ఆర్ సి పౌరసత్వ పట్టికకు ఏ సంబంధమూ లేదు"**

**– కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జావదేకర్.**

హోం మంత్రిత్వశాఖ వార్షిక నివేదిక 2018–19 అధ్యాయం 15, పేరాగ్రాఫ్ 15.40 లో "సాధారణంగా నివసించే వారందరి ప్రత్యేక వివరాలతో జాతీయ జనపట్టికను దేశవ్యాప్తంగా రూపొందించాలని భారత ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఎవరు చెప్పింది అవాస్తవం?

## ఏడో అబద్ధం

**ఈ దేశంలో నిర్బంధ కేంద్రాలే (డిటెన్షన్ సెంటర్లు) లేవు**

**– ప్రధాని.**

రాజ్యసభలో డిసెంబర్ 11, 2019నాడు హోంమంత్రి అక్రమ చొరబాటుదారులను లేదా విదేశీయులుగా నిర్ధారింపబడి వారి దేశాలకు పంపేంతవరకు బంధించడానికి అన్ని రాష్ట్రాలలో డిటెన్షన్ కేంద్రాలను నిర్మించాలని ఆదేశాల పంపడం జరిగిందని సమాధానం చెప్పారు. 9.1.2019న, 24–29 ఏప్రిల్ 2014, మళ్లీ 9–10 సెప్టెంబర్ 2014 కూడా ఆదేశాలు పంపామని వారేచెప్పారు. 2018లోనే ఒక నమూనా డిటెన్షన్ సెంటర్, ఆ సెంటర్లను నడిపే నియమావళి (మాన్యువల్) ను అన్ని రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపారు. కర్నాటక హైకోర్టులో నవంబర్ 28 కేంద్రం దాఖలుచేసిన ఒక అఫిడవిట్‌లో "అన్ని రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు 2014లో 2018లో కూడా డిటెన్షన్ సెంటర్లను నిర్మించాలని అందులో అక్రమ వలసదారులైన విదేశీయులను బంధించడం గురించి రాసా"మని చెప్పారు. కేంద్ర హోం మంత్రి లోకసభకు జులై 9, 2019 ప్రశ్న నెంబర్ 2660 కు జవాబుగా, అస్సాంలో గోల్పురాలో 267మంది బందీల కోసం డిటెన్షన్ సెంటర్‌కు 46 కోట్ల రూపాయల 51 లక్షల రూపాయలు కేటాయించినట్టు చెప్పారు. కర్నాటక ప్రభుత్వం ఇటువంటి బందీ కేంద్రాలను నిర్మిస్తున్నది, ఫడ్నవిస్ ప్రభుత్వం మహారాష్ట్రలో బందిఖానాలు నిర్మించడానికి స్థలాలను కేటాయించింది. ఎవరు చెప్పింది అవాస్తవం?

## ఎనిమిదో అబద్ధం

**"ఈ ప్రక్రియలగురించి భారతీయ ప్రజలు భయపడనవసరం లేదు. కేవలం చొరబాటుదారులు, శత్రువులు మాత్రమే దేశం నుంచి తొలగింపబడుతారు. ఇది మనదేశ రక్షణ కోసం అని నమ్మండి"** **– బిజెపి నాయకులు**

ప్రతి వ్యక్తికీ పౌరసత్వం ఆటోమేటిక్‌గా రాదు అని హోం మంత్రిత్వ శాఖే మరొక ప్రకటన చేసింది.ప్రతి వ్యక్తి పౌరుడు కాదని ప్రభుత్వం భావిస్తుంది. తాను పౌరుడనని రుజువుచేసుకునే భారం, బాధ్యత ప్రతి వ్యక్తి మీదా ఉంటుంది. 3 కోట్ల పదిలక్షల మందిని అస్సాంలో పౌరులుగా ప్రకటించింది. కాని 19 లక్షల మంది తాము పౌరులని రుజువు చేసుకోలేక పోయారని ప్రభుత్వ అధికారులు ప్రకటించారు. వారంతా విదేశీయులని నిర్ధారించారు. వీరంతా డిటెన్షన్ సెంటర్లలో ఉండాల్సిందేనా? వీరికి ఓటింగ్ హక్కులు ఉండవు. వేరే ప్రయోజనాలు అందవు. ఏ దేశానికి ఎప్పుడు పంపుతారో తెలియదు. అసలు వారికి ఏ దేశమో తెలియదు. అస్సాంలో 19 లక్షల మంది జీవితాల్లో చీకటినింపిన

ఎన్ఆర్సి దేశవ్యాప్తంగా అమలు చేస్తే కొన్ని కోట్ల మంది ప్రజలు ఈ దేశంలో రాజ్య రహితులుగా మిగిలిపోవలసి వస్తుంది. వారిని బంధించడానికి ఎన్ని డిటెన్షన్ సెంటర్లు నిర్మించాలి. వారిని పోషించడానికి ఎన్ని కోట్లు కేటాయించాలి. ఎవరు చెప్పింది అవాస్తవం?

## తొమ్మిదో అబద్ధం

**"పౌరసత్వ సవరణ చట్టం 2019 వివక్షతో కూడింది కాదు"**
**– ప్రధాని, హోంమంత్రి, తదితరులు**

భారత సంవిధానంలో ఎక్కడాగానీ, ఆర్టికల్ 5 నుంచి 11 వరకున్న నియమాల్లో గానీ ఎక్కడా మతం ప్రాతిపదికన పౌరసత్వ అధికారాలు నిర్ణయించాలని లేదు. మతం అసలు ఏ అంశంలోనూ నిర్ణాయక కారణం కారాదనది రాజ్యాంగ సూత్రం. ఆర్టికల్ 11 ఇచ్చిన అధికారం కింద పౌరసత్వ చట్టం 1955ను రూపొందించారు. పౌరసత్వసవరణ చట్టం 2003లో అక్రమ చొరబాటుదారులంటే ఎవరో సెక్షన్ 2(1)బి నిర్వచించింది. అక్రమ చొరబాటుదారులను మతం ప్రాతిపదికపై నిర్ణయించలేదు. ఇక పౌరసత్వం సవరణ చట్టం 2019 ఆ సెక్షన్‌ను సవరించారు. అఫ్ఘనిస్తాన్, బాంగ్లాదేశ్ పాకిస్తాన్ నుంచి 31 డిసెంబర్ 2014కు ముందు వచ్చిన హిందూ, క్రైస్తవ, సిఖ్ఖు, బౌద్ధ, జైన్, పార్సీ, మతాలకు చెందిన ఏ వ్యక్తి అయినా అక్రమ చొరబాటుదారుడు కాదు అని మార్పు చేశారు. స్వతంత్రం భారతదేశంలో మొదటి సారి మతం ఒక ప్రాతిపదికగా రాజ్యాంగంలో ప్రవేశించడం ఇదే. భారతదేశంలో ఆరేళ్ల కిందట ప్రవేశించి నివసిస్తున్న ఇద్దరు వలసదారులలో ఒకరికి నివాసానికి రుజువు ఉన్నప్పుడికీ వారి పూర్వీకుల గురించి పత్రాలు లేకపోతే అతను సక్రమ వలసదారుడయ్యే అవకాశం ఉంది, కాని అతను హిందువో, సిక్కో, జైనుడో, పార్సీయో, క్రైస్తవుడో, బౌద్ధుడో అయితేనే సక్రమ వలసదారుడైతాడు. అతను ముస్లిం అయినా, బహాయి అయినా ఇంకే మతానికి చెందిన వాడయినా అక్రమవలస దారుడిగా మిగిలిపోతాడు. దీన్నే వివక్ష అంటారు. అట్లా వివక్ష చేయడానికి చట్టాన్ని సవరించి ఈ చట్టం ద్వారా వివక్ష జరగదు అంటే అంతకు మించిన అవాస్తవం ఏముంటుంది.

## పదో అబద్ధం

**"ఈ పౌరసత్వ సవరణ చట్టం 2019 కానీ ఎన్ఆర్సి కాని పౌరసత్వం ఇవ్వడానికే కాని తొలగించడానికి కాదు"– ప్రధాని**

సవరణ ద్వారా మతప్రాతిపదికన అక్రమ లేదా సక్రమ చొరబాటుదారుడిని నిర్ణయిస్తారు. వారిలో కేవలం ఆరుమతాల వారికి మాత్రమే సక్రమ చొరబాటుదారులని భావించి పౌరసత్వం ఇస్తారు. ఆరుమతాలు కాకుండా ఇతర మతాలకు చెందిన వారికి ఇవ్వరు. విచిత్రమేమంటే నేపాల్, శ్రీలంక, నుంచి వచ్చిన వలసవాదులలో హిందువులే ఎక్కువ మంది ఉన్నారు. బర్మా (మ్యాన్మార్) నుంచి కూడా ఎందరో ఎన్నో మతాలవారు వచ్చారు. వారిలో హిందువులు కూడా ఈ సవరణ చట్టం వల్ల సక్రమ చొరబాటుదారులు కాబోరు. అక్కడ కొన్ని దేశాలనుంచి వచ్చిన వారిని ఆదరించి మరికొన్ని దేశాల నుంచి వచ్చిన వారిని పట్టించుకోబోరని చట్టం చెబుతున్నది. శ్రీలంక నుంచి లక్ష మంది తమిళ హిందువులు ఈ దేశంలో కొన్న దశాబ్దాల నుంచి ఉన్నారు. వారు శరణార్థులే గాని చొరబాటు దారులు కాదు. కాని వారికి దిక్కు లేదు. వారిని శ్రీలంక తమ దేశంలోకి స్వీకరిస్తుందో లేదో తెలియదు. కాని భారత్ మాత్రం వారిని వెళ్లగొట్టడమో లేక డిటెన్షన్ సెంటర్లోనో పెడుతుంది. హిందూ భక్తులైన అంధ అనుయాయులు ఈ హిందువుల గురించి మాట్లాడరు. వీరిని వెళ్లగొట్టినా, బంధించినా ఈ హిందూ ప్రియ భక్తులకు ఫరవాలేదు. ప్రభుత్వమే కాదు ప్రజలను కూడా వివక్షకు సిద్ధం చేసింది ఈ చట్టం ద్వారా. జాతీయపౌర పట్టిక నిర్మాణం పేరుతో సర్కారు వారు అడిగే సమాచారం రుజువులు ఇవ్వలేని నిజమైన భారతీయ పౌరుల గతి ఏమిటి? వారికి ఉన్న పౌరసత్వం ఊడబెరికే ప్రమాదం చాలా స్పష్టం. మేము పౌరసత్వం ఇవ్వడానికే గానీ తొలగించడానికి ఈ చట్టం తేలేదనే మాట కూడా ఎంత అవాస్తవమో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏది అవాస్తవం?

3 వేల మంది బందీలకోసం నిర్మించే డిటెన్షన్ సెంటర్ కు 46 కోట్ల రూపాయలు కేటాయించారు. హోం శాఖ అంచనా ప్రకారం 26 వేల 658 సెంటర్ల నిర్మాణానికి12 లక్షల 40 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని ఇది 2019 సంవత్సరం నాటి జిడిపి లో 8.8 శాతం సొమ్ముతో సమానమని ఒక పాత్రికేయుడు అంచనా వేసారు.

ఈశ్వరుని సాక్షిగా అంతఃకరణ సాక్షిగా రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తామని చెప్పి రాజ్యాంగ వ్యతిరేకంగా విధానాలు తీసుకొస్తున్నారని నిలదీస్తే అధికారికంగా అబద్ధాలు చెప్పడం నేరమా? అయితే శిక్షలున్నాయా?

ఇంతకు ముందు రాజ్యాంగం తెలియని వాళ్లు నాయకులు కావడం వల్ల రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందని అనుకునే వాడిని, రాజ్యాంగ నిపుణులు ప్రభుత్వంలో ఉండడం వల్లే రాజ్యాంగం ప్రమాదంలో పడుతూ ఉండడం నేడు కనిపిస్తున్నది. సిఎఎతో భారతీయులు బతుకులు అనుమానాస్పదంగా మారాయి, ఈ చట్టాన్ని తిప్పికొట్టడానికి పట్టువదలని విక్రమార్కులై పోరాటం సాగించాల్సి ఉంది. ❑



# రాజ్యాంగం భగవద్గీత కాదు

హెచ్చార్కె

ఒక జాతి తన జీవితాన్ని క్రమబద్ధం చేసుకోడానికే రాజ్యాంగం. యథాతథ స్థితికి మనిషిని కట్టుబానిస చేయడానికి కాదు. రాజ్యాంగాన్ని ధిక్కరించడానికి, విమర్శించడానికి... తిరస్కరించడానికి కూడా... అవకాశమిచ్చేదే సరైన రాజ్యాంగం, మంచి రాజ్యాంగం. అలాంటి విమర్శ వినిపించగానే వానరసేనలా విరుచుకుపడేవాళ్లు రాజ్యాంగ స్ఫూర్తికే వ్యతిరేకులు. ఏదో ఒక రాజ్యాంగ స్ఫూర్తికి కాదు. అసలు రాజ్యాంగం అనే స్ఫూర్తికే వ్యతిరేకులు. వాళ్ల దృష్టిలో రాజ్యాంగం ఒక పవిత్ర మత గ్రంథం. రాజ్యాంగం రాసినవాళ్లు సెయింటన్, రుషులు, పవిత్రులు. దాన్ని కాదన్న వాళ్లంతా 'హెరెటిక్స్'. 'ఇంక్విజిషన్లు' జరిపి బతికున్న వాళ్లను రాటలకు కట్టి కాల్చేయాల్సినంత హెరెటిక్స్. రాజ్యాంగం మంచిదైతే, ఇండియాలో ఇన్నాళ్ల అమలు తరువాత కులమతాలకు ఇంత గిరాకీ ఉండేది కాదు. కుల నిర్మూలనకు కాకుండా కులమతాల స్థిరీకరణకే రాజ్యాంగం ఎక్కువ ప్రోత్సాహం కల్పించింది. కులమతాలు ఇష్టారాజ్యంగా వర్ధిల్లడానికి అవకాశ మిచ్చి, మారణహోమాలకు మొసలి కన్నీరు కార్చడం వ్యర్థం. రాజ్యాంగం మీద ప్రజల కోపం సరైనదే . అది పూర్తిగా సత్యా గ్రహమేనని కారంచేడులు, చుండూరులు, కీలవేన్మణులు, ఘోరమైన హేయమైన నేరం జరిగి ఏడాది గడిచినా కేసు ఇంకా విచారణక్కూడా రాని బిక్కి శీను అమానుష హత్య.... నిత్యం నిరూపిస్తున్నాయి. ఈ సత్యాగ్రహానికి స్పందనగా వినిపించే పరుష విమర్శలు, వ్యక్తిత్వ హనన యత్నాలు... పైన చెప్పిన 'ఇంక్విజిషన్' లను తలపిస్తాయి. ఇంక్విజిటర్ల ప్రధాన అభియోగం... రాజ్యాంగ రచయితలను తప్పు పట్టడమంటే... ప్రజాప్రేమి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను దూషించడమేనని. అదొక పెద్ద అబద్ధం. అది డాక్టర్ అంబేద్కర్‌ను రాజ్యాంగ రచయితగా కుదించి, పాలకుల పబ్బం గడపడం. రాజ్యాంగ రచనను భగవద్గీత కన్న రామాయణంతో పోలిస్తే సంగతి మరింత బాగా అర్థమవుతుంది. పితృస్వామిక, భర్తృస్వామిక, బ్రాహ్మణస్వామిక రామాయణాన్ని బోయ కులస్థుడైన వాల్మీకి రాశాడనడం ఎంత పెద్ద అబద్ధమో రకరకాల అసమానతలకు మూలకందంగా ఉన్న రాజ్యాంగాన్ని నిజాయితీపరుడైన దళిత మహానేత, డాక్టర్ అంబేద్కర్ రాశాడనడం కూడా అంతే అబద్ధం.

నిజమే, 'రాజ్యాంగ సభ'కు ఆయన అధ్యక్షుడు. కాని, రాజ్యాంగ సభలో పలు డెలిబరేషన్ల ఫలితం, వాదోపవాదాలలో 'గెలిచిన' మెజారిటీ భావనల ఫలితం రాజ్యాంగం. డెలిబరేషన్లలో చాల రాజీబేరాలు న్నాయి. ఇది నా వ్రాత కాదు అని స్వయంగా డాక్టర్ అంబేద్కర్ చెప్పుకోవలసినంత రాజీబేరాలున్నాయి. రాజ్యాంగ సభ రూపొందించిన రాజ్యాంగం అంబేద్కర్ కల గన్న 'యునైటెడ్ స్టేటస్ ఆఫ్ ఇండియా'కు ప్రాతిపదిక కాలేదు. అయినా, రాజ్యాంగ రచయిత ఆయనే అనడానికి కారణమేమిటి? హిందూ మెజారిటేరియన్ సమాజానికి దళితుడైన అంబేద్కర్ అంటే అంత అభిమానమా? కాదు. ఒక అసమ సమాజం లెజిటిమైటేజేషన్ ప్రక్రియలో అదొక భాగం. దుర్మార్గమైన ఫ్యూడల్ ధర్మాలకు బాధిత కులాల నుంచి ఆమోదం పొందడం కోసమే రామాయణ కావ్య కర్త 'బోయ కులస్థుడైన వాల్మీకి అనే ప్రచారం జరిగింది. నేటి భారత అసమానతలకు రక్షణ కవచమైన రాజ్యాంగానికి, ఈ అసమాన చట్టాలకు... కొండొకచో కూరమైన చట్టాలకు... ఆమోదం కోసమే రాజ్యాంగ రచయిత దళిత నేత అంబేద్కర్ అనే ప్రచారం జరుగుతోంది. ఈ పాపం అంబేద్కర్‌ది కాదు గాని, దీనికి అలాంటి లెజిటిమసీ ఉంది. ఆ లెజిటమసీని తీసేసి ఆలోచించడం అవసరం.

### దోపిడి పాలన: 'సమ్మతి నిర్మాణం'

ప్రతి పాలకవర్గం తన పాలనకు.. అంటే, తన మనుగడకు... మొత్తం సమాజం నుంచి సమ్మతి (కన్సెంట్) కోరుకుంటుంది. తన పాలన వల్ల బాధ పడే వర్గాల నుంచి కూడా... ముఖ్యంగా బాధిత వర్గాల నుంచే... గట్టి సమ్మతి కోరుకుంటుంది. అలాంటి సమ్మతి సాధిస్తుంది. సాధిస్తుంది అనడం కంటే నిర్మిస్తుంది అనడం సబబు. సమ్మతి ఎంత బాగా నిర్మించుకుంటే పాలక వర్గం అంత బాగా మనగలుగుతుంది. సమ్మతి ఎంత కాలం ఉంటుందో పాలకవర్గం అంతకాలం మనగలుగుతుంది. ఔను, అంతకాలమే మనగలుగుతుంది. ప్రజల నుంచి సమ్మతి లేకుండా పాలన నిలబడదు. కొన్నాళ్లు నిలబడినా అది పాలకులకు 'లాభ దాయకంగా ఉండదు. స్వాతంత్ర్యానికి ముందు అప్పటికి బాగా వెనుకబడి ఉన్న భరతభూమి నుంచి బ్రిటిషు పాలనకు 'సమ్మతి' ఉంది. విదేశీ స్వదేశీ అనే సెంటిమెంట్లు అప్పటికి ప్రజల్లో లేవు.

అసలు జాతి అనే పదానికి ఇప్పటి అర్థం లేదు. జాతీయ భావన లేదు. జాతీయ భావన పూర్తిగా ఆధునికం. గతంలో ఉండిందని అనడం, రాణా ప్రతాపునిలో జాతీయతను చూడడం మునుపటి చరిత్రకు ఇప్పటి భాష్యం మాత్రమే. ఈ భాష్యం ఎంత వెర్రితలలు వేస్తున్నదంటే, మౌర్య చంద్రగుప్తునిలో, అతడి మంత్రి చాణక్యునిలో సైతం 'జాతీయత' ను చూసేంత!.

అప్పుడు ఒకపక్క చిట్టిపొట్టి రాజుల కరకు కత్తుల అరాజకం. బందిపోటు ముదిరితే రాజు అనుకోవలసిన పరిస్థితి. మరొకపక్క ఏ అభివృద్ధి, మార్పు లేకుండా పిడుచగట్టుకుపోయిన గ్రామీణ సమాజం. ఆ ఇరుకు అరాజకం కన్న బ్రిటిష్ పాలనలో దొరికిన ఒకింత క్రమబద్ధతనే భరతభూమి ఇష్టపడ్డది. దానిలోనే ప్రజలు ఎంతో కొంత సుఖం, భద్రత చూసుకున్నారు. వలసపాలనలోనే భరత జాతి అనేది ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకుంది. తాను వేరే ఒక ప్రజ అనే స్పృహను సంపాదించుకుంది.

ఇండియాలో మొదటి రైల్వే లైన్ల గురించి మాట్లాడుతూ కార్ల్ మార్క్స్... బ్రిటిష్ సామ్రాజ్యవాదం వాటిని నిర్మించింది తన (వనరుల తరలింపు) అవసరాల కోసమే అయినప్పటికీ, అలాంటి అభివృద్ధి చర్యల వల్ల పాత గడ్డ కట్టిన 'ఏసియాటిక్' సమాజం బద్దలైందని, దేశం పారిశ్రామిక చలనంలో పడిందని... సరిగ్గానే అన్నారు.

ఇక తన వనరులను తన కోసమే వినియోగించుకోగలనని, బ్రిటీషోడి వనరుల తరలింపు తన ఆకలిమంటల ప్రథమ కారణమని భరతఖండం గ్రహించిన తరువాతే ఆ పాలనకు నిజమైన అసమ్మతి మొదలైంది. తిరుగుబాటు రగిలింది. భారత ప్రజలలో అసమ్మతిని తొలగించి, తిరిగి తన దోపిడి పాలనకు సమ్మతి సాధించడం బ్రిటిషోడికి అసాధ్యమైంది. తన పట్ల సమ్మతి లేని ప్రజలను పాలించడం ఇక వాడికి 'లాభదాయకం కాదు. నష్టదాయకం. ప్రజలలో అమ్మతిని అణిచివేయడానికి పెట్టే ఖర్చులు... పాలన వల్ల వొచ్చే రాబడిని మించిపోయాయి. అందువల్లనే బ్రిటిషోడు పాలన బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. తప్పనిసరై భారత ప్రజలకు స్వాతంత్ర్యమిచ్చాడు.

పాలకవర్గ మనుగడలో సమ్మతి (కన్సెంట్) నిర్వహించే కీలక పాత్రకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. రాజ్యం ఏదైనా... అది వలసవాదమయినా, స్వతంత్ర జాతీయ పాలన అయినా, రేపు కార్మికవర్గ పాలన అయినా... పాలనకు ప్రజల సమ్మతి తప్పనిసరి. సమాజంలోని మెజారిటీ ప్రజల సమ్మతి లేకుండా పాలన అసాధ్యం. అలాంటి పాలన ఎంతోకాలం నిలబడదు. పాలించే వాడికి లాభం ఉండదు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో విదేశీ వస్తు బహిష్కరణ కీలకమైనది. విదేశీ వస్తువులంటే ఆనాడు ప్రధానంగా బ్రిటిష్ వస్తువులే. భారతీయులు ఆ వస్తువులను కొనం అని భీష్మించడమంటే ఇండియాలో బ్రిటిష్ పాలనను బ్రిటీషోడికి నష్టదాయకం చేయడమే. పన్నులూ అవీ ఎలాగూ కట్టరు (ఉదా: ఉప్పు సత్యాగ్రహం). సో, అది పాలకులకు 'లాభం' లేని పాలన అయిపోయింది. ప్రజల సమ్మతి లేకుండా ఎంత క్రూరుడైనా, ఎంత శక్తిమంతుడైనా, ఎంత యుక్తిపరుడైనా పరిపాలన సాగించలేడనడానికి చక్కని ఉదాహరణ.

అది దేశీ, విదేశీ సమస్య లెద్దూ అనుకోవచ్చు. కాని, ఒక దేశంలో కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. పాలకవర్గం దేశీయమైనా ప్రజల సమ్మతి లేకుండా మనలేదు. మార్క్స్ తరువాత ముందుకొచ్చిన మార్క్సిస్టులు కొందరు ఈ విషయమెప్పుడో పసిగట్టారు. శ్రామికవర్గాల నుంచి సమ్మతిని సంపాదించడానికి బూర్జువా వర్గం పలు యుక్తులు ప్రయోగిస్తుందని, సమ్మతిని 'నిర్మించడా'నికి' రకరకాల యంత్రాంగాలను ఉపయోగిస్తుందని ఆంటోనియో గ్రాంసీ, లూయీ అల్థూజర్ ('ఐడియాలజీ అండ్ ఐడియలాజికల్ ఆపరేటసెస్') వంటి మార్క్సిస్టులు స్పష్టం చేశారు.

అంతెందుకు, ప్రజల సమ్మతిని కోల్పోయిన తరువాతే రష్యాలో జారిస్టు పాలన జస్ట్ కూలదోస్తే కూలిపోయింది. ప్రజల సమ్మతిని కోల్పోవడం వల్లనే... అదే రష్యాలో కమ్యూనిస్టు పార్టీ పాలన ఉఫ్‌మని ఊదితే గాలికెగిరిపోయింది. ఈ సంగతి శ్రామికవర్గం కన్న బాగా ముందే దోపిడి పాలక వర్గాలకు తెలుసు. ఈ తెలివిడే బూర్జువా పాలన మన్నిక (డ్యూరబిలిటీ) కి మూలకందం అని గ్రాంసీ చెప్పిన మాట అక్షర సత్యం.

బూర్జువా వర్గం (దానికి ముందు ఫ్యూడల్ పాలక వర్గాలు కూడా) సమ్మతి నిర్మాణం కోసం రకరకాల యుక్తులు వుపయోగిస్తుంది. కుల మతాలు, సాహిత్యం , కళలు, విద్య, ఉద్యోగిచత్రం, ప్రచారం... ఇవన్నీ అలాంటి సమ్మతి నిర్మాణం (బిల్డింగ్ అఫ్ కన్సెంట్) లో భాగమే.

## రామాయణం : రాజ్యాంగం

రామాయణం చాల గొప్ప కావ్యం. అందులో ఉపమలు, ఉత్ప్రేక్షలు, ఇంకా ఇతర అలంకారాలు.. వావ్, అమోఘం. నాయనా, నీకు కవిత్వం (య్యా, శుద్ధ కవిత్వం) కావాలా? మన ప్రాచీన సాహితీ సంపదను చూడు, వాల్మీకి రామాయణాన్ని చూడు. ఎంత గొప్ప కథ. చదువరులను కంటికి కడివెడు ఏడ్పించే కథ. ఎంత గొప్ప సాహిత్యం. చదువు చదువు. మళ్లీ మళ్లీ

చదవడానికి వీలుగా కొత్తగా మళ్లీ మళ్లీ రాయి. 'మరలనిదేల రామాయణంబన్నచో..... మరల మరల తినడం లేదా అని ఊదరగొట్టు. ఇంతా చేసి ఈ ఊదర అంతా సాహిత్యం మీద ప్రేమతో కాదు. కవిత్వమనే సుందర సురుచిర పాత్రలో నింపి అందించే (అ)ధర్మాల మీద ప్రేమతోనే. ఆ అధర్మాల కోసమే రామాయణం.... అయితే వాల్మీకం లేదా మొల్లీయం, గోనగన్నీయం లేదా విశ్వనాథీయమై... ముద్రణ మీద ముద్రణలు పొందుతూనే వుంది. యుగయుగాలు వర్ధిల్లుతూనే వుంటుంది. దాని పొట్టవిప్పి, చూడడం మాత్రం జరగదు. భార్యను అగ్గిలో దూకి పాతివ్రత్యం నిరూపించుకోవాలన్న ఒక మగవాడిని దేవుడని పూజించడమేంది, శూద్రుడు తపసించాడని శిరసు ఖండించిన హంతకుడిని పూజించడమేంది అనే ప్రశ్నలకు అవకాశం ఉండదు. అలాంటి మాట వినిపిస్తే చాలు వానరసేన దండెత్తుతుంది. రామాయణ ప్రశంస కేవలం కావ్య మీమాంస కాదు. నిజానికది రామాయణ ధర్మాల ప్రశంస. ఫ్యూడల్ ధర్మాల ప్రశంస. ఆ ధర్మాల బాధితులు కూడా వాటికి సమ్మతించేట్లు చేసే సనాతన యుక్తి, బాధే సౌఖ్యమనిపించే మార్మిక సౌందర్యం.

నేటి రాజ్యాంగం... పేదలు ధనికుల మధ్య వ్యత్యాసాల్ని మరి మరి పెంచుతున్న ఈ రాజ్యాంగం... ధనికుల ప్రయోజనం కోసమే. ఇదే నేటి రాజ్యాంగం ప్రథమ ప్రయోజనం. ఈ ప్రయోజనం నెరవేరినంత కాలం ఇది గొప్పగా ప్రశంసలు పొందుతుంది. సరిగ్గా ఇందుకోసమే రాజ్యాంగాన్ని పరమ పవిత్రమని ప్రచారం చేస్తారు. దీన్ని నిరసించడం మహా పాపం అంటారు. దాన్నొక ఆధునిక రామాయణం చేస్తారు. ఈ రామాయణాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ రాశాడని అనడం దానికి లేని ఔన్నత్యాన్ని ఆపాదించడం కోసమే. ఈ ప్రచారం రాజ్యాంగానికి పేదలలో, దళితులలో సమ్మతిని నిర్మించే ప్రయత్నంలో ఒక భాగమే.

రాజ్యాంగాన్ని ప్రకటించిన మూడేండ్లలోనే స్వయంగా బాబాసాహెబ్ అంబేద్కర్ దీని అసలు రూపాన్ని గ్రహించారు. దీన్ని తగలబెట్టేవాళ్లలో తాను మొదటి వాడిని అవుతానన్నాడు. 1953లో రాజ్యసభలో మాట్లాడుతూ అంబేద్కర్... "సర్, నేను ఈ రాజ్యాంగాన్ని తయారు చేశానని నా మిత్రులు అంటున్నారు. కాని, దీన్ని తగలబెట్టడానికి నేను అందరి కంటే ముందు ఉంటాను. ఇది నాకొద్దు. ఇది ఎవరికీ ఉపయోకరం కాదు" అన్నాడు. "మరి నువ్వే రాజ్యాంగ నిర్మాత అంటున్నారు కదా" అనే మాటకు జవాబుగా ఆయన "మేము లాయర్లం, చాల వాటిని డిఫెండ్ చేస్తాం. 'నువ్వే రాజ్యాంగ నిర్మాతవు కదా' అనే వారికిది నా జవాబు. అప్పుడు నేనొక రాయసగాడిని (హ్యాక్) మాత్రమే. నా అభీష్టానికి వ్యతిరేకంగా నన్ను ఏమి రాయమన్నారో అది రాశాను." అన్నారు.

## రాజ్యాంగం : అంబేద్కర్ ఆలోచన

మరి డాక్టర్ అంబేద్కర్ తన అభీష్టానికి అనుగుణంగా రాసి వుంటే రాజ్యాంగం ఎలా ఉండేది? అప్పుడు కూడా రాజ్యాంగ సభ, డెలిబరేషన్సు వుండేవి. అవి అవసరమే. కాని, చర్చలన్నీ ప్రాథమికంగా అంబేద్కర్ రూపొందించిన నమూనా మీద జరిగేవి. అలాంటి నమూనాను డాక్టర్ అంబేద్కర్ తయారు చేశారు కూడా. కులాల సమస్యే ఉన్నది. అంబేద్కర్ ప్రతిపాదనల మేరకు దళితులకు, బడుగులకు రిజర్వేషన్లు లభించాయి. ఇది మంచిదే. కాని, దీని వల్ల కులాలు పోవు, మతాలూ పోవు. 'నిమ్న కులాలకు రిజర్వేషన్లను కాపాడుతూనే అసలు కులం పునాదులను తొలగించాలి. ఇండియాలో కులాలకు మూలం గ్రామసీమల్లోని ఆర్థిక సంస్కృతి. గ్రామసీమల్లోని ఆర్థిక సంస్కృతి అంటే వ్యవసాయమే. ఊళ్లో హెచ్చుతగ్గుల కులాలకు పునాది, కుల దొంతరలకు మూలం వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాలు. కొద్ది మందికి భూమి ఉండి చాల మంది భూమిహీనులై వున్న పరిస్థితి. భూమిహీనులకు ఒకటి రెండెకరాల భూవసతి కల్పించినా పరిస్థితి మారదు. రెండు మూడెకరాలతో కూలీలు రైతులుగా మారరు. గ్రామీణ వ్యత్యాసాలు తొలగవు. అందరికీ సమానంగా పంట భూములను పంచడమూ కుదరదు. ఎందుకంటే... పంచిన మరుక్షణం జరిగే అమ్మకాలూ కొనుగోళ్లతో, ఆస్తి పంపకాలతో మళ్లీ వ్యత్యాసాలు తయారవుతాయి.

దీనికి ఉన్నదొకే మార్గం. వ్యవసాయం పూర్తిగా జాతీయం కావడం. వ్యవసాయ భూమిని పూర్తిగా నేషనలైజ్ చేయడం. అప్పుడిక గ్రామాలలో భూమి ఉన్నవాడు భూమిలేని వాడు అనే దొంతరలుండవు. రైతులు, రైతుకూలీలు అనే వర్గాలుండవు. అందరూ రైతులే. అందరూ భూమి మీద సమాన హక్కు కలిగిన వారే. అందరూ పని చేసి పని ఫలితం తీసుకోవలసిన వారే. ఆర్థికంగా వ్యత్యాసాలు తొలగాక ఇక మిగిలే కుల భేదాలు ఇప్పటిలా నిమ్నోన్నతాలుగా ఉండవు. రెడ్లు, కాపులు, కమ్మలు, వెలమల మధ్యలో ఉన్నట్లు కులాల మధ్య ఒక రకం పోటీ ఉన్నా అది సమానికుల మధ్య పోటీ. ఆ పోటీ అవసరం లేదనుకునే కొద్దీ, గ్రామసీమల్లో రైతులందరి మధ్య సహకారం పెరిగే కొద్దీ... కులాలు కరిగిపోయేవి. డాక్టర్ అంబేద్కర్ ఈ కల కన్నారో లేదో గాని, దీని పునాదిని మాత్రం ఆయన తన నమూనా రాజ్యాంగంలో విస్పష్టంగా పేర్కొన్నారు.

## ఊరుమ్మడి సేద్యం: గ్రామీణ విముక్తి

రాజ్యాంగ సభ ఇంకా ఏర్పడకముందే... రాజ్యాంగానికి ఒక నమూనా తయారు చేసి జనం ముందుంచారాయన. "స్టేటస్ అండ్ మైనారిటీస్: వాట్ ఆర్ దేర్ రైటర్స్ అండ్ హౌ టు సెక్యూర్ దెమ్ ఇన్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా" అనే పేరుతో తయారు చేసిన పత్రంలో డాక్టర్ అంబేద్కర్ భారత రిపబ్లిక్‌ను 'భారత సంయుక్త రాష్ట్రాలు' అని పేర్కొన్నారు. దేశం ఈనాటి పార్లమెంటరీ ప్రభుత్వాన్ని కాకుండా అమెరికా మాదిరి అధ్యక్ష తరహా ప్రభుత్వాన్ని ఏర్పరుచుకోవాలన్నది ఆయన కోరిక కావొచ్చు. పార్లమెంటరీ ప్రభుత్వమయితే, అది (హిందూ) మెజారిటేరియన్ ప్రభుత్వంగా మారే ప్రమాదం ఉందని ఆయన భావించారు. ఆయన అనుకున్న పరిణామమే ఇవాళ జరుగుతున్నదా? కీలక పరిశ్రమల్ని, ప్రాథమిక పరిశ్రమలను, భీమా రంగాన్ని పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని డాక్టర్ అంబేద్కర్ తన పత్రంలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం మొదట్లో ఈ మేరకు కాస్త ప్రగతిశీలంగా వ్యవహరించింది గాని పబ్లిక్ సెక్టార్ డిజిన్వెస్టిమెంట్' పేరిట దానికి గండి పడడం ఎప్పుడో మొదలైంది. కీలక, ప్రాథమిక పరిశ్రమలతో పాటు... అన్నిటికీ పునాది అయిన వ్యావసాయిక పరిశ్రమను ప్రభుత్వమే నడిపించాలని డాక్టర్ అంబేద్కర్ సూచించారు. అంటే భూమిని ప్రభుత్వ పరం (నేషనలైజ్) చేసి రైతులందరితో ఊరుమ్మడి సేద్యం రూపంలో సహకార వ్యవసాయం సాగించాలి.

అంబేద్కర్ ఇలా రాశారు: " (5) అలాంటి పరిశ్రమలపైనా; భీమా వ్యాపారంపైనా; భూయజమానులు, కౌలుదార్లు లేదా తనఖాదార్లుగా వున్న ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ భూములపైనా... అనుభవ హక్కులను ప్రభుత్వం (స్టేట్) తీసేసుకుంటుంది. భూమి మీద వారి హక్కుల విలువకు సమానంగా డిబెంచర్ల రూపంలో పరిహారం చెల్లిస్తుంది. (9) వ్యవసాయ పరిశ్రమను ఈ కింది విధంగా నిర్వహిస్తారు:(i) ప్రభుత్వం తను స్వాధీనం చేసుకున్న ఈ భూమిని ప్రామాణిక పరిమాణాలలో కమతాలుగా విభజించి సేద్యం చేసుకోడానికి కౌల్దార్లుగా గ్రామవాసులకు (కుటుంబ సముదాయాలకు) ఈ కింది నిబంధనలతో అప్పగిస్తుంది. (a) పొలాన్ని సామూహిక క్షేత్రంగా సేద్యం చేయాలి. (b) ప్రభుత్వం నిర్దేశించే నియమ నిబంధనలకు అనుగుణంగా సేద్యం చేయాలి. (c) పొలం ఫలాన్ని... పొలం మీద విధించబడిన రుసుములను చెల్లించిన తరువాత మిగిలిన దాన్ని... నిర్దేశిత పద్ధతిలో కౌల్దార్లు తమ మధ్య పంచుకోవాలి. (ii) ఒకరు భూయజమాని, ఒకరు కౌల్దారు, మరొకరు భూమి లేని కూలీ అనే వారెవరూ లేకుండా కులమతాల తేడాలు చూడకుండా గ్రామస్థులకు భూమి ఇవ్వాలి. (iii) సేద్యపు నీరు, దుక్కిటెద్దులు, సేద్యం సామాను, ఎరువులు, విత్తనాలు మొదలైన రూపాల్లో ఆర్థిక వనరులు సమకూర్చడం ప్రభుత్వం బాధ్యత. ....

ఇది డాక్టర్ అంబేద్కర్ ఆలోచన. ఇది అమలయి వుంటే ఇవాళ వ్యవసాయం 'కార్పొరేటైజ్' అయిపోతోందనే గగ్గోలు అవసరమయ్యేది కాదు. 'దున్నేవాడికే భూమి' నినాదం నిజంగా సాకారమయ్యేది. మాజీ భూస్వాములకు డిబెంచర్ల రూపంలో పరిహారం ఇవ్వడం కూడా పెద్ద సమస్య అయ్యేది కాదు. రాజభరణాల మాదిరి రాను రాను అవి కూడా 'రెడండాంట్' అయిపోయేవి. మాజీ భూస్వాములు, ఇక, ఊళ్లలో ఉండి పెత్తనాలు చేయడం కుదిరేది కాదు. వాళ్ల డబ్బులు పెట్టుబడిగా పరిశ్రమలు ఎదిగేవి. చిన్న కమతాల వ్యవసాయం ప్రగతి నిరోధకం. యంత్ర యుగంలో వ్యవసాయానికి చిన్న కమతాలు అసలే కుదరవు. చిన్న కమతాల రైతులు సహకార సంఘాలుగా జమగూడితే తప్ప మధ్యంతర సొరచేపల బారి నుంచి వ్యవసాయం తప్పించుకోలేదు. ఏ విధంగా చూసినా చిన్న కమతాలు (10, 15 ఎకరాల కమతాలు కూడా) వ్యవసాయం ఒక పరిశ్రమగా ఎదగడానికి అవరోధమే.

దానికి ఒకే ఒక సరైన పరిష్కారం ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాలు. మధ్యేమార్గం లేదు. మధ్యే మార్గం ఉందనే భ్రమ హానికరం. దరిమిలా, దేశ ఆర్థికానికి పునాదిగా ఉండాల్సిన వ్యవసాయం దానికొక గుదిబండగా మారుతుంది.

చిన్న కమతాల వ్యవసాయం సాంప్రదాయిక పెట్టుబడిదారీ విధానంలోనయితే (కాంట్రాక్ట్ వ్యవసాయం రూపంలో) కార్పొరేటైజేషన్‌కు దారితీయక తప్పదు. ఆ విధంగా మాత్రమే భారీ కమతాలు సాధ్యం. అది వొద్దనుకుంటే, ఇక ఉన్న మార్గం అంబేద్కర్ చెప్పినట్లు భూమి నేషనలైజేషన్, రైతుల సహకార సేద్యం మాత్రమే.

నిజానికివాళ జరగాల్సిన నిర్ణయం కూడా అదే. వ్యవసాయాన్ని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ల పరం చేద్దామా? ఊరూరా భూమిని ఊరుమ్మడి ఆస్తిగా మార్చి ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాలకు శ్రీకారం చుడదామా అన్నదే నేటి సమస్య. రాజ్యాంగ రచనలోనే తప్పటడుగు పడింది. ఇకనైనా సరిదారి పట్టాలి. కృత్రిమ పేదరికం నిర్మూలనకు, కుల నిర్మూలనకు అదే రహదారి. ❑



# ఫాసిస్టు పాలనలో రాజ్యాంగం


**సంగిరెడ్డి హనుమంత రెడ్డి**
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి


26.11.1949న రాజ్యాంగం ఆమోదించబడింది. 26.01.1950 నుండి అమలులోకి వచ్చింది. రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ 25.11.1949న రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణసభ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ఇలా హెచ్చరించారు."మంచి రాజ్యాంగమైనా అమలు చేసేవారు చెడ్డవారైతే అది చెడుగా మారుతుంది. రాజ్యాంగం చెడ్డదైనా పాలకులు మంచివారైతే అది మంచిగా మారుతుంది. ప్రజల మీద, లక్ష్య సాధన, రాజ్యాంగ అమలుకు వారు స్థాపించుకునే రాజకీయ పక్షాల మీద రాజ్యాంగ వ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది. దేశం మతాతీతంగా ఉండాలి. మతం రాజ్యాన్ని అతిక్రమిస్తే స్వాతంత్ర్యం రెండోసారి ప్రమాదంలో పడుతుంది. శాశ్వతంగా దూరమౌతుంది. చివరి రక్తం బొట్టు దాకా స్వాతంత్రాన్ని కాపాడుకోటానికి తీర్మానించు కోవాలి." అంబేద్కర్. "పాలకులు యోగ్యులు, సమగ్రతానిబద్ధులు, గుణవంతులు ఐతే లోపయుక్త రాజ్యాంగాన్ని కూడా ఉత్తమంగా మార్చగలరు." రాజేంద్రప్రసాద్. భవిష్య ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి, పాలనా విధానాలపై వీరికి ఆరోజే అనుమానం కలిగింది.

### సంఘ భావజాలం :

రాజ్యాంగ మూల సిద్ధాంతాల పట్ల ఆర్.ఎస్.ఎస్.(సంఘ్) భావాలు: 1.సంఘ్ జాతీయ పతాకానికి వ్యతిరేకం. 14-08-1947 నాటి సంఘ్ అధికారపత్రిక ఆర్గనైజర్‌లో ఇలా రాశారు. "త్రివర్ణ పతాకాన్ని హిందువులు గౌరవించరు. ఆమోదించరు. 3 అంకె అరిష్టం. కీడు, దుష్ట మానసిక ప్రభావం కలిగిస్తుంది. దేశానికి బాధలు, అపాయాలను కొనితెస్తుంది. 2. సంఘ్ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తుంది. "ఒక దేశం, ఒక పతాకం, ఒక నాయకుడు, ఒక భావజాలం సిద్ధాంతాలతో స్ఫూర్తి పొంది, ఘనకీర్తి సంపాదించిన సంఘ్, దేశ నలుమూలల హిందుత్వ జ్వాలలను వెలిగిస్తున్నది" మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్. 3.సంఘ్ సమాఖ్య స్వభావ భావనలకు విరుద్ధం. "సమాఖ్య స్వభావం, భారత ఉపఖండమంతా ఒకే దేశమన్న నిజాన్నినిరాకరిస్తూ, అఖండతను విచ్ఛిన్నం చేస్తున్నది. దీన్ని సమూలంగా పెకలించాలి. రాజ్యాంగాన్ని శుభ్రపరచాలి. ఏకీకృతప్రభుత్వం ఏర్పరచాలి." గోల్వాల్కర్. 4. లౌకిక భారత్‌ను భగవదాదేశ హిందురాజ్యంగా మార్చాలంటుది సంఘ్. "హిందుస్తాన్‌లో హిందువులే ఉండాలి. హిందు సంస్కృతి, సంప్రదాయాల, ఆశల,ఆలోచనల ఆధారంగా హిందువులతో మాత్రమే ఈ దేశాన్ని నిర్మించాలి." ఆర్గనైజర్ - 14-08-1947. 5. సంఘ్ సమానత, సమన్యాయం, సమానావకాశాలకు స్థానం కల్పిస్తున్న భారత రాజ్యాంగాన్ని తిరస్కరిస్తుంది. స్థానిక న్యాయకోశంగా 'మనుస్మృతి'ని అమలు చేయాలంటుంది. "రాజ్యాంగంలో మనదని చెప్పుకోదగ్గ అంశమే లేదు. మనుస్మృతి ప్రపంచ సమ్మతిని, ప్రశంసలను పొందింది. యాదృచ్ఛిక విధేయతను, అనుగుణ్యతను సంపాదించింది." గోల్వాల్కర్.

'భిన్నత్వంలో ఏకత్వం' ప్రశాంత జీవనానికి, భిన్న కుల మతాల, జాతుల, సంస్కృతుల మధ్య భారతీయతకు కారణం. భిన్నత్వ స్థానంలో హిందుత్వ ఏకత్వాన్ని బలవంతంగా రుద్దాలని సంఘ్ ప్రయత్నిస్తోంది. మోదీ పాలనలో ప్రతి రంగంలో కాషాయ కాలుష్యం వ్యాపించింది. ప్రజలు తాము చెప్పినప్పుడు లేచి కూర్చొని నడవాలని, తాము నిర్ణయించిన దుస్తులు ధరించాలని, తాము తినమన్న తిండి తినాలని, తాము నిర్దేశించిన చదువులు చదవాలని, తాము చెప్పిందే చరిత్రని, తాము ఆదేశించిన భాషనే అభ్యసించాలని, తాము చెప్పిన వారినే ప్రేమించాలని, తాము చెప్పినట్లే దాంపత్య జీవితం గడపాలని సంఘ వాదన. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల రూపురేఖలు మార్చి సమాజాన్ని సంకరపరిచి, అదే సరైందని నమ్మించే ప్రయత్నాలు చేస్తోంది. "మా లక్ష్యం హిందుదేశ స్థాపన. ఆ గమ్య సాధనకే పనిచేస్తున్నాం. కొన్ని మతాలను తృప్తిపరిచే పనులు మానేస్తున్నాం." ప్రధానితో సహా సంఘీయులంతా ఈ ప్రచారంచేశారు. "సంఘ్‌కు భావజాల వ్యాప్తి ప్రధానం. దేశ రూపురేఖలు మార్చి, విధివిధానాలను తీర్చిదిద్దే శక్తిసామర్థ్యాలు 2025 నాటికి నిరూపించబడతాయి" సంఘ ప్రముఖుడు పి.మురళీధరరావు అన్నారు. 2019కే అది నిజమైంది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాటి సంఘ్ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ జర్మనీ నియంత హిట్లర్‌ను ప్రశంసించారు. వినాయక్ దామోదర్ సావర్కర్, గోల్వాల్కర్ ఇజ్రాయిల్ ఏర్పాటును, హిట్లర్ "స్వచ్ఛజాతి" సిద్ధాంతాన్ని సమర్థించారు. సంఘ దృష్టిలో

శిక్కులు, జైనబౌద్ధులు హిందువులే. ముస్లింలు, క్రైస్తవులు పరదేశీలు."రాజకీయాలను హైందవీకరించండి. హిందుత్వాన్ని సైనికీకరించండి. ఎవరైతే తమ పూర్వీకులు భారత్‌లో నివసించారని పరిగణిస్తారో, ఎవరి మతం భారత్‌లో పుట్టిందో, ఎవరి పుణ్యభూమి భారత్‌లో ఉందో వారే హిందువులు. పరదేశాల్లో పుట్టిన ముస్లిం, క్రైస్తవ మతాలవారు భారతీయులు కారు." అన్నారు సావర్కర్. రష్యా చైనాల్లో పుట్టిన సిద్ధాంతాలను ఆచరించే కమ్యూనిస్టులు భారతీయులు కారని సంఘ్ ప్రచారం. "హిందుస్తాన్‌లో హిందూయేతరులు హిందు సంస్కృతి, భాషలను స్వీకరించాలి. హిందుమతాన్ని భక్తి శ్రద్ధలతో గౌరవించాలి. హిందు జాతి, సంస్కృతులను కీర్తించడం తప్ప మరొక భావన కలిగి యుండరాదు. ఒక్క మాటలో వారు ఇక్కడ విదేశీయులుగా బతకాలి. హిందు దేశానికి అణిగిమణిగి ఉండాలి. ఏమీ అడగరాదు. ఏ అధికారాలకు, ప్రాధాన్యతా పరిగణనలకు వారు అర్హులు కారు. పౌర హక్కులకు కూడా." గోల్వాల్కర్ ఉవాచ.

## రాజ్యాంగ పీఠిక :

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించు కోడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యం చేకూర్చుటకు, వారందరి వ్యక్తి గౌరవం, జాతి ఐక్యత, అఖండతలను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్ఠా పూర్వకంగా తీర్మానించుకొని 26 నవంబర్, 1949న రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించు కున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించు కుంటున్నాము." దేశ ఉన్నత న్యాయస్థానం ఈ పీఠికను రాజ్యాంగ మౌలిక సిద్ధాంతంగా ప్రకటించింది. చట్టాలు, రాజ్యాంగ సవరణలు పీఠికలోని అంశాలకు కట్టుబడి ఉండాలన్నది. రాజ్యాంగ ముసాయిదా, నిర్మాణ సభల్లో సామాజిక న్యాయాల వ్యతిరేక మితవాదులు అంబేద్కర్‌కు అడ్డంకులు కల్పించారు. రాజ్యాంగంలో తమ ఇష్టాలు చొప్పించడానికి ఒత్తిడి చేశారు. ఆయన వాపోయినట్లు రాజ్యాంగం రాజకీయ సమానతను ఇచ్చింది. సామాజిక, ఆర్థిక సమానతలు ఇవ్వలేదు. రాజ్యాంగం బ్రిటిష్ పాలనను తిరస్కరించింది. బ్రిటిష్ పాలనా వ్యవస్థలను కొనసాగించింది. రాజభక్తి, దేశద్రోహం, నేర విచారణ, శిక్షా స్మృతులు కొనసాగాయి. 1945 ముందరి సంపద దోపిడి ప్రపంచీకరణ, 1945 తర్వాతి వాణిజ్య ప్రపంచీకరణ, 1991 తర్వాతి సామ్రాజ్యవాద ప్రపంచీకరణలను అడ్డుకునే నిబంధనలు రాజ్యాంగంలో లేవు. ఆదేశిక సూత్రాల అధికరణ 47 మత్తు పదార్థాలను, 48 గోవధను నిషేధించాలన్నాయి. నేటి పాలకులు 47ను అశ్రద్ధ చేసి, 48ని పట్టుకొని రాజ్యాంగానికి హైందవ తత్వాన్ని ఆపాదించాయి.

## రాజ్యాంగ పతనం :

రాజ్యాంగ విలువల పతనం, నియంతృత్వ పోకడల మొదలు ఈ రోజే జరగలేదు. గత ప్రభుత్వాలు సవ్యంగా రాజ్యాంగాన్ని అమలు చేయలేదు. అవినీతి, నేరస్తుల రాజకీయాకరణ, రాజకీయ నేరమయం, కులమత ధోరణి పెరిగాయి. రాజ్యాంగ పీఠిక లక్ష్యాలు సాధించబడలేదు. సామాజిక దృక్పథం, త్యాగంతో నిండవలసిన రాజకీయాలు లాభసాటి వ్యాపారం, లూటీ వ్యవస్థగా మారాయి. ఊసరవెల్లులు పెరిగాయి. పేదరికం, నిరుద్యోగం, ఆరోగ్యం, నీరు, ఆహార సమస్యలు తీవ్రమయాయి. ప్రభుత్వాల బలం, స్థిరత్వం ప్రజాశ్రేయస్సుకు కాక కార్పొరేట్ల లాభాలకు ఉపయోగ పడుతున్నాయి. రాజ్యాంగం క్రమేపీ పతనమైంది.

ఇందిరా గాంధీ 1975లో రాజ్యాంగ అధికరణ 352(1)తో ఎమర్జెన్సీ విధించారు. ఎమర్జెన్సీలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలహీనపడ్డాయి. నియంతృత్వ పోకడలు మొదలయ్యాయి. కాని సంఘ్ రాజకీయ అంటరానితనం పోయింది. తన సాహిత్యాన్ని విస్తృతంగా అమ్ముకుంది. భావజాలాన్ని ప్రచారం చేసింది. సంఘ్, జనసంఘ్, సంఘ పరివార్ సంస్థలు, ఆర్థికంగా, సంఖ్యాపరంగా, రాజకీయంగా పుంజుకున్నాయి. జనతా ప్రభుత్వంలో అధికారం దక్కింది. ఆ ప్రభుత్వ పతనం తర్వాత ఇందిరకు, సంఘ్‌కు క్విడ్ ప్రోకొ కుదిరింది. అది ఇందిరకు సహకరించింది. ఆమె సంఘ్ గంగాజల్ యాత్ర ప్రారంభించారు. ప్రభుత్వ కమిటీల్లో, చర్చల్లో జనసంఘ్‌కు ప్రాతినిధ్యం కల్పించారు. ఈ బలంతో మోదీ లాంటి అరాచకవాదిని తన ప్రధాని అభ్యర్థిగా నియమించే ధైర్యం చేయగలిగింది సంఘ్. రాజీవ్ గాంధీ హిందువులను దువ్వడానికి హిందుత్వ మెతక వైఖరి వహించారు. అయోధ్య ఆలయం తలుపులు తెరిపించారు. అయోధ్య నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించి మందిర్ నిర్మిస్తామన్నారు. షాబానో మనోవర్తి సుప్రీంకోర్టు తీర్పును తిరగతిప్పి ముస్లిం మగాళ్ల కోసం కొత్త చట్టం చేశారు. హిందుత్వవాద ప్రధాని నరసింహారావు బాబ్రీ మసీదు కూల్చివేతకు మౌనంగా సహకరించారు. అయోధ్య అన్యాయ తీర్పు, మందిర్ నిర్మాణం, అలౌకిక పాలనకు పునాదివేశారు. వాజ్‌పేయి ప్రజల ఆస్తుల అమ్మకాలను చట్టబద్ధం చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్లకు కారుచౌకగా అమ్మారు. ప్రజాధనంతో ప్రైవేటు విద్యాలయాల్లో అశాస్త్రీయాంశాలను ప్రవేశపెట్టారు. విద్యవ్యవస్థను కాషాయీకరించారు. రాజ్యాంగం

నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథానికి నీళ్ళొదిలారు. దేశాన్ని సాంస్కృతికంగా కలుషితం చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరమేధాన్ని సహించి, రాజకీయ మతోన్మాదాన్ని ప్రోత్సహించారు. మతపాలనకు నాంది పలికారు.

గత ప్రభుత్వాలు రాజ్యాంగ పీఠికకు నొక్కులు పెట్టాయి. నేటి ప్రభుత్వం తూట్లుపొడిచింది. ప్రజా రాజ్యాంగాన్ని పాలక పక్షపాత గ్రంథంగా మార్చింది. సర్వసత్తాక స్థానంలో ఏకసత్తాకం తెచ్చింది. సామ్యవాదం అసమానతలను నిరోధిస్తుంది. లౌకికత్వం రాజ్యాన్ని, మతాన్ని వేరుచేస్తుంది. ప్రజలను సోదరులుగా, మనుషులుగా తీర్చిదిద్దుతుంది. నేటి ప్రభుత్వం ఈ పదాలను రాజ్యాంగం నుంచే తొలగించాలని ప్రయత్నిస్తోంది. సామ్యవాదం మరిచి అసమానతలను పెంచింది. కార్పొరేట్ల ప్రభుత్వంగా మారింది. ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలకు తిలోదకాలిచ్చింది. హేతు, భౌతిక, మానవవాదాలను మతాతీతంగా ప్రోత్సహించటం లౌకిక రాజ్య లక్షణం. గత ప్రభుత్వాల్లో నిర్వీర్యమైన లౌకికభావం నేటి ప్రభుత్వంలో మాయమైంది. లౌకికత్వాన్ని హిందుత్వానికి ముడేసి భారతీయతను హిందుత్వంగా మార్చింది. పౌరసత్వ సవరణ చట్టంలో రాజ్యాంగ సమానత్వ అధికరణలు 14-18 లను తిరస్కరించింది. సామాజిక సౌభ్రాతృత్వాన్ని మంటగలిపింది. తన నిరంకుశ స్వేచ్ఛను, కార్పొరేట్ల దోపిడి స్వేచ్ఛను పెంచింది. ప్రజల స్వేచ్ఛలను హరించింది. తమ దుశ్చర్యలను, తాత్వికతను ప్రశ్నించిన వారిని తప్పుడు కేసులతో అరెస్టు చేయించి, జాతి నిర్మాతల గౌరవాన్ని కించపరిచింది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చి, నియంతృత్వ ధోరణలు పెంచింది. లౌకికత్వం, అంతర్జాతీయత, బహుళ సంస్కృతులతో పూర్వ కీర్తి ప్రతిష్టలు నశించాయని ఫాసిజం నమ్మకం. దీనికి మతోన్మాదం తోడ్పడింది. భారతీయ సౌభ్రాతృత్వం, అంతర్జాతీయ మానవత్వం లేకుండా దేశ సమగ్రత, సమైక్యతలకు సంపూర్ణత లేదు. రాజ్యాంగం మనుగడ సాగించలేదు.

నాజీ ఫాసిజానికి మోదీ నియంతృత్వానికి పోలికలున్నాయి. నాజీలు యూదుల పౌరసత్వాన్ని రద్దు చేశారు. యూదుల నివాసాలకు, వ్యాపార కేంద్రాలకు పగలు సున్నం గుర్తులు పెట్టి, అర్ధరాత్రి వాటిని ధ్వంసం చేశారు. 60 లక్షల యూదులను, 30 లక్షల కమ్యూనిస్టులను చంపారు. ఇది అద్దాలు పగిలిన కాళరాత్రిగా పేరు పొందింది. మెరుగైన సౌకర్య స్థావరాలకు తరలిస్తున్నామని యూదులను నిర్బంధ కేంద్రాలకు తరలించారు. వారిని నిర్బంధ గృహాలకు తరలిస్తుంటే తోటి పౌరులే వారిపై గుడ్లు, రాళ్ళు విసిరారు. 2002 గుజరాత్ మారణహోమంలో ముస్లింల నివాసాలు, వ్యాపార కేంద్రాలను హిందు అధికారులు గుర్తించారు. సంఘీయులు కాల్చేశారు. వందల ముస్లిం స్త్రీలను సామూహిక అత్యాచారంచేసి హత్య చేశారు. వేల ముస్లింలను ఊచకోత కోశారు. మోదీ కవ్వింపు నినాదాలు, ఉద్రేక కథనాలతో ఉద్విగ్నతకు లోనైన హిందువులు ముస్లింలను ద్వేషిస్తున్నారు. వారిపై హింసను సమర్థిస్తున్నారు. గృహనిర్బంధం తర్వాత కశ్మీర్ నాయకులను సౌకర్య స్థానాలకు తీసుకెళుతున్నామని నీటి, స్నాన సౌకర్యం లేని ఇరుకు గదుల్లో బంధించారు. నాజీలు సొంత పోలీసు ఎస్.ఎస్.ఫోర్స్ ఏర్పాటు చేసుకున్నారు. బిజెపి లక్షల సంఘ్ కార్యకర్తలను పోలీసులుగా నియమించుకుందని, న్యాయవాదులుగా నమోదు చేసుకుందని ఐదేళ్ల క్రితమే మంగళూరు బిజెపి శాసన సభ్యుడు వెల్లడించారు. ఇటీవలి కోర్టు తీర్పులన్నీ బిజెపి కోరుకున్నట్లే రావడం యాదృచ్ఛికం కాదని ప్రముఖ బిజెపి నాయకుడు అన్నారు. బిజెపి ప్రజాస్వామ్య, రాజ్యాంగ సంస్థల రూపురేఖలు మార్చింది. కొన్ని రద్దు చేసింది. విద్యాసంస్థలతో పాటు భారత సంస్థలన్నిటినీ సంఘ్ తాత్వికులతో నింపారు. తక్షణ తలాక్, పెద్దనోట్ల ప్రవేశం, వస్తుసేవల పన్ను, ఉగ్రవాద చట్ట సవరణ, పౌరసత్వ సవరణ, కార్మిక వ్యతిరేక చట్టాలు చేశారు. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దుచేశారు. రఫాల్ యుద్ధ విమానాల అక్రమ కొనుగోళ్లకు పాల్పడ్డారు. సైనిక ఆకస్మిక దాడులు, దేశభద్రత, దేశభక్తి ప్రచారం, గోగూండాల ముస్లిం హత్యలు పెరిగాయి. కోవిడ్ దేశబంది,వ్యక్తి గోప్యతకు చేటు తెచ్చే ఆరోగ్యసేతు, పిఎం కేర్ పథకం, ప్రజావ్యతిరేక సాగు చట్టాలతో రాజ్యాంగాన్ని ఎగతాళి చేశారు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి తూట్లు పొడిచారు.ప్రాంతీయ, ప్రతిపక్షాలు భయాలు, భ్రమలు, ఆశలు, అవకాశవాదాలతో ఈ దుర్మార్గాలకు ఆమోదం తెలిపాయి. మీడియా పాలక పక్షాల కార్పొరేట్ల చేతుల్లో చేరింది. విద్యార్థి లోకాన్ని కట్టడి చేయాలని వారిపై గూండాలతో దాడులు చేయించింది. దేశద్రోహ కేసులు బనాయించింది. ఈ గూండాలలో పోలీసులు, న్యాయవాదులు చేరారు. బిజెపి ప్రాయోజిత కార్యక్రమాలుగా మానభంగ హత్యలు జరుగుతున్నాయి. అనవసర ఆర్డినెన్సులు జారీచేశారు. ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే చౌర్యోన్మాద స్వామ్యంగా ప్రజాస్వామ్యాన్ని మార్చారు. మతోన్మాదంతో రాజ్యాంగాన్ని ధిక్కరించారు. మతవాదం ఫాసిజానికి దారితీస్తోంది. మతసంస్థలు, పాలకులు, కార్పొరేట్లు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయి. సమాజం, దేశభక్తి అర్థాలే మారాయి. సంఘ్ పరివారమే సమాజం. మోదీ భజనే దేశభక్తి. అంబేద్కర్ భయపడినట్లే జరిగింది. రాజేంద్ర ప్రసాద్ ఆశించిన యోగ్యత, నిబద్ధత నేతల్లో కొరవడ్డాయి. జైళ్ళలో ఉండాల్సినవారు కుర్చీలెక్కారు. రాజ్యాంగ బాధ్యత మరిచారు. ఆ బాధ్యతను

తలకెత్తుకొన్న సమాజ నిర్మాతలను జైళ్ళలో కుక్కారు.

"82% హిందువులున్న సమాజంలో హిందు మతవాదంతో భగవత్ భావజాల పద్ధతుల్లో పాలించాలనుకుంటున్నారు మోదీ. ఇతర మతాలను నాశనం చేయాలనుకుంటున్నారు. నియంతృత్వం రాజ్యాంగ విరుద్ధం. మోదీ విధేయ సమాజాన్ని నిర్మించుకున్నారు. మేధావులను లొంగదీసుకున్నారు. నీతి బాహ్యతను ప్రోత్సహించారు." విశ్రాంత న్యాయమూర్తి పి.బి.సావంత్ వాపోయారు. మోదీ-షాల ఏకఛత్రాధిపత్యం, నియంతృత్వం రాజ్యమేలుతున్నాయి. నిర్ణీత కాలానికి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే గణతంత్రం. సంఘ్ గణతంత్రాన్ని నాశనంచేసింది. "మార్క్సిజం పట్ల జనాకర్షణకు దాని శాస్త్రీయ సిద్ధాంతం కారణం కాదు. సామాజిక న్యాయ తపన." నెహ్రూ విశ్లేషణ. రాజ్యాంగబద్ధంగా ఎన్నికై, దేశ సమైక్యతా సమగ్రతలను, రాజ్యాంగాన్ని కాపాడతామని ప్రమాణం చేసిన సంఘీయులు వాగ్దాన భంగం చేస్తున్నట్లు, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్లు అనిపించవచ్చు. నిజానికి వాళ్ళు సంఘ్ ఆశయమైన రాజ్యాంగ శుద్ధి 'పవిత్ర కార్యం' నిర్వహిస్తున్నారు. రాజ్యాంగాన్నే అవమానిస్తూ భారతీయత కోల్పోయిన సంఘీయులు పాలనార్హత కోల్పోయారు. ఆంగ్లేయులను సమర్థించి స్వాతంత్ర్య ఉద్యమానికి ద్రోహం చేసిన మతోన్మాదుల పాలనలో గతంలో లేని రీతిలో, స్థాయిలో ప్రజాస్వామ్యం పతనమైంది. రాజ్యాంగం ప్రమాదంలో పడింది.

## ధనస్వామ్యం :

స్వాతంత్ర్యం తొలినాళ్ళలో దేశభక్తి, సమైక్యత సమగ్రతలు, సమాజ ప్రగతి నాయకుల ఆశయాలు. న్యాయవాదులు, సామాజిక న్యాయాభిలాషులు, రాజ్యాంగబద్ధులు రాజకీయాల్లో పాల్గొనేవారు. కాలక్రమేణా కార్పొరేట్లు ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి పబ్బం గడుపుకునే వారు. తర్వాత తమ తాబేదారులను గెలిపించుకునే వారు. ఇపుడు తామే పోటీచేసి నెగ్గుతున్నారు. ఫలితంగా రాజ్యాంగ విలువలు తెలియని రాజకీయులు పెరిగారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యం అయింది. కార్పొరేట్ల అధిపతులు, అవినీతిపరులు, నల్లధన కుబేరులు, మాఫియా, సమాజ వినాశకులు పాలకులయ్యారు. ధనబలం లేని వామపక్షాల, చిన్న పెట్టుబడిదారీ పార్టీల ఓట్ల శాతం తగ్గింది. ఓట్ల అమ్మకం నేతలే నేర్పారు. చదవని విద్యార్థి కాపీ కొడతాడు. బాధ్యతలు నిర్వర్తించని నాయకులు అడ్డదార్లు తొక్కుతారు. ఓట్ల కొనుగోలు అందులో ఒకటి. భావజాలం తర్వాత ధనజాలం బలమైంది. విజయావకాశాలు ధనికులకు, నేరస్తులకే ఎక్కువ. ధనిక ప్రతినిధులు సంపన్నుల, కార్పొరేట్ల అనుకూల చట్టాలు చేస్తారు. గతంలో మేధావులు, వృత్తినిపుణులు, కళాకారులు, సామాజిక శాస్త్రవేత్తలు ఎగువసభలకు ఎన్నికయేవారు, నియమించబడేవారు. ఇపుడు పాలక పార్టీ తాబేదారులు, ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన వారు, పాలకపక్ష తాత్వికులు, నోట్లివ్వగల వాణిజ్యవేత్తలు ఎగువసభల్లో నింపబడుతున్నారు. మంత్రులు అవుతున్నారు. మోదీ మొదటి ప్రభుత్వంలో ఈ మంత్రులే ఎక్కువ.

## పార్టీ ఫిరాయింపులు :

రాజకీయులు పార్టీ మారతారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేదు. నేడు పూటకొక పార్టీ మారుతున్నారు. అక్రమాస్తుల, వ్యాపారాల రక్షణ, అధికారదాహం దీనికి కారణాలు. కాంగ్రెసు పాలనా లోపాలు అసంతృప్తులకు దారితీసాయి. ప్రాంతీయ, కులమత పార్టీల ఏర్పాటుకు అవకాశమిచ్చాయి. వీటి సంకుచితత్వం, వంశపాలన, నాయకుల అవసరాలు, భ్రమలు, భయాలు, జాతీయతారాహిత్యం ఫిరాయింపుల మరో కారణం. రాజ్యాంగం అమలైన 35 ఏళ్లకు పార్టీ ఫిరాయింపుల నియంత్రణకు రాజ్యాంగంలో షెడ్యూల్ 10 చేర్చబడింది. మూడింట రెండొంతుల కంటే తక్కువ సభ్యులు పార్టీ ఫిరాయిస్తే వారు పాత పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని కోల్పోతారని నిబంధన 1 తెలుపుతోంది. నిర్ణయాధికారం సభాపతులదే. వారు తమ పార్టీలకు రాజీనామా చేయాలని నిబంధన 5 చెపుతుంది. వీటిని ఎవరూ పాటించరు. ఫిరాయింపులు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు తారుమారు అవుతూనే ఉన్నాయి. ఇది రాజ్యాంగ ఉల్లంఘన. సభాపతులుగా స్వతంత్ర రాజ్యాంగ నిపుణులను నియమించాలి. ఫిరాయింపుల్లో సభ్యత్వ నిర్ణయాధికారం స్వతంత్ర అధికారుల లేదా ఎన్నికల సంఘం లేదా న్యాయమూర్తుల అధీనంలో ఉండాలి.

## పరిష్కార మార్గాలు :

ప్రత్యామ్నాయ పార్టీలు నియంత్రిత రికాల్ సౌకర్యంతో దామాషా ఎన్నికలకు ఉద్యమించాలి. వీటిలో వ్యక్తులకు కాక పార్టీలకు, సిద్ధాంతాలకు పోటీ ఉంటుంది. రాజ్యాంగ అధికరణలు 25, 26 లు మత స్వేచ్ఛ, మతాచరణ ఇచ్చాయి. 25(2) మతం వ్యక్తిగతం కావాలని, సామూహికం, సామాజికం కారాదని, మతోన్మాద నియంత్రణకు మతపర చట్టాలు చేయచ్చని చెపుతుంది. స్వలాభం కోసం నేటి వరకు ప్రభుత్వాలు వ్యక్తిగత, సామూహిక మతాంశాలను కలగాపులగం చేశాయి. నేటి ప్రభుత్వం రాజకీయాల్లో మతాన్ని చొప్పించింది. రాజకీయ రామునితో రాజ్యాధికారం శాశ్వతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నది. దీనికి పరిష్కారం శాస్త్రీయ దృక్పథాన్ని ప్రబోధించే అధికరణ 51(ఎ)(హెచ్) అమలులో ఉంది.

అమానవీయ చదువులు చెప్పే కార్పొరేట్ విద్యను అడ్డుకోవాలి. విద్యార్థులను రాజకీయంగా చైతన్యపరచాలి. కుటుంబ, సామాజిక, రాజకీయ ప్రజాస్వామ్య పద్ధతులు నేర్పాలి. ఉపాధ్యాయవర్గం తమ గురు బాధ్యతలు నిర్వహించాలి. యువతకు రాజ్యాంగరాహిత్య నష్టాలను వివరించాలి. రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతున్న నేటి అద్భుత ఉద్యమాల నుండి విప్లవ పార్టీలు పాఠాలు నేర్చుకోవాలి. దశాదిశల ఏర్పాటులో, నాయకుల సైద్ధాంతీకరణలో, ఉద్యమ సార్వజనీనతలో ప్రధాన పాత్ర పోషించాలి. పేదల జీవితమంతా తిండి సంపాదనలో, అనారోగ్యంతో గడిచిపోతుంది. వీరికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అర్థం కావు. సామాజిక మార్పులో భాగస్వాములు కాలేరు. వీరికి విద్య, ఆరోగ్యాలు అందించి చైతన్యపరచాలి. చైతన్య కార్యక్రమాల్లో నిపుణులైన యువకుల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. స్త్రీలు లేని ఉద్యమాలు విజయవంతం కావు. ఉద్యమాల్లో కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల, ఉద్యోగుల, స్త్రీల, యువజన, విద్యార్థుల ప్రాతినిధ్యం పెరగాలి.

రాజకీయ ప్రత్యామ్నాయాలు సైద్ధాంతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పద్ధతులతో ఎదగాలి. పాలక వర్గ రాజకీయాలతో కాక ప్రజాతాత్వికతలతో ప్రజలను చైతన్యపరచాలి. వారికి హక్కులతో పాటు బాధ్యతలు, పౌరజ్ఞానం నేర్పాలి. ప్రభుత్వ వర్గస్వభావాన్ని వివరించాలి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలను సమాజానికి అనుసంధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు, సామాజిక శాస్త్రవేత్తలు రాజ్యాంగ రక్షణలో భాగస్వాములు కావాలి. ప్రజలకు మార్క్సిజం, ఫాసిజం, నాజీయిజంలపై అవగాహన పెంచాలి. రాజ్యాంగాన్ని గౌరవించేలా పౌరసంఘాలు, మీడియా పార్టీలపై వత్తిడి పెంచాలి. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించి నట్లు దేశ స్వాతంత్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే. అనేక అర్హతలు, అవకాశాలు పొంది ఉన్నతవర్గంగా మారిన ప్రజలు ముందుగా తమను తాము ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దు కోవాలి. ప్రజలతో మమేకం కావాలి. ప్రజాఉద్యమాల్లో పాల్గొనాలి. ఇందిర ఎమర్జెన్సీని ప్రతి ఏడాది జూన్ 25న నిరసిస్తాం. నేటి అమానుష అప్రకటిత అత్యవసరస్థితిని ప్రతి రోజూ నిరసించాలి.

**చివరి మాట :**

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం శాశ్వత పరివర్తన మార్గం కాదు. దాని ప్రయోజనం పొందుతూ పాలకుల స్వేచ్ఛాహక్కులకు వ్యతిరేకంగా, ప్రజల స్వేచ్ఛా హక్కుల కోసం పోరాడాలి. విప్లవ మార్గాలను మెరుగుపర్చుకొని వ్యవస్థ మార్పుకు ప్రయత్నించాలి. ప్రజాస్వామ్యపోరులో నెగ్గడానికై కార్మికవర్గాన్ని పాలకవర్గంగా నిలబెట్టడమే విప్లవానికి తొలిమెట్టని కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు. ఈ రాజ్యంలో కార్మికులే పాలకులు. రాజ్యాంగం మంచిదైనా కాకున్నా తేడా ఉండదు. ❑

## జాతీయ స్ఫూర్తి ప్రత్యేక ప్రకటన

**ఉచితంగా జాతీయ స్ఫూర్తి**

జాతీయ స్ఫూర్తి పత్రికను ఆసక్తి గలవారందరికీ ఉచితంగా అందించాలని భావించాం. అందువల్ల ఆసక్తి గల మిత్రులందరూ తమ పోస్టల్ అడ్రసును 8500678977 నెంబరుకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా పంపించండి.

**సంవత్సర చందాలకు స్వస్తి**

ఆసక్తి గల వారందరికీ జాతీయ స్ఫూర్తి పత్రికను ఉచితంగా అందించాలని భావించినందున వార్షిక చందాల పద్ధతికి స్వస్తి చెబుతున్నాం. ఇకపై సంవత్సర చందాలు పంపవద్దని తెలియజేస్తున్నాం. గతంలో చందాదారులుగా వున్న వారికి పత్రికను పంపిస్తాం.

### విరాళాలను పంపండి

పత్రిక నిర్వహణలో వున్న వ్యయప్రయాసలు అందరికీ తెలిసినవే. ఈ పత్రిక పది కాలాలు నిలబడడానికి, ఆసక్తి గల వారందరికీ ఉచితంగా పంపించడానికి అందరి ఆర్థిక తోడ్పాటు అవసరం. మీరు నగదు రూపంలో, ప్రకటనల రూపంలో మీ విరాళాలను జాతీయస్ఫూర్తి అకౌంటుకు పంపండి. మీరు పంపిన మొత్తం వివరాలు, మీ పోస్టల్ అడ్రసులను 8500678977 నెంబరుకు మెసేజ్/వాట్సాప్ ద్వారా తెలియచేయండి.

***NEFT లేదా RTGS పంపడానికి***
**JAATEEYA SPURTHI**
**A/c No.3620 101 0000 380**
**Syndicate Bank, Eluru Main Branch**
**IFSC Code : SYNB0003620**

*జాతీయ స్ఫూర్తి పత్రికకు మీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నాము.*

ఇట్లు
**జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం**


# చట్ట వ్యతిరేకమైన కేంద్రీకృత పాలన దిశగా !



అనువాదం: బోడపట్ల రవీందర్

ప్రభాత్ పట్నాయక్

'ఫెడరలిజం' (సమాఖ్య వ్యవస్థ) భారత రాజ్యాంగం యొక్క మౌలిక లక్షణాలలో ఒకటి. రాజ్యాంగ పరిషత్‌లో ప్రొ.కే.టీ.షా "ఫెడరల్", "సెక్యులర్" (లౌకిక) పదాలను రాజ్యాంగ పీఠికలో పొందుపర్చాలని కోరాడు. కానీ డాక్టర్ అంబేద్కర్, రిపబ్లిక్ యొక్క 'సెక్యులర్', 'ఫెడరల్' లక్షణాలు దానిలోనే ఇమిడి ఉన్నాయి కాబట్టి, ఆ పదాలను ప్రత్యేకంగా పొందుపర్చాల్సిన అవసరంలేదని ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు. రాజ్యాంగం ఏడవ షెడ్యూల్‌లో కేంద్ర, రాష్ట్రాల అధికారాల పరిధిని రెండు జాబితాల్లో, రెండింటి ఉమ్మడి అధికార పరిధిని మూడవ జాబితాలో వివరించింది. అప్పటి నుంచి కేంద్రం నిత్యం రాష్ట్రాల అధికారాల పరిధిలోకి చొచ్చుకొని వచ్చేందుకు మొగ్గు చూపుతూ ఉంది. ఈ ధోరణి ఇప్పుడు బాగా బలం పుంజుకుంది. ప్రస్తుతం మన దేశం చట్ట సమ్మతం కాని కేంద్రీకృత రాజ్యం దిశగా నెట్టబడుతుందన్న వాదనలో ఎలాంటి అతిశయోక్తి లేనట్టు కనిపిస్తున్నది.




రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఉన్న పన్నుల విధింపు అధికారాలను వదిలేయమని రాష్ట్రాలను ఒప్పించిన కేంద్రం, దానికి గాను రాష్ట్రాలకు తగ్గిన ఆదాయాలను చెల్లిస్తామని వాగ్దానం చేసి, జీఎస్టీ పన్నుల నిర్వహణను చూస్తున్న జీఎస్టీ కౌన్సిల్ పైన ఆధిపత్యం చెలాయిస్తూ, ఇప్పుడు చేసిన ఒప్పందం అమలుకు తిలోదకాలిస్తున్నది. ప్రస్తుతం రాష్ట్రాలకు (మూడింటి పైన మినహాయిస్తే) పన్నులు విధించే అధికారాలు లేవు, నష్టపరిహారాన్ని చెల్లిస్తామని చేసిన వాగ్దానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు.

కేవలం కేంద్రీకరింపబడిన వనరులపై అదుపు మాత్రమే కాకుండా, కేంద్రం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా విధాన నిర్ణయాధికారాలను కూడా కేంద్రీకరిస్తున్నది. ఉదాహరణకు విద్య ఉమ్మడి జాబితాలో ఉంది, కానీ ఇటీవల ఒక నూతన విద్యా విధానాన్ని కేంద్రం రాష్ట్రాలతో ఏ విధమైన సంప్రదింపులు చేయకుండానే ప్రవేశ పెట్టింది. రాష్ట్రాలు కేంద్రాన్ని అనుసరిస్తూ, నూతన విద్యా విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయం రాష్ట్రాల అధికారాల పరిధిలో ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు చేయకుండానే పార్లమెంట్ ద్వారా మూడు వ్యవసాయ బిల్లులను ఆదరాబాదరాగా చట్టాలను చేసింది. ఈ చట్టాల వల్ల దేశంలోని వ్యవసాయంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. వీటి ప్రభావం రైతులతో పాటు రాష్ట్రాల ఆదాయాలు కూడా భారీగా కోల్పోవాల్సి ఉంటుంది.

కేంద్రం కేవలం రాష్ట్రాల అధికారాల పరిధిలోకి చొచ్చుకొని వెళ్ళడమే కాకుండా, ఇప్పుడు వాటి ఉనికినే ఏకపక్షంగా మార్చి వేస్తున్నది. రాష్ట్ర శాసనసభ అనుమతి లేకుండా జమ్మూ కాశ్మీర్‌ను రెండు ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించినప్పుడే ఇది స్పష్టం అయ్యింది. ఆ సమయంలో ఆ రాష్ట్రం గవర్నర్ పాలనలో ఉంది కాబట్టి, ఈ విభజనకు కేంద్రం నియమించిన గవర్నర్ ద్వారా అనుమతి పొందాల్సి వచ్చింది. ఈ సాంప్రదాయంతో ఏ రాష్ట్రమైనా రాష్ట్రంగా ఉనికిలో లేకుండా ఏ సమయంలోనైనా దానిని కేంద్రంచే నియమించబడిన గవర్నర్ పాలనలో (గవర్నర్ అనుమతి అంటే, రాష్ట్ర శాసనసభ అనుమతితో సమానం కాబట్టి) ముక్కలు చేయవచ్చు. ఒక రాష్ట్రం ఉనికి కేంద్రం విచక్షణపై ఆధారపడే విషయంగా మారడంతో, కేంద్రీకృత రాజ్యం దిశగా కేంద్రం ఒక దృఢమైన చర్యను తీసుకుంటుంది.

భారత దేశాన్ని ఒక చట్ట సమ్మతం కాని కేంద్రీకృత రాజ్యంగా మార్చడం, హిందుత్వ, ప్రపంచ ద్రవ్యపెట్టుబడితో ఏకం అయిన కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడిదారీ కూటమి ఎజెండా. అందువల్లనే ప్రస్తుతం భారతదేశ రాజకీయాలలో ఆధిపత్యం చెలాయిస్తున్న కార్పొరేట్– హిందుత్వ కూటముల ఉమ్మడి ఎజెండాలో ఇది ఒక ముఖ్యమైన భాగంగా ఏర్పాటు అయ్యింది.

భారతదేశం యొక్క సమాఖ్య స్వభావం, ప్రతీ భారతీయుని లక్షణాన్ని చెప్పే ద్వంద జాతీయ చైతన్యాన్ని అనుసరిస్తుంది.

ప్రత్యేకంగా ఒక ప్రాంతీయ భాషా సమూహానికి చెందిన వారమనే చైతన్యం, అది ఒక ఒడియా, ఒక బెంగాలీ, ఒక మళయాళీ, ఒక గుజరాతీ, ఒక తమిళుడు. వీరంతా భారతదేశానికి చెందిన వారు అనే చైతన్యం. ఈ రెండు రకాల చైతన్యాలు వలస వ్యతిరేక పోరాట కాలంలో బలపడినాయి.

వలసరాజ్య అనంతర రాజ్యం కూడా ఈ రెండు రకాల చైతన్యాలను ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సమాఖ్య లక్షణం ఉండే రాజకీయ పరిష్కారాల ద్వారా కల్పించింది. ఈ సమాఖ్య లక్షణాన్ని కాపాడాలంటే ఈ రెండింటి మధ్య సున్నితమైన సమతుల్యతను పాడైపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఒక దానిపై మరొక దాని ఏకపక్ష ప్రాధాన్యత రెండింటి మధ్య ఉండే సమతుల్యతను భంగం చేస్తుంది. ఫలితంగా దేశ సమైక్యతకు అంతరాయం ఏర్పడుతుంది. ఉదాహరణకు, ప్రాంతీయ-భాషా చైతన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఆ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకోకుంటే, అదనపు కేంద్రీకరణ వారి వ్యతిరేకులను వేర్పాటు వాదం దిశగా ప్రోత్సాహించినట్టే అవుతుంది.

కానీ హిందూత్వ భాగస్వాములు భారతదేశం యొక్క సంక్లిష్టమైన ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోరు. వలసరాజ్య వ్యతిరేక పోరాటంలో వారు పాల్గొనని రోజుల నుంచి భారతదేశం, తయారు చేసే జాతి కాదు, కానీ "హిందూజాతిని" ఏర్పరచిన భూమి అని వారి దృష్టిలో ప్రాచీన కాలం నుంచి ఉంది. కాబట్టి, వారు ప్రాంతీయ-భాషా చైతన్యం, దానిపై నిర్మితమైన అనేక భాష, సంస్కృతీ, సాంప్రదాయాలతో సమ్మిళితమైన చైతన్యం అంతగా ఆలోచించ దగిన విషయాలు కాదని అంటారు. వారు ప్రతి ఒక్కరిపై 'ఒకే భాష', 'ఒకే సంస్కృతి' లాంటి ఏకరూపతను విధించాలని కోరుకుంటారు. వారు అంతటా వ్యాపించి ఉన్న ఒక తాత్వికమైన "భావవాద ఐక్యత"ను కోరుకుంటారు. వారు కోరుకున్న వాటిలో ఏది ఆ మార్గం నుంచి తప్పినా అది "జాతి వ్యతిరేక చర్య" అవుతుంది. దీని నుండే సమాఖ్య లక్షణానికి వ్యతిరేకత వచ్చింది, ఈ అవగాహనలో సమాఖ్య, "జాతి"ని బలహీనపరుస్తుంది.

హిందూత్వ భాగస్వాములు కేవలం అవకాశవాద కారణాల కేంద్రీకరణ కోసం మాత్రమే కాకుండా, వారు అంతర్గతంగా, ప్రతీ చోటా సమాఖ్యకు వ్యతిరేకంగా, కేంద్రీకృత రాజ్యానికి (మత ప్రాతిపదిక గల రాజ్యానికి) అనుకూలంగా ఉన్నారు.

అదేవిధంగా కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడిదారీ కూటమి కూడా కేంద్రీకరణకు అనుకూలంగా ఉంది. గుత్త పెట్టుబడిని నడిపించే ఈ కూటమి ఆర్థిక వ్యవస్థ కేంద్రీకరణకు ప్రాతినిధ్యం వహించి, తన ఆశయాలను నిజం చేస్తుంది. కానీ దీనికి ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. సమాఖ్య రాజ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం, దేశంలోని కొన్ని ప్రత్యేక ప్రాంతాల ప్రభుత్వం కన్నా మహానగర (మెట్రోపాలిటన్) పెట్టుబడితో పాటు గుత్త పెట్టుబడి పట్ల తక్కువ అనుకూలత ఉండే పరిస్థితులు ఉండవచ్చు. అలాంటి పరిస్థితులలో గుత్త పెట్టుబడి లేక మహానగర పెట్టుబడి (సమకాలీన ప్రపంచం యొక్క లక్షణాలు తీవ్రమైన అంతర్- సామ్రాజ్యవాద శత్రుత్వం వల్ల ఎలా ఉంటాయో చెప్పలేదు కాబట్టి, రెండు పదాలను ఉపయోగిస్తున్నాం) కేంద్రాన్ని బలహీన పరచి, ఆ ప్రాంతాలను బలోపేతం చేయాలనుకుంటుంది. సమాఖ్య నిర్మాణంలో అది అధికారాల సంక్రమణను, వనరులను, నిర్ణయాధికారాన్ని కోరుతుంది. చివరకు అది ఆ ప్రాంతాల్లో వేర్పాటు వాదాన్ని ప్రోత్సహిస్తుంది. ఆ రకంగా అది పెద్ద సమాఖ్య రాజ్యం విడిపోవడం ద్వారా తన స్వప్రయోజనాల కోసం కొత్తగా ఏర్పడిన కేంద్రీకృత రాజ్యాన్ని ఉపయోగించుకుంటుంది.

ఇక్కడ విడిపోయిన యుగోస్లేవియా ఒక మంచి ఉదాహరణ. ఉమ్మడి యుగోస్లేవియాలో కేంద్ర ప్రభుత్వంపై ఆధిపత్యం సాధించాలన్న ఆశ జర్మన్ పెట్టుబడికి తక్కువగా ఉంది. సెర్బియాకు నాజీ వ్యతిరేక పోరాటచరిత్ర ఉంది. జర్మన్ పెట్టుబడికి ఉన్న ఆశయం పట్ల అనుమానం కూడా ఉన్న సెర్బియా ఏ ఉమ్మడి దేశంలోనైనా ఒక బలమైన శక్తిగా ఉంటుంది కాబట్టి జర్మన్ పెట్టుబడి యుగోస్లేవియా విడిపోయేందుకు ప్రోత్సహించింది.

ఎక్కడైతే భారతదేశంలాగా కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్-ద్రవ్యపెట్టుబడిదారీ కూటమి యొక్క ప్రయోజనాలు ముందుకు తీసుకు వెళ్ళేందుకు సానుకూలంగా ఉంటుందో, అక్కడ ఈ కూటమి సమాఖ్య నిర్మాణాన్ని బలహీన పర్చేందుకు, అధికారాలు, వనరులు, నిర్ణయాధికారాల కేంద్రీకరణకు అనుకూలంగా ఉంటుంది. తద్వారా రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలతో ఏ విధమైన సంబంధం లేకుండానే అది తన ఆశయాలను ముందుకు తీసుకొని పోతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్ట్‌లను స్థానికులకు, లేదా ప్రభుత్వ రంగానికి అప్పగించే ఆలోచనలు చేయవచ్చు. రైతుల నుంచి తీసుకున్న భూములకు నష్ట పరిహారాన్ని ఇప్పించే ఆలోచనలు కూడా రాష్ట్రాలు చేయవచ్చు. ఇలాంటి రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలు కార్పొరేట్-ద్రవ్య పెట్టుబడిదారీ కూటమికి అసౌకర్యాన్ని కలిగిస్తాయి. కాంట్రాక్టు వ్యవసాయం, క్రమబద్ధీకరణ లేని మార్కెట్ల ద్వారా రైతుల వ్యవసాయం పైన కార్పొరేట్ ఆక్రమణకు మార్గాన్ని సుగమం చేసిన ఇటీవల చట్టాలుగా

☞ మిగతా 31వ పేజీలో

# రాజ్యాంగ ఫలాలు దక్కాలంటే ఉమ్మడి పోరే మార్గం

**డాక్టర్ అబ్దుల్ నూర్ బాషా**
విశ్రాంత ఆచార్యులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు



భారత దేశ ప్రజలకు ఇద్దరే శత్రువులనీ , ఒకటి బ్రాహ్మణిజం ఐతే రెండోది క్యాపిటలిజం (brahmanshahi and bhandawalshahi) అనీ రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎప్పుడో చెప్పిన మాటలు (Dr.BR Ambedkar writings and Speeches, Vol.17, page, 178), నేటి గణతంత్ర దినోత్సవ సమయానికీ ఎంతో ప్రాసంగికతను చేకూర్చుతాయి. ఈ దేశంలో 130 కోట్ల అశేష ప్రజానీకం ఏడు దశాబ్దాల తర్వాత కూడా రాజ్యాంగ హామీలు కనీసంగానైనా రుచి చూడలేని స్థితిలో ఎందుకు ఉండిపోయారు అనడానికి ఆ రెండే ముఖ్య కారణాలుగా కనిపిస్తాయి.

ఎన్నేళ్ళు గడిచినా, ఆ రెండింటినీ సమూలంగా ఓడించిన నాడే నిజమైన స్వాతంత్ర్యం, సమానత్వం సిద్ధిస్తాయని వేరే చెప్పక్కర్లేదు. సాంస్కృతిక విప్లవాలు చైనాలో లాగా కేవలం రాజ్యాధికారం సాధించిన తర్వాత మాత్రమే చేపట్టాలనే సిద్ధాంతం ఏదీ లేదు.. అంటే భారతదేశంలో కులవ్యవస్థ రద్దు దిశగా జరిగే పోరాటాలు ఇప్పుడూ, ఎప్పుడూ, నిరంతరం కొనసాగాల్సినవే. వాస్తవానికి డాక్టర్ అంబేద్కరయితే అసలు మొత్తం అసమాన దోపిడీ రాజ్యంపై జరపాల్సిన సమరాన్ని కుల నిర్మూలన దిశలో సాగే సాంఘిక పోరాటంతోనే ప్రారంభించమని పిలుపు ఇచ్చారు. (Undelivered Speech prepared for Jat- pat- thodak mandal in 1936, later published titled, 'ANNIHILATION OF CASTE). పీడిత జాతుల సంపూర్ణ విమోచనకు అవసరమైన ఆర్థిక, రాజకీయ సమానత్వ సమాజం ఎంతగా కులంతో పీటముడి వేయబడి ఉందో ఆయన మాటలు వ్యక్తపరుస్తున్నాయి.

వాస్తవానికి, గణతంత్ర దినోత్సవం అనేది భారత రాజ్యాంగాన్ని, అది ప్రజల ముందు ఉంచిన మహోన్నతమైన మానవహక్కులనూ గుర్తుకు తెస్తుంది... వాస్తవానికి రాజ్యాంగ పీఠిక హామీపడ్డ ఆదర్శాలూ, విలువలు గుర్తుకు తెస్తుంది. అంతకంటే మిన్నగా భారత దేశాన్ని ఒక సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా రాజ్యాంగం ప్రకటించడం వల్ల, అది భూస్వామ్య, పెట్టుబడి దారీ, బ్రాహ్మణీయ దోపిడీ శక్తులపై సంధించిన అస్త్రంగా పీడిత ప్రజలు స్వప్నించడాన్నీ గుర్తుకు తెస్తుంది.

ఐతే, ఒక్కసారి నేటి భారత సమాజ వాస్తవ స్థితి చూస్తే రాజ్యాంగం ఆశ పెట్టిన రాజకీయ, ఆర్థిక, సాంఘిక న్యాయం ఆచరణలో కనిపించదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ప్రజాస్వామ్య విలువలకు సమాజంలో కనీస స్థానం కనిపించవు. సాంఘిక అసమానతలు, అంటరానితనం, కుల వివక్ష తరతమ స్థాయిలో ఇంకా కొనసాగడమే కనిపిస్తుంది.

కారణాలు పరిశీలిస్తే, తన కాళ్లపై తానుగానే నిలబడి సహజంగా ఎదగాల్సిన ఒక ప్రజాస్వామిక రాజ్యం, సామ్రాజ్య వాద బంటుగా రూపాంతరం చెంది, పరాధీన ఆర్థిక, సాంస్కృతిక విధానాలతో ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టడం ఒక కారణం. కాగా, బ్రాహ్మణీయ హిందుత్వ మత భావజాలంని ఆయుధంగా చేసుకొన్న బడా భూస్వామ్య పెట్టుబడిదారీ శక్తులు ఫాసిస్టు పాలనా సాగించడం రెండవ కారణం. ఇదే నేటి లౌకిక, గణతంత్ర, భారతం వ్యక్తీకరిస్తున్న అంతర చిత్రం.

ఐతే, భారతదేశంలోని బ్రాహ్మణీయ కులాధిపత్య వ్యవస్థ రద్దుకు ఏం చేయాలి? దీనికి కూడా ముందుగా ఉత్పత్తి, శ్రమ సంబంధాల విషయంలో కులానికి ఉన్న స్థానం ఏమిటి అని పరిశీలించడం అవసరం.

దైవదత్తమైనదంటూ ఆర్య జాతిచే మొత్తం మానవ సమాజం పైన రుద్దబడిన చాతుర్వర్ణ సిద్ధాంతం అనాగరికమూ, అమానవీయమైంది. మానవ జాతిని, వర్ణం, కులం పేరిట విభజించి, వారి మధ్య ఆస్తి సంబంధాలను, శ్రమ సంబంధాలను కూడా నిర్ధారించి, శాశ్వతీకరించింది. అంటే, చదువూ, ఆస్తి, అధికారం కేవలం సమాజంలో కొద్ది మందిగా గల బ్రాహ్మణ వర్ణాలకీ, ఉత్పత్తి, సేవలు, బండ చాకిరితో బాటు సాంఘిక వెలి, బానిసత్వం, వివక్ష అశేషమైన దళిత, శూద్ర కులాలకీ రిజర్వ్ చేసింది. ఈ బంధాల నుంచి ఎవడూ తప్పించుకోవడానికి వీలు లేకుండా, స్మృతులు, ధర్మ శాస్త్రాలూ, పురాణాలూ పకడ్బందీగా రూపొందిస్తూ అష్ట దిగ్బంధనం చేశాయి.

మనుస్మృతిని బహిరంగంగా తగలబెట్టే సందర్భంలో డాక్టర్ బాబాసాహెబ్ అన్న మాటలు పరిశీలించదగినవే.. " వర్ణ వ్యవస్థకు వత్తాసు పలికే శాస్త్రాలపై ప్రజలకున్న విశ్వాసాన్ని తొలగించాలంటే ముందుగా వాటికి ఆపాదించబడిన పవిత్రతను నాశనం చేయడమే సరైన పరిష్కారం", అంటారాయన. అలాగే 'కుల

భావం ఒక మానసిక ప్రవృత్తి' అనీ అది సమూలంగా నాశనం కావాలంటే గట్టి మానసిక విప్లవమే రావాల్సి ఉంటుందని ఆయన చేసిన ఆలోచనా (BR Ambedkar, 'Annihilation of Caste in BRAWS, Vol. 1, page 68) కొట్టి పారేయదగింది కాదు.

ఐతే, కులం మానసిక భావనే కాకుండా పునాదిలోని అంతర్భాగం కూడానని స్పష్టమౌతోంది. అది ఉత్పత్తి సంబంధాలనూ నిర్ధారిస్తోందని, వాటిని ప్రభావితం చేస్తుందని కూడా రుజువు అవుతుంది.

ఉదాహరణకు, దేశ వ్యాప్తంగా నేటికీ పది లక్షల మందికి పైగా గల సఫాయికార్మికులు (manual scavengers) ఎవరు? కేవలం అంటరానివారిగా ముద్ర కొట్టబడి ఊరికి దూరంగా ఉంచబడిన దళిత వర్గానికి చెందిన వారే కదా?. అలాగే, దిక్కూ మొక్కూ లేని అనాధ శవాలు, జంతువుల మృత కళేబరాలనీ ఊరి చివరకు మోసుకు పోవాలసిన వారు కూడా ఊరు చివరన బ్రతుకు లీడ్చే పంచమ జాతులే కదా?

నేటికీ క్షురక వృత్తీ, మైల బట్టలు ఉతకడం లాంటి తక్కువగా పరిగణించబడే సేవలు చేయాల్సిన వారూ వర్ణ ధర్మంలోని అడుగు కులాల వారే గదా? అంతెందుకు. దేశ వ్యాప్తంగా నేటికీ దారుణంగా ఆధిపత్య కులాల చేతిలో అత్యాచారాలకు, హత్యలకూ గుర్రై, జీవించే హక్కు లేకుండా చనిపోతున్నవారూ, కనీసం గౌరవంగా అంత్యక్రియలకూ నోచుకోనివారు ఎవరూ? శూద్ర, అతిశూద్ర, ఆదివాసీ జనాంగమే కదా?. ఇలా భూ యాజమాన్యం, ఆస్తి, అధికారం, వ్యాపారం, అన్నింటా కులమే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తూ ఉందనడంలో ఏమైనా అతిశయోక్తి ఉందా?

ఇటీవల కాలంలోనైతే, గోహత్య పాతకం అనే పేరిట కనీస జీవనం కోసం మాంసం, తోళ్ళు , పాడి లాంటి చిరు వ్యాపారాలు చేసుకునే దళిత, మైనారిటీ ప్రజలను వారి వృత్తులకు దూరం చేయడమే గాక, అవే వ్యాపారాలను ఆధిపత్య దోపిడీ కులాలకు భారీ ఎత్తున కట్టబెట్టడం జరుగుతుంది. అంటే, శూద్రులు, అతి శూద్రులకు ఏనాడో వదిలేసిన వృత్తులను కూడా గుంజుకొని వాటిని కార్పొరేట్ కంపెనీల స్థాయికి పెంచి, బ్రాహ్మణ వర్ణాలకే కట్టబెట్టే కుల కుటిలత్వం కూడా నిరాటంకంగా సాగిపోతోంది.

అలాగే, ప్రభుత్వ రంగ పరిశ్రమలను భారీ ఎత్తున ప్రయివేటు పరం చేయటం ద్వారా ఇప్పటి వరకూ దక్కుతున్న కొద్దో గొప్పో ఉద్యోగాల రిజర్వేషన్ సౌకర్యం కూడా బడుగు జాతుల వారికి అందకుండా రద్దు పరిచే దిశగా కులరాజ్యం బలపడుతోంది. వీటన్నిటిబట్టి అర్థమయ్యేది ఏమిటి? కులమే నేటికీ శ్రమ సంబంధాలను, ఉత్పత్తి సంబంధాలనూ నిర్ధారిస్తోందని, ప్రభావితం చేస్తుందని రుజువు అవుతుంది.

ప్రశ్న ఏమిటంటే, ఒక వైపు భూస్వామ్య, పెట్టుబడి దారీ వ్యవస్థలో జీవిస్తూనే, వాటి రద్దు దిశగా సాగాల్సిన పోరాటాల జోలికి పోకుండానే, కుల నిర్మూలనా పోరాటాలు చేయడం సాధ్యమేనా?

అలాంటి ప్రమాదకర ప్రయాణం సాగిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వంల సాధన ఆశించగలమా? కేవలం అరాకొరగా జరిగే కులాంతర వివాహాలు కులరహిత సమాజాన్ని ఆవిష్కరించ గలవా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం అవునని చెప్పడం కష్టమే.

ఎందుకంటే, డాక్టర్ బాబాసాహెబ్ శత్రువులుగా పేర్కొన్న ఆ మను వ్యవస్థ, (Brahminism), ధన వ్యవస్థ (Capitalism) లు సొంత అస్థిత్వాలూ, స్వతంత్ర కార్య క్షేత్రాలూ కలిగిన వ్యవస్థలే ఐనప్పటికీ, వాస్తవానికి అవి రెండూ పరస్పరం సంఘర్షించుకొనే వర్గ శత్రువులు కావు. పైగా, పరస్పరం సహకారం, ఉమ్మడి ప్రయోజనం అందించుకుంటూ పెనవేసుకు సాగే ప్రజా వ్యతిరేక ఆధిపత్య శక్తులు. అవి ప్రజాస్వామ్య విలువలనూ, ప్రజా సంఘటిత సంస్కృతినీ ప్రజలనుండి దూరం చేసే ఆటంక శక్తులనీ కూడా తేటతెల్లమవుతుంది.

కుల భావజాలం జనంలో వెల్లివిరయడం ద్వారా పెట్టుబడికి మరింత ఊపు, ఊతం దొరుకుతుంది. శ్రామిక వర్గాన్ని అనైక్యత గానే ఉంచుతూ అది విదిలించే తాయిలాల చుట్టూనే తమ దృష్టినంతా నిలిపి ఉండేట్లు చేస్తుంది పెట్టుబడి దారీ వ్యవస్థ. పెట్టుబడి దారీ వ్యవస్థ బలపడే క్రమంలో కులవ్యవస్థ బలహీన పడుతుంది అనడానికి ఈ దేశంలో దాఖలాలు అంతగా కనిపించడం లేదు. అందుకే అంబేద్కర్, కుల భూతాన్ని కుప్పకూల్చే పనినే తొలిగా ఆరంభం చేయమంటారు. లేని పక్షంలో అది తరువాత దశలోనైనా మహా భూతంలా మారి పెట్టుబడి దారీ సామ్రాజ్యాన్ని ఢీకొనే విప్లవోద్యమం విజయానికి ఆటంకం గా నిలబడుతుందనీ సరిగ్గానే హెచ్చరించారు. (Annihilation of Caste, BRAWS, Vol. 1) అంటే కులం, ఆర్థిక దోపిడీ వ్యవస్థలపై ఏక కాలంలోనే యుద్ధం జరపాలని స్పష్టమౌతోంది.

ఇక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రజాస్వామ్య ఉనికికీ, దేశీయ సంస్కృతికి ప్రక్కలో బళ్ళెం లాంటిదే. దానితో చెలిమి దేశ సార్వభౌమత్వానికే గొడ్డలి పెట్టు. బడా బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ ఏ రంగాన్నీ పీల్చి పిప్పి చేయకుండా వదలదు. అలా వదిలినా అది తాత్కాలికమే. పెట్టుబడి దారీ వ్యవస్థ ఒక సంక్షోభం నుంచి మరో సంక్షోభంలోకి మారుతూ ఉంటుంది. అది బ్రతకలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నపుడల్లా విచక్షణా రహితంగా అన్ని వర్గాలపై దోపిడీని తీవ్రం చేస్తుంది. ఆ స్థితిలోనే శ్రామిక వర్గం, రైతాంగం, మధ్య తరగతి వర్గంల వైపు నుండి తిరుగుబాట్లూ,

ప్రతిఘటనలూ చెలరేగుతాయి. ఆ దశలోనే రాజ్యం ఫాసిస్టు రూపం ధరిస్తుంది. ఇప్పుడు భారత దేశంలో కూడా హిందూ ఫాసిస్టు వ్యవస్థ బలీయంగా రూపు దిద్దుకొంటూ ఉంది.

క్లుప్తంగా చెప్పాలంటే, నేడు భారత దేశ పీడిత, కార్మిక వర్గం పోరాడవలసిన శత్రువు హిందూ కార్పొరేట్ ఫాసిజమే. అంటే, హిందూ ఆధిపత్య కులాల ఆధ్వర్యంలోని బడా కార్పొరేట్ వర్గ కూటమే. తమపై నిరంతరం జరిగే భౌతిక , కులాధిపత్య దాడులూ, వివక్ష పట్లే గాక అది చూపించే ఆకర్షణల పట్ల కూడా పీడితులు, కార్మిక వర్గం అంతే అప్రమత్తత, అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యం. వాటిపై పోరాటానికి నిరంతరం సమాయత్తమై ఉండడమూ ఆవశ్యకం.

వాస్తవానికి అంబేద్కర్ పెట్టుబడి దారీ వ్యవస్థను శత్రువుగా ప్రకటించినప్పటికీ దేశ వ్యాప్తంగా అంబేద్కర్ వాదులు దానికి వ్యతిరేకంగా చేపట్టిన సమరశీల పోరాటాల దాఖలాలు కనిపించవు. ఒక వైపు ఉపాధినీ, రిజర్వేషన్‌లనూ తీవ్రంగా దెబ్బ తీస్తూ భారీ స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ జరిగిపోతూ ఉంటే , వీటిని నిలువరించే దిశలో సాగాల్సిన దళిత ప్రతిఘటన ఎక్కడ? చివరికి అసంఘటిత రైతాంగం బజార్లు ఎక్కి బడా పెట్టుబడిదారులకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న నేటి తరుణంలో వారికి అంబేద్కర్ వాదుల కనీస సంఘీభావం ఎక్కడ? శత్రుపూరితమైన పెట్టుబడిదారీవ్యవస్థలోనే పీడితజాతులు తమ ఆర్థిక ఎదుగుదలనూ, భవిష్యత్తునూ దర్శించుకోవాలని నేతలు దిశానిర్దేశం చేయడం విచారకరం కాదా? సమస్య ఏమిటి అంటే, మార్క్స్ అంబేద్కర్ సిద్ధాంతాల మధ్య విభేదాలను కారణంగా చూపి ఈ రెండు శిబిరాల నాయకత్వాలు ఎడమొహంగా ఉండడమే. విచిత్రం ఏమిటంటే, ఇద్దరి మధ్యా సిద్ధాంత భేదాలు తారా స్థాయిలో ఉన్నాయంటూ ఉభయ శిబిరాలూ ఎంతో గర్వంగా పోటీ పడి మరీ ఉద్ఘాటించడం. ఐతే ఈ రెండు శక్తులూ సంఘర్షించుకొనవలసిన శత్రువులు కాదనీ, పైగా అవి రెండూ పరస్పరం కలిసి మనువాద బూర్జువా వ్యవస్థపై పోరాడాల్సిన మిత్రులు మాత్రమేననీ, వారు ఏకం కానిదే ఏ విప్లవోద్యమమూ విజయవంతం కాదనీ, ఇరు శిబిరాలూ బలంగా మాట్లాడక మౌనం వహించడమే ఆశ్చర్యం.

అంబేద్కర్ మార్క్సిజం పట్ల కొన్ని సందర్భాల్లో వ్యతిరేక భావననే కనబరిచాడు. నిజమే. వాస్తవానికి అంబేద్కర్ మార్క్స్‌ల సిద్ధాంతాలు కలవవు కూడా. అందువలన, ఈ రెండు శిబిరాల మధ్య సైద్ధాంతిక ఐక్యత కుదరటం సాధ్యం కాకపోవచ్చు. ఐతే కుల వ్యతిరేక, శ్రామిక ప్రజా ఉద్యమాల వైపు ప్రజలు కదిలి వస్తున్న నేటి తరుణంలో, మైత్రీ పూర్వక ఉమ్మడి కార్యాచరణను చేపట్టడానికి ఎవరికీ ఏ ఆటంకమూ ఉండవలసిన అవసరం లేదు కదా? అలాంటి సిద్ధపాటు ఇరువైపులా కనిపించక పోవడమే విషాదం. ఐనా, ఇటీవల కాలంలో ఇలాంటి ఉమ్మడి కార్యాచరణ దిశలో ముందుకు వస్తున్న కొన్ని అంబేద్కర్ వాద సంస్థలూ,, మార్క్సువాదపార్టీలూ. అందరికీ ఆదర్శంగా నిలుస్తాయనీ, ప్రజాతంత్ర విప్లవోద్యమం విజయానికి బాటలు వేస్తాయనీ ఆశిద్దాం. ❑

## చట్ట వ్యతిరేకమైన కేంద్రీకృత పాలన దిశగా!

**(28వ పేజీ తరువాయి)**

మార్చిన వ్యవసాయ బిల్లులను అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించి ఉండేడివి కాదు. చట్టబద్ధతపై అనుమానాలకు తావిచ్చే కేంద్ర ప్రభుత్వ చట్టాలను బలవంతంగా రుద్ది కేంద్రం రాష్ట్రాల గొంతు నొక్కుతున్నది. చట్టబద్ధతపై అనుమానం ఉన్నప్పటికీ ఇలాంటి చట్టాన్ని విధించడం అనేది కేంద్ర ప్రభుత్వం కన్నా న్యాయవ్యవస్థ తన స్వతంత్రతను కోల్పోయిందన్న సూచిక వాస్తవం.

భారతదేశాన్ని చట్ట సమ్మతం కాని కేంద్రీకృత రాజ్యంగా మార్చే అంశం ఉండటంతో హిందూత్వ శక్తులు, కార్పొరేట్–ద్రవ్యపెట్టుబడిదారీ కూటమి ఏకమైనాయి. కార్పొరేట్–హిందూత్వ కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సహజంగానే ఈ ప్రణాళికను ముందుకు తీసుకొనిపోవడంలో నిమగ్నమై ఉంది. ఈ వైఖరి కేంద్రం, రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక సంబంధాలలో మాత్రమే కాక, విద్యా సాంస్కృతిక రంగాలలో కూడా అదే విధమైన సమాంతర వైఖరి స్పష్టం అవుతుంది. నూతన విద్యా విధానంలో హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీని నేర్చుకోవాలనే నిబంధన విధిస్తూ నేర్పుగా చేసిన ప్రయత్నాన్ని ప్రతిఘటించారు, కానీ మళ్ళీ దానిని పునరుద్ధరణ చేస్తారు. నూతన విద్యా విధానంలో బోధనాంశాలను రాష్ట్రాలతో ఏ విధమైన సంప్రదింపులు చేయకుండానే కేంద్రం నిర్ణయించాల్సి ఉంటుంది. భారతదేశంలోని భిన్నత్వం స్థానంలో ''ఒకే సంస్కృతి''ని విధించాలని చేస్తున్న ప్రయత్నాలకు ఇవన్నీ సూచికలు.

వాస్తవమైన ప్రాంతీయ–భాషా చైతన్యాన్ని పూర్తిగా నిరాకరిస్తూ, విస్మరించే ఏకరూపతకు దేశం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇది మన భవిష్యత్తుకు ప్రమాదకరమైన మార్గాలను సృష్టిస్తుంది. ❑

# కళ్యాణి హాస్పిటల్

NABH PRE ACCREDITED



## మల్టీ స్పెషాలిటీ

బస్‌స్టాండ్ రోడ్డ్, హన్మకొండ - 506001.



హాస్పిటల్‌లో తమసేవలందిస్తున్న
శస్త్ర వైద్య నిపుణులు

డా॥ రత్న తిరుపతి రెడ్డి యం.యస్ ( ఆర్థో )
డా॥ ఏ.సుధాకర్ యం.యస్ ( LAP సర్జన్ )
డా॥ జి.లక్ష్మీనారాయణ యం.యస్. ( సర్జన్ )
డా॥ బైరిగాని వినోద్ రెడ్డి యం.డి. ( ఫీజిషియన్ )
డా॥ శంతన్ గుజ్జుల డి.యన్.బి ( ఆర్థో సర్జన్ )
డా॥ సౌమ్య గుజ్జుల యం.యస్., ఓ.బి.జి ( గైనకాలజిస్ట్ & ల్యాప్ సర్జన్ )
డా॥ పి.రవళి డి.జి.ఓ ( గైనకాలజిస్ట్ )
డా॥ సి.హెచ్. సురేష్ కుమార్ యం.యస్ ( స్పైన్ సర్జన్ )
డా॥ యన్.సతీష్ కుమార్ యం.డి. పిడియాట్రిక్స్ ( పిల్లల స్పెషలిస్ట్ )
డా॥ పింగళి గోపాల్ యం.సి.హెచ్., యఫ్.ఆర్.సి.యస్. ( పిడ్ & నియోనటల్ సర్జన్ )
డా॥ జి.సురేష్ యం.డి. ఫీజిషియన్
డా॥ రత్న భావన యం.బి.బి.యస్.

24/7 HOURS SERVICE

డా.పి. అంజనీ దేవి
Mg.Dir.,

### హాస్పిటల్‌లో గల వివిధ విభాగాలు

1. జనరల్ సర్జరీ & లాప్‌రోస్కోపిక్ సర్జరీ
2. ఎముకల విభాగం ( Ortho ) & మోకాలు కీలు మార్పిడితో సహ
3. వెన్నెముక సర్జరీ
4. జనరల్ మెడిసిన్
5. మహిళలకు OBST & GYN
6. చిన్నపిల్లలకు నవజాత శిశులకు NICU
7. చిన్నపిల్లలకు ప్రత్యేక సర్జరీ
8. వ్యాస్కులర్ సర్జరీ
9. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ
10. చెవి,ముక్కు,నోరు ( ENT )



ఆరోగ్య శ్రీ & EHS సౌకర్యం కలదు

24 ఇన్సూరెన్స్ కంపెనీలకు నగదు రహిత సేవలు




- ★ మూడు అధునాతన ఆపరేషన్ థియేటర్లు,
- ★ మోకాలు కీలు మార్పిడి వెన్నెముకల సర్జరీ,
- ★ గర్భిణిలకు నొప్పిలేని ప్రసవ సౌకర్యం,
- ★ లాప్‌రోస్కోపిక్ సర్జరీలు నిర్వహించబడుతున్నవి.

Contact Numbers. : 0870-2577077, 98490 63729, 98490 79480



# ఆర్థిక, మత శక్తుల జమిలి ఎజెండా

ఎ. కృష్ణారావు
ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి

రైతుల ప్రతిఘటన మోదీ లక్ష్యాలకు ఎంత మేరకు విఘాతం కల్పించగలదు? పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల లోపు ఈ సమస్య ఒక కొలిక్కి రాకపోతే మోదీ ఏమి చేస్తారు? ఆయన తిరోగమనానికి ఈ పరిణామాలు సూచికలు అవుతాయా? ఎందుకంటే మోదీ విజయం కేవలం మతశక్తుల విజయంపైనే ఆధారపడి లేదు. తనకు అండగా నిలిచే ఆర్థిక శక్తుల విజయానికి ప్రధానమంత్రి తోడ్పడకపోతే ఆయనకు రాజకీయ విజయాలు సాధ్యపడవు.

భారత రాజకీయాలు ఒక డోలాయమాన స్థితిలో సాగుతున్నాయి. గడచిన సంవత్సరం దాదాపు కరోనా మహమ్మారి చీకట్లలో సాగినప్పటికీ ఈ అంధకారాన్ని తనకు అనుకూలంగా ఉపయోగించుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం తాను అనుకున్న ఎజెండాను అమలు చేయగలిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మోదీ ప్రభుత్వం బిజెపి ఎజెండాలో ఉన్న ఒక్కో అంశాన్ని అమలు చేస్తూ, 2020లో దాని విస్తృత స్వరూపాన్ని ప్రజల అనుభవంలోకి తీసుకువచ్చింది. ఒక సైద్ధాంతిక దృక్పథం, ఒక దీర్ఘకాలిక ఎజెండా ఉన్న పార్టీని ప్రజలు పూర్తి మెజారిటీతో గెలిపిస్తే ఎటువంటి నిర్విచక్షణతో ముందుకు వెళ్లగలదో అన్న విషయం రోజురోజుకూ స్పష్టమవుతున్నది. కశ్మీర్, అయోధ్య, పౌరసత్వ చట్టం వంటి అంశాలపై బిజెపి వేగంగా తీసుకున్న నిర్ణయాలను చూసి ఆ పార్టీకి కేవలం మతతత్వ ఎజెండా మాత్రమే ఉన్నదని, ఆర్థికవ్యవస్థను ఏ విధంగా నిర్వహించాలో అన్న అంశంపై ఆ పార్టీకి ఒక దృక్పథం అంటూ లేదని విమర్శించే వారంతా గత ఏడాది ప్రకటించిన కార్మిక, వ్యవసాయ సంస్కరణల తీరుతెన్నుల్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. కరోనాకు ముందే దేశ ఆర్థిక పరిస్థితి ప్రశ్నార్థకం కాగా, కరోనా సమయంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ఈ సంక్షోభం ఏర్పర్చిన ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడం కోసం మోదీ ప్రభుత్వానికి తీవ్ర నిర్ణయాలు తీసుకోక తప్పలేదు. 'లాక్‌డౌన్ మొదటి దశలోనే ఆర్థిక వ్యవస్థ ద్వారాలు దాదాపు తెరిచాం. జూన్ తర్వాత ఇంకా చాలా నిర్ణయాలు జరుగబోతున్నాయి. ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని అవి తార్కిక ముగింపునకు చేరుకునేలా చూడడమే మా సంస్కరణల ఉద్దేశం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది జూన్ 2న భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) వార్షిక సదస్సులో వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ స్పష్టం చేశారు. భారత దేశం అభివృద్ధి వేగాన్నీ, స్థాయినీ, పరిధినీ పెంచాలని, దేశం నత్తనడక సాగడానికి ఇక ఎంత మాత్రం వీల్లేదని మోదీ మంగళవారం కొచ్చి- మంగళూరు పైప్‌లైన్‌ను ప్రారంభిస్తూ స్పష్టం చేయడంతో ఆయన తన దూకుడును ఆపే అవకాశాలు లేవన్న విషయం తేలిపోయింది.

బిజెపి మతపరమైన ఎజెండాను ఎదుర్కోగల సత్తా కానీ, దానికి సైద్ధాంతిక ప్రత్యామ్నాయాన్ని రూపొందించి ప్రజలను చైతన్య పరిచి తమ వైపుకు తిప్పుకోగలగిన శక్తి కానీ ఉన్న రాజకీయ పార్టీలు మన దేశంలో లేవని, అవి ఇప్పట్లో ఉద్భవించ గలిగిన పరిస్థితులు లేవని ఇప్పటివరకూ జరిగిన పరిణామాలను బట్టి అర్థమవుతోంది. పౌరసత్వ చట్టం, కశ్మీర్ వంటి అంశాలు మైనారిటీలను ఎంత ఏకం చేయగలిగాయో, హిందూ ఓటర్లను అంత సంఘటితం చేయగలుగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. చాలా మందికి బిజెపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు విచిత్రంగా అనిపించవచ్చు. వీరు అభివృద్ధి గురించి, ఆర్థిక విధానాల గురించి మాట్లాడకుండా ఆలయాల గురించి, ఇతర మతపరమైన అంశాల గురించి మాట్లాడతారేం అన్న అనుమానాలు రావచ్చు. కాని అదే సమయంలో కొన్ని చోట్ల అక్కడ ఉన్న రాజకీయ, సామాజిక పరిస్థితుల రీత్యా అలా మాట్లాడే వారు జనంతో కనెక్టు కావడం కూడా జరుగుతుందన్న విషయాన్ని విస్మరించరాదు. ఈ విషయం తెలిసినందువల్లే ఎక్కడ ఒవైసీలు ఉపయోగపడగలరో, ఎక్కడ బండిసంజయ్‌లు భావోద్వేగాలకు తోడ్పడగలరో బిజెపి అధిష్ఠానం ఇప్పటికే ఒక కళగా అభ్యసించకలిగింది.

అంత మాత్రాన బిజెపికి ఆర్థిక, అభివృద్ధి ఎజెండా లేదని చెప్పలేం. దేశంలో ఇప్పటివరకూ ప్రవేశించని రంగాల్లో కూడా ఆర్థిక శక్తుల రంగ ప్రవేశానికి దోహదం చేసి, ఈ శక్తులకు విస్తృత అవకాశాలు కల్పించడం, వాటి అండతో తాను కూడా బలోపేతం కావడం ఈ ఎజెండాలో భాగం. ఈ రీత్యా భారతీయ జనతా పార్టీ దూకుడు రెండు విధాలా సాగుతోందని చెప్పవచ్చు. కశ్మీర్, రామమందిరం, ముస్లిం వ్యతిరేకత, ఇతర భావోద్వేగాల విషయంలో బిజెపి మూల ఓటర్ల పునాదిని విస్తరిస్తూ, ఆ పార్టీ మాతృసంస్థ అయిన సంఘ్ పరివార్‌ను సంతృప్తి పరుస్తూనే, పార్టీకి అండదండగా నిలిచే ఆర్థిక శక్తులను పూర్తిగా విశ్వాసంలోకి

తీసుకునే చర్యల ద్వారా మోదీ ఒక విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ రెండు చర్యలకూ అవినాభావ సంబంధం ఉన్నది. ఈ పరస్పర ప్రయోజనకర అంశాల మూలంగానే బిజెపి రాజకీయ విస్తరణ కూడా సాధ్యపడుతోంది. ఇది తిరుగులేనిదా అన్నది మాత్రం ఇప్పుడే చెప్పడానికి వీల్లేదు. ఈ క్రమంలో వచ్చే అడ్డంకులను అధిగమించడం పైనే బిజెపి ఉత్థాన పతనాలు ఆధారపడి ఉంటాయని చెప్పక తప్పదు.

ఈ పరిణామ క్రమంలో భాగంగానే బిజెపి ఆర్థిక ఎజెండా ప్రస్తుతానికి కొంత ప్రతిఘటనను ఎదుర్కొంటోందని గమనించాలి. సాగు చట్టాలపై గత 40 రోజులుగా ఢిల్లీలో రైతులు ఎముకలు కొరికే చలిలోనూ, మంచు వర్షాల మధ్యా నిరసన ప్రదర్శనలు జరుపుతున్నప్పటికీ, 60 మంది రైతులు చనిపోయినప్పటికీ మోదీ ప్రభుత్వం పట్టు విడుపులు లేకుండా వ్యవహరిస్తోంది. ఈ చట్టాల అమలును తాత్కాలికంగా నిలిపివేసి కమిటీ ద్వారా పరిష్కరించాలని సుప్రీంకోర్టు చేసిన సూచనపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టలేదంటే ఈ చట్టాలు అమలు చేయడం వెనుక మోదీకి బలమైన లక్ష్యం ఉన్నదన్న విషయం స్పష్టం అవుతున్నది. ఏడు సార్లు చర్చలు జరిగినా ప్రభుత్వం ఒక్కో క్లాజుపై చర్చిస్తామని మాత్రమే చెప్పడం, అవకాశం దొరికినప్పుడల్లా ప్రతి వేదికపై తన వేగం ఆగదని మోదీ చెబుతుండడంతోనే చర్చలు జరిపే మంత్రులకు స్వంతంగా నిర్ణయం తీసుకునే అధికారం లేదన్న విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో రైతుల ప్రతిఘటన మోదీ లక్ష్యాలకు ఎంత మేరకు విఘాతం కల్పించగలదు? జనవరి నెలాఖరులో జరిగే పార్లమెంట్ సమావేశాల లోపు ఈ సమస్య ఒక కొలిక్కి రాకపోతే మోదీ ఏమి చేస్తారు? ఈ పరిణామాలు ఆయన తిరోగమనానికి సూచికలు అవుతాయా అన్నది 2021 ప్రారంభంలోనే తేలుతుంది. ఎందుకంటే మోదీ విజయం కేవలం మతశక్తుల విజయంపైనే ఆదారపడి లేదు. తనకు అండగా నిలిచే ఆర్థిక శక్తుల విజయానికి ప్రధానమంత్రి తోడ్పడకపోతే ఆయనకు రాజకీయ విజయాలు సాధ్యపడవు.

2021లో జరిగే ఎన్నికలను కూడా ఈ క్రమంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 2016లో అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా బిజెపి ఈశాన్యంలో తన విస్తరణను ప్రారంభించింది. గత ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, తెలంగాణలో జీహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి అత్యధిక సీట్లు విజయం సాధించడం ఒక రిహార్సల్ మాత్రమే. బెంగాల్, అస్సాం ఎన్నికలు కాంగ్రెస్‌తో పాటు ప్రాంతీయ పార్టీల భవిష్యత్‌ను కూడా నిర్ణయిస్తాయనడంలో సందేహం లేదు. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్న రీత్యా కాంగ్రెస్‌తో ఏ ప్రాంతీయ పార్టీ చేతులు కలిపే అవకాశాలు కనపడడం లేదు. అస్సాంలో మహా కూటమి ఏర్పాటుకు ప్రాంతీయ పార్టీలు తిరస్కరించడంతో కాంగ్రెస్ ఒంటరిదైపోయింది. అదే సమయంలో బిజెపి అస్సాం గణపరిషద్ వంటి పార్టీలతో కలిసి బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రాభవం క్షీణిస్తున్న విషయం గత లోక్‌సభ ఎన్నికల్లోనే తేలిపోయింది. అస్సాం, బెంగాల్‌లో హిందూత్వ ఓటర్లను సంఘటితం చేసేందుకు బీజేపీ చాలా రోజుల నుంచి ఉధృతమైన ప్రణాళికలను రూపొందించింది. రెండు రాష్ట్రాల్లోనూ ప్రధాన పార్టీల నుంచి ముఖ్యమైన నేతలు బిజెపిలోకి వలస రావడం ఎప్పటి నుంచో ప్రారంభమైంది. ఇక్కడ ప్రధానమైన పోటీ నరేంద్ర మోదీ, మమతా బెనర్జీల మధ్యే ఉంటుందన్న విషయంలో సందేహం లేదు. రవీంద్రనాథ్ టాగోర్ ఆహార్యాన్నీ, ఆకారాన్నీ సంతరించుకుంటున్న నరేంద్ర మోదీకి బెంగాల్లో విజయం సాధించడం అత్యంత కీలకమైన రాజకీయ చారిత్రక అవసరం కనుక అన్ని శక్తియుక్తులూ ఒడ్డేందుకు సిద్ధపడుతున్నారు.

తమిళనాడులో రాజకీయ పరిస్థితులరీత్యా అక్కడ సహజంగా డిఎంకె కూటమి ప్రభంజనం వీయాలి. కాని ఆ రాష్ట్రంలో ఉనికి కూడా లేని బిజెపి చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు, అన్నాడిఎంకెను రెండుగా చీల్చి గుప్పిట్లో పెట్టుకోవడంలో బిజెపి విజయం సాధించడమే కాదు, మీడియా ప్రచారంలో కూడా అక్కడ అది అన్ని పార్టీల కన్నా ముందున్నదనడంలో సందేహం లేదు. తమిళనాడులో ఏదో రకంగా దూరి తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడమే బిజెపి ప్రస్తుత లక్ష్యం. '2026లో మనమే అధికారంలోకి వస్తాం..' అని అమిత్‌షా ఇటీవలి తమిళనాడు పర్యటనలో చెప్పడం గమనార్హం.

ఈ ఏడాది పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి సాధించే విజయాలపైనే ఆ పార్టీ విస్తరణ, దాని లక్ష్యాలు నెరవేరడం ఆధారపడి ఉన్నాయయని చెప్పక తప్పదు. సంఘ్ పరివార్, బిజెపి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎజెండాలకు మాత్రమే కాదు, దేశంలో భావి పరిణామాలకు కూడా ఆ విజయాలు సూచిక అవుతాయి. అస్సాంతో పాటు పశ్చిమ బెంగాల్‌లో కూడా విజయం సాధిస్తే, తమిళనాడు, కేరళలో తన ఉనికిని చాటుకుంటే బిజెపికి దేశంలోనే తిరుగుండదని తేలవచ్చు. అంతేకాదు, తన ఆర్థిక ఎజెండాతో పాటు జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌర స్మృతి వంటి అనేక అంశాలను అమలు చేసి ఏకఛత్రాధిపత్యం క్రింద భారత దేశాన్ని తీసుకురాగలిగిన అవకాశాలు కూడా ప్రస్ఫుటంగా ఏర్పడతాయి. ప్రధానమంత్రి మోదీ తాను స్వారీ చేస్తున్న సింహాన్ని ఎంత మేరకు అదుపులోకి తెచ్చుకోగలరన్న విషయంపై ఇది ఆధారపడి ఉన్నది. ❑



# హిందూత్వ ఎజెండాలో భాగమే జమిలి ఎన్నికలు

**డి వి వి ఎస్ వర్మ**
జాతీయ స్ఫూర్తి సంపాదకులు

తొలిసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2016లో "ఒకే దేశం– ఒకే ఎన్నిక" నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ప్రధానమంత్రే ఈ నినాదాన్ని తవ్వి తలకెత్తుకుంటే పత్రికలు, ప్రసార మాధ్యమాలలో ప్రచారానికి కొదువ వుండదు. ప్రభుత్వపరంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వున్న పలు సంస్థలు యీ నినాదాన్ని సమర్థిస్తూ నివేదికల మీద నివేదికలను వెలువరించాయి. 2017లో నీతి అయోగ్ జమిలి ఎన్నికలను సమర్థిస్తూ దాని అమలుకు గల అవకాశాలను, మార్గాలను సూచించింది. ఇదే తరహాలో ఎన్నికల కమిషన్ ఒక నివేదికను రూపొందించింది. 2018లో లా కమిషన్ మరొకసారి కొన్ని మినహాయింపులతో నివేదికను ఇచ్చింది.

మోదీ తన మొదటి 5 ఏళ్ల పాలనలో ఈ నినాదాన్ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం చేశారు. ఎందుకంటే ఈ నినాదం ఆచరణ రూపం దాల్చాలంటే రాజ్యాంగాన్ని ఒక చోట కాదు ఏకంగా 5 చోట్ల సవరించాల్సి వుంది.

పార్లమెంటు ఉభయ సభల కాలపరిమితికి సంబంధించిన ఆర్టికల్ 83ను, రాష్ట్రపతి లోక్‌సభ రద్దుకు సంబంధించిన ఆర్టికల్ 85ను, రాష్ట్రాల శాసనసభల కాలపరిమితికి సంబంధించిన ఆర్టికల్ 172ను, రాష్ట్ర శాసనసభల రద్దుకు సంబంధించిన ఆర్టికల్ 174ను ,రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధింపునకు సంబంధించిన ఆర్టికల్ 356ను సవరించాలి.

2014–19 మధ్య కాలంలో మోదీ ప్రభుత్వం ఇలాంటి రాజ్యాంగ సవరణలు చేయగల స్థితిలో లేదు. రాజ్యాంగంలో ఈ తరహా సవరణలు చేయడానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ 2/3 వంతు సభ్యులు మెజారిటీతో పాటు దేశంలో మెజారిటీ శాసనసభల ఆమోదం పొందాలి. 2014లో మోదీది సంకీర్ణ ప్రభుత్వం. పైగా రాజ్యసభలో కనీసం మెజారిటీ కూడా లేదు. అందుచేత మోదీ వ్యూహాత్మకంగా జమిలి ఎన్నికల నినాదాన్ని ప్రచారానికి, ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి పరిమితం అయ్యారు.

మోదీ రెండోసారి పూర్తి మెజారిటీతో ఎన్నికయ్యారు. రాజ్యసభలో సంఖ్యాబలాన్ని గణనీయంగా పెంచుకున్నారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక మీద ఇతర పార్టీలను, ప్రత్యేకించి ప్రాంతీయ పార్టీల మద్దతు కూడాగట్టడానికి పూనుకున్నారు. 2019 జూన్‌లో జమిలి ఎన్నికలపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నినాదానికి 22 పార్టీల మద్దతు లభించింది. వామపక్షాలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి.

మోదీ రెండోసారి పూర్తి మెజారిటీతో ఎన్నికయ్యారు. రాజ్యసభలో సంఖ్యాబలాన్ని గణనీయంగా పెంచుకున్నారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక మీద ఇతర పార్టీలను, ప్రత్యేకించి ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టడానికి పూనుకున్నారు. 2019 జూన్‌లో జమిలి ఎన్నికలపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నినాదానికి 22 పార్టీల మద్దతు లభించింది. వామపక్షాలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి.

2020న నవంబరు 26న గుజరాత్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ సభలో జమిలి ఎన్నికల మీద మోదీ దూకుడు పెంచారు. "జమిలి ఎన్నికలు కేవలం చర్చించే అంశం మాత్రమే కాదు. అది దేశానికి అవసరం" అని మోదీ చేసిన ప్రసంగం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టపరిచినట్లయింది. పైగా ఈ నినాదం దేశాభివృద్ధికీ, ప్రజాశ్రేయస్సుకూ ఉద్దేశించిందని పేర్కొన్నారు.

ప్రధాని ఈ ప్రసంగం చేసిన వెనువెంటనే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఒక ప్రకటన చేస్తూ "తాము జమిలి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగానే వున్నామంటూ" స్పందించారు. ఇక పత్రికలు, ప్రసార మాధ్యమాలు జమిలి ఎన్నికల మీద చర్చోప చర్చలు సాగిస్తున్నాయి. 2022లోనే జమిలి ఎన్నికలు వస్తాయని జోస్యం చెబుతున్నాయి. ఇలా జమిలి ఎన్నికల ప్రయాణానికి మోదీ పూర్వరంగాన్ని సిద్ధం చేసుకున్నారు. జమిలి ఎన్నికలో సాగుతున్న చర్చలో వెలువడిన నివేదికలలో వ్యాసాలలో ఈ నినాదాన్ని సమర్థించేవారి వాదనలలో వున్న వాస్తవాలను విశ్లేషించుకోవాలి.

### ఎన్నికల నిర్వహణ వ్యయం - వాస్తవాలు

2019 ఎన్నికల ఖర్చు 60 వేల కోట్లు దాటిందని, జమిలి ఎన్నికలతో ఈ వ్యయం గణనీయంగా తగ్గిపోతుందని చేస్తున్న ప్రచారం పూర్తిగా గందరగోళం కలిగించడానికి ఉద్దేశించింది. ఈ ఎన్నికల వ్యయంలో రెండు భాగాలున్నాయి. ఒకటి ప్రభుత్వ ఖజానా నుండి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ చేసే ఖర్చు, మరొకటి ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీలు, వారి

అభ్యర్థులు పెట్టే ఖర్చు. ఈ 60 వేల కోట్ల అంచనా లెక్క ఈ రెండింటినీ కలిపి చెప్పే లెక్క.

ఎన్నికలనిర్వహణకు ప్రభుత్వ ఖజానా నుండి చేస్తున్న ఖర్చు మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులు పెట్టే ఖర్చు ప్రయివేటు ఖర్చు. ఓట్ల కొనుగోళ్ళకీ, మద్యం పంపిణీకి, సభలకు జనాలను తరలించడానికి, రకరకాల ప్రచారాలకి ఇంకా ఓటర్లను ప్రలోభపెట్టే చీరలు, సారెలు వగైరా ఖర్చులను ఎన్నికల వ్యయంగా, దేశం భరించలేని భారంగా ప్రచారం చెయ్యడం వాస్తవాలను మరుగున పరిచే ప్రయత్నం మాత్రమే.

ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్ ఈ క్రింది ఖర్చులను చేస్తుంది.

1. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, వాటికి అవసరమైన సదుపాయాల కల్పన
2. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి ప్రయాణ ఖర్చులు
3. బాలట్ బాక్సుల తరలింపు, సిబ్బందికి ప్రయాణ ఖర్చులు
4. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన తాత్కాలిక ఫోను, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్
5. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లు.
6. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి చేసే ఇతర ఖర్చులు

1952లో తొలి జమిలి ఎన్నికలకు అయిన ఖర్చు 10 కోట్లు మాత్రమే. ఈ ఖర్చు ప్రతి ఎన్నికకు పెరుగుతున్న ఓటర్లకీ, ధరవరలకీ, చేస్తున్న ఏర్పాట్లకీ అనుగుణంగా పెరుగుతూ వచ్చింది. 1977లో 6వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు 82 కోట్లు ఖర్చు కాగా 2009లో 15వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు 1114 కోట్లు, 2014లో 16వ లోక్‌సభ ఎన్నికలకు ఖర్చు 3426 కోట్లకు పెరిగింది. ఎన్నికల కమిషన్ రాను రాను ఎన్నికల నిర్వహణ సమయాన్ని వివిధ దశల పోలింగ్‌ల పేరుతో సాగదియ్యడం వల్ల నిర్వహణ ఖర్చు మరికొంత పెరుగుతున్నది. ఇది 5 ఏళ్లకి ఒకసారి జరిగే ఖర్చు. అంటే ఒకే ఏడాదికి ప్రభుత్వ ఖజానా నుండి అయ్యే ఖర్చు కేవలం 700 కోట్లు మాత్రమే.

2019-20 కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ 28 లక్షల కోట్లు. అందులో ఎన్నికల నిర్వహణకు చేసే 700 కోట్లు ఖర్చు సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే. ఇక రాష్ట్రాలలో ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహిస్తే 5 ఏళ్లకు ఆ రాష్ట్రంలో ఖర్చు 3 లేదా 4 వందల కోట్లు. అంటే ఏడాదికి 100 కోట్లు కూడా లేదు. అందువల్ల జమిలి ఎన్నికలు జరిగితే ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గిపోతుందన్న వాదన వాస్తవం కాదు.

అసలు సమస్య ఎన్నికలను కుబేరుల ఆటగా మార్చిన ఎన్నికల వ్యవస్థను సంస్కరించడాన్ని వదిలేసి జమిలి ఎన్నికలే పరిష్కారంగా చూపడం అర్థరహితం.

## ఎన్నికల కోడ్ - అభివృద్ధి

తరచు ఎన్నికల వల్ల ఎన్నికల కోడ్ అమలులో వుండడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయన్నది మరో వాదన. లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు దేశమంతటికీ ఎన్నికల కోడ్ వర్తిస్తుంది. అప్పుడు కేంద్రంలో ఆపద్ధర్మ ప్రభుత్వమే వుంటుంది. అది కొత్త పథకాలను, నిర్ణయాలను తీసుకునే అవకాశం వుండదు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగేటప్పుడు ఆ రాష్ట్రాలలో ఇదే స్థితి వుంటుంది. ఇకపోతే కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు కేంద్రప్రభుత్వం స్తంభించిపోదు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఓటర్లను ప్రభావితం చేసే కొత్త పథకాలు, రాయితీలు ప్రకటించడం మీద ఆంక్షలు మాత్రమే వుంటాయి. రోజువారీ పరిపాలన, అంతకుముందు అమలులో వున్న పథకాలు యధావిధిగా కొనసాగుతాయి. గతంలో కొన్ని రాష్ట్రాల ఎన్నికల సమయంలో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోలేదు.

ఎన్నికల కోడ్ వల్ల పాలన స్తంభించడంలేదు. ప్రభుత్వాన్ని నడిపే పెద్దలు ప్రతి ఎన్నికలలోనూ – శాసనసభ లేదా మున్సిపల్ కార్పొరేషన్ తామే అభ్యర్థులమైనట్టు ఆయా పార్టీల మంత్రులు, ముఖ్యమంత్రులు పాలన పక్కనబెట్టి ప్రచారంలో గల్లీ గల్లీకి తిరిగే పద్ధతి వల్ల రోజువారీ పాలనకు ఆటంకం కలుగుతుంది. రాష్ట్రాల ఎన్నికలను ఆ రాష్ట్ర పార్టీలకి, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను స్థానిక నేతలకు వదిలేస్తే ఈ సమస్య ఉత్పన్నం కాదు.

ప్రతిసంవత్సరం ఏదో ఒక ఎన్నిక జరగడం వల్ల కులతత్వం, మతతత్వం ప్రాంతీయ తత్వాలు రెచ్చగొట్టబడుతున్నాయని ఈ చిచ్చు ఆగాలంటే జమిలి ఎన్నికలు అవసరం అంటున్నారు. నిజానికి ఎన్నికల సమయంలోనే కాదు రాజకీయ పార్టీలు అధికారం కోసం ఏ అడ్డదారినైనా తొక్కడానికి సిద్ధపడుతూ ప్రతినిత్యం కులాన్ని, మతాన్ని రాజకీయానికి వాడుకుంటూనే వున్నారు. ఇది కేవలం ఎన్నికలకే పరిమితమైన అంశంగా ప్రకటించడం రోజువారీ కులమత రాజకీయాలను కప్పిపుచ్చడానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

మొత్తంమీద జమిలి ఎన్నికలను సమర్థించేవారు చేసే వాదనలలో వాస్తవం పాలు తక్కువ వాగాడంబరం పాలు ఎక్కువగా కనిపిస్తున్నది. మనది చాలా వైవిధ్యం గల దేశం. పలు ప్రాంతీయ ప్రత్యేకతలు, భాషలు, మతాలు గల దేశం. సామాజికంగా ఆహారం ఆహార్యం దగ్గర నుండి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల వైవిధ్యం గల దేశం.

ఈ బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకున్నారు. దీనికి తగిన పార్లమెంటరీ తరహా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ఎంపిక చేశారు. కేంద్రానికీ, రాష్ట్రాలకీ మధ్య స్పష్టమైన విభజన రేఖలు గీశారు. కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడిజాబితాల రూపంలో అధికారాల విభజన చేశారు. ఎన్నికలలో ప్రజలు తీర్పు చెప్పడానికి ఇవి ప్రాతిపదికలు కావాలి.

జాతీయస్థాయిలో లోక్‌సభకు జరిగే ఎన్నికలలో వివిధ పార్టీలు కేంద్రజాబితాలోని అంశాలపై ప్రకటించే విధానాల ఆధారంగా ప్రజలు తీర్పు చెప్పాల్సి వుంటుంది. అలాగే రాష్ట్ర జాబితాలోని అంశాల ఆధారంగా రాష్ట్రాలలో తీర్పులు చెప్పాల్సి వుంటుంది. అందువల్ల లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేరు వేరుగా ఎన్నికలు జరపడం వల్ల ప్రజలు దేనికి తగ్గ తీర్పు దానికి చెప్పడానికి వీలు కలుగుతుంది. జమిలి ఎన్నికల వల్ల ఈ అధికార విభజన ప్రాతిపదిక కలగాపులగం అవుతుంది. జాతీయ, రాష్ట్ర అంశాలలో ఏదో ఒక దానికే ప్రాధాన్యత లభిస్తుంది. అలాంటి కలగా పులగపు తీర్పు వాంఛనీయం కాదు.

## జమిలి ఎన్నికల అనుభవం

1952 నుండి 1967 వరకు దేశంలో జమిలి ఎన్నికలు జరిగిన మాట వాస్తవం. తిరిగి అదే పద్ధతిని తీసుకురావడం తప్పుకాదని వాదించే వారు ఈ జమిలి ఎన్నికల పర్యవసానాలను విస్మరిస్తున్నారు.

మన దేశం 1950లో రిపబ్లిక్ అయ్యింది. 1952లో తొలి ఎన్నికలు కావడం వల్ల లోక్‌సభకు, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరపవలసి వచ్చింది. జాతీయోద్యమ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రెండింటా ఆధిపత్యాన్ని పొందింది. ఇలా ప్రారంభం అయిన జమిలి ఎన్నికలు తర్వాత దశలో ఏక పార్టీ ఆధిపత్యంగా, ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలను విస్మరించేదిగా తన నిజరూపాన్ని బహిర్గతం చేసింది.

దీని పర్యవసానంగా అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ఈ పార్టీలన్నీ కడిగిన ముత్యాలు కాకపోయినా అనేక బలహీనతలు, లోపాలు, నియంత పోకడలూ వున్నా అవి ప్రజల ప్రాంతీయఆకాంక్షలకు ప్రతినిధులుగా కొనసాగుతున్నాయి. గతంలో జమిలి ఎన్నికల ప్రయోగం జాతీయ పార్టీ ఏకఛ్ఛత్రాధి పత్యానికి దారితీసింది. వివిధ రాష్ట్రాల ప్రజల ప్రాంతాల ఆకాంక్షల వైవిధ్యాన్ని తుడిచిపెట్టింది. అదొక విఫల ప్రయోగంగా మిగిలింది.

## ఒకే దేశం - ఒకే ఎన్నిక పర్యవసానాలు

ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదాన్ని తరిచి చూస్తే చాలా కోణాలు కనిపిస్తాయి. లోక్‌సభకు జరిగే ఎన్నికలు దేశానికి జరిగే ఎన్నికలు. అవి దేశమంతటా ఒకేసారి జరుగుతున్నాయి. అందువల్ల ఈ నినాదం అసలు లక్ష్యం వేరువేరుగా జరుగుతున్న రాష్ట్రాల ఎన్నికలను రద్దు చేసి లోక్‌సభ ఎన్నికలతో పాటు నిర్వహించడం పైకి కనిపించే సారాంశం.

ఇది మనకి కొత్త కాదు. 1952-67 మధ్యకాలంలో జరిగిన జమిలి ఎన్నికలనే తిరిగి మోదీ ప్రభుత్వం పునరుద్ధరించాలని భావిస్తున్నది. ఒక విఫల ప్రయోగంగా చరిత్రలో నిలిచిన జమిలి ఎన్నికలను తిరిగి మోదీ ప్రభుత్వం ఎందుకు తలకెత్తుకున్నది? అన్నదే అసలు సమస్య. ఎందుకంటే గతంలో జమిలి ఎన్నికలు సాధించిన ఫలితాలు, మోదీ ప్రభుత్వ లక్ష్యాలు ఒక్కటే. ఒక జాతీయపార్టీ ఏకస్వామ్య పాలన సాధించడం, ప్రాంతీయ వైవిధ్యాలను తుడిచిపెట్టడం హిందూత్వ ఎజెండా అందరికీ తెలిసిందే. దాని లక్ష్యం "హిందూరాష్ట్ర" ను అంటే హిందూత్వ రాజ్యాన్ని ఏర్పాటు చెయ్యడం. ఇది జరగాలంటే దేశాన్ని ఒక ముద్దగా చెయ్యాలి. అన్ని రకాల వైవిధ్యాలను రూపుమాపాలి. ఈ దిశగా మోదీ ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది.

ఒకే దేశం ఒకే చట్టం పేరుతో ఒకే పన్ను చట్టాన్ని (జి.యస్.టి) తెచ్చింది. రాష్ట్రాలకు వున్న పన్నులు వేసే అధికారాన్ని తొలగించింది. ఒకే దేశం ఒకే మార్కెట్ పేరుతో వ్యవసాయ చట్టాలు తెచ్చింది. రాష్ట్ర పరిధిలోని వ్యవసాయాన్ని కబళించింది. కార్మిక చట్టాలను ఏకీకృతం చేసింది. ఒకే భాషను అన్ని రాష్ట్రాల మీద రుద్దే ప్రయత్నాలు సాగిస్తున్నది.

ప్రజల ఆహార స్వేచ్ఛమీద, ప్రేమ, పెళ్లి స్వేచ్ఛల మీద దాడులను ప్రోత్సహిస్తున్నది. పౌరసత్వానికి మత ప్రాతిపదికను తెచ్చి మెజారిటీ వాదాన్ని, మత జాతీయ వాదాన్ని ప్రచారంలో పెట్టింది. హిందూత్వ వాదానికి అనుకూలంగా చరిత్రను తిరగరాయిస్తున్నది. ఇలా దేశ ఆర్థిక, సామాజిక జీవనంలో ఏకత్వాన్ని రుద్దే ప్రయత్నాలను ముమ్మరంగా సాగిస్తున్నది. ఇవన్నీ హిందూత్వ ఎజెండాకు భూమికను సిద్ధం చేస్తున్నాయి.

ఇక దేశ రాజకీయ రంగాన్ని కూడా ఒక ముద్దగా చెయ్యాలి . ఇది హిందూరాష్ట్ర సాధనకు అత్యంత కీలక మైన అంశం .ప్రస్తుతం జాతీయ రాజకీయ రంగంలో ప్రాంతీయ పార్టీలు ,ప్రజల స్థానిక ఆకాంక్షలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి . రాజకీయ రంగం నుండి వీటిని తొలగించడం లేదా బలహీన పర్చడం ద్వారానే దేశ రాజకీయం ఒక ముద్దగా మారుతుంది . అప్పుడు దేశ రాజకీయం మెజారిటీ వాదానికి ,మత జాతీయ వాదానికి ఆటపట్టు అవుతుంది . హిందూ రాష్ట్ర సాధనకు మార్గం సుగమం అవుతుంది ఈ హిందూత్వ ఎజండాలో కీలక పాత్ర పోషించేవే జమిలి ఎన్నికలు. ❑

# మోదీకి ప్రత్యామ్నాయం అంకురిస్తుందా ?

**కొండుభట్ల రామచంద్రమూర్తి**
సీనియర్ పాత్రికేయులు, 'సకలం' సంపాదకులు



జాతీయ స్థాయిలో బీజేపీ పనీ, ప్రధాని నరేంద్రమోదీ పనీ నల్లేరుమీద బండిలాగా సాగిపోవడానికి ప్రధాన కారణం ఏమిటి? ప్రతిపక్షంలో మోదీకి దీటైన నాయకుడు లేకపోవడం. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ప్రజలు మోదీకి సమవుజ్జీగా, సమానస్కంధుడుగా పరిగణించడం లేదు. అందుకే 2019లో మోదీ తన ఐదేళ్ళ పాలన తర్వాత కూడా 2014లో కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నారు. దేశంలోని చాలా ప్రతిపక్ష పార్టీల నేతలు రాహుల్ గాంధీని జాతీయ స్థాయి ప్రతిపక్ష నేతగా గుర్తించడం లేదు. అందుకు తెలుగుదేశం అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడూ, తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) వంటి ప్రాంతీయ పార్టీల నాయకులు జాతీయ స్వప్నాలు కంటున్నారు. వీలైనప్పుడల్లా పావులు కదుపుతున్నారు. మేమూ ఉన్నాం అంటున్నారు. జాతీయ పార్టీ నాయకుడైన రాహుల్ గాంధీకి తాము ప్రత్యామ్నాయం అనుకుంటున్నారు. ఎందుకు? రాహుల్ గాంధీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరు కనుక మనమూ ఒక ప్రయత్నం చేద్దాం. మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, విపి సింగ్, చంద్రశేఖర్, దేవగౌడ, గుజ్రాల్ మాదిరి ఒక్కసారైనా ప్రధానమంత్రి పదవి చేపట్టాలని ఉవ్విళ్ళూరుతున్న ప్రాంతీయ నాయకులు ఉన్నారు. వారు ఇతర ప్రతిపక్ష నాయకులను కూడగట్టుకొని మోదీకి ప్రత్యామ్నాయం కావాలని కలలు కంటున్నారు. ప్రస్తుతం అంత సీను' అటు చంద్రబాబునాయుడికి కానీ ఇటు కేసీఆర్ కి కానీ లేదు. నిన్న మొన్నటి వరకూ కలలకు కొదువ లేదు. ఇప్పుడు ఇద్దరిలోనూ కలవరపాటే కనిపిస్తున్నది.

"మోదీకి ప్రత్యామ్నాయం అన్వేషించవలసిన అవసరం ఉన్నదా? మోదీనే 2024లోనో, సమాంతర ఎన్నికలు వస్తే 2022లోనో జరిగే ఎన్నికలలో మరోసారి గెలిచి మూడో విడత ప్రధానిగా ప్రమాణం చేస్తే దేశానికి వచ్చే నష్టం ఏమిటి?" అని ఎవరైనా అడగవచ్చు. మోదీకీ, బీజేపీకి ప్రత్యామ్నాయం వెదకవలసిన తక్షణావసరం ఉంది. మోదీ ధోరణిని ఎదుర్కొని నిలబడే దమ్మున్న నాయకుడి అవసరం దేశానికి ఉన్నది. అధికార పక్షానికి ప్రత్యామ్నాయం, బలమైన ప్రపతిపక్షం ప్రజాస్వామ్యం మనుగడకు అత్యవసరం.

## రైతుల సాహసానికి బలమైన ప్రతిపక్షం తోడైతే....

సుమారు యాభై రోజులుగా నిరసన ప్రకటిస్తూ దిల్లీ-హరియాణ సరిహద్దులో, కటిక చలినీ, పోలీసులు ప్రయోగిస్తున్న చల్లటి నీటి దాడినీ, మోదీ ప్రభుత్వ అధికారాన్ని ధిక్కరించి ప్రదర్శనలు చేస్తున్న రైతుల పట్ల ఏ మాత్రం మెత్తపడకుండా మూడు వ్యవసాయ చట్టాలనూ అమలు చేసి తీరుతామంటూ పట్టుబట్టే అవకాశం మోదీకి ఎవరు ఇచ్చారు? పంజాబ్, హరియాణా రైతులకు ప్రతిపక్షం మద్దతు సరిపోకపోవడమే మోదీ ప్రభుత్వానికి బలం. మూడు వ్యవసాయ బిల్లుల మంచిచెడుల గురించి జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇంత సుదీర్ఘమైన రైతు ఉద్యమం భారత దేశ చరిత్రలో ఇంతకు మునుపు జరగలేదు. ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ పాదయాత్ర చేసిన వైనం చరిత్రలో నమోదయింది. నారాయణ స్వామి, శరద్ జోషీ, మహేంద్ర తికాయత్ వంటి నాయకులు ఉద్యమం నడిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాలు దిగి వచ్చేవి. కానీ ఇన్ని వేలమంది ఇన్ని రోజులుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నా మోదీకి చీమ కుట్టినట్టు కూడా కనిపించడం లేదు. వ్యవసాయ మంత్రి తోమర్‌నూ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నూ చర్చలు జరిపే మంత్రుల బృందానికి నాయకులుగా పంపుతున్నారు. ప్రధాని మాత్రం మెట్టు దిగలేదు. కావాలంటే కోర్టుకు పొమ్మని రైతులకు బీజేపీ నేతలు సవాలు విసిరారు.

## సుప్రీంకోర్టు శల్యసారథ్యం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ ఏ బాబ్డే మౌఖికంగా ప్రభుత్వాన్ని అభిశంసిస్తున్నట్టు మాట్లాడారు. న్యాయమూర్తులు కేసు విచారణ సమయంలో పిటీషనర్‌కు అనుకూలంగా, ప్రభుత్వానికో, సంస్థలకో వ్యతిరేకంగా మాట్లాడటం, తీరా తీర్పు పిటిషన్‌కు ప్రతికూలంగా ఇవ్వడం చాలాకాలంగా మనదేశంలో ఉన్నదే. అదే జరిగింది. వ్యవసాయ చట్టాలను సస్పెన్షన్‌లో పెట్టడానికి మీకు అభ్యంతరం ఏమిటంటూ హుంకరించిన జస్టిస్ బాబ్డే ప్రభుత్వ వైఖరిని నూటికి నూరు శాతం సమర్థించే నలుగురు ప్రముఖులతో ఒక కమిటీని నియమించారు. ఒక సభ్యుడు బాధ్యత స్వీకరించేందుకు నిరాకరించారు. తక్కినవారు పెద్దగా ఆసక్తి

చూపించలేదు. రైతు నాయకులు ఈ కమిటీని గుర్తించడానికీ, దాని ఎదుట వాంగ్మూలం ఇవ్వడానికి సిద్ధంగా లేమంటూ కరాఖండిగా చెప్పారు. కమిటీ సభ్యులను కలుసుకోబోమని స్పష్టంగా చెప్పారు. ఇంత ధైర్యంగా ప్రభుత్వాన్ని ఎదిరించే రైతులకు వెన్నుదన్నుగా బలమైన ప్రతిపక్షం ఉండే పరిస్థితి వేరే రకంగా ఉండేది. ఇంత ఏకపక్షంగా ఉండేది కాదు. మోదీ ఈ వ్యవహారాన్ని ఇంత తేలికగా తీసుకునేవారు కాదు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తామని రైతులు బెదిరిస్తున్నారు. అదొక్కటే మోదీని ఆలోచింపచేస్తున్నది. ప్రతిపక్షం గట్టిగా నిలబడితే పరిస్థితి భిన్నంగా ఉండేది.

ప్రతిపక్షం బలహీనతకు కేవలం కాంగ్రెస్ పార్టీని మాత్రమే నిందించడం భావ్యం కాదు. ప్రాంతీయ పార్టీలు కూడా అన్నదాతల ఆక్రందనను పట్టించుకోవడం లేదు. తమ సంకుచిత ప్రయోజనాలకే, తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదాహరణకు తెలుగు రాష్ట్రాలలో నాలుగు ప్రాంతీయ పార్టీలకూ నాలుగురు అధినాయకులు ఉన్నారు. నలుగురిలో ఒక్కరు కూడా రైతు పక్షాన లేరు.

## చంద్రబాబునాయుడి తరహా వేరు

వీరిలో అందరికంటే అనుభవజ్ఞుడు నారా చంద్రబాబు నాయుడు. 1995 నుంచి ఇప్పటి దాకా, అంటే సుమారు పాతికేళ్ళకు పైగా, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, పదేళ్ళకు పైగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్న వారు. దేవెగౌడనూ, ఐకె గుజ్రాల్‌నూ ప్రధానులుగా సింహాసనం పైన కూర్చోబెట్టింది తానేనంటూ సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పుకుంటారు. 2019 ఎన్నికలలో మోదీ పరాజయం ఖాయమని అంచనా వేసుకొని ప్రతిపక్షాలను సమీకరించడం, వారికి నిధులు సమకూర్చడం వంటి పనులు చంద్రబాబునాయుడు చేశారు. కాంగ్రెస్‌ను సైతం కౌగలించుకున్నారు. అంతటితో ఆగకుండా నరేంద్రమోదీని రాజకీయంగా, వ్యక్తిగతంగా కటువుగా విమర్శించారు. ఎన్నికల ఫలితాలు చంద్రబాబునాయుడు అంచనాలు శుద్ధతప్పు అని తేల్చాయి. లోక్ సభలో బీజేపీ సాధించిన సీట్లు 2014 స్థాయిని మించిపోగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సీట్లలో 175 కి గాను 151 సీట్లలో వైఎస్ ఆర్ సీపీ గెలిచింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ పోరాటే శక్తి టీడీపీకి లేదు. అందువల్ల మోదీకి పచ్చ జెండా ఊపారు. ఆయన దానిని గుర్తించినా స్పందించలేదు. అది వేరే విషయం. ఏతావాతా చెప్పుకోవలసింది ఏమంటే కేంద్రాన్ని తప్పుపట్టే పరిస్థితిలో చంద్రబాబునాయుడు లేరు. ఎన్నికలైన తర్వాత ఇంతవరకూ మోదీని కానీ బీజేపీని కానీ టీడీపీ అధినేత పల్లెత్తు మాట అనలేదు. అనబోరు. రాష్ట్ర రాజధానిలో సంవత్సర కాలంగా ఉద్యమం చేస్తున్న రైతుల పట్ల చంద్రబాబునాయుడికి సంపూర్ణ సానుభూతి ఉన్నది కానీ దేశ రాజధానిలో నిరసన ప్రకటిస్తున్న రైతుల పట్ల ఏ మాత్రం ప్రేమలేదు.

## బీజేపీ మిత్రపక్షం జనసేన

జనసేన నేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ టీడీపీ 2014 విజయానికి దోహదం చేశారు. చంద్రబాబునాయుడికి మిత్రుడుగా పేరు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికలలో పోటీ చేసి దెబ్బ తిన్నారు. తాను స్వయంగా పోటీ చేసిన రెండు స్థానాలలోనూ గెలవలేక పోయారు. ఎన్నికల తర్వాత ఢిల్లీ వెళ్ళి బీజేపీ నాయకులతో మాట్లాడి వచ్చారు. బీజేపీకీ, జనసేనకూ మధ్య పొత్తు ఉన్నదనే అభిప్రాయం ప్రజలలో ఉంది. బీజేపీ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు వీర్రాజు పవన్ పట్ల సుముఖంగానే ఉన్నారు. తిరుపతి ఎన్నికలలో జనసేన పోటీ చేయాలని పవన్ కల్యాణ్ కు బలంగా ఉన్నది. బీజేపీ పోటీ చేస్తుందని వీర్రాజు ప్రకటించేశారు. పొత్తు, పోటీ సంగతి ఏమైనా పవన్‌కల్యాణ్‌కు బీజేపీ విధానాలను విమర్శించే పరిస్థితి లేదు. అమరావతి రైతులను అప్పుడప్పుడు పలకరించి వారికి మద్దతు పలుకుతున్నారు కానీ ఢిల్లీలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న రైతుల పట్ల సానుభూతి ఉన్న దాఖలా లేదు.

## వైఎస్ ఆర్ సీపీ మౌనం

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీ వైఎస్ఆర్ సీపీ. ఏ కారణంగా చూసినా కేంద్రంలోని ఎన్ డీ ఏ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే అవకాశం లేదు. అవసరం కూడా లేదు. జగన్ మోహన్ రెడ్డి కార్యక్షేత్రం కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. జాతీయ స్థాయి పోకడలూ, ఊహలూ లేనేలేవు సరికదా పొరుగున ఉన్న తెలంగాణలో పోటీ చేయాలని కూడా అనుకోవడం లేదు. పూర్తిగా వాస్తవికవాది. నేలవిడిచి సాము చేయని పోరాట యోధుడు. జగన్ మోహన్ రెడ్డికి తన శక్తిపైనా, పరిధిపైనా, పరిమితులపైనా సంపూర్ణమైన స్పష్టత ఉన్నది. సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ పెట్టిన డజనుకు పైగా కేసులు వివిధ దశలలో ఉన్నాయి. సీబీఐనీ, ఈడీని ప్రభావితం చేసే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంది. లోగడ సోనియాగాంధీ చేసిన పనే ఇప్పుడు నరేంద్రమోదీ చేస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగించుకొని కొమ్ములు తిరిగిన ప్రతిపక్ష నాయకులను తమ పార్టీలో చేర్చుకొని దొడ్డిలో కట్టేసుకుంటున్నారు లేదా కేసులూ, ఆరోపణల చిట్టాలూ చూపించి బెదిరించి నోరుమూయిస్తున్నారు.

## మోదీపై పోరాడవలసిన అవసరం జగన్‌కు లేదు

ఇటువంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వాన్ని కానీ ప్రధాని మోదీని కానీ పనిగట్టుకొని విమర్శించి, వ్యతిరేకించవలసిన అవసరం జగన్ మోహన్‌రెడ్డికి లేదు. ఆయన ఎన్నడూ మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేయలేదు. ఆ పనులు చేసిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు మోదీ పిలుపుకోసం ఎదురు చూస్తుంటే, రైతుల దీక్షల పట్ల మౌనం వహిస్తుంటే జగన్ మోహన్ రెడ్డి నోరు చేసుకోవలసిన అవసరం ఏమున్నది? మౌనం. ప్రధానంగా శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్టు తనకు బద్ధశత్రువైన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి ప్రత్యర్థి అయిన నరేంద్రమోదీ జగన్ మోహన్ రెడ్డికి సహజ మిత్రుడు. మూడు వ్యవసాయ చట్టాలను అధ్యయనం చేసి, వాటి లోటుపాట్లను గుర్తించి, రైతులకు అనుకూలంగా, చట్టాలకు వ్యతిరేంగా, ప్రభుత్వానికి ప్రతికూలంగా మాట్లాడవలసిన అగత్యం జగన్‌మోహన్‌రెడ్డికి లేదు. అమరావతి రైతుల పట్ల కానీ ఢిల్లీ రైతుల పట్ల కానీ ఒకే వైఖరి. ఇక నాలుగో నేత కేసీఆర్. అనుభవంలో చంద్రబాబునాయుడు తర్వాత స్థానం కేసీఆర్ దే. నాయుడి మంత్రివర్గంలో సభ్యుడుగా ఉండేవారు. అదే విధంగా కొనసాగిస్తే రాష్ట్ర విభజన జరిగేది కాదు. కానీ సీబీఐ మాజీ డైరెక్టర్ విజయరామారావుకి మంత్రి పదవి ఇవ్వాలనే ఉద్దేశంతో 1999లో కేసీఆర్‌కి మంత్రివర్గంలో చోటు కల్పించకుండా శాసనసభ ఉపసభాపతిగా నియమించారు. దీనిని అవమానంగా భావించిన కేసీఆర్ టీడీపీ నుంచి నిష్క్రమించి తెలంగాణ రాష్ట్ర సమితిని 2001లో నెలకొల్పారు. తర్వాత జరిగింది చరిత్ర. అందరికీ తెలిసిందే. తనపైన విశ్వాసంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సమ్మతించిన సోనియాగాంధీనే బురిడీ కొట్టించిన కేసీఆర్ బీజేపీనీ, మోదీని వ్యతిరేకించిన సందర్భాలు కూడా ఉన్నాయి. 2019లో కేసీఆర్ సైతం ఫెడరల్ ఫ్రంట్ కలలు కన్నారు. మోదీ ఓడిపోతారని చంద్రబాబునాయుడిలాగే కేసీఆర్ కూడా తప్పుడు అంచనా వేశారు. ఆయన దేశంలోని ఇతర ప్రతిపక్షాలకు సహాయసహకారాలు అందించిన సంగతి రహస్యం కాదు.

## దుబ్బాకతో మొదలు

ఇటీవలెనే జరిగిన దుబ్బాక ఉపఎన్నికలో బీజేపీ అనూహ్యంగా విజయం సాధించినప్పుడు ఉలిక్కిపడిన కేసీఆర్ కాషాయం రంగు పార్టీకి ప్రచారం చేసుకునేందుకు సమయం లేకుండా వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ) జరిపించారు. 2016లో నాలుగు డివిజన్లతో సరిపెట్టుకున్న బీజేపీ 2020లో 48 డివిజన్లకు విస్తరించింది. వందకు పైగా స్థానాలు కలిగిన టీఆర్ఎస్ 56 స్థానాలకు కుదించుకొని పోయింది. జీహెచ్ఎంసీ ఎన్నికలలో కేసీఆర్ బీజేపీని దుయ్యపట్టారు. వ్యవసాయచట్టాలనూ తూర్పారపట్టారు. రైతులకు సంఘీభావం ప్రకటించారు. తాను ప్రతిపక్ష పార్టీలను కూడగట్టి ఫెడరల్ ఫ్రంట్‌ను బలోపేతం చేసి ఢిల్లీ వెడుతున్నందుకు బీజేపీ నాయకులు బెంబేలు పడుతున్నారంటూ అహంకారపూరితంగా వ్యాఖ్యానించారు. కనీసం కేసీఆర్ అయినా పలుకున్న తెలుగు నాయకుడిగా నిలబడతారేమో, ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమాన్ని సమర్థిస్తారేమోనని ఆశపడినవారికి నిరాశే మిగిలింది.

## ప్రధానితో సమావేశం, కేసీఆర్ అస్త్రసన్యాసం

జీహెచ్ ఎంసీ ఎన్నికలైన తర్వాత ఢిల్లీ వెళ్ళి నరేంద్రమోదీనీ, దేశీయాంగ మంత్రి అమిత్ షానూ కలిసి వచ్చిన తర్వాత నేరుగా ఫామ్ హౌస్‌కు వెళ్ళి రెండు వారాలు మౌనంగా గడిపారు. ఆత్మ విమర్శ చేసుకొని ఉంటారు. అప్పటి నుంచి బీజేపీ పైన విమర్శలు లేవు. వ్యంగ్యాస్త్రాలు సంధించడం లేదు. వాగ్దాడులు లేవు. రైతులకు మద్దతును వాపసు తీసుకొని వ్యవసాయ చట్టాలకు మద్దతు తెలుపుతున్నట్టు సంకేతాలు ఇచ్చారు. నిరుడు మాదిరిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండబోవని ప్రకటించారు. ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని తేల్చిచెప్పారు. అంతా మూడు వ్యవసాయ చట్టాలకు అనుగుణంగానే మాట్లాడారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు బండి రవీంద్ర ఎంత రెచ్చగొట్టినా కేసీఆర్ కానీ, ఆయన కుమారుడు కేటీఆర్ కానీ రెచ్చిపోవడం లేదు. తిరుగుదాడి చేయడం లేదు. 'మౌనేనకలహం నాస్తి' అనుకున్నట్టున్నారు. సర్దుకున్నట్టున్నారు.

## నాలుగు తెలుగు పార్టీల బీజేపీ సానుకూలత

రెండు తెలుగు రాష్ట్రాలలోని నాలుగు ప్రాంతీయ పార్టీలూ బీజేపీ పట్ల సానుకూలంగా ఉన్నాయనేది స్పష్టం. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బలంగా లేదు. తెలంగాణలో 24 శాతం ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు చెపుతున్నారు కానీ తాము మూడో స్థానానికి దిగజారినట్టు వారు మానసికంగా రాజీపడినట్టు కనిపిస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. నిజానికి వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ, రైతులను సమర్థిస్తూ ఉద్యమం నిర్వహించడానికి, కార్యకర్తలను ఉత్సాహపరచడానికి ప్రస్తుత వాతావరణం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంది. వామపక్షాలను కూడగట్టుకొని కార్యాచరణ ప్రకటించవచ్చు. కానీ పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమకుమార్ రెడ్డి వైదొలగడం, ఆయన స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో ఎవరు చొరవ తీసుకోవాలన్న సంశయంతో కాంగ్రెస్ పార్టీ విలువైన అవకాశాన్ని వినియోగించుకోలేకపోతున్నది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలకూ రైతుల పట్ల అంకితభావం ఉన్నది. కానీ వారికి

ప్రజలలో మద్దతు క్రమంగా తగ్గిపోయింది. తెలుగునాట వామపక్షాల ప్రభావం ఇదివరకు ఉన్నంతగా ఇప్పుడు లేదు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ బీజేపీకి, నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఉద్యమం చేసే పరిస్థితులు లేవు.

## అందరూ అందరే

బీహార్‌లో లాలూప్రసాద్ యాదవ్ తనయుడు తేజశ్వియాదవ్ కూడా రైతు ఉద్యమంతో మమేకం కావడం లేదు. మొన్ననే ముగిసిన ఎన్నికలలో అలసిపోయి విశ్రాంతి తీసుకున్నట్టు కనిపిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ కానీ బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కానీ ఎన్ డి ఏ ని వ్యతిరేకించి గట్టిగా రైతులకు మద్దతు ఇస్తున్న దాఖలా లేదు. ఇందులో సమాజ్ వాదీ పార్టీ కొంత నయం. ఒడిశాలో నవీన్ పట్నాయక్ కానీ తమిళనాడులో పళణిసామి కానీ రైతులకు మద్దతు ప్రకటించలేదు. పినరయి విజయన్ (కేరళ ముఖ్యమంత్రి), మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్), కెప్టెన్ అమరేంద్రసింగ్ (పంజాబ్), అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), అరవింద్ కేజీవాల్ (ఢిల్లీ) మాత్రమే రైతులను సమర్థిస్తున్నారు. మోదీని వ్యతిరేకిస్తున్నారు. తక్కిన అన్ని రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయి. జాతీయ స్థాయిలో మోదీని ఢీకొనగలిగే నాయకుడు లేడు. ఒక నాయకుడిని తయారు చేసుకోవలసిన అవసరం దేశానికి ఉన్నది. లేకపోతే వ్యవహారం ఏకపక్షంగా సాగిపోతుంది. పర్యవసానాలు భయంకరంగా ఉంటాయి. వ్యవసాయ బిల్లులు ఆదరాబాదరాగా చట్టాలు అయినట్టే అన్ని పనులూ ఏకపక్షంగా, నిర్నిరోధంగా జరిగిపోతాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రధానమైన చర్చలూ, సమాలోచనలూ ఉండవు. చర్చ జరగాలన్న పట్టింపు కూడా ఉండదు. క్రమంగా నియంతృత్వ ధోరణి ప్రబలుతుంది. అందుకే, బీజేపీని నిలువరించే శక్తి కలిగిన ప్రతిపక్షం అత్యవసరం.

## కాంగ్రెస్ అనివార్యం

బీజేపీని ఒంటరిగా అడ్డుకునే శక్తి కాంగ్రెస్‌కు లేదని అందరూ ఒప్పుకుంటారు. కానీ బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వినా మరో ప్రతిపక్షం లేదనే మాట కూడా ఎవ్వరూ కాదనలేనిది. ఒక రకంగా దేశానికి కాంగ్రెస్ అనివార్యం. అందుకే కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోదీ నినాదం చేశారు. కాంగ్రెస్ వైదొలిగితే తన జైత్రయాత్రకు అడ్డు ఉండదని ఆయన భావన.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కొద్దిగొప్పో ఉనికి కలిగిన జాతీయ పార్టీ కాంగ్రెస్. కాంగ్రెస్‌కి సరైన నాయకుడు లేడు. రాహుల్‌గాంధీ నాయకత్వం నుంచి తప్పుకొని సంవత్సరం దాటిగా తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ కథ నడిపిస్తున్నారే కానీ మరో నాయకుడిని ఎన్నుకోలేదు. మరొకరిని విశ్వసించే మనస్తత్వం లేదు. బహుశా తిరిగి రాహుల్‌గాంధీకే సోనియాగాంధీ పగ్గాలు అప్పజెబుతారు. తిరిగి అదే సమస్య. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్నప్పటికీ రాహుల్ గాంధీని మోదీకి దీటైన నేతగా, ప్రత్యామ్నాయంగా పరిగణించేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. అందువల్ల, కాంగ్రెస్ ప్రయోజనాలనూ, రాహుల్ గాంధీ భవిష్యత్తునూ దృష్టిలో పెట్టుకొని సోనియాగాంధీ పెద్ద మనసు చేసుకొని చొరవ తీసుకోవలసిన సందర్భం ఆసన్నమైంది. ఆమె అంతట ఆమే ఒక నిర్ణయం తీసుకోవాలి కానీ ఫలానా నిర్ణయం తీసుకోమని చెప్పే సాహసం కాంగ్రెస్ నాయకులలో ఎవ్వరికీ లేదు. ఆమెకు లేఖ రాసిన కాంగ్రెస్ వరిష్ఠనాయకులు సైతం అంత ధైర్యం చేయలేరు.

## సోనియా కర్తవ్యం ఏమిటి?

సోనియాగాంధీ ఇప్పుడు ఏమి చేయాలి? కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీని తిరిగి నియమించినా, ఎన్నిక చేసుకున్నా నష్టం లేదు. రాహుల్‌కి అంత ఆసక్తి లేకపోతే మరొకరిని ఆ పదవికి ఎన్నుకున్నా, నియమించినా పర్వాలేదు. తాను ఏ పదవిలో ఉన్నారో ఆ పదవిని కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడికి అప్పగించాలి. ఆ నాయకుడు ఇతర ప్రతిపక్షాలకు ఆమోదయోగ్యుడై ఉండాలి. యునైటెడ్ ప్రోగ్రెసీవ్ అలయెన్స్ (యూపీఏ) అధ్యక్ష పదవిని సోనియాగాంధీ ఖాళీ చేసి అటువంటి నాయకుడికి అప్పగించాలి. ఆ పదవికి తగిన ప్రతిపక్ష నాయకుడు లేదా నాయకురాలు ఎవరు?

దేశం అంతటా పరిశీలించినా, అగ్రనాయకుల నేపథ్యాలు అధ్యయనం చేసినా మహారాష్ట్ర నాయకుడూ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేతా శరద్ పవార్ మినహా మరొకరు కనిపించరు. ఆరోగ్యం సహకరిస్తే ఆయన ఈ పదవికి సరిపోతారు. అతి చిన్న వయస్సులోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసి, రెండు విడతల కాంగ్రెస్ పార్టీ నుంచి చీలిపోయి సొంత పార్టీని పెట్టుకొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని జాతీయ రాజకీయాలలో ఏర్పరచుకున్న నాయకుడు శరద్ పవార్.

## శరద్ పవార్, అర్జున్ సింగ్

పీవీతో 1991లో ప్రధాని పదవికి పోటీ పడినవారు ఇద్దరు. ఒకరు శరద్ పవార్, రెండవ నాయకుడు అర్జున్ సింగ్. ఒకరు మరాఠా, మరొకరు ఠాకూర్. పవార్ పీవీ పట్ల గౌరవభావం ప్రదర్శించారు. అర్జున్‌సింగ్ సోనియాగాంధీ చెవిలో ఇల్లు కట్టుకొని పీవీపైన చాడీలు చెప్పి ఆమె మనసు విరిచారు. మరాఠా నాయకుడిది సకారాత్మక వ్యక్తిత్వం అయితే ఠాకూర్ నేతది నకారాత్మకం. బాబరీ మసీదు విధ్వంసం తర్వాత మహారాష్ట్రలో

అల్లర్లు జరిగినప్పుడు పీవీ అభీష్టం మేరకు పవార్ మహారాష్ట్రకు వెళ్ళారు. కానీ జాతీయ రాజకీయాలను వదల లేదు. తాజాగా మహారాష్ట్రలో అసాధ్యం అనుకున్న దానిని సుసాధ్యం చేసిన ఘనత, ప్రావీణ్యం, సంయమనం శరద్ పవార్ సొంతం. ఆయన కారణంగానే ఈ రోజున శివసేన, కాంగ్రెస్ పార్టీ ఒకే గూటిలో సహజీవనం చేస్తున్నాయి. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలను ఒకే తాటిపైకి తెచ్చి, నడిపిస్తున్న నాయకుడు శరద్ పవార్. యూపీఏకి సారథిగా రాహుల్‌గాంధీ కన్నా, మరే ఇతర నాయకుడి కన్నా శరద్‌పవార్ పరమయోగ్యుడు. ఆయనను యూపీఏ నాయకత్వం స్వీకరించవలసిందిగా సోనియాగాంధీ ఆహ్వానించడం దూరదృష్టితో కూడిన, సాహసోపేతమైన, రాజనీతిజ్ఞతతో తీసుకున్న చర్య అవుతుంది.

## యూపీఏ గొడుకు కిందికి ప్రతిపక్షాలు

శరద్ పవార్ నాయకుడిగా ఉంటే దేశంలోని ప్రతిపక్షాలలో అత్యధికం యూపీఏ గొడుగు కిందికి చేరుతాయి. శివసేన నుంచి సీపీఎం వరకూ సకల భావజాలాల సమ్మేళనంగా కొత్త కూటమిని ఏర్పాటు చేసే పెద్దరికం శరద్‌పవార్‌కి ఉంది. వాటిని సమన్వయం చేసి, ఐకమత్యంగా ఎన్నికల పోరాటంలో ముందుండి నడిపించే శక్తి యుక్తులూ, అనుభవం, యుద్ధకౌశలం శరద్ పవార్ కి దండిగా ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ప్రతిపక్ష పార్టీలు సమీకృతమై 2022లో కానీ, 2024లో కానీ, ఎన్నికలు ఎప్పుడు జరిగితే అప్పుడు బీజేపీని ఓడించగలిగితే ఆయన ప్రధాని అవుతారు. బీజేపీని ఓడించడం అసాధ్యం కాదని బీహార్ ఎన్నికలు నిరూపించాయి. తేజస్వియాదవ్ బీహార్ యువముఖ్యమంత్రిగా ఉండేవారు. పైగా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి నరేంద్రమోదీ ప్రధానిగా పది సంవత్సరాలు పూర్తి చేస్తారు. డబుల్ యాంటీ ఇంకంబెన్సీ ఫ్యాక్టర్ (రెండు పదవీ కాలాలు ప్రధానిగా చేసిన వ్యక్తి పట్ల సహజంగా కనిపించే ప్రతికూల భావన) ఓటర్లపైన పని చేస్తుంది. 2014లో, 2019లో మోదీకి ధీటైన నాయకుడు ప్రతిపక్షంలో ఎవ్వరూలేరు కనుక మోదీ అవలీలగా గెలుపొందారు.

## ప్రతిపక్ష సేనాధిపతిగా పవార్


ఒక వేళ శరద్ పవార్ యూపీఏ అధినేతగా నిలబడి, ఆయన వెంట కాంగ్రెస్ నాయకులతో పాటు మమతాబెనర్జీ, కేసీఆర్, అఖిలేష్ యాదవ్, మాయావతి, తేజస్వియాదవ్, స్టాలిన్, ఉద్ధావ్ ఠాక్రే, నవీన్ పట్నాయక్, వంటి హేమాహేమీలు నిలిస్తే అది శక్తిమంతమైన సైన్యం అవుతుంది. యూపీఏకి విజయావకాశాలు తప్పనిసరిగా ఉంటాయి.

యూపీఏ గెలిచి శరద్ పవార్ ప్రధానమంత్రి పదవి స్వీకరిస్తే ఆయన అయిదు సంవత్సరాలు పదవిని నిర్వహిస్తారు. అప్పటికి రాహుల్ గాంధీకి 58 సంవత్సరాలు నిండుతాయి. శరద్ పవార్‌కి ప్రధాని పదవి చేపట్టగలిగినంత శక్తిమంతులైన వారసులు లేరు. కుమార్తె సుప్రియా సూలేకు కానీ ఇతర బంధువులకు కానీ ప్రధాని పదవిని ఆశించే స్థాయి లేదు. తన పార్టీని (ఎన్సీపీ) ఇతర రాష్ట్రాలలో విస్తరించడానికి అవకాశం లేదు. వీలైతే తన పార్టీని కాంగ్రెస్‌లో మరోసారి విలీనం చేయడానికి కూడా ఆయనకు అభ్యంతరం ఉండకపోవచ్చు.

## చారిత్రక అవసరం

పవార్ మంత్రిమండలిలో రాహుల్ గాంధీ ఉపప్రధానిగా చేరి పరిపాలనా వ్యవహారాలలో అనుభవం సంపాదిస్తే, 2029 నాటికి యూపీఏ రెండో టరమ్ గెలుస్తే శరద్ పవార్ చేతుల్లో నుంచి రాహుల్ గాంధీ ప్రభుత్వ పగ్గాలు అందుకోవచ్చు. అప్పటికి కాంగ్రెస్‌పార్టీ జవసత్వాలు సంతరించుకొని సజీవంగా ఉంటుంది. తన కుమారుడు ప్రధాని కావాలన్న సోనియాగాంధీ స్వప్నం సాకారం అవుతుంది. తాను ఈ దేశానికి ప్రధానిగా పనిచేయాలన్న శరద్ పవార్ ఆకాంక్ష నెరవేరిన తర్వాత రెండో టరమ్ కోసం ఆయన ఆరాటపడే పరిస్థితి ఉండదు. ఇప్పుడు శరద్ పవార్ వయస్సు ఎనభై ఏళ్ళు దాటాయి. 2029 నాటికి తొంభైకి చేరువ అవుతారు. ఆ పైన పదవీ వ్యామోహం ఉండదు. రాహుల్ చేతికి అధికారం అప్పగించడానికి ఎటువంటి సమస్యా ఉండదు. ఈ లోగా కాంగ్రెస్ పార్టీకి తోడుగా మరో జాతీయ పార్టీ ఉద్భవించి బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలిచే అవకాశాలు లేవు. కాంగ్రెస్ పార్టీకి సముజ్జ్వలమైన భవిష్యత్తు ఉండాలంటే, రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే ప్రస్తుతానికి యూపీఏ అధ్యక్ష పదవిని శరద్ పవార్‌కి ఇవ్వడమే సముచితమైన నిర్ణయం. కాంగ్రెస్, రాహుల్ గాంధీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సోనియాగాంధీ సాధ్యమైనంత త్వరలో ఈ నిర్ణయం తీసుకోవాలి. ఇది చారిత్రక అవసరం.

దేశం అంతా పశ్చిమబెంగాల్ వైపు చూస్తున్నది. ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ముందు యూపీఏ అధ్యక్షుడిగా శరద్ పవార్‌ని ప్రతిష్ఠించినట్లయితే ప్రతిపక్షం పట్ల ప్రజలలో విశ్వాసం పెరుగుతుంది. యూపీఏ అధ్యకుడి హోదాలో శరద్ పవార్ పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కి అనుకూలంగా ప్రచారం చేస్తే మమతా బెనర్జీ బీజేపీ సవాలును అధిగమించే అవకాశాలు కూడా లేకపోలేదు. బీజేపీ రథాన్ని నిలువరించే శక్తి శరద్ పవార్‌కి సోనియాగాంధీ ప్రసాదించగలరా? పెద్ద మనసు చేసుకొని చారిత్రక నిర్ణయం తీసుకోగలరా? చరిత్రలో ఆమె ఎటువంటి స్థానం సంపాదించుకుంటారు? ❑



# మరో భారతదేశం ఇప్పటికీ సాధ్యమేనా ?

**అవిజిత్ పాథక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ

ఎన్నికల్లో నరేంద్ర మోడీ, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి సాధించిన మిరుమిట్లు గొలిపే విజయం మీద ఇప్పటికే విస్తృతమైన ఆలోచన, చర్చ మొదలయ్యాయి.

అవును, వ్యాఖ్యాతలు మోడీ విజయం వెనుక ఉన్న కారణాల్ని విశ్లేషిస్తున్నారు. జాతి అంతిమ రక్షకుడిగా తనను తాను ముందుకు తెచ్చుకోగల ఆయన శక్తి, నాటకీయ ప్రసంగాల ద్వారా ప్రజలతో సరాసరి సంభాషిస్తూ వారి 'జాతీయ' ' మత' భావాలలో చురుకు పుట్టించగల నేర్పు, అన్నిటినీ మించి సాంకేతిక అవగాహన మిళితమైన ఆయన ఎత్తుగడలు చర్చింపబడుతున్నాయి.

అంతే కాదు, ఆయనకు సరైన ప్రత్యామ్నాయం లేకపోవడం గురించీ, ముక్కలై పోయి బలహీనమై, సరైన పొందిక, మార్గదర్శకత్వమూ లేని ప్రతిపక్షం గురించీ, బలీయమైన బిజెపి–ఆరెస్సెస్ సంఘటితాన్ని ఎదుర్కొని నిలబడలేని దాని అశక్తత గురించి కూడా మాట్లాడుకుంటున్నారు.

ఈ విజయం పట్ల నిరాశగా ఉన్నవాళ్లున్నారు. భారతదేశపు ఉదార లౌకికత, అందరిని కలుపుకుపోయే తత్వం మరణించాయంటున్నారు. పౌరుషంతో, సాంకేతికతతో, హిందూ అస్తిత్వ గర్వంతో ఉప్పొంగే ఏకస్వామ్య లక్షణాలున్న కొత్త భారతదేశాన్ని మోడీ నిర్మిస్తున్నాడంటున్నారు. ఆయన స్వాతంత్ర్యోద్యమ అవశేషాలు ఏమాత్రం లేని కొత్త తరం భాషను మాట్లాడుతున్నారు. హైందవ గర్వంతో గ్లోబల్ అధికారం కోసం కలలు కంటున్న తరం భాష అది.

ఒక్కటి మాత్రం నిజం. ఈసారి ఆర్థికం కాదు సాంస్కృతికమే ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. లెక్కలేనంత మంది ఆయన అనుచరులు భారతదేశ సాంస్కృతిక రాయబారిగా ఆయనను చూస్తున్నారు.

ప్రతిపక్షం, ఆ మాటకొస్తే, లౌకిక ఉదార వామపక్షాలు ఒక ప్రత్యామ్నాయ హెజిమొని నిర్మాణంలో విఫలమయ్యాయని స్పష్టమౌతోంది.

మొదట భారతదేశం ఎన్ని సందేహాస్పదమైన విభేదాలున్న దేశమైనా ఐక్యత కోసం అన్వేషించడం ఇక్కడ అసాధారణమేమీ కాదనే అంశంతో మొదలుపెడదాం.

ఏమైనా, ఉదార మేధావివర్గమూ, మార్క్సిజం, అంబేద్కరిజం, పోస్ట్ మోడర్నిజంలతో దగ్గర సంబంధమున్న సామాజిక శాస్త్రవేత్తలూ, ఒక ఐక్య భారతజాతి నిర్మాణాన్ని వినిర్మాణం చేస్తూ వచ్చారు. వారు విబేధాలు, చీలికలు, శకలాలు, కులస్వామ్యాలు, ప్రాంతీయ విబేధాల గురించి మాట్లాడారు. వీరిలో కొందరికి భారతదేశం ఒక జాతిరాజ్యమే కాదు. మహా అయితే అది, బెంగాలీ, తమిళ, అస్సామీ, కన్నడ వంటి వైవిధ్యభరిత జాతుల్ని సమాధాన పరచడం కోసం ఏర్పరుచుకున్న ఒక పరిపాలనా సౌలభ్యం మాత్రమే. మరి కొందరికి నిచ్చెన మెట్ల కులస్వామ్యం ఎంత లోతుగా కూరుకుపోయిందంటే భారతదేశ ఐక్యత ఒక భ్రమ, అంతే. ఉత్తరాధునికులైతే అఖండం అని దేని గురించి మాట్లాడినా నవ్వుతారు.

వారికి దేశం ఒక ఊహ, లేదా బ్రాహ్మణీయ/వలసవాద నిర్మాణం మాత్రమే. ఇక మార్క్సిస్టుల విషయానికొస్తే వారి ఆర్థిక విశ్లేషణ అద్భుతమైనప్పటికీ ప్రజలు తమ మాతృదేశం పట్ల కలిగి ఉండే సున్నితమైన సాంస్కృతిక మత అనుబంధాల్ని వారు పట్టించుకోరు.

అయినా, నేనిందాక చెప్పినట్టు ఇన్ని విబేధాల మధ్య కూడా ఐక్యత కోసం జరుగుతున్న అన్వేషణ ఉంది. ఈ వెతుకులాటలో ప్రజలు దేశమంతా తిరిగి నిర్వహించిన వ్యాపారాలూ, చేసిన తీర్థయాత్రలూ, జానపదులతో సహా అన్ని వర్గాలూ ఇచ్చిపుచ్చుకున్న సంప్రదాయాలూ ఉన్న సుదీర్ఘ భారతీయ నాగరికతా చరిత్ర ఒక సానుకూలమైన ఐక్యతానుభవాన్ని తప్పక ఇస్తుంది.

ఈ అన్వేషణ ఇటీవల మూడు కారణాల వల్ల ఒక భిన్న వ్యాఖ్యానాలకు ఆస్కారమిస్తోంది. మొదటిది దేశ విభజన మిగిల్చిన భీభత్సమైన స్మృతుల వల్ల, పొరుగున ఉన్న ముస్లిం రాజ్యాల 'భయం' వల్ల ప్రేరణ పొందిన హిందూ ప్రతీకాత్మక భారతీయ అస్తిత్వ అన్వేషణ సాగుతోంది. రెండవది, ఎంత ప్రపంచీకరణ జరిగినా జాతీయత స్ఫూర్తి పూర్తిగా వసివాడలేదు. నిజానికి ఈ గ్లోబల్ పరిణామాలు ప్రజలు తమ మూలాల పట్ల, సాంస్కృతిక అస్తిత్వం పట్ల అందోళన చెందే పరిస్థితిని కలిగించాయి. ఒకరు అంతర్జాతీయ బ్రాండ్లను ఉపయోగించడంలో గ్లోబల్ కావొచ్చు, కాని వాళ్లు వైవిధ్యభరితమైన తమ సాంస్కృతిక చిహ్నాలను వారసత్వాన్నీ కోల్పోవడానికి ఇష్టపడడంలేదు. ప్రపంచీకరణ

సాంస్కృతిక రాజకీయాల్ని తీవ్రం చెయ్యడానికే ఉపయోగ పడిందని చెప్పాలి. మూడవది, సరిహద్దు తగాదాలను, ఉగ్రవాద హింసను, ఇస్లామోఫోబియాను సంతరించుకున్న ప్రపంచం ఆయుధీకరణను వేగవంతం చేసింది. ఫలితంగా హిందు జాతిని బలపరచుకోవడం, సరిహద్దులను కాపాడుకోవడం, భద్రతను మెరుగుపరచుకోవడం వంటి కొత్త కోణాల్ని ఈ పరిణామం స్వీకరించింది.

ఇదుగో ఇలాంటి పరిస్థితుల్లో భారత జాతి, జాతీయత అనే భావోద్వేగాలను ఉద్దీపింపచేయడంలో మోడీ సఫలీకృతులయ్యారు. మాయావతి లాంటివాళ్లు కుల కేంద్రిత అస్తిత్వం గురించి తప్ప ఇతరం బొత్తిగా మాట్లాడకపోతూంటే, మోడీ ఏమో హిందూ జాతి లక్నోలోని బహుజనవాడలోనో ముంబైలోని అత్యాధునిక మలబార్ హిల్స్‌లోనో విలీనమైపోవడం గురించి మాట్లాడతారు. లేదంటే, భాష, ప్రాంతీయ, జాతి విభేదాల గురించి పోస్ట్ మోడర్న్ ఉపజాతివాదులు మాట్లాడుతుంటే మోడీ ఈశాన్య పర్వత సానువుల్లోకి 'హిందుత్వ'ను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తారు. బెంగాలీలు కూడ జైశ్రీరాం నినాదాలు చెయ్యడం కర్ణాటకలో యువ ముసలి తేడా లేకుండా మోడీ మాస్కులు ధరించి డాన్సులు చెయ్యడం చూస్తున్నాం కదా !

అంటే, ప్రతిపక్షాల శకలదృక్పథం మోడీ అఖండ హిందు జాతీయవాదాన్ని ఎదుర్కోలేకపోయిందా?!

కానీ, ఇక్కడొక సమస్య ఉంది. బిజెపి ప్రచారం చేస్తున్న జాతీయవాదంలో కూడా ఒక గతితర్కం ఉన్నట్లుంది. హిందువు లందరూ ఏకం కండి అనే పిలుపులో రోగనిదానం ఉంది. అది ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. నేనొక టీ అమ్మేవాణ్ని, ఆటో డ్రైవర్‌ని, గ్రామీణ వృత్తిపనివాణ్ని మాత్రమే కాదు, నేనొక హిందువును. నా హిందు సంస్కృతిని నేను కాపాడుకోవాలి అనే లక్ష్యం అది. పరాయీకరింపబడిన ప్రపంచంలో అస్తిత్వానికొక అర్థాన్నిస్తోందది. దుర్బలం చేయబడిన తరగతులలో కొత్త శక్తిని నింపుతోందది. ఒక రకంగా అందులో ఉపశ్రేణీ స్పర్ధ కూడా ఉన్నట్లుంది.

కానీ మనం దాన్ని అంగీకరించలేం. అది విరుద్ధమైంది. అది 'శత్రువు' దిశగా ఎక్కుపెట్టబడింది. వాస్తవమేమిటంటే అది తీవ్ర భావోద్వేగాలను కలిగిస్తుంది. అది పాకిస్తాన్ మీద కావొచ్చు లేదా దేశంలోని ముస్లిం ప్రజాబాహుళ్యం మీద కావొచ్చు. అది కలిగించే మత్తుకు పిచ్చివాడి శక్తి ఉంది. ఉదాహరణకు భారత్ మాతా కి జై నినాదం ఇప్పుడు భారతదేశంలో నివసిస్తున్న ప్రజలందరి పట్ల ఉదాత్తమైన ప్రేమను, అనుబంధ భావనను కలిగించడం లేదు. అదిప్పుడొక ఉగ్ర నినాదం. ఈ దేశంలో మైనారిటీల కథ ముగిసిందని చేస్తున్న ప్రకటన. పైగా ఈ ఏకతా వాదం హిందు మెజారిటి నుంచి 'ఇతరు'ల్ని ప్రక్కకు నెట్టేస్తుంది. ఇక్కడ ఐక్యత అంటే కొందర్ని బలవంతంగా ఏకత్వంలోకి కుదించటం. పైగా, మోడీ ఈ బలవంతపు హిందు జాతీయ వాదాన్ని సాంకేతిక అభివృద్ధితో సమాధానపరుస్తారు. నిజానికి ప్రజాభిప్రాయంలో ఆయన ఏకకాలంలో తన మూలాల్ని హిందు సంస్కృతిలో పాతుకుని, సాంకేతికతతో స్నేహం చేయగల గ్లోబల్ ఆధునికుడు. ఆయన కేదార్ నాథ్ నుంచి బుల్లెట్ ట్రైన్‌ల దాకా అంతటా ఉంటారు.

ఇట్లాంటి చీకటి వేళల్లో కూడా భారతదేశం గురించిన విభిన్న కథనాలు వెలుగులు చిమ్ముతున్నాయని మనం మరచిపోకూడదు. అవి ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండడం కాదని చెబుతాయి. విస్పష్టమైన విభేధాల మధ్య కూడా మనల్ని కలుపుతున్న లలితమైన మార్మికమైన చారిత్రక సాంస్కృతిక అనుబంధాన్ని చూడమని చెబుతాయి. ఏకత్వాన్ని సాధించడం అనేది ప్రేమించడం, సంభాషించుకోవడం, కలుపుకోవడం వంటి వాటి ద్వారా అనుభవంలోకి తెచ్చుకునే ఒక నిరంతర ప్రక్రియ అనీ, అది ఒక నియమిత కాలంలో పూర్తిచేయగల వస్తువు లాంటిది కాదనీ చెబుతాయి. ఒకానొక లౌకిక స్పృహతో నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియాలో చూసినట్లూ, ఠాగోర్ తన కవితాత్మక విశ్వతత్వం లో దర్శించినట్లూ, అన్నిటికంటే ముఖ్యంగా గాంధీ విశాలమైన స్వరాజ్య ప్రాతిపదిక మీద సర్వాంగీకారంతో దాన్ని సాధించ బూనుకున్నట్లు చెబుతాయి.

వేరొక మాదిరి చెప్పాలంటే వారి జాతీయవాదం ఇప్పటి ఉగ్రతత్వంతో కాక సామ్యవాద స్వప్నాన్ని నింపుకున్న ప్రజాసంక్షేమ లక్ష్యం కలిగింది. అయితే భారతదేశం గురించిన ఈ దర్శనం మీడియా ఇచ్చే సాంకేతిక మిలిటరీ పరిష్కారాల మత్తులో ఉత్తేజితమై, ఎలాగైనా బలాన్ని ప్రదర్శించాలనే ఉగ్రతత్వంతో ఉన్న ఇవాళ్టి కొత్త తరానికి రుచించడంలేదు. అంతేకాదు, ప్రతిపక్షాలు కూడా కోల్పోతున్న ఈ ఆదర్శాలను గమనించడం మానేస్తున్నాయా అనిపిస్తోంది. అంటే అఖిలేష్‌యాదవ్ కుల సమీకరణ, చంద్రబాబు నాయుడు ప్రాంతీయవాదం, కాంగ్రెస్‌లో ప్రబలుతున్న చీలికలు వీటన్నిటిలో ఒక ఉదాత్తమైన దృక్పథం కొరవడుతోందా అని కూడా ఆలోచించవలసి వస్తోంది.

సమకాలీన భారతదేశంలో లౌకికవాదం సృష్టించినంత గందరగోళం మరే సిద్ధాంతమూ సృష్టించలేదు. లౌకికవాదం అంటే మతం పట్ల ఏవో స్వాభావికమైన సందేహాల్ని కలిగి ఉండడం మాత్రమే అనుకుంటే మత సంప్రదాయాలు బలంగా ఉన్న మన దేశంలో కుదరదు. అట్లాగే ఆత్మతత్వం (Spirituality) లేని

నిర్వీర్యమైన లౌకికవాదానికి మతతత్వం ప్రత్యామ్నాయం కాకూడదు.

కాబట్టి ప్రత్యామ్నాయం ఆత్మతత్వం కలిగిన ఆధునికత. అంటే గిడసబారిన లక్షణాలున్న ప్రపంచంలో మనుషుల్ని ప్రేమించడం , ఇతరుల్ని గాయ పరచకపోవడం, పర్యావరణం పట్ల దయ సున్నితత్వం కలిగి ఉండడంవంటి ఉన్నతమైన విలువలున్న జీవన విధానాన్ని కలిగి ఉండడం. అట్లాగే సైన్సుకు, నిరపేక్షతత్వానికీ, విపరీతమైన అనుభవవాదానికీ ప్రాధాన్యతనిచ్చే లౌకికవాదం కూడా మనిషి తాత్విక జిజ్ఞాసను సంతృప్తి పరచలేదు. అట్లాగే వ్యవస్థీకృతమైన నిర్మాణం ఉన్న మతాలు తమ అనుబంధ పౌరోహిత వర్గంతో కలిసి కర్మకాండలకు, మతం వెలుపలి అంశాలకు ప్రాధాన్యతనిచ్చి కబీరు, టాగోరు, గాంధీ వంటి సత్యాన్వేషకుల్ని దూరం చేశాయి.

మనం ఇప్పుడు నెహ్రూ లేదా వామపక్ష లౌకికవాదం కానీ, గాంధీ మత సహన సహజీవన వాదం కానీ లేని విచిత్ర పరిస్థితిలో ఉన్నాం. దానికి బదులు రకరకాల సాధువులు, సెలెబ్రిటీ బాబాలు, అందర్నీ మించి హిందూ జాతీయవాద మూక నడిపిస్తున్న ఉగ్రతత్వ జాతీయవాదంలో ఉన్నాం. అది 'హిందువు' ల్ని త్వరగా ఆకర్షిస్తుంది. ఎందుకంటే 'ముస్లిం దురాక్రమణదారు' ల దాడుల్లో జరిగిన సాంస్కృతిక విధ్వంసం పట్ల కుహనా లౌకికవాదులు చూపే ఉదాసీనతని ఇది బట్టబయలు చేస్తుంది కాబట్టి.

దేశవిభజన మిగిల్చిన బాధాకరమైన స్మృతుల నేపథ్యంలో రెండు మతాల మధ్య సంక్లిష్ట సంబంధాలు నెలకొన్న మనలాంటి దేశంలో, వాటి మధ్య రోజువారీ జీవితానికి అవసరమైన అవగాహన లోపించి, లౌకికత్వం నామ మాత్రమైన సందర్భంలో మత భావోద్వేగాలతో ఆడుకోవడం పెద్ద కష్ట మేమీ కాదు.


అవును మనం క్లిష్టమైన సమయాన్ని దాటుతున్నాం. దీనికి సమాధానం 'నువ్వు మతంతో ఆడుకో: నేను కులంతో ఆడుకుంటా' వంటి అస్తిత్వ రాజకీయాలను పరిమితం చెయ్యడం కాదు. ఒక వైపు దేవాలయాల్ని మరో వైపు మసీదులను సందర్శించడం కాదు. లేకపోతే మతానికి సంబందించిన ప్రతి దాన్ని ఖండించడం కూడా కాదు.

బహుశ మనకిప్పుడు కావలసింది విశాల ప్రాతిపదిక మీద అందర్నీ కలుపుకుపోతూ మనిషి పట్ల, సమాజం పట్ల విశ్వతత్వం గల రాజకీయ ఆర్థిక సాంస్కృతిక తాత్వికత. నేనెప్పుడూ అనే విధంగా రసాత్మకత కలిగిన ఈ రాడికల్ భావజాలాన్ని అలవరచు కోవడం కబీరు అంబేద్కర్‌లతో, గాంధీ ఠాగోర్‌లతో, మార్క్స్ నెహ్రూ లతో మనం చేసే నిరంతర సంభాషణ వల్ల సాధ్యపడుతుంది.

హిందూ తీవ్రవాదులు, ఇతర మతతతత్వవాదుల మాదిరిగానే మతాన్ని ద్వేషఖడ్గంగా మార్చివేశారు. కానీ మనలోని చాలా మంది 'లౌకిక వాదులు' దీనితో పోరాడడానికి కావలసిన సంపద్వంతమైన జీవన తాత్వికతను, ప్రాపంచిక దృక్పథాన్ని ఇంకా అలవరచుకోలేదు.

కేవలం ఎలాగైనా ఎన్నికల్లో గెలవడం కాకుండా ఎవరైతే మెరుగైన భవిష్యత్తు కోసం ప్రతికూలతల మధ్య కూడా నిర్విరామంగా కృషి చేస్తూ పోతారో వారికి చిమ్మ చీకటిలో కూడా ఉషాకిరణం కనిపిస్తుందని చరిత్ర చెబుతోంది. ❑

(ది వైర్ 01 జూన్ 2019)




## గోదావరి బాలల విజ్ఞాన కేంద్రం

**చదువుతో పాటు ప్రాపంచిక విషయాల అధ్యయనం**

**గోదావరి ప్రింటర్స్ పైన, ఆర్.ఆర్. పేట, ఏలూరు - 2**

బాలలకు చదువుతో పాటు ఇతర అంశాలను
చదవడం అలవాటు చేయాలనే సంకల్పంతో
మేము ఈ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాము.

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక పఠనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. 3వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు వారి వారి స్థాయిలలో చదవడానికి వీలుగా సాహిత్య పుస్తకాలు, ప్రపంచ జ్ఞానాన్ని పెంచే పుస్తకాలు, విజ్ఞానంతో పాటు వినోదం కలిగించే పుస్తకాలను అందచేస్తాం. పుస్తకాలు పిల్లలు ఇంటికి తీసుకువెళ్ళి చదువుకోవచ్చు. ఇంటి దగ్గర వారి తల్లిదండ్రులకు పుస్తకాలు చదివి వినిపించమని ప్రోత్సహిస్తాం.

ప్రతీ 3 నెలలకు ఒకసారి ఆ స్కూలుకి ఇచ్చిన పుస్తకాలు వెనక్కి తీసుకుని మరలా వేరే పుస్తకాలు అందచేస్తాం. ఆ సందర్భంగా పిల్లలకు **"నేను చదివిన నాకు నచ్చిన పుస్తకం"** అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తాం. దీనిలో విద్యార్థులు వారు చదివిన పుస్తకాలలోని అంశాలను వ్యాసరూపేణ రాస్తే సరిపోతుంది. పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తాం. పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందచేస్తాం.

పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, స్థానికులు ఎవరైనా బాధ్యత తీసుకుని విద్యార్థులతో పుస్తకాలు చదివించడానికి ముందుకు వచ్చిన వారికి మా కేంద్రం నుండి పుస్తకాలు అందచేస్తాం.


*మా కేంద్రం నిర్వహణకు అవసరమైన నిధులను మేమే స్వయంగా సమకూర్చుకుంటాం. ఎవరి నుండి విరాళాలు సేకరించం. ఎవరైనా దాతలు ముందుకు వస్తే వారు ఇచ్చే పుస్తకాలను మాత్రమే తీసుకుంటాం. వారు ఇచ్చే పుస్తకాలపై వారి పేరు ముద్రిస్తాం.*

మిత్రులు ఎవరైనా పాఠశాలలను దత్తత తీసుకొని పుస్తక పఠనా కార్యక్రమం చేపడితే వారిని మా కేంద్రం తరపున ఆ పాఠశాల కేంద్రం ఆర్గనైజరుగా ఎంపిక చేసి వారికి పుస్తకాలు అందచేస్తాం. **ఎప్పటికప్పుడు మిత్రుల సహకారం, సూచనలు తీసుకుంటూ మా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని సంకల్పించాం.**


**నిడదవోలు వెంకటేశ్వరరావు - సుశీల**

# అన్నదాతలకే కాదు.. అందరికీ ముప్పే

**పి. సాయినాథ్**
ప్రసిద్ధ పాత్రికేయుడు
పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా వ్యవస్థాపక సంపాదకుడు



నూతన వ్యవసాయ చట్టాల్లో వాడిన భాష వల్ల (తక్కువ స్థాయి) కార్యనిర్వాహకులు తామే న్యాయస్థానాలుగా మారిపోతారు. న్యాయమూర్తి, ధర్మకర్త, తలారి కూడా అయిపోతారు. పెద్ద కార్పొరేట్లకూ, రైతులకూ మధ్య ఇదివరకే ఉన్న అన్యాయమైన అధికార అసమానతలను తాజా చట్టాలు మరింతగా పెంచుతాయి. ప్రభుత్వం ఊహించినదానికి భిన్నంగా రైతులు తమ (మన) హక్కుల కోసం నిలబడ్డారు.



“కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారికి, లేదా దీనికి సంబంధించిన మరే ఇతర వ్యక్తికి వ్యతిరేకంగా ఈ చట్టం కింద సదుద్దేశంతో చేసిన, చేయాలనుకున్న వాటి గురించి న్యాయ పరమైన ఫిర్యాదు, దావాలు ఉండవు.” రైతు ఉత్పత్తుల అమ్మకం, వాణిజ్య చట్టం, 2020లోని 13వ భాగంలోని వాక్యాలు ఇవి.

ఇప్పుడు కూడా ఈ కొత్త చట్టాలు రైతులను మాత్రమే ఉద్దేశించినవని మీరు అనుకుంటున్నారా? సివిల్ సర్వీస్ ఉద్యోగులు నిర్వహించాల్సిన న్యాయపరమైన బాధ్యతలకు వ్యతిరేకంగా దావా వేయడానికి మినహాయింపునిచ్చే చట్టాలు కూడా ఉన్నాయి. కానీ ఇది దాన్ని ఎన్నో రెట్లు మించిపోయింది. ‘సదుద్దేశంతో’ వాళ్లు ఏం చేసినా దానికి చట్టపరమైన మినహాయింపు ఇవ్వడం మరీ అతిశయం. ‘సదుద్దేశంతో’నే ఏదైనా నేరం చేసి వుంటే వాళ్లను కోర్టుకు ఈడ్వలేకపోవడమే కాదు, ఇతరత్రా వేరే విధమైన చర్యలు తీసుకోవడానికి కూడా అవకాశం లేనంత రక్షణలో వారున్నారు. పొరపాటున మీరు ఈ అంశం వదిలేసి వుంటే గనక, చట్టంలోని 15వ భాగం దాన్ని తిరిగి నొక్కి చెబుతుంది. ఈ అంశాలను విచారించే పరిధి ఏ సివిల్ న్యాయస్థానానికి కూడా లేదని.

అసలు ఎవరీ చట్టపరంగా సవాలు చేయలేని, సదుద్దేశంతో పనులు చేసే ‘మరే ఇతర వ్యక్తి’? క్లూ: నిరసన తెలుపుతున్న రైతుల నినాదాల్లో దొర్లుతున్న బడా కార్పొరేట్ సామ్రాజ్యాధిపతులు పేర్లను వినడానికి ప్రయత్నించండి. ఇదంతా కూడా వ్యాపారాన్ని, చాలా చాలా పెద్ద వ్యాపారాన్ని సులభతరం చేయడంలో భాగంగా జరుగుతున్నది. ‘ఏ ఫిర్యాదు, వ్యాజ్యం లేదా మరే ఇతర న్యాయపరమైన చర్యలు ఉండవు’... వ్యాజ్యం వేయలేనిది రైతులు మాత్రమే కాదు, ఎవరూ వేయలేరు. ప్రజాహిత వ్యాజ్యాలకు కూడా ఇదే వర్తిస్తుంది. లాభాపేక్ష లేని గ్రూపులు, రైతు సంఘాలు, లేదా మంచో చెడో ఉద్దేశాలతో ఉన్న ఏ పౌరుడి జోక్యానికి కూడా ఇందులో వీలులేదు. అత్యవసర పరిస్థితి విధించిన 1975-77 కాలంలో తేలిగ్గా అన్ని ప్రాథమిక హక్కులు రద్దయి పోయాయి. మళ్లీ దాని తర్వాత న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు పౌరుడికి లేకుండా చేసిన విషయంలో ఈ చట్టాలు మరీ అతిశయపు మినహాయింపులు ఇచ్చేశాయి.

ప్రతి భారతీయుడి మీద దీని ప్రభావం ఉంటుంది. ఇంకో రకంగా చెప్పాలంటే, ఈ చట్టాల్లో వాడిన భాషవల్ల (తక్కువస్థాయి) కార్యనిర్వాహకులు తామే న్యాయస్థానాలుగా మారిపోతారు. వాస్తవంగా చెప్పాలంటే, న్యాయమూర్తి, ధర్మకర్త, తలారి కూడా అయిపోతారు. రైతులు ముమ్ముందు వ్యవహారం చేయాల్సిన పెద్ద

కార్పొరేట్లకూ, రైతులకూ మధ్య ఇదివరకే ఉన్న అన్యాయమైన అధికార అసమానతలను ఇది మరింతగా పెంచుతుంది. దీనిమీద ఆందోళన చెందిన ఢిల్లీ బార్ కౌన్సిల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలో ఇలా ప్రశ్నించింది: "పౌర పరిణామాలకు దారితీసే అవకాశమున్న వివాదాల్లో పాలన, కార్యనిర్వహణకు సంబంధించిన యంత్రాంగానికి తీర్పునిచ్చే అధికారాన్ని ఎలా ఇస్తారు?" ఈ న్యాయసంబంధ అధికారాలను కార్యనిర్వాహక యంత్రాంగానికి బదిలీ చేయడాన్ని 'ప్రమాదకరం, మహాపరాధం' అని ఢిల్లీ బార్ కౌన్సిల్ అభివర్ణించింది. న్యాయవృత్తి మీద చూపే ప్రభావం గురించి, 'ఇది ప్రత్యేకించి జిల్లా న్యాయ స్థానాల విధులకు తీవ్రమైన హాని కలిగించడంతో పాటు న్యాయవాదుల ఉనికిని కూడా లేకుండా చేస్తుంది' అని అభిప్రాయపడింది.

**ఇప్పుడు కూడా ఈ చట్టాలు కేవలం రైతులను ఉద్దేశించినవేనని అనుకుంటున్నారా?**

కార్యనిర్వాహక యంత్రాంగానికి న్యాయపరమైన అధికారాలను బదిలీ చేయడం ఒప్పందాలకు సంబంధించిన చట్టంలో ఉంది. దీనిలోని 19వ భాగం ఏమంటుందంటే: సబ్ డివిజినల్ అధికారి, పునర్విచారణ జరిపే అధికారి ఈ చట్టం కింద పూర్తి సాధికారులై నిర్ణయించిన దాన్ని నిలిపివేయగలిగే అధికారం ఏ సివిల్ న్యాయస్థానానికి గానీ మరే ఇతర అధికార యంత్రాంగానికి గానీ లేదు. ఈ వ్యవసాయ చట్టంలోని 19వ భాగపు సారాంశం... రాజ్యాంగపరమైన విచికిత్సకు హక్కు కల్పించే రాజ్యాంగంలోని 32వ ఆర్టికల్‌ను కొట్టి పడేస్తోంది. ఆర్టికల్ 32ను రాజ్యాంగపు ప్రాథమికమైన నిర్మాణంగా పరిగణిస్తారు. కచ్చితంగా ఈ 'ప్రధాన స్రవంతి' మీడియా (జనాభాలోని 70 శాతానికి సంబంధించిన అంశాలను విస్మరించే దానికి పెట్టిన చిత్రమైన పేరు)కు ఈ వ్యవసాయ చట్టాల వల్ల భారత ప్రజాస్వామ్యానికి సంభవించే విపరిణామాల గురించి తెలిసే అవకాశం లేదు. కానీ ప్రజాహితం, ప్రజాస్వామ్యం కన్నా ఎక్కువగా వారిని లాభాపేక్ష నడిపిస్తుంది.

ఇందులో ప్రయోజనాల వైరుధ్యం ఏమైనా ఉందా అనే అనుమానాలుంటే అవి వదిలించుకోండి. ఈ మీడియా సంస్థలు కూడా కార్పొరేషన్లే. దేశంలోని అతిపెద్ద కార్పొరేషన్ అధిపతి దేశంలోని అతిపెద్ద మీడియా సంస్థ యజమాని కూడా. చాలా కాలంగానే ఈ ఫోర్త్ ఎస్టేట్‌కూ, రియల్ ఎస్టేట్‌కూ మధ్య ఉన్న తేడా ఏమిటో చూపలేనట్టు అయిపోయింది. కార్పొరేషన్ ప్రయోజనాలను కాదని పౌర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వలేనంత లోతుగా ఈ ప్రధాన స్రవంతి మీడియా తన ప్రపంచంలో కూరుకుపోయి వుంది. వారి పత్రికల్లో, చానళ్లలో రైతులను రాక్షసులుగా చిత్రించడం జరుగుతోంది– ధనిక రైతులు, కేవలం పంజాబీయులు, ఖలిస్తానీలు, కపటులు, కాంగ్రెస్ దేశద్రోహులు, ఇట్లా ఎన్నో రకాలుగా ఎంతో ప్రతిభావంతంగా చూపుతూనే వున్నారు. కాకపోతే ఈ పెద్ద మీడియా సంస్థల సంపాదకీయాలు భిన్నమైన ఎత్తుగడ అనుసరిస్తాయి. మొసలి కన్నీళ్లు కారుస్తాయి. ప్రభుత్వం ఈ విషయంలో మరింత మెరుగ్గా వ్యవహరించాల్సిందని చెబుతాయి. రైతుల మేలు కోరి, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రభుత్వ ఆర్థికవేత్తలు, ప్రధానమంత్రి తెచ్చిన ఈ చట్టాలు చాలా అవసరం, ఆచరించ దగ్గవని చెబుతాయి.

కానీ అవన్నీ వేసుకోని ఒక ప్రశ్న : ఇప్పుడే ఎందుకు? కార్మిక చట్టాలు కూడా ఇంత హడావుడిగా ఎందుకు ముందుకు తెచ్చారు? ఎంతో శ్రద్ధ చూపాల్సిన వేయి అంశాలుండగా ఈ కోవిడ్ మహమ్మారి సంక్షోభ సమయమే ఈ చట్టాలను తేవడానికి ఎందుకు అనువైన సమయమని బీజేపీ భావించింది? కోవిడ్ వల్ల తీవ్రంగా దెబ్బతిని, చలనం కోల్పోయివున్న రైతులు, కార్మికులు ఏ రకంగానూ అర్థవంతమైన నిరసన చేయలేరని వాళ్ల అంచనా. కాబట్టి, ఇదే సరైన సమయం. అంటే సమూల సంస్కరణలను ముందుకు జరిపే 'రెండో 1991 క్షణాన్ని' వాళ్లు దర్శించారు. మంచి సంక్షోభాన్ని అస్సలు వృథా చేయొద్దని వాళ్లకు తెలుసు. 2018 నవంబరులో లక్ష మందికి పైగా రైతులు ఢిల్లీలోని పార్లమెంట్ దగ్గర స్వామినాథన్ నివేదిక సిఫారసులను అమలు చేయాలని నిరసనకు దిగారు. అందులోని ముఖ్యాంశాలైన రుణమాఫీ, కనీస మద్దతు ధరకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందులో కేవలం పంజాబ్ రైతులే లేరు, 22 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని రైతులు ఉన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఊహించిన దానికి భిన్నంగా రైతులు తమ (మన) హక్కుల కోసం నిలబడ్డారు. తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ❑

# వ్యవసాయదారుని కోణంలో రైతు సమస్యలు



డా॥ సి. కృష్ణమోహనరావు

"అనుభవం అయితే గాని తత్వం బోధపడదు"అనే నానుడి ఉంది. ఇది వ్యవసాయానికి సరిగ్గా సరిపోతుంది. సుమారు 35 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగం తర్వాత 2 సంవత్సరాల క్రితం సొంతంగా వ్యవసాయం మొదలు పెట్టాను. నేను వ్యవసాయం చేస్తున్న ప్రాంతం అరటికి అనుకూలంగా ఉండటం, చుట్టుపక్కల రైతులు కొంతమంది రైతులు ముందు సంవత్సరం అరటి వేసి లాభాలు తీసుకోవడంతో గత సంవత్సరం రెండున్నర ఎకరాల్లో అరటి తోట వేశాను. ఉద్యానవన శాఖ వారు జి9రకంటిష్యూ కల్చర్ అరటికి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇస్తున్న ప్రోత్సాహం, అధిక దిగుబడి, ఎగుమతి మార్కెట్ ఉందని తెలిసి వీటిని బయోటెక్నాలజీ కంపెనీ నుండి కొనుగోలు చేసి వేశాను. అరటి పంటపై చీడపీడలు తుఫాను వంటి వాటి ప్రభావం చాలా ఎక్కువ. అందువల్ల అరటిపంటకు బీమా చేయించడానికి ఉద్యానవన శాఖ దగ్గర్నుండి అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థలను సంప్రదించడం జరిగింది. అయితే ప్రస్తుతం అటువంటి పథకం లేదని గతంలో కొన్ని ప్రైవేట్ కంపెనీలు చేసేవారని, అయితే వారందరూ మానేశారని చెప్పారు. అదేవిధంగా అరటి నారు కొనుగోలుకు ఇచ్చే సబ్సిడీ ప్రభుత్వం వద్ద నిధులు లేక మంజూరు కాలేదని తెలిపారు. శాస్త్రీయ పద్ధతులలో అన్ని జాగ్రత్తలు తీసుకోవడం, ఆ ప్రాంతానికి పెద్ద తుఫానులు ఏమి రాక పోవడంతో మంచి పంట వచ్చింది. ఒక్కొక్క గెల 30 నుండి 35 కేజీలు వచ్చాయి.

అయితే ప్రకృతి ఒడిదుడుకుల నుండి తప్పించుకోగలిగాను గాని మార్కెట్ తాకిడికి తట్టుకోలేకపోయాను. అరటిపండ్లరేటు విపరీతంగా పడిపోయింది. గతంలో కేజీ కనీసంగా పది రూపాయిలు అమ్మగా అది ఐదు రూపాయలకు పడిపోయింది. మొదట అది కరోనా ప్రభావం అనుకున్నాం, కానీ తరువాత తెలిసిందేమిటంటే ఎక్కువ మంది రైతులు ఈ రకం వెరైటీ ప్రభుత్వ ప్రోత్సాహంతో వేయడం వలన సప్లై అధికంగా ఉండడం ధరలపై పోయినట్టు వ్యాపారస్తులు చెప్పారు. ఉద్యానవన శాఖ కూడా జీ9టిష్యూ కల్చర్ అరటి పంటను 79 వేలహెక్టార్ల నుండి లక్ష హెక్టార్లకుపెంచడంలో విజయం సాధించినట్లు ప్రకటించుకుంది. మార్కెటింగ్ గురించి సంప్రదించగా కొత్త రకాల ప్రోత్సహించడమే గాని మార్కెటింగ్ మాకు సంబంధం లేదని చెప్పారు. దీని ఫలితంగా రెండున్నర ఎకరాల భూమిపై మూడు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టగా 50 వేల రూపాయలు నష్టంతో బయటపడ్డాం. ఇటువంటి అనుభవాలన్నీ మా తోటి రైతులందరికీ కోకొల్లలు.

వ్యవసాయం నష్టదాయకంగా ఉందని అందరు అంగీకరిస్తారు. గత సంవత్సరం బొంబాయిలో రైతులు నిర్వహించిన ర్యాలీ గాని, నేడు ఢిల్లీ సరిహద్దుల్లో నెల రోజులుపైగా తీవ్రమైన చలిలో రైతులు చేస్తున్న ఉద్యమంగాని వ్యవసాయ రంగంలో సంక్షోభానికి చిహ్నాలే. భారతదేశంలో ప్రతి సంవత్సరం షుమారుగా 10,000 మందికి పైగా రైతులు, వ్యవసాయ కూలీలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్న దుస్థితి. (ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం, 2016 లో 11,379, 2017లో 10,365, 2018 లో 10,349, 2019 లో 10,281 మంది రైతుల ఆత్మహత్య మరణాలు సంభవించాయి). 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతిరోజు సుమారు 2000 మంది వ్యవసాయాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. వీరు మంచి ఉద్యోగ అవకాశాలు వచ్చి వేరే రంగాలకు తరలిపోతున్న వారు కాదు. వ్యవసాయరంగంలో బతకలేక వలస కార్మికులుగా వెళ్ళిపోతు న్నారు. రైతుల జీవనప్రమాణాలకు జాతీయ స్థూల ఆదాయం నిజమైన సూచి కానప్పటికీ, అందుబాటులో ఉన్న లెక్కలు అవే కాబట్టి వాటిని పరిగణనలోకి తీసుకుంటే, 1950లో భారతదేశ జాతీయ స్థూల ఆదాయంలో వ్యవసాయానికి 45 శాతం భాగం ఉంటే 70 సంవత్సరాల తరువాత నేడు ఆ శాతం 16 లోపు పడిపోయింది. అదే సమయంలో భారతదేశ జనాభాలో70 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడితే, నేడు 50 శాతం మంది ప్రజలు వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్నారు. ఇది వ్యవసాయ సంక్షోభానికి అద్దం పడుతుంది.

## భిన్న దృక్కోణాలు

వ్యవసాయ సమస్యలు అర్థం చేసుకోవడంలోనూ, వాటి పరిష్కారం విషయంలోనూ చాలా స్పష్టమైన వర్గ విభజన కనిపిస్తుంది. కార్పొరేట్లు, ప్రధాన స్రవంతి మీడియా ప్రభావంలో ఉండే వ్యవసాయానికి సంబంధంలేని మధ్యతరగతి ప్రజలు,

వ్యవసాయాన్ని చూసే దృష్టికి, రైతులు తమను తాము చూసే దృక్పథానికి స్పష్టమైన తేడా ఉంది. కార్పొరేట్ వర్గాలు వ్యవసాయాన్ని ఒక వృత్తిగా, ఒక ఆర్థిక కార్యకలాపంగా భావిస్తారు. వ్యవసాయాన్ని ఒక వ్యాపారంలా చూడాలని, మిగిలిన వ్యాపారాల లాగే మార్కెట్ శక్తులకు వదిలేయాలని, దానిలోను లాభాలు, నష్టాలు ఉంటాయని భావిస్తారు. ప్రభుత్వం (రాజ్యం) వ్యవసాయాన్ని ఆర్థిక రంగంలో ఒక భాగంగా చూడాలని, వ్యవసాయం చేసుకునే బాధ్యత రైతుల పైనే ఉంటుంది భావిస్తారు.

ప్రకృతి నుండి మార్కెట్ నుండి రైతుకు రక్షణ కల్పించే విషయంలో కూడా కార్పొరేట్ వర్గానికి రైతులకు మధ్య స్పష్టమైన వైరుధ్యం ఉంది. రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసుకోవాలని, వారికి అవసరమైన వ్యవసాయ పరికరాలను ప్రైవేటు సంస్థల నుండి కొనుగోలు చేయాలని, వ్యవసాయ బీమా వంటివి ప్రైవేటు రంగబీమా సంస్థ ద్వారా చేయించుకోవాలని వీరి అభిప్రాయం. ఇలా చేయడం వల్ల ఇటు రైతులకు అటు ప్రైవేట్ రంగానికి ఉపయోగకరంగా ఉంటుందని వారు వాదిస్తారు. అదే విధంగా మార్కెట్లు విషయంలో కూడా ప్రభుత్వం జోక్యం లేకుండా ప్రైవేటు రంగానికి అప్పగించాలని, అప్పుడే ప్రైవేటు రంగం వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుందని తద్వారా రైతులకు, ప్రైవేటు రంగ వ్యాపారులకు లాభం చేకూరుతుందని వాదిస్తారు.

దీనికి భిన్నంగా రైతులు'వ్యవసాయ' కోణంలో కాకుండా 'వ్యవసాయదారుని' కోణంలో ఆలోచిస్తారు. వారు వ్యవసాయాన్ని ఒక జీవన విధానంగా భావిస్తారు. వీరికి వ్యవసాయం అనేది ఒక ఎంపిక చేసుకున్న వృత్తి కాదు, ఒక తప్పనిసరి అవసరం. వ్యవసాయం తప్ప వారికి వేరే ఆధారం లేదు, వేరే పని రాదు, వేరే అవకాశాలు లేవు. రైతుల దృష్టిలో వ్యవసాయాన్ని వ్యాపారంగా చూడటానికి అవకాశం లేదు. వ్యాపారం అనేది ఒక ఎంపిక చేసుకున్న వృత్తి కానీ ఇక్కడ వ్యవసాయం అనేది ఎంపిక చేసుకున్న వృత్తి కాదు. ఒక గ్రామీణ రైతు బతకడానికి వ్యవసాయం తప్ప వేరే దారి లేదు. ఈ దృక్పథంలో రైతు ఒక బాధితుడు. అతడు బాధితుడు కావడానికి కారణం అసమాన సమాజం, అసమర్థ ప్రభుత్వాలు. అందువల్ల రైతులను ఆదుకునే బాధ్యత ఆ సమాజం పైన ప్రభుత్వం పైన ఉందని రైతుల అభిప్రాయం.

## ప్రకృతి, మార్కెట్లు, ప్రభుత్వం

వ్యవసాయం, తద్వారా రైతు జీవితం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటాయి. అవి ప్రకృతి, మార్కెట్, ప్రభుత్వం. ప్రకృతిలోని అన్ని అంశాలు నేల, నీరు, గాలి, ఎండ, వాన, చీడపీడలు వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రకృతిలో మార్పులు రైతు స్వాధీనంలో ఉండవు. ప్రకృతిపై రైతు వ్యక్తిగతంగా పోరాడలేడు. సామూహికంగా కొంతవరకు విజయం సాధించ గలడు. ఈ విషయంలో సమాజం తరపున ప్రభుత్వం రైతుకు సహాయం చేయాలని రైతుల అభిప్రాయం. దీనికి అనేక రూపాలు ఉంటాయి. ఉదాహరణకు వ్యవసాయానికి సాగునీటి వసతి కల్పించడం, కొత్త రకాల విత్తనాలకై పరిశోధనలు చేపట్టడం, మంచి ఎరువులు, సస్య రక్షణ మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడం, ప్రకృతి వైపరీత్యాల నుండి నష్టపోకుండా భీమా రూపంలో ఆర్థికంగా సహాయపడటం వంటివి.

వ్యవసాయాన్ని ప్రకృతితో సమానంగా ప్రభావితం చేసే అంశం మార్కెట్. ప్రకృతిలో ఎంత వైవిధ్యం ఉంటుందో మార్కెట్లో అంత ఒడిదుడుకులు ఉంటాయి. పండించిన పంట ధర మార్కెట్‌పై ఆధారపడి ఉంటుంది. ఈ మార్కెట్ ఒడిదుడుకులు రైతు చేతులలో ఉండవు. రైతుకు పంట పండించడం ఒక ఎత్తయితే మార్కెట్లో అమ్ముకోవడం అంతకన్నా కష్టం. రైతు తనకు కావలసిన వస్తువులన్నీ చిల్లర మార్కెట్‌లో అధిక ధరలకు కొని పండిన పంట టోకు మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముచున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సమాజం తరపున మార్కెట్ ఒడిదుడుకులు నుంచి రైతుకు రక్షణ కల్పించాలని రైతులు కోరుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు ఆశిస్తున్నారు.

## ప్రభుత్వ విధానాలు

వ్యవసాయం అనేది పంట పండించడానికి పరిమితం కాదు. అది ఒక ప్రక్రియ. విత్తనాలు కొనుగోలుకు అవసరమైన డబ్బు సమకూర్చుకోవడం దగ్గర నుండి పంట అమ్మి డబ్బు చేసుకునే వరకు అనేక అంశాలతో ముడిపడి ఉండే దీర్ఘకాలపు వలయం. దీనిలో అనేక ఆర్థిక రాజకీయ సామాజిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మానవుని జీవితంలో ప్రతి అంశంలాగే వ్యవసాయం కూడా రాజకీయ అంశం. దేశంలోని రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.

స్వాతంత్రానికి పూర్వం రైతాంగానికి ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు ఉండేది కాదు. 1920-30 దశకంలో వచ్చిన మాంద్యంలో పంటకు ధరలు లేక రైతులు చితికిపోయారు. అటు ప్రజలకు కొనుగోలు శక్తి లేక తీవ్ర కరువు కాటకాలతో లక్షల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. స్వాతంత్రం వచ్చిన తరువాత

ప్రభుత్వం కొన్ని సంక్షేమ విధానాలను ప్రవేశపెట్టి రైతులకు అనేక రూపాల్లో సహాయాన్ని అందించడం మొదలు పెట్టింది. వ్యవసాయ రంగ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున ప్రభుత్వం పెట్టుబడి పెట్టింది. వ్యవసాయ విశ్వవిద్యాలయను స్థాపించి వ్యవసాయ రంగంలో పరిశోధనకు కృషి చేశారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు కనీసధర లభించేటట్లు కృషి జరిగింది. దీంతో వ్యవసాయ రంగం కొంత పురోగతి సాధించింది. అయితే 1990 దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తరువాత ప్రభుత్వం వ్యవసాయ రంగం నుండి క్రమేపీ తప్పుకుని ప్రైవేట్ రంగానికి అప్పగించాలనే ప్రయత్నం చేస్తుంది. సరళీకృత ఆర్థికవిధానం అంటే ఆర్థిక రంగంలో ప్రభుత్వ పాత్ర లేకుండా ప్రైవేటీకరణ ద్వారా నిర్వహించాలని, అప్పుడే త్వరితగతిన ఆర్థిక అభివృద్ధి సాధ్యపడు తుందనే సిద్ధాంతం. దానికి అంతర్జాతీయంగా డబ్ల్యుటివో ఒప్పందాలు దోహదం చేస్తున్నాయి.

ఈ విధానాలకు అనుగుణంగా ప్రకృతి నుండి మార్కెట్ నుండి రైతును రక్షించే అన్ని రంగాల నుండి ప్రభుత్వం క్రమేపీ ఉపసంహరించుకుంటూ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ వస్తుంది. ఉదాహరణకు వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ అందించడం దగ్గర్నుండి సోలార్ పంప్ సెట్ల ఏర్పాటు వరకు క్రమేపీ ప్రైవేట్ సంస్థల యాజమాన్యంలోకి పోతున్నాయి. అదే విధంగా వ్యవసాయ పరిశోధనలకు ప్రభుత్వం నిధులు కేటాయింపు క్రమేపీ తగ్గుతూ వస్తుంది వాటి స్థానంలో ప్రైవేటు విత్తన కంపెనీలు ఈ రంగంలో ప్రవేశించి ఆశాస్త్రీయమైన పద్ధతులలో విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నాయి. అదే విధంగా ఎరువులు, సస్యరక్షణ అనేవి అతిపెద్ద ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల స్వాధీనంలోకి పోయాయి. అలాగే, వ్యవసాయ బీమా ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పగించాలని ప్రయత్నం జరిగింది. అదే విధంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో, గతంలో పరిమితంగానే ఉన్నప్పటికి, మార్కెటు కమిటీలు ద్వారా జోక్యం చేసుకుని ధరలను కొంత వరకు నియంత్రించేవి. ఈ కొద్దిపాటి మద్దతు కూడా లేకుండా మార్కెట్లను పూర్తిగా ప్రైవేటీకరించంటానికి కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకు రావడం జరిగింది. వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వజోక్యం లేకుండా పూర్తిగా ప్రైవేటురంగానికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించు కుని ఇప్పటికే విద్య వైద్య బ్యాంకింగ్ ఫార్మా రంగాలకు విస్తరించిన భారత కార్పొరేట్ రంగం వ్యవసాయ రంగానికి విస్తరించాలని చూస్తుంది.

## రైతుల ప్రత్యక్ష అనుభవాలు

సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా వ్యవసాయం లాభపడకపోగా సంక్షోభం ప్రారంభమైంది. ప్రైవేట్ రంగం వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడం బదులు వ్యవసాయ రంగాన్ని దోపిడీ చేయాలనే ప్రయత్నం మొదలు పెట్టింది. ప్రైవేట్ రంగం ప్రవేశించిన చోటల్లా రైతుల అనుభవాలే దీనికి ప్రత్యక్ష సాక్ష్యం. ఉదాహరణకు రెండుసంవత్సరాల క్రితం నేను సోలార్ పంప్ సెట్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశాను. ఒక ప్రైవేటు కార్పొరేట్ కంపెనీ నుండి కొంతమంది వ్యక్తులు వచ్చి సోలార్ పంప్ సెట్ ఏర్పాటు చేశారు. పంప్ సెట్ ఏర్పాటు చేసినట్టు సంతకం తీసుకుని వెళ్లారు. ఒక వారం తర్వాత దానికి మరమ్మతులు వచ్చాయి. ఆ పంపు సెట్టు దరఖాస్తు చేసుకున్న విద్యుత్ శాఖని సంప్రదించగా వారు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసిన ప్రైవేటు కంపెనీలు సంప్రదించాలని కోరారు. అనేక సార్లు ఫోన్ చేసినప్పటికీ వారు స్పందించలేదు. దాంతో విసుగుచెంది ఒక నెల తరువాత సమాచార హక్కు చట్టం కింద ఏ కంపెనీ ఏర్పాటు చేసింది, ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లించింది మొదలగు వివరాలు కోరడం జరిగింది. నేను సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాను అని తెలిసి అప్పుడు ఆ కంపెనీ ప్రతినిధి వచ్చి మరమ్మతు చేసారు. చట్టం ప్రకారం నేను సేకరించిన వివరాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. నా తరపున ప్రభుత్వం ప్రైవేట్ ఆ కంపెనీతో సుమారు 4.25 లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకుని ఐదు సంవత్సరాల మెయింటినెన్స్ కాంట్రాక్ట్ వారికి ఇవ్వడం జరిగింది. ఈ కాంట్రాక్ట్ వివరాలేవి నాకు ఇవ్వలేదు. ఈ ఒప్పందాలలో రైతులకు ఎటువంటి భాగస్వామ్యం లేదు. ప్రైవేటు సోలార్ పంపుసెట్లకు ఎటువంటి మెయింటినెన్స్ చేయడం లేదు. మరమ్మతులు వచ్చినా వారు స్పందించడం లేదు. ఇది నా ఒక్కడి అనుభవం కాదు, సోలార్ పంప్ సెట్లు వేయించుకున్న రైతులందరి అనుభవం.

మరొక ఉదాహరణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం. ఈ పథకంలో విపరీతమైన లాభాలు వస్తున్నాయని అనేక ప్రైవేట్ బీమా కంపెనీలు చేరాయి. ప్రభుత్వం నేరుగా భీమా ప్రీమియం చెల్లించడం, సరైన పంట కోత పరీక్షలు లేకపోవడంతో క్లెయిమ్స్ లేక భీమా కంపెనీలు విపరీతమైన లాభాలు గడించాయి. 2016 ఖరీఫ్ సీజన్లో పదివేల కోట్ల రూపాయలు లాభం గడించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించినప్పటికీ కేవలం 32 శాతం క్లెయిమ్స్ చెల్లించాయి.

పంచాయతి/మండల వారీగా పంట కోతల పరీక్షలు ప్రారంభం కావడంతో కంపెనీలకు నష్టాలు రావడం మొదలయింది. 2018-19 సంవత్సరంలో 20,953 కోట్లు ప్రీమియం రాగా 27,550 కోట్లు క్లెయిమ్స్ చెల్లించవలసి వచ్చింది. వెంటనే అనేక పెద్ద ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ రంగం నుండి తప్పుకోవడం మొదలు పెట్టాయి.

మరొక ఉదాహరణ బీహార్‌లోని వ్యవసాయ మార్కెట్లు. బీహార్ ప్రభుత్వం 2006 సంవత్సరంలో వ్యవసాయ మార్కెట్లను రద్దు చేసింది. ఇప్పటి కేంద్ర ప్రభుత్వ చట్టాలలాగే వ్యవసాయ రంగంలో ప్రైవేట్ వ్యాపారస్తులు ప్రవేశించడం ద్వారా రైతులకు మరింత మెరుగైన ధరలు వస్తాయని భావించారు. అయితే గత 14 సంవత్సరాల అనుభవం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. బీహార్‌లో వ్యవసాయ మార్కెట్లకు పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులు రాకపోగా రైతులకు కనీస గిట్టుబాటు ధర రాక వేరే రాష్ట్రాలకు పోయి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు మొక్కజొన్న కనీస మద్దతు ధర క్వింటాల్‌కు 1850 రూపాయలు ఉండగా బీహార్‌లో రైతులు వెయ్యి రూపాయలకు అమ్ముకుంటు న్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ నివేదిక వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారని స్పష్టం చేసింది. ఈ ఉదాహరణలన్నీ ప్రైవేట్ రంగంలో ఉన్న పరిమితులను సూచిస్తున్నాయి. రైతులు ప్రైవేటు రంగాన్ని నమ్మే పరిస్థితి లేదు.

## రైతులు ఏం కోరుకుంటున్నారు

ప్రభుత్వం కార్పొరేట్లు తరపున కాకుండా రైతుల తరపున ఉండాలని రైతులు కోరుకుంటున్నారు. మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ క్రమబద్ధీకరించే సక్రమమైన మార్కెటింగ్ వ్యవస్థ లేదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత లేదు. కనీస మద్దతు ధర ప్రకటించిన 26 వ్యవసాయ ఉత్పత్తులు కూడా సరైన కొనుగోలు వ్యవస్థ లేదు. ఈ స్థితిలో దేశ జనాభాలో 50శాతం మంది ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని మార్కెట్ శక్తులకు వదిలివేయడం వల్ల వ్యవసాయరంగంలో ఉన్న ప్రజలకే కాకుండా సామాన్య ప్రజలకు ఆహార కొరత ఏర్పడి వారి జీవన ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ విధానాల వల్ల దేశ ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది.

రైతులు కోరుకునేది వ్యవసాయంలో ఖర్చు తగ్గించడానికి ప్రభుత్వ రంగ/సహకార సంస్థల ద్వారా ఏర్పాట్లు (తక్కువ వడ్డీకి నగదు, వ్యవసాయ పనిముట్ల అద్దె కేంద్రాలు, కోల్డ్ స్టోరేజిలు వంటివి), స్థానిక పరిస్థితులకు అనుకూలంగా వ్యవసాయ భీమా, తాము ఉత్పత్తి చేసిన పంటలకు మార్కెట్లు, వాటిలో మద్దతు ధరకు ఒక చట్టబద్ధమైన హక్కుగా కొనుగోలు ఏర్పాట్లు ఉండాలని, దానికి అవసరమైన మూలధనం ప్రభుత్వం అందించాలని కోరుకుంటున్నారు.

## వ్యవసాయ రంగంలో పెట్టుబడులు

రైతుల ఆదాయం తగ్గిపోవడానికి ప్రధానమైన కారణాల్లో ఒకటి వ్యవసాయ రంగంలో అర్థవంతమైన పెట్టుబడి పెట్టక పోవడం. దేశంలోని మొత్తం పెట్టుబడిలో వ్యవసాయరంగం భాగం 1950లో 18 శాతం ఉంటే 2018 నాటికి అది 7.6 శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగంలో చేస్తున్న ఖర్చు కూడా ఎక్కువ భాగం సంక్షేమ పథకాలు లేదా సబ్సిడీ మీద ఖర్చు చేయడం జరుగుతుంది. దీనికి ఒక కారణం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉండటం కార్పొరేట్లు కూడా అవసరం. ధరలు పెరిగితే ప్రజల జీవనవ్యయం పెరిగిపోయి పారిశ్రామిక కార్మికులకు ఎక్కువ జీతం ఇవ్వవలసి వస్తుంది.

అలాగే ప్రజలు ఆహారం మీద ఎక్కువ ఖర్చు చేస్తే పారిశ్రామిక ఉత్పత్తుల కొనుగోలుకు శక్తి తగ్గిపోయి పారిశ్రామిక వర్గాలు నష్టపోతాయి. అందువలనే అభివృద్ధి చెందిన అమెరికా ఇంగ్లాండ్ వంటి దేశాల్లో మనకన్నా అనేక రెట్లు ఎక్కువ సబ్సిడీలు ఇస్తున్నారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదు. వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టినప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది. ఈ పెట్టుబడులు వ్యవసాయాన్ని ప్రకృతి నుండి మార్కెట్ నుండి రైతులను కాపాడే మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించాలి.

వ్యవసాయం సంక్షోభం నుంచి బయట పడడానికి వ్యవసాయదారుని కోణం నుంచి ఆలోచించాలి. రైతులకు అనుకూలమైన స్పష్టమైన ప్రభుత్వ విధానం, సమగ్రమైన దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. ప్రకృతి ఒడిదుడుకులనుండి మార్కెట్ ప్రభావాల నుండి రైతులు రక్షించాలి. రైతులకు, మార్కెట్లకు మధ్య ప్రభుత్వం సమన్వయకర్తగా వ్యవహరించాలి. ఈ పని చేయడం ప్రభుత్వ కనీస బాధ్యత.


ప్రపంచవ్యాప్తంగా అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ప్రభుత్వాలు ఈ బాధ్యతను అనేక రూపాల్లో నిర్వహిస్తున్నాయి. భూమి పరిమితమైన వనరు. ప్రైవేటు వ్యాపారుల లాభాపేక్ష భూవినియోగాన్ని శాసించకూడదు. అందుచేత భూవినియోగాన్ని సామాజికంగానే నియంత్రించాలి. ❑

# కార్మిక చట్టాలను పాతరేస్తున్న మోడీ సర్కార్

పాలడుగు భాస్కర్



కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కోట్లాది మంది కార్మికుల కడుపులు కొట్టే చర్యలకు మోడీ సర్కార్ పూనుకున్నది. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఉన్న కార్మిక చట్టాల అంశాన్ని కనీసం రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండానే ఏకపక్షంగా అన్నింటినీ గుదిగుచ్చి క్రోడీకరణలకు పూనుకున్నది. ఇది మన ఫెడరల్ స్ఫూర్తికే విరుద్ధం. లేబర్ కోడ్ బిల్లుల ఆమోదం సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను బహిష్కరించి, నిరంకుశంగా సభా సాంప్రదాయాలను మంట గలిపి, మూజువాణి ఓటుతో కార్మిక చట్టాల కథ ముగించింది బీజేపీ. 48 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవితాల్ని ప్రభావితం చేసే 3 కోడ్‌లు, ఇండిస్ట్రియల్ రిలేషన్ కోడ్, ఆక్యుపేషనల్, హెల్త్ అండ్ వర్కింగ్ కండీషన్స్ కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్‌లను సెప్టెంబర్ 22న ఆమోదింప జేసుకుంది. వేజ్‌కోడ్ గతంలో 2019 లోనే ఆమోదం పొందింది. పెట్టుబడిదారుల ప్రయోజనాల్ని కాపాడేందుకు బీజేపీ రూపొందించుకున్న దీర్ఘకాలిక ప్రణాళిక నేడు నియంతృత్వంతో అమలైపోయింది. ఏనాటి నుండో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు నేడు మోడీ సర్కార్ పాతర వేస్తున్నది. కోసం వాజ్‌పాయి కాలంలో రెండవ జాతీయ లేబర్ కమిషన్ పేరుతో చేసిన సిఫారసులనే మోడీ సర్కార్ క్రోడీకరణ పేరుతో కార్మిక చట్టాలను ధ్వంసం చేస్తున్నది.



ట్రేడ్ యూనియన్ యాక్ట్, ఇండిస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్, ఇండిస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్స్ యాక్ట్‌లను క్రోడీకరించి కొత్త చట్టం ఇండిస్ట్రియల్ రిలేషన్ కోడ్ 2020గా నామకరణ చేశారు. గతంలో ప్రజోపయోగ సర్వీస్‌ల్లో మాత్రమే 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇవ్వకుండా సమ్మె చేయకూడదు. ఇచ్చిన సమ్మె నోటీస్‌కు గడువు 6 వారాలు ఉంటుంది. కన్సిలియేషన్ ప్రక్రియ ప్రారంభం అయిన తరువాత సమ్మెలోకి వెళ్ళకూడదు. మారిన కోడ్‌లో ఇప్పుడు ప్రజోపయోగ సర్వీస్‌లే కాదు. ఏ పరిశ్రమలోనైనా సమ్మె నోటీస్ ఇవ్వాలి. 14రోజుల లోపు సమ్మె చేయకూడదు. ఇప్పుడు సాంప్రదాయక సర్వీసుల్లో కూడా ముందస్తు సమ్మె నోటీస్ ఇవ్వాల్సిందే. అలా చెయ్యకపోతే ఆ సమ్మె చట్టవిరుద్ధం అవుతుంది. దీనివల్ల సమ్మె హక్కు నిర్వీర్యం అవుతుంది. కన్సిలియేషన్ పేరుతో ఏ పని ప్రదేశంలోనైనా సమ్మె జరగకుండా ప్రభుత్వం, యాజమాన్యాలు కుట్రచేసేందుకు చట్టపరమైన హక్కు యాజమాన్యాలకు లభించింది.

ఐడి యాక్ట్ సెక్షన్-5బి ప్రకారం ముందు సంవత్సరంలో ఆ పరిశ్రమల్లో 100మందికి తక్కువ కాకుండా కార్మికులు పనిచేస్తే ఆ పరిశ్రమ మూసివేతలు, తొలగింపులు, లే-ఆఫ్‌లకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం. ప్రస్తుతం ఆ సంఖ్యను 300కు పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో 300పైగా కార్మికులు పనిచేసేవి 50పరిశ్రమలు కూడా లేవు. అత్యధిక పరిశ్రమలకు ఈ కోడ్‌ల పేరుతో మినహాయింపులు వచ్చేశాయి. యాంత్రీకరణ, ఆటోమేజేషన్, కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్ వేగంగా విస్తరిస్తున్న నేటి ఆధునిక కాలంలో ఉత్పాదక శక్తి పెరిగి కార్మిక శక్తి స్థానాన్ని యంత్రం ఆక్రమించింది. గతంలో 100 మంది పనిచేసిన పరిశ్రమల్లో ఇప్పుడు 10, 15 మందితో అదే ఉత్పత్తి సాగుతోంది. ఇండిస్ట్రీయల్ రిలేషన్స్ కోడ్ 2020లో స్టాండింగ్ ఆర్డర్స్‌కి చేసిన మార్పుల వల్ల అత్యధిక పరిశ్రమల్లో కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ కనుమరుగు కానున్నాయి. యాజమాన్యాల అరాచకానికి, దోపిడీకి అంతు లేకుండా పోతుంది. అవసరమైనప్పుడు కార్మికులను పనిలో పెట్టుకోవడం, అవసరం లేనప్పుడు తీసివేయడం హైర్ అండ్ ఫైర్ పద్ధతి అమల్లోకి వస్తుంది. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య నామమాత్రమవుతుంది. పెట్టుబడిదారుల లాభాలకు కొదవే ఉండదు.

ఇప్పటివరకు లేని నిర్ధారితకాల ఉద్యోగులు (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్) నూతన వ్యవస్థను 2018లోనే రంగంలోకి తెచ్చారు. వారిని సర్వీసులో నిర్దిష్ట కాలమే కొనసాగిస్తారు.

కార్మికులకు చట్టాలు వర్తించే సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయలేదు. పీఎఫ్‌కి 20 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులుండే సంస్థల కార్మికులకే కార్మిక చట్టాలు వర్తిస్తాయి. ఈఎస్ఐకి 10మంది అంతకంటే ఎక్కువ, గ్రాడ్యూటీకి 10మంది లేదా అంతకంటే ఎక్కువ, మెటర్నిటి బెనిఫిట్‌కి 10 లేదా అంతకంటే ఎక్కువ, బోనస్‌కి 20 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులుంటేనే కార్మిక చట్టాలు వర్తిస్తాయి. ఇప్పుడు ఆ సంఖ్యలో ఎలాంటి మార్పులు చెయ్యలేదు. ఇప్పటికే అత్యధిక మంది కార్మికులు ఈ చట్టాల పరిధిలోకి రావడంలేదు. ఈ సంఖ్యను తగ్గిస్తే అనేక మందికి ప్రయోజనం కలిగేది. విద్యుత్ సహాయంతో పనిచేసే పరిశ్రమల్లో 10 లేదా అంతకంటే ఎక్కువ, విద్యుత్ సహాయం లేకుండా నడిచే పరిశ్రమల్లో 20 లేదా అంతకంటే ఎక్కువ మంది, వలస కార్మికులకు 5 లేదా అంతకంటే ఎక్కువ, కాంట్రాక్ట్ కార్మికులు 20 లేదా అంతకంటే ఎక్కువమంది ఉంటే ఆ సంఖ్య ఆధారంగా కార్మిక చట్టాలు వర్తించేవి, ఇప్పుడు ఆ సంఖ్యలను 20, 40, 10, 50 లేదా అంతకంటే ఎక్కువగా మార్చారు. యజమానులు పనిని పరిశ్రమల నుంచి నివాస ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒకే పనిని అనేక ముక్కలు చేసి కాంట్రాక్టర్లకు అప్పజెబుతున్నారు. దీంతో కార్మికుల సంఖ్యను తక్కువగా చూపించి కార్మిక చట్టాల నుండి మినహాయింపు పొందుతున్నారు. ఈ మార్పు వల్ల 75శాతం మంది కార్మికులు కార్మిక చట్టాల పరిధి నుంచి తొలగించబడతారు.

ఫ్యాక్టరీస్ యాక్ట్, మైన్స్ యాక్ట్, డాక్ట్ వర్కర్స్ (సేఫ్టీ, హెల్త్ అండ్ వెల్ఫేర్) యాక్ట్, బిల్డింగ్&అధర్ వర్కర్స్ రెగ్యులేషన్ ఆఫ్ ఎంప్లారుమెంట్ అండ్ కండీషన్స్ ఆఫ్ సర్వీస్ యాక్ట్, ప్లాంటేషన్ యాక్ట్, కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ & అబాలిషన్) యాక్ట్ 1970, ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ (రెగ్యులేషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ & కండీషన్ ఆఫ్ సర్వీస్ యాక్ట్ 1979, వర్కింగ్ జర్నలిస్ట్&అధర్ న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ (కండీషన్ ఆఫ్ మిస్ ప్రోవిజన్) యాక్ట్, వర్కింగ్ జర్నలిస్ట్ (ఫిక్సేషన్ ఆఫ్ రైట్స్ ఆఫ్ హౌజెస్) యాక్ట్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ (కండీషన్ ఆఫ్ సర్వీస్) యాక్ట్ 1976, బీడీ & సిగార్ వర్కర్స్ (కండీషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్) యాక్ట్, సినిమా థియేటర్ వర్కర్స్ యాక్ట్‌లను క్రోడీకరిస్తూ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ & వర్కింగ్ కండీషన్ కోడ్ 2020గా మార్చారు.

ఈ కోడ్‌లో 13 చట్టాలను విలీనం చేసి గతంలో ఆ చట్టాలకున్న అధికారాలను తొలగించారు. కార్మికుడి పని గంటలు, ఓటీ, సెలవులు, భద్రత, ఆరోగ్యం సంబంధించి పబ్లిక్ ఎమర్జన్సీలో వీటికి సంబంధించి ఒకటి లేదా అంతకుమించిన నిబంధనల నుండి గరిష్టంగా 3 నెలల పాటు మినహాయింపు ఫ్యాక్టరీ వరకే ఇచ్చే వెసులుబాటును, ఇప్పుడు కొత్తగా ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి ప్రారంభించిన దగ్గర నుంచి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొన్న కాలం వరకు, వీటికి సంబంధించి ఏదైనా లేదా అన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీటిని అన్ని పని ప్రదేశాలకు వర్తింపజేస్తారు. గరిష్టంగా సంవత్సరం వరకు మినహాయింపు ఇచ్చి అధికారాన్ని కల్పించారు. ఈ చర్యలు కార్మికుల్ని శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టేందుకే దోహద పడతాయి. అంతర్‌రాష్ట్ర వలస కార్మికులకు పనిచేసే సంస్థలో, అదే పనిచేసే ఇతర కార్మికులకు ఇచ్చే వేతనాలు, సెలవులు, పని గంటలు, ఇతర పని పరిస్థితులు వలస కార్మికులకు అమలు చేయాలి. వీటితో పాటు నివాస సౌకర్యం, హాస్పిటల్ ఖర్చులు, ఉచిత ఆరోగ్య సౌకర్యం, నియామక సమయంలోనే డిస్టెబిలైజేషన్ అలవెన్సుగా సగం వేతనాన్ని అలవెన్సుగా చెల్లించాలి. గతంలో వీరికి రక్షణగా ఉన్న అనేక హక్కులను తొలగించి ఒక సంస్థలో పనిచేసే ఇతర కార్మికుల వలే పీఎఫ్, ఈఎస్ఐతో పాటు సమానంగా సౌకర్యాలు కల్పిస్తే చాలు అని మార్పు చేశారు. భవిష్యత్‌లో వలస కార్మికులు సమాన పనికి – సమాన వేతనాన్ని, నివాస సౌకర్యాన్ని ఉచిత ఆరోగ్య సౌకర్యాలను కోల్పోనున్నారు.

ఈపీఎఫ్ చట్టం, ఈయస్ఐ చట్టం, మెటర్నిటీ బెనిఫిట్స్ యాక్ట్, బిల్డింగ్ & అధర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సెస్ యాక్ట్, పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్ట్, ఎంప్లాయీస్ ఎక్స్చేంజ్ (కంపల్సరీ నోటిఫికేషన్ ఆఫ్ వేకెన్సీస్) యాక్ట్, సినీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్ 1981, అన్‌ఆర్గనైజ్‌డ్ వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ యాక్ట్ 2008, ఎంప్లాయీస్ కంపెన్సేషన్ యాక్ట్ 1923 చట్టాలను క్రోడీకరించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020గా రూపొందించారు.

బీడీ, వివిధ రకాల గనుల్లో పనిచేసే వారి కోసం ఉద్దేశించిన చట్టాలను ఇప్పటికే జీఎస్‌టీ అమల్లోకి తెచ్చిన సందర్భంగా (122వ రాజ్యాంగ సవరణ ద్వారా) రద్దు చేశారు. బీడీ సెస్ 1-7-2019 నుండి రద్దైంది. ఇనుము, మాంగనీస్ గనులు, క్రోం గనులు లేబర్ సెస్, మైకా గనుల లేబర్ ఫండ్ సెస్, సున్నం రాయి, డోలమైట్ గనుల లేబర్ ఫండ్ సెస్, సినిమా వర్కర్స్ వెల్ఫేర్ సెస్ ఇవన్నీ 2016 మే 21 నుండి రద్దు చేయబడ్డాయి. బీడీ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ యాక్ట్, బీడీ వర్కర్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్, ఇనుప గనుల – మాంగనీస్ గనుల, క్రోం గనుల లేబర్ వెల్ఫేర్

☞ మిగతా 72వ పేజీలో

# మతాలు కాదు, మనిషే ప్రమాదంలో ఉన్నాడు

**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్



సంప్రదాయ వాదులు, దైవ విశ్వాసం గలవారు, అన్ని మతాల బోధకులు, ప్రవచనకారులు వగైరాలంతా అసలు నీతి నిజాయితీ అనే మాటలు ఉచ్చరించగూడదు. ఎందుకంటే వారు నిరూపణలేని దైవం మీద విశ్వాసం ఉంచుకోవడంతో పాటు జనాన్ని కూడా కుట్రపూరితంగా మోసం చేస్తున్నారు. వాస్తవాలు, నిజాలు మాట్లాడని వారు తమకు నీతి నిజాయితీ ఉందని, ఇతరుల్లో అవి ఉండాలని బోధించడం హాస్యాస్పదం. అది అబద్ధాలు ప్రచారం చేసేవాడు ఇతరులకు నిజం మాట్లాడమని చెప్పినట్టుగా ఉంటుంది. చిత్తుగా తాగిన తాగుబోతు తడబాటు లేకుండా అడుగులేయాలని హితబోధ చేసినట్టు ఉంటుంది. ఆత్మ ద్రోహం చేసుకుని బతుకుతూ, ఇతరులకు ద్రోహం చేస్తూ, నైతికత గురించి, నీతి నిజాయితీ గురించి ఉపన్యాసాలిస్తే వాటికి అసలు విలువ ఉంటుందా? ఒకసారి ఆలోచించండి!



నిజానికి ఇస్లాం మతం ప్రమాదంలో లేదు. క్రైస్తవం ప్రమాదంలో లేదు. హిందూమతం కూడా ప్రమాదంలో లేదు. మత పిచ్చిలో పడ్డ మనిషే ప్రమాదంలో ఉన్నాడు. చనిపోయిన వాడికి తను చనిపోయినట్టు తెలియదు. దగ్గరి వాళ్ళంతా విలవిలాడుతారు. మూర్ఖత్వంలో ఉన్న వాడికి కూడా తను మూర్ఖత్వంలో ఉన్నాడని తెలియదు. ఇతరులు జాలిగా బాధ పడతారు. మూర్ఖత్వం మరణం కంటే తక్కువది కాదు. అందుకే విశ్వ విఖ్యాత రచయిత మార్క్ ట్వెయిన్ ఇలా అన్నారు. "వాళ్ళు పిచ్చివాళ్ళయి పోతున్నారని వాళ్ళకు తెలియకుండా, జనాన్ని పిచ్చి వాళ్ళను చేయొచ్చు.. ఒక వాస్తవాన్ని చెప్పి ఒప్పించడం కష్టం!" అని! ఉగ్రవాదులకీ వీరికీ తేడా ఏమిటంటే వారికి మత పిచ్చి మాత్రమే ఉంటుంది. మూర్ఖత్వంలో కొట్టుమిట్టాడే వీరికి కులపిచ్చి, వర్ణ పిచ్చి, వర్గ పిచ్చి, ప్రాంతీయపిచ్చి లాంటివి ఎన్నో ఉంటాయి. మత పిచ్చి ఉన్నవాడు ఇతర మతస్థుల్ని ద్వేషిస్తాడు. కుల పిచ్చిగాడు మాత్రం స్వంత మతంలోని మనుషుల్నే అంటరానివాళ్ళుగా దూరం పెట్టి అవమానిస్తాడు. తన ఆధిక్యత చూపుకోవడమే వాడికి ముఖ్యం. ఇలాంటి పరిస్థితి గమనించే రాహుల్ సాంకృత్యాయన్ ఏనాడో ఓ మాట చెప్పారు. "ప్రతి మతం ఇతర మతానికి వ్యతిరేకం. కానీ, ప్రజల్ని పీడించడానికి అన్నీ ఏకమవుతాయి." అని– నిజమే కదా? ఈనాటికీ పరిస్థితి మారలేదు – ఉగ్రవాది మతం పేరుతో బయటి నుంచి మనపై దాడి చేస్తాడు. వీడు మన అగ్రవాది – మతం పేరుతోనే స్వదేశీయులపైనే దాడులు చేస్తాడు. ఇద్దరి ఉన్మాదం ఒకటే కదా? ఇదే విషయం మీద ఒక ఇమామ్ ఏమన్నాడో చూడండి.. "ఆత్మాహుతి ద్వారా స్వర్గానికి వెళ్ళడం ఖాయం అని విశ్వసిస్తూ ఉంటే గనక, వారు తమను మాత్రమే పేల్చుకోవాలి. అంతేగాని, ఇతరులను కాల్చడం దేనికీ? అది న్యాయమా?" అని ప్రశ్నించాడు ఇమామ్ తవ్‌హిడి. అంటే, ఇలా ఉచితంగా జనానిన 'స్వర్గాని'కి పంపడం న్యాయమా?

"మతం ఒక ప్రమాదకరమైన మూర్ఖత్వాన్ని నేర్పుతూ ఉంటుంది. అది చావుతో కూడా ముగిసిపోదు" అని అన్నారు ప్రముఖ జీవ పరిణామ శాస్త్రవేత్త రిచర్డ్ డాకిన్స్. ఆయన హేతువాది కూడా కాబట్టి అలా అన్నాడని అనుకుందాం. మరి హేతువాదంతోనూ, విజ్ఞాన శాస్త్రంతోనూ అంతగా సంబంధం లేని ప్రఖ్యాత ప్రకృతి కవి విలియం వర్డ్స్ వర్త్ కూడా అదే అభిప్రాయం ఎందుకు వెలిబుచ్చాడు.. ఆలోచించాలి కదా? పైగా ఇద్దరూ బ్రిటిష్‌వారే. వర్డ్స్ వర్త్ చెప్పిన మాట ఏమిటంటే.. "శాంతి సౌఖ్యం, విశ్రాంతి ఇవ్వలేని మతం కంటే, ప్రకృతి ఆరాధనే ఉత్తమం!" అని. విశ్వవిఖ్యాత బ్రిటిష్ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ తన మిత్రుడికి రాసిన ఒక ఉత్తరంలో మతం పట్ల తన అభిప్రాయం తెలియజేశాడు. జీసస్ మీద గాని, బైబిల్ మీద గాని, తనకు విశ్వాసం లేదని ఆయన తన మిత్రుడు ఫ్రాన్సిస్ మెక్ డెర్మొట్ అనే యువ బారిస్టర్‌కు రాశాడు. "న్యూ టెస్టమెంట్ మీద మీకు విశ్వాసం ఉందో లేదో దయచేసి తెలియజేయండి – నేను దాన్ని బహిర్గతం చేయను" అని ఆ యువ బారిస్టర్ లేఖ రాస్తే – దానికి జవాబుగా డార్విన్ అలా రాశాడు. అయితే చాలా కాలానికి డార్విన్ చేతి రాతతో ఉన్న ఆ ఉత్తరం న్యూయార్క్‌లో వేలం వేశారు. అప్పుడు అది లక్షా తొంభయి ఏడువేలు పలికింది. ఆ లేఖ రాసింది 23 నవంబర్ 1880న అయితే, ఓ యాభై సంవత్సరాల తర్వాత అది వేలం వేయబడింది. డార్విన్ వ్యక్తిత్వానికి, చేతిరాతకు, అభిప్రాయానికి ఎంత విలువ ఉంటే,

ఆ రోజుల్లోనే అంత డబ్బుకు వేలం వేయబడాలీ? డార్విన్ మతం గురించి, దేవుడి గురించి ఎక్కడా ఏమీ చెప్పలేదు. జీవ పరిణామం ఎలా జరిగిందో రుజువులతో సహా తన సిద్ధాంతం ప్రతిపాదించాడు. అంతే, ప్రపంచ వైజ్ఞానిక జగత్తు జేజేలు పలికింది. అదే క్రమంగా దైవ విశ్వాసకుల్ని ఆలోచనలో పడేస్తూ వస్తోంది.


"గతమంతా నిండింది / పురాణాల బూజులతో / బూతు కథల మోజులతో / ఆలినెవడొ ఎత్తుకెలితే / అంగలార్చె అర్భకుని / దేవుడంటూ కొలిచే / మతవాది మారాలి / హేతువాది కావాలి / అతడు చీరలెత్తుకెళ్ళే పాట / చిత్రంగా పాడుకుంటూ / వెర్రి మొర్రి కథలకు / బుర్రలమ్ముకొన్నట్టి / వేదాంతి మారాలి / హేతువాది కావాలి" – అని ఆకాంక్షించారు కవి, ఉద్యమకారుడైన కత్తి పద్మారావు. రామకోటి, విష్ణు సహస్ర నామాల వంటి విషయాలు దాటి అయ్యవార్లు రాలేకపోతున్నారు. అంతకు మించిన జ్ఞానం వారికి లేదని సామాన్య జనం గ్రహించుకోవాలి. ఎక్కువ శాతం ఉన్న చెడుని దాచేసి, కొద్దిగా ఉన్న మంచిని చూపి మత బోధకులు తమ మత గ్రంథాల డబ్బా కొట్టుకుంటూ ఉంటారు. పైగా తమకు తామే, తాము అభ్యుదయ వాదులమని రొమ్ము విరుచుకుంటూ ఉంటారు. మిత్ – నుంచి పుట్టిందే మైథాలజీ అయినప్పుడు అది చరిత్ర అని నిరూపించటానికి కొందరు విఫలయత్నం చేస్తుంటారు. అందుకే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు.. "హేతువాదానికి నిలబడని వాదనలు విశ్వసించగూడదు. సమాజం చైతన్యవంతంగా పురోగమించాలంటే కాలాన్ని అనుసరించి నడుచుకోవాలి" అని! అంతే కాదు ఇదే విషయాన్ని బ్రిటిష్ అమెరికన్ వక్త, జర్నలిస్ట్, విశ్వ విఖ్యాత రచయిత క్రిస్టోఫర్ హిచ్చెన్స్ మరింత స్పష్టంగా చెప్పాడు. "ఆధారం లేకుండా చెప్పబడుతున్న దేనినైనా.. ఆధారం లేకుండానే తోసిపుచ్చవచ్చు" అని!

దేశంలో మూఢనమ్మకాలు లేని జీవన విధానం ఏదైనా ఉంటే అది బౌద్ధమే! నిజానికి అది మతం కాదు. కొంతలో కొంత హింసను తగ్గించి, శాంతిని స్థాపించింది బుద్ధుడే. హిందూ పరిపాలకులెవరూ శాంతిని కోరుకోలేదు. హిందూమతాన్ని, వేదాలను నమ్మని చార్వాకుల్ని ధర్మరాజు (మహాభారతంలోని పాత్రకాదు) అనే పరిపాలకుడు నిర్దాక్షిణ్యంగా హత్యలు చేయించాడు. ఆ చార్వాకుల స్ఫూర్తితోనే బుద్ధుడు నాస్తికత్వాన్ని ప్రచారం చేశాడు. బుద్ధుడు నేర్చిన నాస్తికత్వం అజిత కేశ కంబలి అనే భౌతికవాదితో జరిగిన చర్చలో నేర్చుకున్నదే! అందువల్ల బుద్ధుణ్ణి ఒక సామాజిక వాదిగా చూడాలి. దేవుడే లేడన్న బుద్ధుణ్ణి ఈ దేశంలో దుర్మార్గంగా దేవుణ్ణి చేశారు. ఆయన జీవిత కథని, ఆయన బోధనల్ని మార్చి రాశారు. చివరకు ఆయననే దశావతారాల్లో చేర్చుకున్నారు. భగవంతుడు అబద్ధం గనక, బుద్ధుణ్ణి 'భగవంతుడు' అని అనగూడదు. కొన్నేండ్ల క్రితం ఈ నేల మీద నడయాడిన చారిత్రక పురుషుడు. మహౌన్నత వ్యక్తిత్వం గల గొప్ప సంఘ సంస్కర్త! బౌద్ధంలోని అహింసని హైజాక్ చేసిన మనువాదులు తాము అహింసావాదులమని ప్రకటించుకుంటూ ఉంటారు. అదే నిజమైతే మరి వారు పూజించే దేవుళ్ళ చేతుల్లో అన్నన్ని ఆయుధాలు ఎందుకున్నాయి? వారి సంప్రదాయంలో జంతు బలులు, నరబలులు ఎందుకున్నాయి? శతాబ్దాలు గడిచినా ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఎందుకు దొరకడం లేదూ? ఏ మానవత్వాన్ని నిలుపడానికి ఇవి సంస్కృతిలో భాగమయ్యాయి? దుష్టులను శిక్షిస్తున్నాడనే నెపం మీద ఎందుకు హింసను ప్రోత్సహించడం జరిగింది? సృష్టించగల సత్తానే దేవుడికి ఉంటే మరి దుష్టులను సృష్టించడం దేనికీ? మానవులందరినీ సద్బుద్ధితో సృష్టిస్తే సరిపోయేది కదా? ఈ కలహాలు, హత్యలు, దోపిడీలు, లైంగిక వేధింపులు, యుద్ధాలు ఉండేవి కావు కదా? అంటే, అలాంటి సద్బుద్ధి దేవుడికే లేదన్న మాట! అలాంటప్పుడు ఇక మనుషులకేం ఇవ్వగలడూ?

మొదట దుష్టులను సృష్టించడం, మళ్ళీ వాళ్ళను సంహరించడానికి ఆయుధాలు ఉపయోగించడం, హింసను ప్రేరేపించడం.. సున్నిత మనస్కులైన మానవులు, శాంతి కాముకులు భరించలేరు కదా? జనాన్ని భయపెట్టి, అందులోంచి భక్తి పుట్టిస్తాడా? భయపెట్టే తండ్రిని ఏ పిల్లలూ ప్రేమించరు. తొలినాళ్ళలో దేవుణ్ణి సృష్టించి, ఒక్కొక్కటిగా కట్టుకథలు రాసిన ఆనాటి రచయితలకు మెదడు సరిగా పెరిగినట్టు లేదు. వారిచ్చే వివరాలు, వివరణలు హేతుబద్ధంగా లేవు. అసంబద్ధంగా ఉన్నాయి. అందుకే పునః సమీక్షించుకోవాల్సి వస్తోంది! విశ్వ మానవ సౌభ్రాతృత్వం గురించి ఏ దేవుడైనా చెప్పాడా? లేదే? అవగాహనా రాహిత్యం తప్ప, అజ్ఞానం తప్ప మత గ్రంథాల్లో జ్ఞానమెక్కడుందీ? ఇవి సర్వకాల సర్వావస్థలకు ప్రామాణికం ఎలా అవుతాయి? "ఏ మతమైనా నరకం పేరుతో భయపెట్టి, స్వర్గం పేరుతో ఆశపెట్టి భక్తులను లొంగదీసుకునేదే" అని అన్నాడు రాబర్ట్ జి.ఇంగర్సాల్ అనే అమెరికన్ రచయిత. 'స్వేచ్ఛాలోచన'కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చినవాడతడు. బలులు, యజ్ఞాలు, యాగాలు హిందూ ధర్మంలో భాగమై ఉన్నప్పుడు, వేల ఏండ్ల క్రితమే బుద్ధుడు వాటిని ఎందుకు వ్యతిరేకించాడో ఒకసారి ఆలోచించండి. వాటి వల్ల కొంత మంది అగ్రవర్ణాలకు ఏం మేలు జరిగేదో కాని, సామాన్యులు తీవ్రంగా నష్టపోయేవారు. వాటివల్ల వ్యవసాయం బాగా దెబ్బతినేది. పశువులపై ఆధారపడ్డ ఇతర వృత్తుల వారికి తీవ్రనష్టం కలిగేది. ఇది కేవలం హిందూ మతానికే పరిమితమైలేదు. ఇతర మతాలలో

☞ మిగతా 74వ పేజీలో

# అసత్యాలే ఆయుధాలుగా



రామ్ పునియాని
సామాజిక విశ్లేషకులు

అనువాదం : మల్లెంపాటి వీరభద్రరావు

ప్రగ్యాసింగ్ ఠాగూర్ అధికార బీజేపీలో సాధారణ సభ్యురాలేమీ కాదు. ఆమె మధ్యప్రదేశ్ నుండి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యురాలు. రక్షణ కమిటీలో కూడా సభ్యురాలుగా ఉన్నారు. నాథురాం గాడ్సేను ప్రశంసిస్తూ ప్రకటన ఇచ్చినప్పుడు కమిటీ నుండి ఆమెను తొలగించారు. ఆమె ప్రప్రథమంగా మాలేగావ్ పేలుళ్లలో 6గురు చనిపోయినప్పుడు వెలుగులోకి వచ్చింది.

26.11.2008న హత్యకు గురైన హేమంత్ కర్కరే మాలేగావ్ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, ఆ పేలుళ్ళలో ఉపయోగించబడ్డ మోటార్ సైకిల్ గతంలో ఠాగూర్‌కు చెందినదనే వాస్తవాన్ని వెలికి తీశాడు. ఈ దర్యాప్తు ఆమె అరెస్టుకు దారి తీయడమే కాక, ఆ కుట్రలో భాగస్వాములైన అనేక మంది అరెస్టు అయ్యారు. ఆమె ప్రస్తుతం వైద్య కారణాల రీత్యా బెయిలుపై ఉన్నారు.

కర్కరే తనను వేధించాడనీ, తన శాపం వల్లనే అతడు చంపబడ్డాడని ప్రకటనచేసి ఆమె ప్రాచుర్యంలోకి వచ్చింది. అధిష్టానం నుండి వచ్చిన ఒత్తిడితో ఆ ప్రకటనను వెనక్కి తీసుకున్నది. దీని తరువాత నాథూరామ్ గాడ్సేని జాతీయవాదిగా పేర్కొంటూ మరొక ప్రకటన చేసింది. ఆయన గతంలో జాతీయవాదేనని, భవిష్యత్తులో కూడా జాతీయవాదిగానే ఉంటాడని ప్రకటించింది. మరొకసారి ఈ ప్రకటనను కూడా వెనక్కు తీసుకోవాలని ఆమెపై ఒత్తిడి వచ్చింది. తాను కూడా ఠాగూర్‌ను క్షమించలేనని మోడీ తెలిపాడు.

ఆమె వ్యాఖ్యానాల పరంపరలో భాగంగా తాజాగా వర్ణ వ్యవస్థపై మరొక వ్యాఖ్య చేసింది. 13 డిసెంబర్, శూద్రులను గురించి వ్యాఖ్యానిస్తూ, సామాజిక పొందిక పట్ల అజ్ఞానంతో, శూద్రులను శూద్రులని పిలిస్తే వారు అవమానంగా భావిస్తారని తెల్పింది. ఠాకూర్ క్షత్రియ మహాసభలో ప్రసంగిస్తూ, మన ప్రాచీన గ్రంథాలను పరిశీలించినట్లయితే (మన ధర్మ క్షేత్రంలో) మన సమాజం నాలుగు విభాగాలుగా విభజింపబడిందని, ఈ పద్ధతిలోనే ఈనాటి క్షత్రియులు వారి విధులను అర్థం చేసుకొని, అధిక సంఖ్యలో పిల్లలకు జన్మనిచ్చి సైన్యంలోకి పంపించవలసిన అవసరం ఉందని చెప్పింది. అప్పుడు మాత్రమే వారు దేశం కోసం పోరాడుతూ, దేశ భద్రతను బలోపేతం చేయగలరని తెలిపింది.

సహజంగానే తాను మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాల్సిందిగా ఒత్తిడి వచ్చినప్పటికీ, ఆమె మాట్లాడిన మాటలు యాధృచ్ఛికమైనవి కావు. ఆ మాటలు వివక్షతతో కూడిన జాతీయ వాదుల లోతైన అవగాహనతో మాట్లాడిన మాటలే. కర్కరే క్షుణ్ణమైన దర్యాప్తు నిర్వహించినప్పటికీ, యూపీఏ-2 ప్రభుత్వం హిందూ మితవాద గ్రూపులపై నేరాన్ని ఆరోపించే ప్రయత్నం చేస్తుందని ప్రచారంలో పెట్టారు. పేలుళ్ళు జరిగిన సమయంలో ఇద్దరు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు జైలులో ఉన్నారు. కేసులలో చిక్కుకున్న అనేకమంది విడుదల చేయబడ్డారు. దీనికి కారణం ఏమంటే దర్యాప్తు చేసే అధికారులకు ఈ కేసుల విషయంలో సున్నితంగా వ్యవహరించవలసినదిగా ఆదేశాలు అందాయి. ముంబాయి కోర్టుకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోహిణి సాలియన్ ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ ప్రతిపాదనను ఆమె తిరస్కరించినట్లు తెలియజేశారు. ఈ కారణంగా ఆమెను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవి నుండి తొలగించారు.

గాడ్సేకి సంబంధించి ఠాగూర్ చేసే ప్రకటనలు అన్నీ కూడా రహస్య కుట్రలో భాగమే. బహిరంగంగా గాడ్సేను స్తుతించటం, ఆయన పేరు మీద గుడులు నిర్మాణం కావడం వారి దురాలోచనలో భాగమే. హిందూ మహాసభకు చెందిన పూనం పాండే 30 జనవరి, 2019న (గాంధీజీ హత్య జరిగిన రోజున) సంబరాలు చేయడం ఇందులో భాగమే.

కుల, వర్ణ దురహంకారం, ఆధిపత్య జాతీయవాదంలో భాగమే. అంబేద్కర్ మనుస్మృతి వ్రాత ప్రతులను, వర్ణ మరియు పురుషాధిక్యత కల్గి ఉండటంవల్లనే దహనం చేశాడు. కానీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన సర్ సంఘ్ చాలక్, గోల్వాల్కర్ మాత్రం

లార్డ్ మనువును ప్రశంసిస్తూ, ఈ సనాతన శాసనాలు ఈనాటికీ అనుసరించదగినవే అని చెప్పాడు. ఆర్ఎస్ఎస్ ముఖ్య పత్రిక (మౌత్ పీస్) "ఆర్గనైజర్" రాజ్యాంగాన్ని విమర్శిస్తూ, ఈ రాజ్యాంగం మనుస్మృతిలో ఉన్న గొప్ప సూత్రాలకు అనుగుణంగా లేదనే కారణంతో మన రాజ్యాంగాన్ని తిరస్కరించింది. అదేవిధంగా అనేక మంది హిందూ జాతీయవాదులు, భారతదేశానికి మనుస్మృతి ఉండగా మరొక కొత్త రాజ్యాంగం అవసరం లేదని వాదిస్తున్నారు.

ఈ ఆధిపత్య భావజాల గందరగోళమేమంటే, ఈనాటి పరిస్థితులకు అనుగుణమైన భాషలో మాట్లాడడం, భారత రాజ్యాంగం పట్ల పెదవులపై సానుభూతిని చూపిస్తూ , ఆచరణలో రాజ్యాంగాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేయడం, హిందువులను సంఘటిత పరచడానికి ముస్లిములను దోషులుగా చూపి, హిందువులను సమీకరించడం, కానీ తమ వ్యూహంలో భాగంగా దళితులను లోబర్చుకోవడమే వారికి క్లిష్టమైన సమస్యగా మారింది.

డాక్టర్ అంబేద్కర్ కుల నిర్మూలననే లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ హిందూ జాతీయవాద భావజాలం సామాజిక సామరస్య ఫోరమ్‌ను (సామాజిక్ సమస్తామార్చ్) ను ఆవిష్కరించే ప్రయత్నం చేసింది. వీరు ముందుకు తీసుకు వచ్చిన అంశం ఏమంటే, ప్రాచీన కాలంలో అన్ని కులాలు సమానత్వంతో ఉంటూ సామరస్యంగా జీవించేవని, ముస్లింలు భారతదేశానికి వచ్చిన తరువాత వీరిని మత మార్పిడి చేసే ప్రయత్నం చేశారని, కానీ స్థానికులు ఆ ప్రతిపాదనను ప్రతిఘటించారని, అందువల్ల వారిని వేరు చేసి అసమానత్వ కులాలుగా మార్చారని ప్రచారం చేస్తున్నారు. మోడీ తన పుస్తకం "కర్మయోగ్" (తరువాత ఉపసంహరించబడింది) లో, మరుగుదొడ్లను శుభ్రం చేసేవారు తమ జీవనాధారం కోసమే ఆ పని చేయడం లేదని, ఆ పని చేయడంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారని తెలిపాడు. ఈ విధంగా సామాజికంగా మార్పు చేసే నైపుణ్యంతో దళితులను హిందుత్వ రాజకీయ పరిధిలోకి ఇముడ్చుకోవడంలో చాలా తీవ్రమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే విధంగా దళిత ఆదివాసీలను కూడా హిందూ జాతీయ రాజకీయాల్లో సైనికులుగా ఉపయోగించుకుంటున్నారు.

పదవులను ఎరచూపి అనేక మంది దళిత నాయకులను కూడా తమలో కలుపుకోవడంలో బీజేపీ విజయవంతమైంది. ప్రగ్యా సింగ్ ఠాకూర్ మాట్లాడేది ఏదైనా, అధికార పార్టీ మరియు ఆర్ ఎస్ ఎస్ ఆలోచనలకు భిన్నంగా ఉండదు. అయితే ఏమి చెప్పాలి, ఎలాంటి అర్థాన్ని ఇవ్వాలనేదే ప్రశ్న. దీనికి అత్యంత సారూప్యత కలిగిన అంశం ఏనుగు దంతాలు. మనం చూసేది, మనకు చూపబడేది, మనకు కనిపించేది వాస్తవానికి భిన్నంగా ఉంటాయి. ఈ భావజాలం ఉన్న ఆర్గనైజేషనకు సవాల్ ఏమంటే, గాంధీ పేరును ఉపయోగించుకుంటూనే గాడ్సేని తమ భావజాలంలో సజీవంగా ఉంచగల్గడం. కుల, వర్ణ వ్యవస్థలను సజీవంగా ఉంచుతూనే, సమానత్వాన్ని గూర్చి మాట్లాడడం వారి లక్ష్యంగా ఉంది.

క్షత్రియులు అధిక సంతానాన్ని కలిగి ఉండాలనే వాదన మొట్ట మొదటిసారి చాలా బలంగా, స్పష్టంగా వింటున్నాము. ఇప్పటి వరకు అనేక మంది ఆర్ఎస్ఎస్ ముఖ్యులు కుటుంబ నియంత్రణ పథకాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. దీనికి కారణం ముస్లింలు కుటుంబ నియంత్రణను పాటించడం లేదని, హిందువులు కుటుంబ నియంత్రణను పాటిస్తే, ముస్లింల జనాభా పెరిగిపోతుంది అనేది వారి వాదన. బ్రహ్మచారులయిన అనేకమంది ప్రచారకులు హిందూ స్త్రీలు అధిక సంతానాన్ని కనాలని ప్రచారం చేస్తున్నారు. ఠాగూర్ హిందువుల్లో వర్ణ వ్యవస్థను ముందుకు తెస్తూ, క్షత్రియులు యుద్ధ భూమిలో పని చేయడం కోసం, ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్తుంది. ఇది అసహజమైనది. ఈ పద్ధతిని సాయుధ దళాలలో, నియామక విధానాల్లో కూడా అనుసరిస్తారా అనేది కొంతకాలం తర్వాతయినా స్పష్టమవుతుంది.

లోతైన మతపరమైన సాంప్రదాయాలతో సంబంధం ఉన్న ఠాగూర్ మైనార్టీలను అట్టడుగుకు నెట్టి వేయడమే కాక, హిందూ ఐక్యతను ప్రదర్శించే లక్ష్యంతో పనిచేస్తుంది. అయితే ఈ పద్ధతిలో కుల, వర్ణ ఆధిపత్యాన్ని నిలబెట్టడమే తన లక్ష్యంగా ఉంది. ఆ విధంగా ప్రగ్యా సింగ్ ఠాగూర్ బి.జె.పి. భావజాలానికి ప్రతినిధిగా నిలుస్తుంది. ❑

# రాజ్యాంగ పరిరక్షణకు మరో జాతీయోద్యమం



**డి సోమసుందర్**

భారత రాజ్యాంగానికి తాము సంపూర్ణ విధేయులమని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ప్రకటించారు. రాజ్యాంగానికి వెలుపల ఒక పోటీ అధికార కేంద్రాన్ని నెలకొల్పడం తమ అభిమతం కాదని కూడా ఆయన స్పష్టం చేసారు. చింతన్ శివిర్, చింతన్ బైఠక్ వంటి సందర్భాల్లో ఆరెస్సెస్ నేతలు మీడియాతో మాట్లాడే మాటల్ని మనం పరిగణనలోకి తీసుకోలేం! మోహన్ భాగవత్ పైకి ఏమి చెబుతున్నప్పటికీ భారత రాజ్యాంగ ప్రవేశిక లోని మౌలిక భావనలపట్ల తమ ద్వేషాన్ని ఆరెస్సెస్ నేతలు ఏనాడూ దాచుకోలేదు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మారుస్తామంటూ పలుసార్లు ప్రకటించారు. జాతీయోద్యమ ఆదర్శాల నుండి రూపుదిద్దుకున్న రాజ్యాంగ ప్రవేశికనూ, దాని స్ఫూర్తిని ధ్వంసం చేయడానికి వారు నిరంతరం ప్రయత్నిస్తూ వచ్చారు. ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక గణతంత్ర భావనల పునాదిపై హిందూ రాష్ట్రవాదుల దాడి కేంద్రీకృతం అయ్యింది.

రాజ్యాంగ రచనా కాలంలోనే మొదలయిన హిందుత్వ దాడి గత డెబ్బయి సంవత్సరాలుగా వేర్వేరు రూపాలలో కొనసాగుతూ వచ్చింది. జాతీయోద్యమానికి దూరంగా ఉండటానికే పరిమితం కాకుండా దానికి ద్రోహం చేయడానికి సావర్కర్ వెనుకాడలేదన్న వాస్తవాన్ని గమనంలో వుంచుకోవాలి. జాతీయోద్యమ ఆదర్శాలను నిరంతరం నిందిస్తూ, జాతీయ నాయకుల వ్యక్తిత్వంపై దాడి కొనసాగించారు. ఆధునిక, నాగరిక భావాలను సావర్కర్ ఈసడించారు.

భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని సావర్కర్ విస్పష్టంగా ప్రకటించాడు. రాజ్యాంగ నిర్ణాయక సభ రాజ్యంగ రూపకల్పనలో తలమునకలై వున్న కాలంలో సావర్కర్ మనుస్మృతినే భారత రాజ్యాంగంగా ఆమోదించాలని డిమాండ్ చేసారు. సావర్కర్ ఇలా రాసారు..!

'రాజ్యాంగంలో భారతీయం అనదగినది ఏదీ లేదు. ప్రాచీన కాలంలోనే శిక్షాస్మృతిని రూపొందించి అమలు చేసిన గొప్ప నమూనా మన దేశంలోనే వుంది. మనుస్మృతిలోని అంశాలు విశ్వవ్యాప్తంగా మేధావుల ప్రశంసలను పొందాయి. మన దేశంలో మనుస్మృతిని అందరూ ఇచ్ఛాపూర్వకంగా ఆమోదించి, విధేయంగా పాటిస్తారు. మనకు సరిపడని పాశ్చాత్య భావనలతో రాజ్యాంగాన్ని నింపాల్సిన పనిలేదు".

1949 నవంబరు 30 నాటి 'ఆర్గనైజరు' పత్రిక సంపాదకీయంలో ఆరెస్సెస్ అధినేత గోల్వాల్కర్ రాసిన వార్త ఇలా వుంది.

"నూతన భారత రాజ్యాంగంలో భారతీయం అని చెప్పదగినది ఏదీ లేదు , భారతీయ ప్రాచీన రాజ్యాంగ చట్టాలు, పురాతన వ్యవస్థలు, అవి రూపొందించిన శాసనాలు వాటికి సంబంధించిన పారిభాషిక పదావళి గానీ, పేర్లు గానీ ఏమిలేవు. ప్రాచీన కాలంలోనే భారతదేశం సాధించిన విశిష్ట రాజ్యాంగ ప్రగతి గురించిన ప్రస్తావనే లేదు. స్పార్టాకు చెందిన లైకార్గస్, పర్షియాకు చెందిన సోలోన్ కంటే ఎంతోముందే మన మనుస్మృతి రూపొందింది. నాటి నుండి నేటి వరకూ మనుస్మృతి ప్రపంచ వ్యాప్త ఆరాధననూ, హిందువుల విధేయతను చూరగొన్నది. కానీ మన రాజ్యంగ పండితుల దృష్టిలో దీనికేమి విలువ లేకుండా పోయింది.

గోల్వాల్కర్ తన "బంచ్ ఆఫ్ థాట్స్' గ్రంథంలో భారత రాజ్యాంగంపై తన భావనలను మరోసారి స్పష్టం చేసారు. "భారత రాజ్యాంగం అంతా పాశ్చాత్య దేశాల భావనలతో నిండి వుంది. గజిబిజి, విజాతీయ సంకర భావనల నుండి అక్కడ నుంచి ఒకటి, ఇక్కడి నుంచి ఒకటి పదాలను తెచ్చి కూర్పు చేసారు. అందులో మనదనదగిన భావన ఒక్కటీ లేదు. మన జాతీయ లక్ష్యాల గురించి గానీ, మన ప్రాచీన జీవన ఆదర్శాల గురించి గానీ, మన జాతి గమ్యాల గురించి గానీ భారత రాజ్యాంగంలో ఏమీ లేదు".

హిందూకోడ్ బిల్లుకు వ్యతిరేకంగా 1949 డిసెంబరు 11న ఢిల్లీలోని రామలీలా మైదానంలో ఆరెస్సెస్ పెద్ద బహిరంగ సభ జరిపింది. 'హిందూకోడ్ బిల్లు హిందూ సమాజంపై వేసిన అణుబాంబు' అంటూ వక్తలు పేర్కొన్నారు. 'మహిళలకు హక్కులు ఇస్తే హిందూ పురుషులలో మానసిక రోగాలకు, తీరని వ్యధకూ దారి తీస్తుందనీ' గోల్వాల్కర్ పేర్కొన్నారు. వక్తలంతా భారత రాజ్యాంగంపై తీవ్రమైన దాడి చేసారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసారు. పర్యవసానంగా డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో హింసాయుత ప్రదర్శన జరిగింది. ప్రదర్శకులు జవహర్‌లాల్

నెహ్రూ, డా. బి.ఆర్. అంబేద్కర్ దిష్టిబొమ్మల్ని దగ్ధం చేసారు. డా॥ అంబేద్కర్ నివాసంపై దాడికి పూనుకున్నారు.

అయితే హిందూ రాష్ట్ర వాదుల భావనలను జాతీయోద్యమ నాయకత్వం ధీటుగా ఎదుర్కొన్నది. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ వంటి నేతలు జాతీయ కాంగ్రెస్‌లో భారత రాజ్యాంగ ప్రవేశికలోని మౌలిక భావనలకు ఆమోదాన్ని సాధించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ రిపబ్లిక్ భావనలకు పటిష్టమైన చట్రాన్ని రూపొందించేందుకు శ్రమించారు కమ్యూనిస్టులు, సోషలిస్టులు విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనను, దోపిడి లేని సమసమాజ నిర్మాణ కాంక్షనూ జాతీయోద్యమ ఆదర్శాలలో భాగం చేయడంలో కృషి సాధించారు.

గాంధీజీ భారతదేశానికి సొంత రాజ్యాంగం వుండాలన్న ఆలోచనను 1922లోనే వ్యక్తం చేసారు. సంపూర్ణ స్వాతంత్య తీర్మానం ఆమోదించిన తర్వాత రాజ్యాంగ రూపకల్పనా కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపట్టింది. గాంధీజీ సొంతంగా ఒక నమూనా రాజ్యాంగాన్ని రూపొందించినప్పటికీ దానిని పక్కన బెట్టి భారత రిపబ్లిక్ భావనలను పటిష్టం చేయడానికే దోహదం చేసారు. రాజ్యాంగ నిర్ణాయక సభలో జరిగే చర్చలకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ వచ్చారు.

1946 డిసెంబరు 13న రాజ్యాంగరచనాలక్ష్యాలపై జవహర్ లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన తీర్మానం రాజ్యాంగ స్వరూపానికి మౌలిక ప్రాతిపదికను అందించింది. "పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించాలనీ, భావస్వేచ , వ్యక్తీకరణ స్వేచ్ఛ, విశ్వాసాల స్వేచ్ఛ, ఆరాధనా స్వాతంత్ర్యం, ఎంపిక స్వేచ్ఛ, సంఘటితమయ్యే, ఉద్యమించే స్వేచ్ఛ ఉండి తీరాలని" నెహ్రూ ప్రతిపాదించారు.

"సామాజిక హోదాలో, అవకాశాలలో సమానత్వం ఉండాలని, వ్యక్తి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలనీ, జాతీయఐక్యత, సౌభ్రాతృత్వం సామాజికఆదర్శాలు కావాలని'' నెహ్రూ పేర్కొన్నారు.

"భారత దేశం మెజారిటేరియన్ దేశంగా వుండజాలదని, మైనారిటీ ప్రజల, వెనుకబడిన, అణగారిన ప్రాంతాలకూ, ప్రజలకూ రాజ్యాంగబద్ధమైన రక్షణలు కల్పించాల్సిన అవసరాన్ని" నెహ్రూ నొక్కి చెప్పారు.

"దేశ సమగ్రతను, అఖండతనూ, ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటూనే, నాగరిక దేశాల న్యాయ చట్టాల వెలుగులో ప్రపంచ శాంతి, సకల మానవాళి సంక్షేమం కోసం, ఇష్టపూర్వకం గా భారత దేశం కృషి చేస్తుందని" నెహ్రూ స్పష్టం చేసారు.

రాజ్యాంగరచనా కాలంలోనే డా॥బి.ఆర్.అంబేద్కర్ హిందుత్వ విషయంలో చాలా స్పష్టమైన వైఖరి తీసుకున్నారు.

"హిందూ రాష్ట్ర వాస్తవరూపం ధరిస్తే మన దేశానికి అదో గొప్ప విపత్తు అవుతుంది. హిందువులు తమ గురించి తాము ఏమి చెప్పుకున్నప్పటికీ హిందూయిజం అనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావనలకు తీవ్ర ప్రమాదకరమైనది. ఆ కారణం చేతనే హిందూయిజం ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రమూ సరిపడనిది, హిందూ రాజ్యం ఏర్పాటును ఎదుర్కొని తీరాలి" అంటూ అంబేద్కర్ సంకల్పం చెప్పారు.

హిందూ కోడ్ బిల్లు సందర్భంగా ఆచార్య కృపలానీ చేసిన వ్యాఖ్య కూడా చాలా ఆసక్తికరంగా వుంది. "మహిళలకు హక్కులు ఇస్తే హిందూమతం ప్రమాదంలో పడుతుందని చెప్పడం పసలేని వాదన! హిందువులు దొంగతనాలు, వ్యభిచారాలు, రౌడీయిజమూ చేస్తుంటే మతానికి ప్రమాదం జరగడం లేదా? హిందువులు నల్లబజారునూ, లంచగొండితనాన్ని ప్రోత్సహిస్తుంటే ప్రమాదం లేదా? ప్రాచీన ఆచారాలలో కాలానుగుణ్యంగా లేని ఒక చట్టాన్ని మార్చాలనుకునే సరికి మతం ప్రమాదంలో పడిపోయిందా? హిందుత్వవాదుల అత్యుత్సాహాన్ని హిందూమతంలోని ఉన్నతాదర్శాల పరిరక్షణ కోసం వినియోగిస్తే మంచిది" అంటూ జె బి కృపలానీ విరుచుకుపడ్డారు.

గాంధీ, అంబేద్కర్, కమ్యూనిస్టుల ఆలోచనలలో ఎన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికి భారత రాజ్యాంగ ప్రవేశికలోని ఆదర్శాల విషయంలో పూర్తి ఏకాభిప్రాయం వుందని నాటి చర్చల సరళిని చూస్తే తేటతెల్లం అవుతుంది. ప్రజాస్వామ్యం, మతసామరస్యం, సామాజిక న్యాయం, ఇరుగు పొరుగు దేశాలతో శాంతియుత సహజీవనం, కుల, మత, ప్రాంతీయ భాషా, లింగ వివక్షలకు ఆస్కారం లేని సమాజం లక్ష్యాలుగా మన గణతంత్రం రూపొందాలని జాతీయోద్యమ నేతలు సంకల్పించారు. బహుళత్వం, వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం వంటి అత్యున్నత విలువలకు వారు పెద్ద పీట వేసారు.

భారత రాజ్యాంగ ప్రవేశికలోని సకారాత్మక భావనలను వ్యతిరేకించింది హిందూ రాష్ట్రవాదులు మాత్రమే! భారత జాతీయ వాదాన్ని హిందూ ఆధిక్యతా జాతీయవాదంగా మార్చడానికి హిందూ మహాసభ, ఆరెస్సెస్ గట్టి ప్రయత్నం చేసాయి. అయితే హిందూ మెజారిటేరియన్ వైఖరి ప్రజాస్వామ్య మూల సిద్ధాంతాలకే విరుద్ధమని గాంధీజీ, నెహ్రూ, పటేల్, అంబేద్కర్ గట్టిగా భావించారు. అందుకే భారత రాజ్యాంగ లక్ష్యాలలో వారు

మనుస్మృతికి స్థానం కల్పించలేదు. పైగా దానిని తీవ్రంగా నిరసించారు. జాతీయోద్యమాన్ని ప్రభావితం చేయడంలో అప్పటికి విఫలమైన హిందూ రాష్ట్ర వాదులు రాజ్యాంగ మౌలిక విలువలకు విరుద్ధమైన భావజాలాన్ని మాత్రం వ్యాప్తి చేస్తూనే వచ్చారు. ద్విజాతి సిద్ధాంతాన్ని సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ తిరస్కరించిన జాతీయోద్యమ నేతలపై హిందూ రాష్ట్ర వాదుల ఆగ్రహానికి సంకేతమే గాంధీజీ హత్య!

హిందూ రాష్ట్ర ఏర్పాటు విషయంలో తమ పరాజయానికి ప్రతీకారంగానే అటువంటి దారుణానికి వారు పూనుకున్నారు ! ఆ తర్వాత కాలంలో ఆర్ఎస్ఎస్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ కమ్యూనిస్టులపై తన సైద్ధాంతిక దాడిని ఎక్కుపెట్టింది. పాశ్చాత్య సిద్ధాంతాలన్నీ నకారాత్మకమైనవని, హిందుత్వ జాతీయ వాదమే సకారాత్మకమైనదని గోల్వాల్కర్ తన బంచ్ ఆఫ్ థాట్స్‌లో పదేపదే చెప్పుకున్నారు. కానీ జాతీయోద్యమంలో, రాజ్యాంగ రచనా కాలంలో హిందూ రాష్ట్రవాదులు పూర్తి నకారాత్మక, విధ్వంస వైఖరిని చేపట్టారు.

రాజ్యాంగ ప్రవేశికలోని మౌలిక భావనలను వక్రీకరిస్తూ అవాస్తవాలను అర్ధ సత్యాలను, కాల్పనిక కట్టుకథలనూ వ్యాప్తి చేస్తూ హిందూ ఆధిక్య జాతీయవాదాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. డెబ్బయ్ సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ మన దేశంలో ఒక భావోద్వేగ, మేధో వక్రీకరణకు పాల్పడుతూ వచ్చింది. స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమ ఆదర్శాలు అమలుచేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యింది. రాజ్యాంగ లక్ష్యాలను విస్మరించింది. ఎన్నికల లబ్ది కోసం మతోన్మాదంతో కాంగ్రెస్ లాలూచీ పడింది. కాంగ్రెస్ పార్టీ అవకాశవాద విధానాల పర్యవసానంగా పుంజుకున్న మతోన్మాద శక్తులు బరి తెగించాయి. దాంతో హిందూ రాష్ట్ర వాదులు మరోసారి విజృంభించారు. హిందూత్వమే నిజమైన భారతీయత అని నమ్మించేందుకు ఆరెస్సెస్ విశ్వప్రయత్నం చేస్తూ వచ్చింది. ఫలితమే నేటి పరిస్థితి.

నరేంద్రమోదీ, అమిత్‌షా సారథ్యంలోని ప్రస్తుత ప్రభుత్వం జాతీయోద్యమ ఆదర్శాలకు విరుద్ధమైన మార్గంలో భారతీయ సమాజాన్ని నడిపించాలని ప్రయత్నిస్తోంది. తమ మార్గానికి అవరోధంగా వున్న భారత రాజ్యాంగ ప్రవేశికలోని మౌలిక భావనలపై నిరంతరం దాడి చేస్తోంది. గాంధీజీని ఎంతమాత్రమూ ఇష్టపడని హిందూ రాష్ట్రవాదులు భారతీయ సమాజంపై ఆయన ముద్రని చెరపలేకపోయారు. అలాగే జవహర్‌లాల్ నెహ్రూని పెద్ద దుష్టశక్తిగా చిత్రీకరించాలని ప్రయత్నిస్తూ వచ్చారు. రాజ్యాంగం అంటే ఎంత మాత్రమూ గౌరవం లేకపోయినా బి.ఆర్. అంబేద్కర్ని తమ నెత్తిన పెట్టుకుంటున్నారు. కమ్యూనిస్టులపై ఆరెస్సెస్ వారికున్న ద్వేషం, అసూయ కొత్తవి కావు.

భారత రాజ్యాంగాన్ని నీరు కార్చి మనుస్మృతిపై ఆధారపడిన హిందూ ఆధిక్యతా జాతీయవాదాన్ని ప్రతిష్టించడానికి హిందూ రాష్ట్ర వాదులు ప్రయత్నిస్తున్నారు. మోసపూరితంగా గాంధీ, అంబేద్కర్‌లను నెత్తిన పెట్టుకుంటున్నారు. నెహ్రూని, కమ్యూనిస్టులను అపఖ్యాతి పాలు చేయడానికి అబద్ధపుప్రచారాలకు తెగబడుతున్నారు. సావర్కర్‌ని హీరోగా తయారుచేస్తున్నారు.

అయితే హిందూరాష్ట్రవాదుల నకారాత్మక భావనలను స్వీకరించడానికి భారతీయ సమాజం సిద్ధంగా లేదు. ఎన్నికల విజయాలు, ప్రచారంలో సాధించే పై చేయి హిందుత్వవాదుల బలానికి చిహ్నం కాదు. గత ఆరేళ్ళలో భారతీయ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు జరిగిన తీరని హానికి వారే బాధ్యులని ప్రజలు గ్రహిస్తున్నారు.

దారిద్ర్యం, నిరుద్యోగిత, సంపద పంపిణీలో పెరుగుతున్న వ్యత్యాసాలు, పర్యావరణ విధ్వంసం, రాజ్యాంగ వ్యవస్థల నిష్క్రియాపరత్వం, మానవాభివృద్ధి సూచికలలో వెనుకబాటుతనం, దేశంలో పెరుగుతున్న అసహనం, అభద్రత వంటివి ప్రజల్ని వేధిస్తున్నాయి. మైనారిటీలు, దళితులు, మహిళలపై పెచ్చుమీరిన అత్యాచారాలు సామాజికజీవితాన్ని అశాంతిమయం చేస్తున్నాయి. ప్రచారమూ, ఎన్నికలు, ఇరుగుపొరుగు దేశాలతో కయ్యాలు, నకిలీ దేశభక్తి, కృత్రిమ జాతీయవాదం ద్వారా సంపూర్ణ ఆధిపత్యం సాధించాలనే తపన తప్ప బీజేపీకి పాలనపై ఎంత మాత్రమూ శ్రద్ధ లేదు.

సిఎఎ వ్యతిరేక ఆందోళన, రైతుల ఆందోళన, మతోన్మాదాన్ని ప్రతిఘటించడానికి మైనారిటీలు, దళితులు పోరాటాలకి కదలడం, కార్పొరేటీకరణకు, కార్మిక చట్టాలను నీరు కార్చే సంస్కరణలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు దిగడం వంటివి ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా కన్పిస్తున్న కొన్ని సంకేతాలు మాత్రమే !

జాతీయోద్యమ ఆదర్శాల, రాజ్యాంగ మౌలిక లక్ష్యాల పరిరక్షణకు మరో జాతీయోద్యమం రూపొందుతున్న క్రమం ఆవిష్కారమవుతోంది. భారత రాజ్యాంగ రూపకల్పన ద్వారా హిందూ రాష్ట్రవాదుల పన్నాగాలను తిప్పి కొట్టిన శక్తులు మరోసారి హిందుత్వను ఎదుర్కోవాల్సిన తరుణం వచ్చింది. జాతీయోద్యమ ఆదర్శాల కోసం దేశంలోని ప్రజాసామ్య, లౌకిక, వామపక్ష శక్తులు చేతులు కలపాలి. భారత రిపబ్లిక్‌ను రక్షించుకోవడం ద్వారానే హిందూరాష్ట్రను ఎదుర్కోగలం ! ❑


శ్రీ అన్నపూర్ణ
స్టూడెంట్స్ మెస్
శాఖాహార భోజనశాల
Republic Day
వివాహాది
శుభకార్యములకు
క్యాటరింగ్
సౌకర్యం కలదు
ప్రో॥ సముద్రపు సత్యం
శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానం దగ్గర, బోసురోడ్, తెనాలి
9866943202, 7793932444



# మీడియాను మింగేస్తున్న కార్పొరేటీకరణ, కాషాయీకరణ

**కోసూరి అమర్‌నాథ్**
Scribes News సంపాదకులు
ప్రెస్ కౌన్సిల్ మాజీ సభ్యులు

వంసం 71వ గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో మీడియా తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తోందా లేదా అని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇది. మీడియాను ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభం అంటాం. అలాంటప్పుడు మీడియా దేశ సార్వభౌమాధికారాన్ని, సెక్యులర్, సోషలిస్టు, ప్రజాస్వామ్య ఆదర్శాలను పరిరక్షిస్తోందా అని బేరీజు వేసుకోవాలి. ఎందుకంటే మన దేశం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అంటాం. ప్రజాస్వామ్య వ్యవస్థకు కాపలాదార్లుగా ఉండవలసిన పత్రికా రచయితల నడవడిక, నిర్వహిస్తున్న పాత్ర ఎలా ఉన్నాయో కూడా ఆలోచించుకోవాలి.

ప్రపంచంలో అత్యంత ఎక్కువ ప్రతులు అమ్ముడయ్యే పత్రిక అని చెప్పుకుంటున్న టైంస్ ఆఫ్ ఇండియాను నడిపే బెన్నెట్ కోల్మన్ ప్రధాన కార్యనిర్వహణాధికారి ఒకసారి "మేం వాణిజ్య ప్రకటనల వ్యాపారం చేస్తున్నాం. వార్తలు కేవలం దానికి ఆనుషంగికమైనవే" అన్నాడు. ఈ వ్యాఖ్యలు గుత్త వ్యాపార వర్గాల చేతిలో ఉన్న మీడియా వైఖరి ఏమిటో స్పష్టం చేస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం ఈ ధోరణి మరింత ప్రస్ఫుటంగాకనిపిస్తోంది.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అంటే నెహ్రూ ప్రవచించిన ఉదారవాద, ప్రజాస్వామ్య భావనల ఆధిపత్యం కొనసాగిన సమయంలో మీడియా కనీసం వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ వంటి ప్రజాస్వామ్య భావాల ముసుగైనా కప్పుకున్నట్టు కనిపించేది. తమ వ్యాపారానికి అడ్డు తగలనంత వరకు సంపాదకులకు స్వేచ్ఛ ఇచ్చేది. కమ్యూనిస్టు పార్టీ గొప్ప నాయకుడు, ఉత్తమ పర్లమెంటేరియన్ భూపేశ్ గుప్తా అ అలాంటి మీడియాను "ఝూట్ ప్రెస్" అని చమత్కరించేవారు. పత్రికాధిపతులు జనపనార మిల్లుల ద్వారా అపారంగా డబ్బు సంపాదించేవారు. జనపనార మిల్లులున్నవారు నడిపే పత్రికలను జ్యూట్ ప్రెస్ అనే వారు. ఆ మాటనే కాస్త మార్చి భూపేశ్ గుప్తా ఝూట్ ప్రెస్ అనే వారు.

ప్రముఖ పత్రికలు శ్రామికవర్గ, రైతుల, బడుగు జీవుల ప్రయోజాలను పరిరక్షించడం లేదని గ్రహించిన ఎడతాత నాయాయణన్, నిఖిల్ చక్రవర్తి లాంటి ప్రముఖ పత్రికా రచయితలు 1960లలో పేట్రియట్, లింక్, మెయిన్ స్ట్రీం లాంటి ప్రత్యామ్నాయ పత్రికలను ప్రారంభించారు. ఆ రకంగా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేవారు. నోరు లేని కోట్లాది మంది భావప్రకటనా స్వేచ్ఛా హక్కుని సాధించడానికి పత్రికా రచయితలు సహకార రంగంలో పత్రికలు నడపాలని ప్రసిద్ధ సంపాదకుడి ఎం. చలపతిరావు చెప్పేవారు. ఆ స్ఫూర్తితోనే అయోధ్య నుంచి జనమోర్చా, చెన్నై నుంచి న్యూస్‌టుడే పత్రికలు వెలువడ్డాయి.

ప్రజల దృక్కోణాన్ని ప్రోత్సహించడం కోసం వామపక్షాలు వివిధ భాషల్లో పత్రికలు నిర్వహించాయి. వీటిలో కొన్ని ప్రసిద్ధమైనవి. ఇప్పటికీ అలాగే ఉన్నాయి. కార్పొరేట్ పత్రికల నుంచి విపరీతమైన పోటీ ఎదుర్కోలేక, ఆదాయం చాలక ఇలాంటి కొన్ని పత్రికలు కనుమరుగైనాయి. ఎందుకంటే కార్పొరేట్ సంస్థలు అపారంగా డబ్బు గుమ్మరించగలవు. ఎం.చలపతి రావు, ముద్దుకూరి చంద్రశేఖరరావు, సి.రాఘవాచారి వంటి వారు ఈ ప్రత్యామ్నాయ పత్రికలకు సంపాదకులుగా ప్రసిద్ధులయ్యారు. వీరిని మీడియాలోని అన్ని వర్గాలవారు, మేధావులు గౌరవించేవారు. నెహ్రూ నెలకొల్పిన నేషనల్ హెరాల్డ్ పత్రికలో సుదీర్ఘకాలం పని చేసిన ఎం.చలపతిరావును సంపాదకులకే సంపాదకుడు అనే వారు. ఎందుకంటే ఆయన "వార్త పవిత్రమైంది. వ్యాఖ్య మీ ఇష్టం" అన్న సూక్తికి కట్టుబడి ఉన్నారు.

## ఎలక్ట్రానిక్, వెబ్ మీడియా

విషయ ప్రసార మాధ్యమాలు శరవేగంగా అభివృద్ధి చెందడంతో ముద్రణా మాధ్యమాన్ని వెనక్కు నెట్టేసి టీవీ, డిజిటల్ మాధ్యమాలు దూసుకెళ్తున్నాయి. పాలకపక్షాలు ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ మంత్రజపం చేయడంతో టీవీ చానళ్లు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఒక అంచనా ప్రకారం దేశంలో ఇంగ్లీషు, ఇతర భాషల్లో కలిపి 250కన్నా ఎక్కువ టీవీ వార్తా ఛానళ్లు ఉన్నాయని అనుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో మిగతా అన్ని చోట్లకన్నా ఎక్కువగా 30 చానళ్లకన్నా ఎక్కువ ఉన్నాయి. ఇంటర్నెట్, యూట్యూబ్ చానళ్లు కుప్పతెప్పలుగా వెలిశాయి.

## కార్పొరేట్, రాజకీయ మీడియా

దేశ రాజకీయ సంస్కృతిపై ధనబలం, కండబలం ఆధిపత్యం చెలాయించడం మొదలైన దగ్గరి నుంచి రాజకీయ వర్గాలు అధికారంలోకి రావడానికి, దాన్ని నిలబెట్టుకోవడానికి ప్రసార మాధ్యమాల్లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ప్రజలకు చేరువ కావడానికి అనేక ప్రాంతీయపార్టీలు వార్తా పత్రికలను, వార్తా చానళ్లను ప్రారంభించాయి. దేశమంతటా విస్తరించి ఉన్న అధికార పక్షాలు పెద్ద మీడియా సంస్థలు ఎదగడానికి, వాటి వ్యాపారాభివృద్ధికి సహకరించి వారికి ఎగువసభల్లో స్థానం కల్పించి ఆ మీడియా సంస్థల మద్దతు సమకూర్చుకున్నాయి. పత్రికా రచయితలకు ఉద్యోగ భద్రత కల్పించే వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని రద్దు చేయక ముందు కూడా ఇష్టానుసారం ఉద్యోగులను నియమించుకోవడం, తొలగించే విధానం మీడియా పరిశ్రమలో అమలులో ఉంది. దీనివల్ల సంపాదకులు, పత్రికా రచయితలు యాజమానుల లేదా మేనేజర్ల అడుగులకు మడుగులొత్తాల్సి వచ్చింది. లేకపోతే ఉద్యోగం కోల్పోవడానికి సిద్ధపడాలి. డబ్బిచ్చి వార్తలు రాయించుకోవడం పరిపాటి అయిపోవడంతో మీడియా విశ్వసనీయత ప్రశ్నార్థకమైంది.

## కోవిడ్ విపత్తు

కోవిడ్ అంటువ్యాధి వ్యాపించిన తరవాత ఒక ప్రణాళిక లేకుండా, హఠాత్తుగా లాక్ డౌన్ విధించడంతో ఆర్థిక వ్యవస్థ గందరగోళంగా తయారైంది. దీనికీ మీడియా పరిశ్రమ కూడా మినహాయింపు కాదు. పత్రికలకు రాబడి తగ్గిపోవడంతో అన్ని రకాల మీడియా సంస్థలు వందలాది మంది పత్రికా రచయితలను ఉద్యోగాలనుంచి తొలగించారు. లేదా వారి వేతనాల్లో కోత పెట్టారు. పత్రికా సంస్థలు పేజీలు తగ్గించాయి. వార్తా సేకరణా తగ్గిపోయింది. దీనితో స్థానిక వార్తలు అందిస్తూ వార్తా సంస్థలకు జీవధారగా ఉన్న వేలాదిమంది పార్ట్ టైం పత్రికా రచయితలు జీవనోపాధి కోల్పోయారు. అందువల్ల కొన్ని డిజిటల్ మీడియా సంస్థలు మినహా ముద్రణా మాధ్యమం, ఎలక్ట్రానిక్ మీడియా అమాంతం లాక్ డౌన్ విధించడంతో జనం పడుతున్న కష్టాలను ప్రజలకు తెలియజేయలేకపోయాయి. ఉపాధి, గూడు కోల్పోయిన వందలు వేల వలస కార్మికులు రైళ్లు, ఇతర రవాణా సదుపాయాలు నిలిచిపోయినందువల్ల కాలినడకన వందలాది కిలోమీటర్లు నడిచి స్వస్థలాలకు వెళ్లారు. ఈ క్రమంలో అనేక మంది ప్రాణలు పోగొట్టుకున్నారు.

కరోనా విపత్తును ఎదుర్కోవడంలో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల వైఫల్యాన్ని కప్పి పుచ్చి వార్తా ఛానళ్లు మతోద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశాయి. కరోనా వ్యాధిని వ్యాపింపచేసింది తబ్లీగీ జమాత్ వారేనని దుష్ప్రచారం చేశాయి. కొన్ని మీడియా సంస్థలైతే మరో అడుగు ముందుకు వేసి "జిహాదీ సూపర్ స్ప్రెడర్స్"(అంటువ్యాధులు వ్యాపింపచేసే జిహాదీలు) అన్న మాట చెలామణిలో పెట్టారు. ఆ తరవాత ఈ ఆరోపణలు, తప్పుడు సమాచారాన్ని న్యాయవ్యవస్థ తోసిపుచ్చింది. కానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగింది. అధికార యంత్రాంగం వైఫల్యాలను బయటపెట్టిన పత్రికా రచయితలు, సంపాదకులు దేశద్రోహం కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది. ఈ విషయంలో న్యాయవ్యవస్థ ఏ మాత్రం తోడ్పడలేదు. ప్రభుత్వ అనుకూల, అహంకారపూరితుడు అయిన రిపబ్లిక్ టీవీ ఆంకర్, యజమాని అయిన వ్యక్తిని వార్తలకు సంబంధంలేని కేసులో అరెస్టు చేస్తే ఉన్నత న్యాయస్థానం హడావుడిగా ఆయనను ఆదుకుంది. హత్రస్‌లో సామూహిక అత్యాచారం గురించి వార్త సేకరించడానికి వెళ్తుండగా మలయాళీ పత్రికా రచయిత సిద్ధీఖ్ కప్పన్‌ను అరెస్టు చేస్తే జామీనుకోసం కింది కోర్టులను సంప్రదించాలని ఉన్నత న్యాయస్థానం సూచించింది.

## గోదీ మీడియా

కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని సమర్థించే, వ్యవసాయంలో కార్పొరేట్లకు ప్రవేశం కల్పించడం మొదలైన అంశాలకు సంబంధించి మూడు వివాదాస్పద చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టినప్పుడు మీడియాలో ఒక వర్గం కేంద్ర ప్రభుత్వం రీతిలోనే ఉద్యమకారుల్లో ఖాలిస్థానీలు, అర్బన్ నక్సలైట్లు, రైతులు కానివారు ఉన్నారని ప్రచారం చేసింది. ఉద్యమాన్ని అవహేళన చేస్తూ అనేక కథనాలు ప్రచురించారు. ప్రసారం చేశారు. ఈ దుష్ప్రచారంతో రైతులు ఎంతగా విసిగిపోయారంటే ఆందోళన కొనసాగిస్తున్న రైతులు "గోదీ మీడియా మా వార్తలు రాయనక్కర్లేదు" అని బ్యానర్లు కట్టారు. పోస్టర్లు అతికించారు. అలాంటి వార్తా సంస్థల సిబ్బందిని వెనక్కు పంపించేశారు కూడా. వారి ప్రచారం ఎంత విషపూరితంగా తయారైందంటే భారత సంపాదక మండలి (ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా), ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ.జె.యు.) ఆందోళనకారుల విషయంలో ఇలాంటి దూషణపూరిత భాష ఉపయోగించకూడదని సూచించవలసి వచ్చింది. దేశ రాజధానిలో రైతుల నిరసనకు సంబంధించిన వార్తల విషయంలో కొన్ని పత్రికల తీరుకు ఎడిటర్స్ గిల్డ్ కలత చెందుతోందని, కొన్ని మీడియా వ్యవస్థలు ఉద్యమకారులను, ''ఖాలిస్థానీలు'',

"దేశద్రోహులు" అని ముద్ర వేస్తున్నాయని ఎడిటర్స్ గిల్డ్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఏ రుజువులూ లేకుండా ఇలా తూలనాడుతున్నారని ఆ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సంస్థలు న్యాయంగా, నిరపేక్షంగా, సమతూకంతో వ్యవహరించాలని; పక్షపాత దృష్టితో వ్యవహరించకూడదని విజ్ఞప్తి చేసింది. రైతులు రాజ్యాంగం ప్రసాదించిన తమ హక్కులను వినియోగించుకుని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని అభిప్రాయపడింది. అసమ్మతిని అవమానించడంలో మీడియా భాగస్వామి కాకూడదని, ఆందోళన చేస్తున్న వారి వస్త్రధారణను, జాతిని దృష్టిలో ఉంచుకోకూడదని తెలియజేసింది. న్యాయమైన, నైతికమైన పత్రికారచన కొనసాగించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సలహా ఇచ్చింది.

## ట్రాలీ టైంస్

మీడియాలో ఒక వర్గం కొనసాగిస్తున్న అసత్యప్రచారాన్ని, దూషణను ఎదుర్కోవడానికి ఆందోళన చేస్తున్న రైతులు నాలుగు పేజీల "ట్రాలీ టైంస్" పత్రికను పంజాబి, హిందీ భాషల్లో వెలువరించారు. రైతులకు వ్యతిరేక ప్రచారం చేస్తూ, మోదీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంటు చేత మమ అనిపించిన చట్టాలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆందోళనను అపఖ్యాతి పాలు చేస్తున్న వారి బండారం బయటపెట్టడానికి ఈ పత్రిక వెలువరించడం అద్భుతమైన ఆలోచన. సంస్కరణల మిషతో, కార్పొరేట్ వర్గాలు సులువుగా వ్యాపారం చేసుకోవడానికి అనువుగా ప్రభుత్వం ఆదరాబాదర ఈ శాసనాలు తీసుకొచ్చింది. ఈ పత్రిక మొదటి సంచిక పతాక శీర్షిక "జుడేంగే, లడేంగే, జీతేంగే".

రైతు సంఘాల నాయకులు, ఆందోళన చేస్తున్న రైతులు తీసిన ఫొటోలు, గీసిన కార్టూన్లు, రాసిన కవితలు, వార్తలు, అభిప్రాయాలు ఈ పత్రికలో ప్రచురించారు. ఒక రైతు ట్రాక్టర్ మీద కూర్చొని చదువుతున్న పత్రికలో "ఇంఖిలాబ్ ది తల్వార్ విచారణ్ ది శాన్ తే తెజ్ హోంది ఏ" శీర్షిక ఉంది. ఇది భగత్ సంగ్ అన్న మాట. "తమ మీద గోదీ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి రైతులు తమ పత్రిక తామే నడుపుకోవలసి రావడం సిగ్గు చేటు" అని ఎన్.డి.టి.వి.కి చెందిన రవీశ్ కుమార్ వ్యాఖ్యానించారు.

## మీడియా కాషాయీకరణ

తమకు వత్తాసు పలికే టీవీ చానళ్లు, వార్తాపత్రికల దండుతో కలిసి మీడియాను కాషాయీకరించడానికి అధికారంలో ఉన్న బీజేపీ, సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమకు బ్రహ్మాండమైన మెజారిటీ ఇచ్చారు కనక తమకు అనుకూలమైన వాదనలు చేయడం సబబే అని సమర్థించుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అనుసరిస్తున్న దృక్కోణాన్ని మీడియా విడనాడాలనీ, మీడియాకు జాతి విషయంలో బాధ్యత ఉందని చెప్తున్నారు. "రాజ్యాంగ చట్రం" మేరకే మార్పులు వస్తున్నాయనీ, ఈ మార్పులు పాత పద్ధతిలో ఆలోచించేవారికి మింగుడు పడడం లేదని అంటున్నారు.


"కొంత కాలంగా మన దేశంలో మీడియా ఒక వైఖరి అనుసరిస్తోందని, దీనిని వ్యాఖ్యాతలు వామపక్షాలు, ఉదారవాదుల వేపు మొగ్గే మీడియా అంటున్నారు" అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎం.వి.కామత్ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం చేస్తూ వ్యాఖ్యానించారు. ''అయితే మీడియా గతంలో సంతరించుకున్న దృక్కోణాన్ని కొనసాగిస్తే, మారుతున్న దృక్పథాన్ని గమనించకపోతే సమస్య తలెత్తుతుంది" అని ఆయన అన్నారు. లేని విచ్ఛిన్నకర దృక్కోణం పేరుతో జాతీయతా దృక్పథాన్ని బలహీనపరచడం సరైంది కాదని కూడా ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రతి అంశాన్ని విచ్ఛిన్నకర దృష్టితో చిత్రీకరించడం శక్తిమంతమైన, పునరుజ్జీవం పొందవలసిన, అభివృద్ధి చెందుతున్న భారత్ నిర్మించాలన్న లక్ష్యానికి విఘాతం కలుగుతుంది అని ఆయన హెచ్చరించారు.

## సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం

సామాజిక మాధ్యమాలలో సత్యాసత్యాలను బేరీజు వేయ కుండా దురుద్దేశంతో సమాచారం అందించడం దురదృష్టకరం. తమ ఎజెండాను ముందుకు తోయడానికి ఈ పని చేస్తున్నారు. ఈ విషయాన్ని గురించి గత ఏడాది నవంబర్ 16న పత్రికా దినోత్సవం సందర్భంగా వెబ్ ఆధారంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రెస్ అకాడమీ అధ్యక్షులు న్యాయమూర్తి సి.కె. ప్రసాద్ "కేవలం వదంతుల మీద ఆధారపడ్డ సమాచారానికి పత్రికా రచయితలు చోటివ్వకూడదు. పత్రికా రచయితలు సమాచారానికి కాపలాదారులుగా ఉండాలి. వాస్తవాలు, వదంతుల మధ్య తేడా గమనించాలి. క్లిష్టమైన సమయంలో వదంతులను చెలామణిలో పెట్టకూడదు. ఒక్కొక్క సారి ఒక సమాచారమే ప్రాణాంతకంగా మారవచ్చు. శాంతికి భంగం కలిగించవచ్చు. సత్యం, కచ్చితత్వం, న్యాయవర్తన, నిష్పక్షపాతం, మానవతావేదం, సేవాభావం మీడియాలో పని చేసేవారు గుర్తుంచుకోవలసిన అంశాలు" అని ఆయన అన్నారు. ❑

# చరిత్ర, విద్య, సాంస్కృతిక రంగాలలో కాషాయీకరణ

**వకుళాభరణం రామకృష్ణ**
విశ్రాంత చరిత్ర ఆచార్యులు
హైదరాబాద్ విశ్వవిద్యాలయం



మతతత్వం (కమ్యూనలిజం) ఆధునిక యుగంలో తలెత్తిన ఒక భావజాలం. ఒక కుహనా చైతన్యం (False consciousness) గా నిర్వచించవచ్చు. ఒక మతానికి చెందిన వారందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు, ఒకే విధమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలుంటాయని మతతత్త్వం భావిస్తుంది. వాస్తవానికి అలా వుండదు. "మతాన్ని విశ్వసించే ప్రజల మధ్య ఎన్నో వైరుధ్యాలుండవచ్చు. ఉంటాయి కూడా మతతత్వ నిర్వచనాన్ని యింకొంచెం విస్తరించుకుంటూ పోతే అది అధికార వర్గాలకు పనికొచ్చే రాజకీయ పనిముట్టుగా కూడా చెప్పుకోవచ్చు. దేశంలోని పరిమిత ఆర్థిక వనరుల కోసం జరిగే పోటీలో స్వార్థపర శక్తులకు మతతత్త్వం ఎంతో ఉపకరిస్తుంది.

మత భావం వేరు. మతంపై ఆసక్తి, అభినివేశం వేరు. మత విశ్వాసాలు ఒక వ్యక్తి ప్రైవేటు జీవితంలో కలిగి వుండటమూ వేరు. దీనికీ, మతతత్త్వానికి పొంతన లేదు. ఇవ్వాళ మన దేశ రాజకీయాల్లో, సామాజిక సంబంధాల్లో మతతత్త్వం తామర తంపరగా అల్లుకుపోయింది. దీన్ని బి.జె.పి లాంటి కొన్ని రాజకీయ పార్టీలు రాజ్యాధికారం కోసం, ఒక ప్రత్యేక జాతి గుర్తింపు కోసం వాడుకొంటున్నారు. కేవలం మతాన్ని రాజకీయాధికారం కోసమే గాక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో మత మౌఢ్యాన్ని పెంపొందించడం కోసం కృషి చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యవధిలో మతం పునాదిగా నిర్మించిన సామాజిక చైతన్యం, రాజకీయ ప్రయోజనానికి దోహదం చేస్తుందన్న అంశాన్ని వీరు గుర్తించారు.

భారతదేశంలో మతతత్త్వం వలసపాలనలో మొదలైందని స్థూలంగా చెప్పుకోవచ్చు. మత సంఘటన, మత సమీకరణ అప్పటి నుండే ఆరంభమయ్యాయి. భారతీయుడంటే హిందువు అని, భారతదేశం హిందూదేశమని పరిగణించే ఆలోచనా బీజాలు అప్పుడే మొలకెత్తాయి. నేడు మన సమాజంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే, వర్తమాన రాజకీయావసరాలకు గతాన్ని, మతాన్ని ఉపయోగించటం, మత సమీకరణ హిందూ మత భాష్యాలతో జరుగుతుండడం మనం గమనిస్తాం. అయితే హిందూ మతం అనబడేది అనాది నుండి ఉందా? ఆ మాటకొస్తే హిందూ అనే పదం అరబ్బులు సింధ్ ప్రాంతాన్ని ఆక్రమించాక, సింధు నదిని 'ఇండస్' అని పిలిచారు. ఆ పదం నుండే 'హిందు' అనే పదం పుట్టుకొచ్చింది. అంతకు ముందు భారతీయ సాహిత్యంలో – లౌకిక, పారమార్థిక గ్రంథాల్లో ఈ పదాన్ని మనం గమనించం. పందొమ్మిదో శతాబ్దంలో ప్రాచ్యవాదులు (Orientalists) హిందూమతాన్ని ఒక ప్రత్యేక మతంగా ముందుకు తీసుకొచ్చారు. హిందూ మతం అనబడే మత భావజాలం రెండు సమాంతరాలుగా భారతీయ సంస్కృతిలో వుంటూ వచ్చింది. హిందూ మతం ఏకైక చారిత్రక పరిణామంగా రూపొందలేదు. ప్రముఖ చరిత్రకారులు రొమిలా థాపర్, హిందూ, మహమ్మదీయ మతాలను రెండు ఊహాజనితమైన సమాజాలుగా (Imagined commuinites) సిద్ధాంతీకరించారు. ఆవిడతో పాటు ఇంకా అనేక చరిత్రకారులు, ఆర్.ఎస్.శర్మ మొదలగువారి అభిప్రాయంలో హిందూ మతానికి చారిత్రకత ఇటీవల సంక్రమించింది. దేశ చరిత్రలో అనేక రాజ్యాలను పరిపాలించిన రాజులెవ్వరూ తాము హిందువులని చెప్పుకోలేదు. మనమైన గత చరిత్ర కలిగిన ఏకైక మతం హిందూమతం కాదు. అప్పట్లో అంటే ఆధునిక యుగానికి పూర్వం. ఈ మత భావనలను బ్రాహ్మణీయ మతంగా లేక వైదికమతంగా వర్ణించటం జరిగింది. అప్పుడు కూడా ఈ మత భావజాలం దేశీయమైనదిగా, ప్రజలందరికీ చెందినదిగా వుండేది కాదు. వేద కాలం నుండి వైదిక మతానికి భిన్నంగా, సమాజంలో యితరేతర విశ్వాసాలకు చెందిన ప్రజలు వుంటూ వచ్చారు. వారు శ్రమణులు కావచ్చు. బౌద్ధులు కావచ్చు లేదా జైనులు, లోకాయతులు కావచ్చు. భారతీయ సమాజంలోని ఈ రెండు రకాలైన మతధారలు నేటికీ వున్నాయి. గతంలో లేని హిందూ జాతి, వుందని బుకాయిస్తూ, కృత్రిమంగా దాన్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో పరిశీలిస్తే భారతీయ సంస్కృతి ఒక అఖండ పదార్థం కాదు. దాన్ని హిందూ సంస్కృతిగా పేర్కొనడం, చరిత్రను వక్రీకరించడమే కాక తిరస్కరించడం కూడా. యదార్థ లౌకికవాదం పేరుతో మతాన్ని, జాతీయతను ఒకటిగా పరిగణించి దాన్ని హిందూ జాతీయ తత్త్వంగా లేక సాంస్కృతిక జాతీయ తత్త్వంగా చలామణి చేసే ధోరణి బి.జె.పి చేపట్టింది.

నేడు ఈ మతత్వ వాదులు నూరిపోస్తున్న హిందూ జాతీయతావాదానికి మూలాలు 1920 దశకంలో వినాయక్

దామోదర్ సావర్కార్ గ్రంథం 'హిందుత్వ' లో వున్నాయి. సావర్కార్ ప్రవచించిన హిందూత్వం నేటి మతతత్వ వాదులకు వేదం. సావర్కార్ మాటల్లోనే హిందూత్వ నిర్వచనాన్ని తెలుసుకుందాం. హిందువు అంటే సింధూ నది నుంచి సాగరందాకా వున్న భూమిని తన తాతముత్తాతల భూమిగా, పితృ భూమిగా మనసారా భావించే వాడూ, పైపైకి పయనిస్తూ తమలో కలుపుకున్న దాన్నంతా ఉత్కృష్టమయ్యేలా తీర్చిదిద్దుతూ హిందూ ప్రజలు అని వ్యవహారం లోకి వచ్చిన వైదిక సప్త సింధు జాతి రక్తానికి తనను వారసుడిగా భావించేవాడూ, ఒకే మూలభాషా (సంస్కృతం), ఒకే యితిహాసం, ఒకే వాఙ్మయం, ఒకే కళాశిల్పాలూ, ఒకే ధర్మశాస్త్రాలు, ఒకే న్యాయశాస్త్రాలు, ఒకే కర్మకాండా, ఒకే పుణ్యకార్యాలూ, ఒకే సంస్కారాలూ, ఒకే పండుగలూ, ఒకే పబ్బాలూ ద్వారా వ్యక్తమయ్యే ఆ సింధు జాతి సంస్కృతిని తనదిగా భావించేవాడూ, వీటన్నింటికీ మించి ఈ సింధు స్థానాన్ని తన ఆచార్యుల పుట్టినిల్లుగా, గురు మహాత్ముల జన్మ క్షేత్రంగా, పావిత్రయానికీ, పావనత్వానికీ, కాణాచిగా తలచి తన పుణ్యభూమిగా భావించేవాడున్నూ, ఒకే రాష్ట్రమూ, ఒకే జాతీ, ఒకే సంస్కృతీ-యివీ హిందుత్వ లక్షణాలు. (వినాయక దామోదర్ సావర్కర్, హిందుత్వ, పుటలు 122-23).

సావర్కార్ హిందుత్వ నిర్వచనాధారంగా ఆ తర్వాత కాలంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) అధినేత ఎమ్.ఎస్. గోల్వాల్కర్ (ఈయన్నే గురూజీ అని పిలిచేవారు), తాను రాసిన 'Bunch or thoughts we and our Nationhood Defined" అనే గ్రంథాల్లో ఈ అంశాలను మరింత స్పష్టంగా వివరించాడు. వర్ణ వ్యవస్థను గూర్చి ఆయనిలా అంటారు. హిందువుల భావనలో విరాట్ పురుషుడు సర్వశక్తివంతమయిన దేవతామూర్తికి సంకేతం. బ్రాహ్మణులు శీర్షం, క్షత్రియులు బాహువులు, వైశ్యులు ఊరువులు, శూద్రులది పాదస్థానం.... సమగ్ర జీవిత లక్ష్యమైన ఈ చతుర్విధ పురుషార్థాల భావనే ప్రపంచంలో మనకు కీర్తి తెచ్చిపెట్టిందని మనం మరచిపోరాదు." (వక్కాణింపు మాది). అఖండ భారత్ అనే తమ విధాన నినాదానికి గోల్వాల్కర్ యిలా నిర్వచనం చెప్పాడు, - "మాతృదేశం అపూర్వ సమగ్ర స్వరూపం సంతరించుకునేదాకా ఏ పుత్రుడు ఆ విషాదాన్ని (దేశ విభజన) విస్మరించలేదు. విశ్రమించనూ లేదు. ఒకవేళ ఈ విభజన చారిత్రక వాస్తవమైతే దానిని తిరగదోడడానికి మనం వున్నాం. ఈ ప్రపంచంలో వాస్తవానికి, తిరుగతోడరానిదంటూ ఏదీ లేదు." (వక్కాణింపు మాది)

మిశ్రమ, బహుళ సంస్కృతిగా వాసికెక్కిన భారతీయ సంస్కృతిని యీ రీతిలో అఖండ సంస్కృతిగా, దాన్నే హిందూ సంస్కృతిగా వివరించే ప్రయత్నాలు దీనివల్ల మనం గ్రహించ వచ్చు. భారతీయ సంస్కృతిని, అధర్వణ వేదం ఇలా నిర్వచించింది. వివిధ భాషలు మాట్లాడుతూ, వివిధ మతాచారాలు పాటిస్తూ, దేశకాల పాత్రమైన జీవితాలు గరుపుతున్న మనుషుల్ని భరిస్తున్న భూమాతా-పాడి ఆవు నిరంతర క్షీర ప్రవాహంలో తుష్టి చేకూర్చిన విధంగా సహస్ర ముఖాలుగా మమ్మల్ని సంపదలతో సంతుష్టుల్ని చేతువు గాక - (వేదాల పిలుపు. A.C.Bose Bharatiya Vidya Bhavan) వేదాలు సహితం భిన్న మత, జాతులతో కూడిన మిశ్ర సంస్కృతినే వక్కాణించాయి.

హిందూత్వ శక్తుల భావజాలాన్ని స్థాలీకపులి న్యాయంగా తెలుసుకున్నాక, కేంద్రంలో మిత్ర పక్షాలతో కూడి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ, (అంతకు క్రితమే కొన్ని రాష్ట్రాల్లో పరిపాలన సాగించింది) సమాజంలోని అనేక పార్శ్వాలను ఎలా కాషాయీకరిస్తున్నదో (Saffronise) చూద్దాం. చరిత్రను వక్రీకరించడంతో కాషాయీకరణ ఆరంభమైందని చెప్పుకోవచ్చు. చరిత్రను కమ్యూనలైజ్ చేయడం, 19వ శతాబ్దపు తొలి భాగంలో జేమ్స్ మిల్ (James Mill) భారతదేశ చరిత్ర రచనతో ఆరంభమైంది. మొత్తం చరిత్రను హిందూ, మహమ్మదీయ, బ్రిటిష్ యుగాలుగా విభజించి మొదటి రెండు యుగాలకు మతపరమైన పేర్లు పెట్టారు. వాస్తవంలో ఈ విభజన రాష్ట్రీయం కాదు. 'హిందూ యుగంలో అనేక హిందూయేతర రాజ్యాలు, 'మహమ్మదీయ' యుగంలోనూ, ఇస్లామేతర రాజ్యాలూ, రాజ వంశాలు పరిపాలించాయి. వలస పాలనా కాలాన్ని యిదే క్రమంలో జేమ్స్ మిల్ క్రైస్తవ యుగంగా పేర్కొనక, దాన్ని బ్రిటిష్ యుగంగా భాసించాడు. శాస్త్రీయ దృక్పథం చరిత్ర రచనలో ప్రవేశపెట్టాక (యిది ధర్మానంద కొశాంబితో ఆరంభమైంది.) ప్రాచీన (Ancient), మధ్యయుగ (Medieval), ఆధునిక (Modern) దశలుగా యుగ విభజన జరిగింది.

జేమ్స్‌మిల్ యుగవిభజన వెనకాల వలసవాద ప్రయోజనాలు యిమిడి వున్నాయి. ఒకటి, భారతదేశంలో ప్రజల్ని మతపరంగా చీల్చడం, రెండు భారతీయుల్ని చిన్న సమాజాలుగా పరిగణించడం కాగా, మూడు ఆంగ్ల పాలనకు ముందున్న పాలన (ప్రధానంగా ముస్లిములది) నిరంకుశమనీ, అనాగరికమని చెప్పడం. తద్వారా తమ పాలన నాగరికమైందనీ, ఆధునికమైందనీ, కొత్త సంస్కృతి, ప్రజాస్వామ్య భావాలతో కూడినదని చెప్తూ చరిత్ర ద్వారా ప్రజల మనోభావాల్ని ప్రభావితం చేయడం వలస పాలన కేవలం సైనిక

బలం ద్వారానే కొనసాగలేదు. ఏ పాలనా అలా సాగదు. భావజాలం (Ideology) నూరిపోయడం ద్వారా, సమాజంపై ఆధిపత్యాన్ని (Hegemony) సాధిస్తుంది. (ఇప్పుడు జరుగుతున్న కాషాయీకరణ అదే క్రమంలో జరుగుతోందని మనం గుర్తుంచుకోవాలి).

భారతదేశ చరిత్ర రచనకు ఆధునిక కాలంలో శ్రీకారం చుట్టిన వలస పాలకుల ధోరణినే జాతీయోద్యమ కాలంలో భారతీయ చరిత్రకారులు అనుసరించారు. జాతీయోద్యమానికి స్ఫూర్తినివ్వడం కోసం, భారతీయ సంస్కృతి అతి పురాతనమైందనీ, ప్రాచీన (హిందూ యుగంలో) కాలంలో అత్యున్నత శిఖరాలను చేరుకొందనీ, ప్రపంచంలో అనేక దేశాలకు జ్ఞానభిక్ష పెట్టిందని రాశారు. భారతీయ చరిత్రకారులు జాతీయోద్యమ దశలో చేసిన ఈ రచనలకు ఒక ఆశయం వుంది. జాతీయోద్యమాన్ని బలోపేతం చేయడం వలన సంస్కృతికి భావజాలానికి ప్రత్యామ్నాయంగా, దీనితో సరితూగగల భారతీయ సంస్కృతి చిత్రపటాన్ని తయారు చేయడం, అనేక వలసవాద వ్యతిరేక జాతీయోద్యమాలు ఈ విధానాన్ని అనుసరించడం మనం గమనిస్తాం. జాతీయోద్యమ దశలో గతాన్ని, ప్రాచీన సంస్కృతిని కీర్తించడం చారిత్రక అవసరమైనా, దాని దుష్ఫలితాలు మతవాదం ముసుగులో, ఆ తర్వాత కాలంలో ముందుకొచ్చాయి. స్వాతంత్ర్యానంతరం చరిత్ర రచన మౌలిక మార్పులకు లోనైంది. చారిత్రక భౌతికవాద దృష్టితో శాస్త్రీయ, లౌకిక చరిత్ర రచన ఆరంభమైంది. అంతకు ముందు గ్రంథాల్లో చోటు చేసుకున్న చరిత్ర వక్రీకరణలు, మత దృష్టితో రాజకీయ, చరిత్రను విశ్లేషించడాన్ని ఖండిస్తూ, ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక కోణాల్లో చరిత్ర రచనను చేపట్టారు. ఢిల్లీ, జవహర్‌లాల్, ఆలీఘర్ మొదలగు విశ్వవిద్యాలయాల్లో సాగిన చరిత్ర రచనతో పాటు NCERT (ఢిల్లీ), ఈ ధోరణిలో ప్రముఖ చరిత్రకారులచే (ఆర్.యస్.శర్మ, రామిలాథాపర్, సర్వేపల్లి గోపాల్, బిపిన్ చంద్ర, మారుతీహాసన్, సతీష్ చంద్ర, జి.యల్. ఆర్య అర్జున్ దేవ్ మొదలగువారు) ఉత్తమ విలువలతో సెకండరీ స్థాయిలో పాఠ్య పుస్తకాలు రాయించి ప్రచురించింది. ఒక కొత్త చరిత్ర రచనకు – ఆర్థిక, సాంఘికాంశాలతో నాందీ పడింది. ఇవి నమూనా గ్రంథాలుగా పరిగణించబడ్డాయి. వాటిలోని పాఠ్యాంశాలే గాక, వాటికి రూపొందించిన సిలబస్ కూడా సమగ్రంగా వుంది.

చరిత్రపై దాడి పై గ్రంథాల నిషేధంతో (1977) అప్పటి జనతా ప్రభుత్వం ఆరంభించింది. హిందూ మతాన్ని, సంస్కృతిని కించపరిచే భాగాలున్నాయనీ, ముస్లిముల పాలనలో జరిగిన వివిధ సంస్కృతుల మేళవింపు, భారతీయ బహుళ మిశ్రమ సంస్కృతికి దోహదం చేసిందన్న వాదన ప్రభుత్వానికి (మతశక్తులు భాగంగా వున్న) మింగుడు పడలేదు. పైగా, చరిత్రను విశ్లేషించడం, మత దృష్టితో గాక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాల నుండి పరిశీలించాలన్న శాస్త్రీయ దృక్పథం మతశక్తుల రాజకీయ ఎజెండాకు విరుద్ధంగా వుంది. ఈ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో ప్రభుత్వం వెనుకంజ వేసింది. జనతా ప్రభుత్వం పతనం కావటంతో కొన్ని సంవత్సరాల పాటు మతతత్వ శక్తులు నివురు కప్పిన నిప్పులా వుండిపోయ్యాయి.

1990 దశకం ప్రారంభం నుండి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ (BJP) చరిత్ర పాఠ్య పుస్తకాల్లో మతతత్వాన్ని తెప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఈ మూడు రాష్ట్రాల్లో సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో ఇరవై వేలకు పైగా సరస్వతీ శిశు మందిర్‌లు, సరస్వతీ విద్యాలయాలను ప్రైవేటు రంగంలో నెలకొల్పారు. వీటన్నింటిలో చరిత్ర పేరుతో చేసే బోధన హిందూ మతతత్వాన్ని ప్రోది చేసేదిగా వుంది. నిజానికి, సంఘ్ పరివార్ తన ప్రత్యక్ష రాడిని రాజకీయ ప్రత్యర్థులపై కంటే చరిత్రపైనే ఎక్కుపెట్టింది. ఎందుకిలా చేసిందని ఆలోచిస్తే రెండు విషయాలు స్ఫురిస్తాయి. ఒకటి, భావజాలాన్ని సమాజంలో చొప్పించేందుకు చరిత్ర ప్రబల సాధనంగా వుపయోగ పడుతుంది. ఏ యితర అధ్యయనాంశాలకు లేని ఈ వెసులుబాటు ఒక చరిత్రకే వుందని మనం గమనించాలి. వక్రీకరణలతో చరిత్రను బోధించడం ద్వారా సివిల్ సమాజాన్ని తమ మతతత్వంతో ఆకట్టుకొని, దానిపై పట్టు సాధించి తద్వారా తమ అంతిమ ధ్యేయమైన రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవచ్చు. ఇదీ వారి వ్యూహం. దీనికి ఈ శక్తులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. స్వల్పకాలికంగా, చరిత్ర పాఠ్య పుస్తకాలను మార్చటం, అది గత పది సంవత్సరాలుగా వీరవలంభిస్తున్న ఒక ఎత్తుగడ. దీర్ఘకాలికంగా, చరిత్ర పరిశోధనను తమ కనుగుణ్యంగా ప్రభావితం చెయ్యటం. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా జాతీయ స్థాయిలో చరిత్ర పరిశోధనా సంస్థ ICHR ను (Indian Council for Historical Research) మతతత్వ శక్తులతో నింపివేశారు. జాతీయ స్థాయిలో చెప్పుకోదగ్గ ఒక్క చరిత్రకారుడు కూడా వీరు నియమించిన సభ్యుల్లో లేరు. అయోధ్య వివాదంలో బాబ్రీ మసీదు స్థానంలో ముందు రామాలయం వుందన్న తప్పు నివేదికను తయారు చేసిన

కమిటీలో సభ్యుడైన బి. ఆర్. గ్రోవరు ఛైర్మన్‌గా నియమించారు. తత్ఫలితమే, ప్రముఖ చరిత్రకారులు కె.యస్. ఫణిక్కర్, సుమిత్ సర్కార్ సంపాదకత్వంలో వెలువడ్డ Towards Freedom ప్రాజెక్టు సంపుటాలను అచ్చు వెయ్యకుండా ఆపారు. ఈ కుట్రలో భాగంగానే ICSSR (Indian Council for Social Science Research), NCERT, Simla Institute మొదలైన జాతీయ పరిశోధనా సంస్థలకు సంచాలకులుగా సంఘ్ పరివార్‌కు చెందిన వారిని నియమించారు. ఇదే క్రమంలో దాదాపు 70 సంవత్సరాలకు పైబడి చరిత్ర రంగంలో కృషి చేస్తున్న అఖిల భారత హిస్టరీ కాంగ్రెసును స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. దీనికి పోటీగా 'భారతీయ ఇతిహాస సంకలన సమితి' అనే ఒక సంస్థను ఏర్పర్చారు. దీనికి దేశం మొత్తం మీద 400 పైగా బ్రాంచీలు వున్నాయి. జిల్లాల వారీగా చరిత్రలు ప్రచురించడం వీరి కార్యకలాపాల్లో ఒక ముఖ్య భాగం.

వక్రీకరణలతో కూడిన చరిత్ర పాఠ్య పుస్తకాలు ఏ విధంగా జాతీయ సమైక్యతకు భంగం కల్గిస్తున్నాయో పరిశీలించి నివేదికను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం (ఇప్పుడున్న ప్రభుత్వానికి ముందుది) అఖిల భారత స్థాయిలో ఒక సమీక్షా సంఘాన్ని ఏర్పాటు చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో చలామణిలో వున్న చరిత్ర పాఠ్య గ్రంథాలను పరిశీలించి ఈ కమిటీ ఒక నివేదికను తయారు చేసింది. చరిత్ర గ్రంథాలనే గాక నైతిక విద్య పేరుతో పాఠశాలల్లో ప్రవేశపెట్టిన గ్రంథాలను కూడా కమిటీ పరిశీలించింది. ఈ నివేదిక నుండి కొన్ని ఉదాహరణలు దిగువ పేర్కొంటున్నాం.

భారతీయ సంస్కృతికి తలమానికమైనది ఆర్య సంస్కృతి, ఆర్యులే నికరమైన స్వదేశీయులు. భారతీయ సంస్కృతికి మూల స్తంభాల వంటివారు ఆర్యులు. వారు పదాలను సృష్టించారు. భారతదేశమే ఆర్యుల జన్మస్థానం" (వక్కాణింపు మాది)

దాదాపు 2200 సంవత్సరాల క్రితం భారతదేశపు వ్యాపారం ప్రపంచం నాలుగు చెరగులా వ్యాపించింది. భారతదేశంలో తయారైన వస్తువులతో విదేశ మార్కెట్లు నిండిపోయేవి, భారత ప్రజల దగ్గర వున్న వజ్రాలు, మరకత మాణిక్యాలు, వెండి బంగారు నిల్వలను చూసి యావత్రపంచం అసూయపడేది."

మత మౌఢ్యాన్ని, స్వదేశీ వ్యామోహాన్ని ఆ విధంగా అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్లారు. విద్యాభారతి పాఠశాలల్లో పుణ్యభూమి భారత్ పేరుతో ముద్రించిన పటంలో, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పాటు భూటాన్, నేపాల్, టిబెట్లను, మయన్మార్‌లోని భాగాలను కూడా కలిపి అఖండ భారత్" అంటూ ముద్రించారు.

మధ్య యుగాల చరిత్రకు సంబంధించిన కొన్ని కొటేషన్లు కింద ఇస్తున్నాం.

"కత్తి పట్టుకొని ఇస్లాం భారతదేశంలో వ్యాపించింది. ఒక చేత కత్తి, మరో చేత ఖురాన్ పట్టి ముస్లింలు భారతదేశంలో ప్రవేశించారు. కత్తులతో బెదిరించి అసంఖ్యాక హిందువులను ముస్లింలుగా మార్చివేశారు. ఈ క్రమంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమం మత యుద్ధంగా మారింది."

తమ మతంలోకి ప్రజలనుమార్చేందుకే అరబ్బులు వచ్చారు. వాళ్లు ఎక్కడికి వెళ్లినా తమ చేతుల్లో కత్తి వుంచుకొంటారు. వాళ్ల సైన్యం ప్రపంచం నాలుగు చెరగులా దురాక్రమణ జరిపింది. వారి మార్గంలో తగిలిన ప్రతి దేశాన్ని నాశనం చేశారు. ఇళ్లను, ప్రార్థనా మందిరాలను, విద్యాలయాలను ధ్వంసం చేశారు. గ్రంథాలయాలను తగులబెట్టారు. మత గ్రంథాలను అపవిత్రం చేశారు. తల్లులను, చెల్లెళ్లను చెరచారు. న్యాయం, మానవత్వం అన్న పదాలే వాళ్లకు తెలియవు.

"సముద్రగుప్తుడు కుతుబ్ మినార్‌ను నిర్మించాడు. దాని పేరు విష్ణు స్థంభం".

ఆధునిక చరిత్రకు సంబంధించిన కొన్ని గ్రంథాలల్లో నెహ్రూ పేరు ఎక్కడా లేదు. పైగా హెడ్గెవార్, గోల్వాల్కర్‌లను గొప్ప వీరులుగా చిత్రించారు. బాబ్రీ మసీద్ విధ్వంసంలో పాల్గొన్న కర సేవకులను స్వాతంత్ర్య పోరాట యోధులుగాను, ములాయం సింగ్ యాదవ్‌ను ముల్లాగా, హిందూ హంతకుడిగా చిత్రించారు. రాజనీతి శాస్త్ర పాఠ్యాంశాల్లో నుంచి కొన్ని ఉదాహరణలు :

"వివిధ మతాలు, విశ్వాసాలకు చెందిన వ్యక్తులు ఈ దేశంలో ప్రవేశించి తమ మతాలను ప్రచారం చేయ సంకల్పించారు. కాని, మన పవిత్ర సంస్కృతి ముందు వారంతా తలలు వంచక తప్పలేదు. ఇస్లాం కొంత వరకు చోటు చేసుకోగల్గింది. భారతదేశాన్ని క్రైస్తవ దేశంగా మార్చాలన్న క్రైస్తవుల కోరిక మాత్రం సఫలం కాలేదు. ఆఖరుకు ఈ దేశ సంస్కృతిని కమ్యూనిస్టు పద్ధతిలో తీర్చిదిద్దాలనుకున్న కమ్యూనిస్ట్ ప్రయత్నాలు కూడా సఫలం కాలేదు. దీనికి కారణం మన సంస్కృతి ప్రపంచ సంస్కృతులన్నింటికన్నా అత్యుత్తమమైంది కావటమే."

"మత ప్రమేయం లేని దేశం ఎప్పుడూ కష్టనష్టాలకు ఆలవాలమౌతుంది. రావణుని లంకలో బంగారం వుండవచ్చు.

కాని, అక్కడ రామరాజ్యం లేదు కదా!"

"సాంఘిక సమానత్వం సాధించడానికి రిజర్వేషన్లు ఏ మాత్రం వుపయోగపడవు. జాతీయైక్యతకి, సమగ్రతకి ఈ రిజర్వేషన్లు ప్రమాదకరంగా పరిణమించాయి."

సామాజిక శాస్త్రం నుంచి కొన్ని ఉటంకింపులు. –

"ఒక కులంలోని వారు తమ కులంలోని వారినే పెళ్లి చేసుకోవాలి. ఇది రక్తాన్ని స్వచ్ఛంగా వుంచటమే కాకుండా, యితర కులాల్లోని మలినాలు చేరకుండా రక్షిస్తుంది."

చిన్న వయస్సులోనే జరిగే పెళ్ళిళ్లు భార్యాభర్తల మధ్య అన్యోన్యతను పెంచి సుఖ సంసారానికి సహకరిస్తాయి. బాల్య వివాహాలు యువకులలో చెడు ప్రవర్తనను ఆరికట్టి లైంగికంగా వారు తప్పుదారి పట్టకుండా కాపాడుతాయి."

ఇదే ధోరణి సాహిత్య వ్యాకరణ, సంస్కృతీ జ్ఞానం అనే పాఠ్య పుస్తకాల్లోనూ కన్పిస్తుంది. ఉదాహరణకు :

"వాల్మీకి రాసిన రామాయణాన్ని హోమర్ (Homer) తిరిగి ఇలియడ్‌గా రాశాడు. గ్రీకు తాత్వికులైన హెరడోటస్, ఆరిస్టోఫేన్స్ మన వేదాల వల్ల ప్రభావితులయ్యారు.

"ఏసుక్రీస్తు హిమాలయాలను సందర్శించాడు. అతను తన సిద్ధాంతాలను హిందూయిజమ్ నుండే సంగ్రహించాడు."

"తొలిమానవుడు భారత్‌లో భాగమైన టిబెట్‌లో జన్మించాడు. ఇతర జీవరాసులన్నీ ఈ భూభాగంపైనే జన్మించి యితర ప్రపంచానికి విస్తరించాయి."

ఈ వక్రీకరణలు సామాజిక శాస్త్రాలకే పరిమితం కాలేదు. సైన్స్, గణితాలలో సైతం ప్రవేశించాయి. 1990 దశకంలో బి.జె.పి అధికారంలో వున్న రాష్ట్రాల స్కూలు సిలబస్‌లో వేద గణితాన్ని ప్రవేశపెట్టారు. వేద గణితంపై ఒక జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు.

ఇలాంటి కొటేషన్లు వీరు ప్రవేశ పెట్టిన గ్రంథాలనుండి అసంఖ్యాకంగా ఉదహరించుకుంటూ పోవచ్చు. పై చెప్పినవి కొన్ని మచ్చు తునకలు మాత్రమే.

సాంస్కృతిక రంగంలో కాషాయీకరణ కొన్ని సంవత్సరాలుగా హిందూ సంస్కృతి, మెజారిటీ ప్రజల సిద్ధాంతం పేరుతో జరుగుతూ వుంది. మైనారిటీలను భయభ్రాంతులను చేసి, చర్చిలను, మసీదులను ధ్వంసం చేయడం, మత మార్పిడులను తిప్పికొట్టే నెపంతో తిరిగి హిందువులుగా మార్చడం గుజరాత్, ఉత్తరప్రదేశ్ మొదలగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఇటీవల ఘటనలు, ఒరిస్సాలో క్రైస్తవ మత గురువు స్టెయిన్స్, అతడి పిల్లలను సజీవ దహనం చేయడం మైనార్టీలపై జరుగుతున్న దాడులకు పరాకాష్ట నిందితుడుగా అనుమానిస్తున్న దారాసింగ్ పేరుతో "దారాసేన' నొకటి ఏర్పాటు చేసి, అతడి రక్షణకు ఒక సమితిని స్థాపించి దారాసింగ్ ను ఒక వీరుడుగా చిత్రించి, మయూర్ భంజ్ నుండి రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నుకొనేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ప్రార్థనా స్థలాలను మత మౌఢ్యవాదులు (ఆంధ్రప్రదేశ్ లో) ధ్వంసం చేయడం మనకు తెలిసిందే! దేశంలో అనైక్యతకు, శాంతి భద్రతలు కొరవడానికి మైనార్టీలే కారణమంటూ ప్రచారం చేయడం, వారి వల్ల హిందూమతానికి, సంస్కృతికి భంగం కలుగుతుందంటూ గత రెండు, మూడు సంవత్సరాలుగా సంఘ్ పరివార్ విష ప్రచార ఫలితాలే ఈ ఘటనలు. కుహనా లౌకిక వాదుల వల్ల హిందూమతానికి, సంస్కృతికి (అంటే మెజార్టీ ప్రజలకు) అన్యాయం జరుగుతుందన్న ప్రచారం, మత భావజాలానికి యిప్పటి వరకూ దూరంగా వుంటూ వస్తున్న భారతీయులను గూడ వొప్పించేట్టుగా వుంటోంది. నిజానికి ప్రమాదకర పరిస్థితి యిదే! మధ్యతరగతి వర్గాలు సామాన్యంగా, యింతవరకూ మత భావజాలానికి లోను కాలేదు. పని గట్టుకొని చేస్తున్న దుష్ప్రచారం వీరిని లోబరచుకుంటోంది.

సంస్కృతికి సంబంధించి ప్రముఖ చిత్రకారుడు హుస్సేన్ చిత్రాలపై జరిగిన విధ్వంసకాండ గర్హనీయమైంది. ఇదే కోవకు చెందినదే "Water" సినిమా యూనిట్‌పై చేసిన దాడి. (Fire సినిమా కూడా ఈ దాడులకు గురైంది). వారణాసిలో, హిందూ సంస్కృతిని కించపరుస్తున్నారన్న నెపంతో, 'కాశీ సంస్కృతి రక్షా సంఘర్ష సమితి' పేరుతో హింసాకాండకు పూనుకొన్నారు. 'Water' సినిమా తీసుకోడానికి అటు కేంద్రం, యిటు రాష్ట్రం రెండూ అనుమతినిచ్చాయి. అయినా, స్థానిక అధికారులు సినిమా యూనిట్‌కు రక్షణ కల్పించలేమని చేతులెత్తేశారు. ఇక్కడ గమనించాల్సింది. దేశంలో చట్టబద్ధ పాలన (Rule of Law) కొనసాగుతోందా? లేదా? ప్రభుత్వం చట్టాన్ని సంరక్షించాల్సింది పోయి, నిస్సహాయత వెలిబుచ్చడమేమిటి? ఇది కుట్రా, మరొకటా? ప్రజాస్వామ్యానికి గుండె కాయ Rule of Law. అది లేనప్పుడు సామాన్య పౌరులకు రక్షణ ఏముంటుంది? భావ ప్రకటనా స్వేచ్ఛ (రాజ్యాంగంలో పొందుపరచిన) దేశంలో వున్నటా లేనట్టా? కళాకారుల ప్రభుత్వం సరి పెట్టుకొంటే, సంఘ్ పరివార్ దీన్ని ఖండించక పోగా ఈ దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నట్టు రుజువైంది. ఇది సాంస్కృతిక ఉగ్రవాదం (cultural extremitim) కాక

మరేమిటి? జర్మనీలో హిట్లర్ అధికారంలోకి రాకపూర్వం, వాజీలు (Storm troopers) తన ప్రత్యర్థుల యెడల సరిగ్గా యిదే పద్ధతులను పాటించారన్న చారిత్రక సత్యాన్ని మనం మర్చిపో కూడదు. ఉత్తర భారతంలో కొన్ని విద్యాలయాల్లో, విద్యార్థినులు ధరించే దుస్తులపై ఆంక్షలు విధించడం, ఫలానా దుస్తులనే వేసుకోవాలని నిర్బంధించడం, Valentine Day నాడు గ్రీటింగ్స్ అమ్మే అంగళ్ళను ధ్వంసం చేయడం - యివన్నీ సంస్కృతీ సంరక్షణ' పేరుతో జరుగుతున్న అకృత్యాలు. ఈ ధోరణి యిలా కొనసాగితే ఆఫ్ఘనిస్థాన్‌లో అమల్లోకి వచ్చిన తాలిబానిజం (Tahihanism) భారతదేశంలో గూడ ప్రవేశించే అవకాశముంది.

విద్యారంగంలో కాషాయీకరణ, పాఠ్యపుస్తకాలకు సంబంధించి తెలుసుకొన్నాం. కానీ, యిప్పుడమల్లో వున్న విద్యా విధానం (సెకండరీ స్థాయి వరకు) లో మార్పులు దొడ్డిదారిన ప్రవేశపెట్టాలన్న ప్రయత్నాలు అక్టోబర్ 1998 లో జరిగిన రాష్ట్ర విద్యామంత్రుల సమావేశంలో జరిగాయి. తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో ఎజెండాను ప్రభుత్వం వుపసంహరించుకొంది. (సరస్వతి వందనంపై రసాభాస యిక్కడే జరిగింది). అక్కడ ప్రవేశపెట్టిన ఎజెండా అంతకు ముందు ఆగస్ట్‌లో జరిగిన సంఘ పరివార్ విద్యాసంస్థ "విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్" (ఆగష్టు 1998) లో ప్రవేశపెట్టిందన్నది గమనార్హం. (ఈ సమావేశాన్ని ఆర్.యస్.యస్ డిప్యూటి చీఫ్ సుదర్శన్ ప్రారంభించాడు). ఈ ఎజెండాలోని కొన్ని అంశాలు : 1) విద్యా బోధనలో అన్ని స్థాయిల్లో భారతీయ సంస్కృతిని తప్పనిసరి చేయాలి. 2) ప్రాథమిక స్థాయి తర్వాత బాలికలను గృహ నిర్వహణ గూర్చి బోధించాలి. 3) 3 నుండి 10వ తరగతి వరకు సంస్కృతాన్ని తప్పనిసరిగా బోధించాలి. 4) సెకండరీ స్థాయి నుండి విశ్వ విద్యాలయ దశదాకా నైతిక, ఆధ్యాత్మిక విద్యను ప్రవేశపెట్టాలి. 5) సరస్వతీ వందనం, వందేమాతరం గీతాలాప నలను పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి. 6) అన్ని స్థాయిల్లోను ఉపనిషత్తులు, వేదాలను పాఠ్య ప్రణాళికలో చేర్చాలి. 7) రాజ్యాంగంలోని 29, 30 అధికరణల్లో మార్పులు తేవాలి (ఇవి మైనారిటీ విద్యా సంస్థలకు సంబంధించినవి).

విద్యామంత్రుల సమావేశం రసాభాసగా ముగిశాక (ఎజెండాను ఉపసంహరించుకొన్నారు.) ఈ సంవత్సరం జనవరి లో NCERT పాఠశాల విద్యకు సంబంధించి ఒక డాక్యుమెంటు ను ప్రవేశపెట్టింది. దీన్ని చర్చా పత్రంగా పేర్కొంది. కానీ, యిందులో చర్చించడానికనువైన ప్రశ్నలను లేవనెత్తనే లేదు. 1986 పాలసీ డాక్యుమెంటు నుండి అనేకాంశాలను చొప్పించారు. కానీ వీటికి వుల్లేఖనాలు (references) లేనందున, అందులో నుండి ఏమి గ్రహించారో మనకు బోధపడదు. కేంద్రంలో బి.జె.పి. (ఇతర పార్టీలతో కలిసి) అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన మొదటి ముఖ్యమైన డాక్యుమెంటు. విద్యాశాఖామంత్రి కొన్నాళ్ళుగా వెలిబుచ్చుతున్న అభిప్రాయాలకు యిది అనుగుణంగా వుంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దీనిని తిరస్కరించింది. అంతిమంగా యిది ఏ రూపుదిద్దుకొంటుందో యిప్పుడే చెప్పడం కష్టం. కేంద్ర విద్యా సలహా మండలి (CABE) ఆమోదిస్తేనే కానీ, దీన్ని ప్రవేశ పెట్టడానికి వీల్లేదు. ఇందులోని అంశాలు క్రితం విద్యా మంత్రుల సమావేశంలోని ఎజెండాలోనివే. మరికొన్ని సంఘ పరివార్ అనుబంధ సంస్థల్లో నుండి గ్రహించినవి. మత విద్య ప్రవేశ పెట్టాలన్నది ఒక అంశం. ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? మతాల్ని గూర్చిన అధ్యయనం వేరు. లౌకికవాదాన్ని పునర్నిర్వచించడం 'మరో' అంశం. ఇది ఎలా జరుగుతుందన్నది వేచి చూడాల్సిందే. డాక్యుమెంట్ ప్రకారం మతాన్ని రాజ్యాన్నుండి (State), రాజకీయాల నుండి వేరు చేసే ఆలోచన లేదు. (డాక్యుమెంట్ పుట. 24) విలువల బోధన మొత్తం మత సంబంధంగానే వుంది (అదే పుటలు 61-62), భాషాధ్యయనంలో ఇంగ్లీషును మూడవ తరగతి నుండి బోధించాలి. త్రిభాషా సూత్రాన్ని నిర్లక్ష్యం చేశారు. స్వాతంత్ర్యానంతరం దేశం అనుసరించిన జాతీయ విద్యా విధాన లక్ష్యాలకు ఇవి భిన్నంగా వున్నాయి. లౌకికత్వాన్ని భిన్నంగా నిర్వచించడం (సర్వధర్మ సంభాష), మత విద్యా విలువల బోధన (నీతి విద్య)కు, వారానికి ప్రత్యేకించి రెండు గంటలు కేటాయించడం వగైరా సంఘ పరివార్ భావజాలాన్ని చాప కింద నీరులాగ ప్రవేశపెట్టేందుకు అనువుగా వున్నాయని పలువురు విద్యావేతలు అభిప్రాయపడుతున్నారు.

గుజరాత్ ప్రభుత్వం పాలనా యంత్రాంగాన్ని కూడా కాషాయీకరణం చేయపూనుకుంది. ప్రభుత్వోద్యోగాల్లో చేరడాన్ని స్వయం సేవకులకు వీలు కల్పిస్తూ ఆర్.యస్.యస్ పై వున్న (ఇందుకు సంబంధించి) నిషేధాన్ని తొలగించారు. దేశమంతటా పెల్లుబికిన వ్యతిరేకతతో ప్రభుత్వం ఈ ఉత్తర్వును ఉపసంహరించు కొందన్న విషయం మనకు తెలిసిందే!

మతతత్వ శక్తులు బలపడం మొత్తం భారతీయ సామాజిక, సాంస్కృతిక, వారసత్వాన్నే కాదని, మెజారిటేరియన్ సంస్కృతి పేరుతో హిందూ బ్రాహ్మణీయ జీవన విధానాన్ని అమలు పరచ చూస్తున్నారు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు గత

పదేళ్ళుగా బలహీనపడ్డం ఒక కారణం. కాగా, తమ ఎన్నికల ప్రయోజనాలకు మత శక్తులతో చేతులు కలిపి, మతతత్వాన్ని పరోక్షంగా ప్రధాన రాజకీయపక్షమైన కాంగ్రెస్‌తో పాటు వామ పక్షాలతో సహా అన్ని పార్టీలు ఏదో ఒక సందర్భంలో పెంచి పోషించాయి. ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ కాలం నుండి ముఖ్యంగా రాజీవ్‌గాంధి హయాంలో ఈ విధానాన్ని చేపట్టింది. మైనారిటీలను కుహనా లౌకిక వాదంతో బలపరుస్తున్నా రన్న విమర్శతో మెజార్టీ ప్రజలకు దూరం కావడం, ఒకవైపు, హిందువుల మనోభావాలను బుజ్జగించి రాజకీయ లబ్ధిని పొందాలన్న హ్రస్వదృష్టితో, మైనారిటీల వత్తాసును కోల్పోవడం జరిగింది. ఈ రాజకీయ చదరంగంలో మైనారిటీలు పావులుగా మిగిలిపోయారు. ఎటూ పోలేని దిక్కుతోచని స్థితి. వామపక్షాలవైపు మొగ్గడానికి, సిద్ధాంతపర విభేదాలు అడ్డురావడం, పైగా అవి ముక్కలు చెక్కలుగా చీలి, రాజకీయాల్లో నిర్ణాయక పాత్రను నిర్వహించలేకపోవడం ప్రబల కారణాలుగా చెప్పుకోవచ్చు. పాలక వర్గాలు, ఏదో ఒక సందర్భంలో తమ మనుగడ కోసం, మతతత్వాన్ని ఉపేక్షించడమే గాక, వాడుకొంటున్నారు. అందుతే యీ బాధ్యత ముఖ్యంగా వామపక్షాలపై వుంది. రాజీలేని పోరాటాన్ని నిర్వహించడాన్ని ఏక సూత్ర విధానంలో అవి నడుం బిగించాలి.

ఈ పోరాటం ఎలా నిర్వహించాలి. రెండు విధాలుగా పరిశీలిద్దాం. ఒకటి సివిల్ సమాజంలో ప్రజలకు మతతత్వాన్ని గూర్చి లోతైన అవగాహన కలిగించాలి. తర్వారా ప్రజల చైతన్య స్థాయి పెంచాలి. దీనికి చర్యలు, గోష్టులు, వుపన్యాసాలు, యింకా గ్రంథాలు, కరపత్రాల ద్వారా విద్యావంతులను చేయాలి. మతతత్వ వ్యతిరేక పోరాటం వారిని అధిక సంఖ్యలో భాగస్వాములను చేయాలి. రెండు, అధ్యాపకులకు, మధ్యతరగతి మేధావులకు, ప్రత్యేకించి దేశ చరిత్ర, సంస్కృతుల గూర్చి, వాటిలోని మత సామరస్యం, బహుళత్వాల గూర్చి వివరించాలి. సమాజంలో యివ్వాళ నిర్లిప్తత, నిస్తేజం పెరిగి ఆశావాదం క్షీణిస్తోంది. ఈ ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ, నిర్దుష్టమైన భవిష్యత్తు లేక, యువతలో వున్నత సామాజిక విలువలు లోపిస్తున్నాయి. దీనికి ఆర్థిక విధానాల ప్రపంచీకరణతోపాటు, సంస్కృతి కాలుష్యం పెరిగి, సమాజాన్ని మత్తులో వుంచుతున్నాయి. అక్రమార్జన పెరిగి, వినిమయతత్వంతో పాటు, విచ్చలవిడితనం పెరిగాయి. అందువల్ల ఈ వాతావరణంలో మతం, మూఢనమ్మకాలు, జీవిత గమనం నియతివాదంతో ముడిపడి, సమాజం క్రియాశీలతను కోల్పోతోంది. తిరిగి ప్రజల్లో భావ చైతన్యాన్ని విలువలను పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన వుద్యమంలో భాగంగానే మతతత్వ వ్యతిరేకాంశాన్ని చేర్చాలి. మతతత్వ భావజాలానికి దోహదం చేసే వాతావరణాన్ని మార్చే విధంగా సాగాలి ఈ పోరాటం. ప్రతి పట్టణంలో, గ్రామంలో, లౌకిక, ప్రజాస్వామ్య అభ్యుదయ భావాలతో గూడిన వారిని ఒక చోటకు చేర్చాలి. సమాజంలోని అన్ని పార్శ్వాలకు మతతత్వం, చడీ, చప్పుడు లేకుండా ఎలా విస్తరిస్తుందో చెప్పాలి. మతం వేరు, మతతత్వం వేరన్న అంశాన్ని విశదీకరిస్తూ వ్యక్తులు స్వీయ జీవితాల్లో విశ్వసించే మతపరమైన అంశాలను లౌకికత్వం వ్యతిరేకం కాదనీ నొక్కి చెప్పాలి. దురదృష్టవశాత్తూ లౌకికత్వాన్ని, మైనార్టీల ఎడల అనుసరించే బుజ్జగింపుతత్వంగానో లేదా మత వ్యతిరేక వుద్యమం గానో చిత్రించే తప్పుడు ప్రచారాన్ని తిప్పిగొట్టాలి. మతం ఒక జాతి సంస్కృతిలో అంతర్భాగమని, చరిత్ర గమనంలో అది నిర్వహించే పాత్రను దాని ధన, రుణాంశాలను విశ్లేషించాల్సిన అవసరాన్ని తెలియచేయాలి.

అంతేకాక లౌకికత్వాన్ని పాలక వర్గాలు స్వాతంత్ర్యానంతర కాలంలో నిర్వచించి, నిర్వహించిన తీరులో చోటు చేసుకొన్న లొసుగులను నిజాయితీతో పునఃపరిశీలన చేయాలి. మొత్తం మీద యింతవరకూ జరుగుతూ వచ్చిన లౌకికత్వ చర్చ దిశను నిశితంగా పరీక్షించి, ఖవ్వాళ తలెత్తిన మతతత్వ ప్రమాదాన్ని ధీటుగా ఎదుర్కొనే వ్యూహాన్ని రచించు కోవాలి. ఈ కృషిలో మేధావులు, రచయితలు, అనేక కళా సాంస్కృతిక రంగాల్లో కృషి చేస్తున్న సృజనశీలురు కలిసి పని చేయాలి. ఇది కేవలం మతతత్వ వ్యతిరేక ఉద్యమంగానే కాకుండా లౌకికవాద వ్యాప్తికి తోడ్పడే పాజిటివ్ ప్రయత్నంగా వుండాలి. ఇది దీర్ఘకాలిక పోరాటం. దీంట్లో పత్రికలు ముఖ్య పాత్ర నిర్వహించాలి. మతతత్వానికి వర్గ, సామాజిక పునాది వేగంగా మారుతోంది. మధ్యతరగతి ఆధునికత వైపు మొగ్గు చూపుతూనే, మరోవైపు తమ సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసు కోలేక (మిశ్రమ, బహుళత్వంతో కూడి, కొన్ని వేల సంవత్సరాలు కలిసిమెలిసి జీవించిన భిన్న ప్రజల, మతాల విశ్వాసాల సంస్కృతీ సమ్మేళనం) మతప్రతీప శక్తులకు, వారి వులిపికట్టె భావాలకు గురవుతున్నారు. అదే క్రమంలో నిమ్న కులాల వారు కూడ ఈ వూబిలోకి లాగబడుతున్నారు. విభిన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కల్గిన వారందరినీ మత సౌహార్ద్రత సామూహికతా నినాదాలతో మతతత్వం తనలో యిముడ్చుకోడానికి యత్నిస్తోంది. దీన్ని నివారించడం లౌకికత్వ ఎజెండాలో ప్రధాన భాగం కావాలి. ❑

(చరిత్ర, సంస్కృతి వ్యాసావళి పుస్తకం–2008 నుండి)



# విద్యలో కాషాయీకరణ

**డి రమేష్ పట్నాయక్**
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి

కస్తూరీరంగన్ కమిటీ నివేదిక విద్యావ్యాపారాన్ని తీవ్ర స్వరంతో నిరసించినా విద్యావ్యాపార నిషేధానికిగాని, కనీసం నియంత్రణకు గాని సరియైన ప్రాతిపదికలను ప్రతిపాదించలేక పోయింది. అయితే విద్యావ్యాపారం కొత్తదేమీ కాదు. ఈ నివేదికలో సరిక్రొత్త దాడి విద్యారంగంలో అధికార కేంద్రీకరణ. అధికార కేంద్రీకరణ కొరకు గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రయత్నించింది కాని, విద్యారంగ ఉద్యమాల ఒత్తిడి వలన కొంత, కాంగ్రెస్‌లో ఉన్న స్వంత మార్కు ప్రజాస్వామ్యం వలన కొంత ఆ ప్రయత్నం వీగిపోయింది. ప్రస్తుతం ఎన్.డి.ఎ పేరుతో నడుస్తున్న బి.జె.పి ప్రభుత్వం ఈ నివేదిక ద్వారా ప్రయత్నిస్తున్న అధికార కేంద్రీకరణ సాదాసీదా కేంద్రీకరణ కాదు. అధికార కేంద్రీకరణకు కారణాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్‌ది వ్యాపారపరమైన అవసరం. కాగా, బి.జె.పిది రాజకీయ, సాంస్కృతికపరమైన అవసరం కూడా. ఈ నివేదిక మరొక ప్రధాన లక్షణం సాంస్కృతిక ఆధిపత్యవాదం. ఇది ఫాసిజానికి అవసరమైన ఒక ప్రధానమైన షరతు అని వేరుగా చెప్పనవసరం లేదు.

విద్యా లక్ష్యాన్ని నిర్వచించేటప్పుడు ఈ నివేదిక 'విద్యార్థిలో భారత రాజ్యాంగ విలువలను ప్రోది చేయడం' ఒక ప్రధాన లక్ష్యంగా చెప్తుంది. అయితే నివేదికలో ఎక్కడా లౌకికవాదం అని గాని, సోషలిజం అనిగాని పదాలు కనిపించవు. అధికార పార్టీ బి.జె.పి ఈ పదాలను రాజ్యాంగం నుండి తొలగించాలని ప్రచారం చేస్తూ ఉన్న విషయం తెలిసిందే. అలాగే, సుమారు వంద సంవత్సరాలు సాగిన భారత సంస్కరణోద్యమం మరియు స్వాతంత్ర్యోద్యమం, ఆ కాలంలో విద్యారంగంలో ముందుకొచ్చిన ఆకాంక్షలు ఈ నివేదికలో ఎక్కడా కనిపించవు. సంఘపరివార్ శక్తులు స్వాతంత్ర్యోద్యమాన్ని వ్యతిరేకించిన విషయం, సంఘ పరివార్ సంఘ సంస్కరణకు కూడా వ్యతరేకం అన్న విషయం తెలిసినవే. వారు మనువాద రక్షకులు. సంస్కరణోద్యమం ప్రధానంగా మనువాదానికి వ్యతిరేకంగానే జరిగింది. ఈ నివేదిక విద్యారంగంలో వెనుకబడిన ప్రతి సామాజిక వర్గానికి, పేరు పేరునా విద్య అందాలని వ్రాసింది. కాని 'సామాజిక న్యాయం' అన్న మాటకు ఈ నివేదికలో ఎక్కడా స్థలం దొరకలేదు. అంటే ఈ నివేదిక యస్.సి; యస్.టి; బి.సి; మైనారిటీలు మొదలగువారికి విద్యను ఒక హక్కుగా గుర్తిస్తుందా లేక మంచి పాలకులు దయార్ద్ర హృదయంతో చేయవలసిన ఒక సత్కర్మగా భావిస్తుందా అన్నది ప్రధానమైన విషయం. అదే విధంగా ఈ నివేదిక అన్ని మతాల ప్రజలు కలసి ఐక్యంగా, సంతోషంగా జీవించాలని కాంక్షిస్తున్నది. బాగానే ఉంది. కాని ఈ దేశంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రజలు ఐక్యంగా నిలబడడానికి, అందుకవసరమైన అవగాహనను ఇచ్చినది 'వైవిధ్యంలో ఏకత' అన్న భావనయే. వైవిధ్యాన్ని గౌరవించడం ద్వారానే ఐక్యత సాధ్యమని ఈ దేశ ప్రజలు నమ్మి ఆచరిస్తున్నారు. కాని భారత దేశ సంస్కృతి గురించిన ఇంత ప్రధానమైన భాష్యానికి నివేదికలో చోటు దొరకలేదు. 'వైవిధ్యంలో ఏకత' అన్న భావాన్ని సంఘ్ పరివార్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. సంఘ్ పరివార్ వ్యతిరేకించిన అనేక భావాలు ఈ నివేదికలో చోటు చేసుకోలేక పోయాయి.

ఫాసిస్టు శక్తులు భారతదేశంలో ఇంత వడిగా ఎలా పెరుగు తున్నాయంటే భారత దేశంలో ప్రతి గ్రామంలో రాముడి గుడి ఉండడం కారణం కాకపోవచ్చు. ప్రతి మనిషిలో, ప్రతి ఇంటిలో ఆధిపత్యవాదం ఉండడమే ప్రధాన కారణం అనిపిస్తుంది. ఫాసిస్టులు చేయవలసింది అంతా మనలో ఉన్న అధిపత్య వాదాలను వెలికితీయడం సంఘటిత పరచుకోవడం మాత్రమే. విద్యారంగం అందుకు బలమైన పునాదిని వేయగలుగుతుందని వారు సరిగానే అంచనా వేశుకున్నారు, ఈ నివేదికలో అందుకు ప్రాతిపదికలు రూపొందించుకున్నారు. చాలా చోట్ల ఈ నివేదిక భారతదేశంలో ఉన్న భాష మరియు సాంస్కృతిక వైవిధ్యం గురించి పేర్కొంది. వాటిని ప్రోది చేయవలసిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడింది. కాని అందుకు భిన్నంగా, నివేదిక భారతీయ సంస్కృతి' అని ప్రస్తావించిన ప్రతిసారీ అది ఏకరూప సంస్కృతి గురించి మాట్లాడుతుందన్న విషయం తెలుస్తుంది. నివేదికలో ఆయా సందర్భంలో బహుళ సంస్కృతుల భావన ఎంత వెదకినా కనిపించదు. ఇక భారత వాస్తవ పరిస్థితులను మనం పరిశీలిస్తే, భారత దేశం చాలా విశాలమైంది. వందలాది భాషలు మరియు వందలాది సంస్కృతులు గల దేశం. ఇంత భాషా సాంస్కృతిక

వైవిధ్యం మరొక దేశంలో ఉందో లేదో కూడా చెప్పలేం. అయితే విషయం ఇంత మాత్రమే కాదు. గడిచిన నాలుగైదు వేల సంవత్సరాల కాలంలో దేశంలో ఉన్న వివిధ సంస్కృతులు ఎంతో మార్పు చెందాయి. భారత దేశంలో అనేక సంస్కృతులు ఉండడం మాత్రమే కాదు, ప్రతి సంస్కృతి వందల వేల సంవత్సరాల క్రమంలో ఎంతగానో మారింది. అంతేకాదు, ప్రతి ప్రాంతంలో మరియు ప్రతి కాలంలో పాలకుల సంస్కృతి వేరు, ప్రజల సంస్కృతి వేరు. గణ లేదా తెగల సమాజం విచ్ఛిన్నమైన తరువాత పాలకుల మరియు ప్రజల సంస్కృతులు ఎప్పుడూ ఒక్కటిగా లేవు. దీర్ఘకాలంగా పాలకుల మరియు ప్రజల సంస్కృతుల మధ్య వైవిధ్యమే కాదు వైరుధ్యం కూడా ఉంది.

నివేదిక, మర్యాద కొరకు కావచ్చు పాలీ, అరబీ వంటి భాషలను ప్రస్తావించినా సంస్కృత భాషను ప్రత్యేకంగా ఆకాశానికి ఎత్తింది. అంతేకాదు, సంస్కృత సాహిత్యంలో ఎంతో జ్ఞానం దాగి ఉందని చెప్పుకొచ్చింది. సంస్కృతం ఇతర భారతీయ భాషల అభివృద్ధికి ఎంతో సహకరించిందని, ఇప్పటికీ ఇతర భాషల అభివృద్ధికి అది ఎంతగానో సహకరించగలదని నివేదిక పేర్కొంది. వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్న విషయం తెలిసిందే. తులసీ దాసు రామాయణాన్ని సాధారణ హిందీలో వ్రాసినందుకు పండిత సమాజం తులసీదాసును వెలివేసింది. అరబిక్ నుంచి ఖురాన్‌ను ఉర్దూలోనికి అనువదించిన రచయితకు అదే గతి పట్టింది. చివరికి నన్నయ కూడా భారతాన్ని రచించినప్పుడు పూర్తిగా తెలుగును ఉపయోగించడానికి భయపడిన విషయం తెలిసిందే. సంస్కృతాన్ని ఆకాశానికి ఎత్తి తరువాత బాలలకు సెకండరీ విద్యలో సంస్కృతాన్ని ఒక ఎంపిక అధ్యయన విషయంగా (ఎలక్టివ్ సబ్జెక్టు ఆఫ్ స్టడీగా) పెట్టాలని నివేదిక సిఫారసు చేసింది. త్రిభాషా విధానంలో భాగంగా హిందీ ప్రాంతం వారు హిందీయేతర భారతీయ ఆధునిక భాష ఒకటి నేర్చుకోవాలని ఒక దగ్గర చెప్పి మరొక దగ్గర హిందీ ప్రాంతం వారు హిందీ మరియు ఆంగ్లంతో పాటు మూడవ భాషగా సంస్కృతం నేర్చుకోవచ్చని శలవిచ్చింది. ప్రతిపాదిత త్రిభాషా విధానమే ఒక అశాస్త్రీయమైన విధానం. అదలా ఉండగా, త్రిభాషా విధానం వలన వివిధ భాషలు మాట్లాడే భారత ప్రజల మధ్య ఒక సద్భావం ఏర్పడుతుందన్న వాదన అంగీకరించినా, హిందీ వారు తెలుగు, తమిళం లేదా ఒరియా వంటి ప్రజలు మాట్లాడే భాషలు నేర్చుకుంటే ప్రయోజనం ఉంటుంది గాని సంస్కృతం నేర్చుకోవడం వలన ఏం ప్రయోజనం ఉంటుంది. ఏదో ఒక పేరున సంస్కృతాన్ని రుద్దడం ఈ నివేదిక లక్ష్యంగా కనిపిస్తుంది. అక్కడితో అయిపోలేదు, సంస్కృతంలో ఉన్న రచనలను గణితం, సామాజిక మరియు ప్రకృతి శాస్త్రాల ద్వారా పాఠశాల విద్యలో వివిధ రూపాలలో బాలలకు అందించాలని నివేదిక పేర్కొంది. సంస్కృతాన్ని, అలాగే సంస్కృతం ద్వారా కుల, వర్ణ మరియు పితృస్వామిక సంస్కృతిని విమర్శ చేయలేని బాలల మేధస్సులలోకి ఎక్కించడమే నివేదిక లక్ష్యంగా కనిపిస్తుంది. ఉత్పత్తి కృషిలో నిమగ్నమై ఉండిన, అనేక లౌకిక కళలను సృష్టించి పోషించిన శూద్రులను, మొత్తం స్త్రీలను విద్యకు దూరం చేయడం ద్వారా, అలాగే అగ్రకుల పురుషులు కూడా ఈ కుల మరియు పితృస్వామిక వ్యవస్థకు భక్తు కాపాలాదారులుగా దిగజారిపోవడం వలన భారత దేశంలో శాస్త్ర జ్ఞాన అభివృద్ధి ఒక దశలో ఆగిపోయింది. సంస్కృతం, పాలీ అలాగే ఇతర పురాతన భాషలలో వివిధ రంగాలలో ఉన్న జ్ఞాన సంపదను, అది స్థాయిలో ఉన్నా, పరిశోధించడం చాలా అవసరం. అటువంటి పరిశోధనల ద్వారా భారత సమాజ నాగరికత అభివృద్ధి క్రమాన్ని అది ఎదుర్కొన్న ఆటు పోటులను మనం గ్రహించవచ్చు. చరిత్రను పునర్నిర్మించుకోవచ్చు. కుల తత్వాన్ని మరియు పితృ స్వామ్య కుసంస్కృతిని వదలి పెట్టకుండా ఈ దేశం ఎంతమాత్రం ముందుకు వెళ్ళజాలదు. కులంపై ఆధారపడి ఒక నీతిని గాని ఒక జాతినిగాని నిర్మించలేమని బాబా సాహెబ్ అంబేద్కర్ హెచ్చరించి ఉన్నాడు. అయితే నివేదిక ఈ జాఢ్యాల నుండి బయట పడవలసిన అవసరం గురించి ఎంత మాత్రమూ వ్రాయకపోవడం అశ్చర్యకరం. ఇక్కడే మరొక్క విషయాన్ని ప్రస్తావించాలి. ఈ నివేదికలో భారత దేశ గురుకుల వ్యవస్థ గురించి చాలా గొప్పగా వ్రాసారు. గురుకులాలు విద్యా వ్యాపారం చేయని మాట వాస్తవమే. కాని నాటి జనాభాలో 90 శాతంగా ఉన్న శూద్రులకు, అతి శూద్రులకు మరియు మొత్తం స్త్రీలకు ఆ గురుకులాలలో ప్రవేశం లేదన్న విషయం ఈ నివేదిక నమోదు చేయలేదు. గురుకులాలపై విమర్శకు తావులేని ప్రసంశ చాలా ప్రమాదకరమైనది. మరొక విషయం, 2016లో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన దస్తావేజు వలే ఈ నివేదిక పొడువునా పురాతన సంస్కృతి గురించి ప్రశంస ఉంటుంది. కాని మధ్యయుగాలలో నాగరికత సాధించిన విజయాలు గురించి ప్రధానంగా ఏమీ కనిపించదు.

జాతీయ విద్య, శిక్షణ మరియు పరిశోధనా సంస్థ (NCERT) ఒక జాతీయ పాఠ్య ప్రణాళికను (NCF) తయారు చేయడం, దానిని ఒక నమూనాగా తీసుకుని (ఒక ఆదేశంగా కాదు) ఆయా రాష్ట్రాలలో ఉన్న రాష్ట్ర విద్య, శిక్షణ మరియు పరిశోధనా సంస్థలు (SCERT) ఆయా రాష్ట్రాల కొరకు పాఠ్య ప్రణాళికలు తయారు చేయడం ఇంతవరకు జరుగుతున్న విషయం. అలాగే కేంద్రీయ

పాఠశాలలు NCERT తయారు చేసిన పాఠ్య పుస్తకాలను ఉపయోగించేవి. మరియు రాష్ట్రాలలో ఆయా SCERTలు తయారు చేసిన పాఠ్య పుస్తకాలు ఉపయోగించేవారు. రాష్ట్రంలో కొన్ని పాఠశాలలు NCERT పాఠ్య పుస్తకాలు ఉపయోగించేవి. ఇంకా ICSE పాఠ్య పుస్తకాలు వేరుగా ఉండేవి. కస్తూరి రంగన్ నివేదిక పాఠ్యప్రణాళికలో మరియు పాఠ్య పుస్తకాల రచనలో తీవ్రమైన కేంద్రీకరణ ప్రతిపాదించింది. దేశ వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు యన్.సి.ఇ.ఆర్.టి పాఠ్యపుస్తకాలను తయారు చేయాలని, వాటికి ఆయా రాష్ట్రాలలో స్థానికంగా కొంత భాగాన్ని చేర్చవచ్చని నివేదిక సిఫారసు చేసింది. ఈ సిఫారసులు ఎంత కఠినంగా తయారుచేసారంటే పాఠ్య పుస్తకాలలో వస్తువే కాదు, ఉదాహరణలు కూడా మార్చడానికి లేదని చెప్పారు. ఆపైన, అన్ని దశలలో సాంప్రదాయ భావాలకు అధిక స్థానం కల్పించాలని నివేదిక పేర్కొంది. సంప్రదాయాలలో అత్యధికమైనవి అభివృద్ధి నిరోధకమైన సాంప్రదాయాలే. వాటికి అధిక ప్రాధాన్యత కల్పించడం అంటే ఏమిటి? దేశ వ్యాప్తంగా బాలల మేధస్సులు ఒకే కేంద్రం నుంచి నియంత్రించడమే ఇది. ఇది ఆలోచనలను ఒకానొక నిర్దేశిత మార్గాన్ని పట్టించడం, రెజిమెంటేషన్ ఆఫ్ థాట్. ఈ సిఫారసులు అమలు చేస్తే భాషా సాంస్కృతిక వైవిధ్యాలకు తావు ఎక్కడ ఉంటుంది? అంతేకాదు, రాష్ట్రాల ఫెడరల్ హక్కులు కూడా పూర్తిగా అణచివేయబడతాయి. మరొక విషయం, ఈ నివేదిక ప్రకారం ఉపాధ్యాయుల నియామకాలలో వ్రాత పరీక్షలతో పాటు తరగతి గది డెమాన్‌స్ట్రేషన్ కి కూడా మార్కులివ్వాలని, ఉపాధ్యాయుల పదోన్నతులలో సీనియారిటీకి ప్రాధాన్యత లేకుండా పనితీరును బట్టి పదోన్నతులు ఉండాలని ప్రతిపాదించింది. అధికారంలో బి.జె.పి ఉంటే సంఘ్ పరివార్ అభిమానుల డెమోలే బాగుంటాయి, అలాగే వారి పనితీరే బాగుంటుందని వేరుగా చెప్పనవసరం లేదు. కాంగ్రెస్ పాలనలో అవినీతి వస్తుగతమైనది మాత్రమే. కాగా, బి.జె.పి పాలనలో అవినీతి భావజాలపరమైనది కూడా. అంటే మత వాదాన్ని, మనువాదాన్ని నమ్మినవారే నియామకాలు పొందడం పదోన్నతులు పొందడం జరిగే అవకాశం ఉంటుంది. ఈ నివేదిక చాలా ఆశ్చర్యకరంగా విద్యావకాశాల విస్తరణకు కృషిచేయాలని స్వచ్ఛంద సంస్థలకు మరియు మత సంస్థలకు విజ్ఞప్తి చేసింది. స్వచ్ఛంద సంస్థలకు ఈ నివేదిక ఇచ్చిన రాయితీలను స్వచ్ఛంద సంస్థల ముసుగులో విద్యావ్యాపారులే ఉపయోగించుకుంటారని సులభం గానే గ్రహించవచ్చు.

ఇక మత సంస్థలు విద్యావకాశాలను విస్తరించాలనడం అచారిత్రకం. వంద సంవత్సరాల క్రితమే మహా కవి గురజాడ 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలచి వెలుగును' అని చెప్పాడు. మతానికి మరియు జ్ఞానానికి ఉన్న వైరుధ్యాన్ని ఇంతకంటే ఇంకెవరూ బాగా చెప్పలేరేమో. మత రాజ్యం మరియు మత విద్య మన భవిష్యత్తుగా కనిపిస్తున్నది, ఈ నివేదికలో ప్రతిపాదించిన అధికార కేంద్రీకరణను, కాషాయీకరణను నిలువరించకపోతే ఈ దేశ ఉనికికే ప్రమాదం. ❑

## కార్మిక చట్టాలను పాతరేస్తున్న మోడీ సర్కార్

**(52వ పేజీ తరువాయి)**

సెస్ యాక్ట్, ఇనుప గనుల, మాంగనీస్ గనుల క్రోం గనుల వెల్ఫేర్ యాక్ట్, మైకా గనుల లేబర్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్, సున్నపు రాయి గనులు, డోలమైట్ గనుల లేబర్ ఫండ్ యాక్ట్, సినీ వర్కర్స్ లేబర్ సెస్ యాక్ట్ ఇవన్నీ జీఎస్‌టీ సునామీలో కొట్టుకుపొయ్యాయి. 2014 నుండి కేంద్రంలో బీజేపీ పాలన మొదలైనప్పటి నుంచి పాము తన పిల్లలను తానే మింగేసినట్టు, కార్మిక చట్టాలను మోడీ సర్కార్ మింగేస్తోంది.

పెద్ద సంఖ్యలో ఉన్న కార్మికులకు ఇప్పటివరకు అమలులో ఉన్న సాంఘిక భద్రతా హక్కులను సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020 రద్దు చేస్తున్నది. రద్దు చేయబడిన చట్టాల వల్ల సెస్ వసూళ్ళు చేయకపోవడంతో ఇప్పటివరకు ఉన్న సాంఘిక భద్రత హక్కులన్నీ హరించుకపోతాయి. ఇప్పటి వరకు వసులు చేస్తున్న సెస్‌ల గురించి ఈ కోడ్‌లో ఏ ప్రతిపాదనలు లేవు. అందరికీ సాంఘిక భద్రత కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పడం ఒట్టి బూటకం.

కార్మికోద్యమ చరిత్రను గమనిస్తే సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు పాలకులిచ్చింది కాదని, అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగానే అనేక కార్మిక చట్టాలు – హక్కులను సాధించుకున్నదనేది వాస్తవం. మన ముందు తరాలు తమ రక్తాన్ని, చెమటను చిందించి సంపాదించి నేటి కార్మిక వర్గానికి వారసత్వంగా ఇచ్చిన హక్కులను, కార్మిక చట్టాల సవరణ, క్రోడీకరణ పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం రద్దు చేయ పూనుకున్నది. కార్మికవర్గం ఆ హక్కులను నిలబెట్టుకోవాలి. రానున్న రోజుల్లో పెట్టుబడి, పాలకవర్గాలతో నిర్దయాత్మకంగా పోరాడాలి. కార్మిక చట్టాలను కాపాడుకుంటూ ఆ దశలో యావత్తు కార్మికవర్గం అడుగువేయాలి. ❑

# సంపూర్ణ ఆరోగ్య భారతం కావాలి



డా॥ యం.వి. రమణయ్య
ప్రజారోగ్య వేదిక (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షుడు

దేశ అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన కొలమానం ఆరోగ్యం. భారత రాజ్యాంగం పౌరులకు ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు ప్రసాదించింది. జీవించడం అంటే కేవలం బతకడం మాత్రమే కాదు. ఆరోగ్యంగా బతకడమని అర్థం. అయితే వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా వుంది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత '2002 జాతీయ ఆరోగ్య పథకా'న్ని 2017లో కొంత మార్పులు చేర్పులు చేసి మళ్ళీ 'జాతీయ ఆరోగ్య విధానం–2017'గా ప్రకటించారు. ఆ పథకాన్ని 2018లో 'ఆయుష్మాన్ భారత్ పథకం'గా మార్చి ప్రకటించారు. ఇలా ఆరోగ్య పథకాలు మాత్రం అనేక రూపాంతరాలు చెంది చివరికి 'ఆరోగ్య బీమా పథకం' కింద మారిపోయింది. కానీ భారత ప్రజల ఆరోగ్య సూచికలు నానాటికీ దిగజారిపోతున్నాయి తప్ప మెరుగుపడలేదు.

## బడ్జెట్ కేటాయింపులు

భారత్‌లో వైద్య రంగానికి కేటాయిస్తున్న బడ్జెట్ జిడిపిలో కేవలం 1.15 శాతం మాత్రమే. 2002 జాతీయ ఆరోగ్య విధానం ప్రకారం 2020 నాటికి ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు బడ్జెట్ కేటాయింపు పెంచుతామన్నారు. కానీ గత 15 సంవత్సరాల్లో ఆరోగ్య బడ్జెట్ మొత్తం జీడీపీలో 1.1 శాతానికి మించి కేటాయించలేదు. అంతర్జాతీయ సగటు కేటాయింపులు చూస్తే 4.9 శాతంగా ఉంది. మళ్లీ ఇప్పుడు జాతీయ విధానం 2017 ప్రకారం ప్రస్తుతం 1.15 శాతంగా ఉన్న ఆరోగ్య బడ్జెట్‌ను 2025 నాటికి 2.25 శాతానికి పెంచుతామని ప్రభుత్వం పేర్కొంది. కానీ గత ప్రభుత్వాలు 3 శాతం పెంచుతామని పేర్కొన్న దానికంటే ప్రస్తుత ప్రభుత్వం తక్కువ ప్రతిపాదించింది. అంతర్జాతీయంగా ఉన్న కేటాయింపులు 5 శాతంతో పోల్చి చూస్తే ఈ కేటాయింపుల పెంపుదల సగం కంటే తక్కువగా ఉండటం బాధాకరం.

## మందుల కంపెనీల మాయాజాలం

సాధారణంగా బ్రాండెడ్ ఔషధాలను తయారు చేసే కంపెనీలే జనరిక్ మందులను కూడా ఉత్పత్తి చేసి మార్కెట్ చేస్తుంటాయి. కాబట్టి బ్రాండెడ్ మందుకి జనరిక్ మందుకి వాటి నాణ్యతా ప్రమాణాలలో, పని తీరులో ఎటువంటి తేడా ఉండదు. కానీ ధరలలో 300 శాతం నుంచి 1000 శాతం వరకు భారీగా తేడా ఉంటుంది. జనరిక్ మందు ఖరీదు రూ.2 ఉంటే మందులు కంపెనీలు బ్రాండెడ్ మందు ధరలను రూ. 40 నుండి రూ. 50 గా నిర్ణయిస్తాయి. అంతేకాకుండా జనరిక్ మందులపై అత్యంత దుర్మార్గంగా దుష్ప్రచారం చేస్తాయి. అలా మందులు కంపెనీలు జనరిక్ మందులను తొక్కేస్తూ బ్రాండెడ్ మందుల ద్వారా భారీ స్థాయిలో దోపిడీ చేస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాను తట్టుకునేందుకు వాడుతున్న మందులు, మాస్కులను కూడా నకిలీవి తయారు చేసి ఇబ్బడి ముబ్బడిగా అమ్మేస్తూ ప్రజలను దోచేస్తున్నాయి.

## వైద్య సిబ్బంది కొరత

ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం డాక్టర్ జనాభా నిష్పత్తి కనీసం 1:1000 ఉండాలి. మన దేశంలో 2019 మార్చి 31 నాటికి ఎంసీఐ చట్టం ప్రకారం రాష్ట్రాల వైద్య మండళ్ల వద్ద నమోదు చేసుకున్న మొత్తం అల్లోపతి డాక్టర్ల సంఖ్య 11 లక్షల 59 వేల 309. ఆనాటికి అంచనా వేయబడిన భారత దేశ జనాభా 130 కోట్లు. అంటే డాక్టర్లు, జనాభా నిష్పత్తి 0.14 : 1000. అంతర్జాతీయ గణాంకాలను పరిశీలిస్తే క్యూబా 6.72 : 1000, ఆస్ట్రేలియా 3.374 : 1000, బ్రెజిల్ 1.9 : 1000, రష్యా 4.5 : 1000, స్పెయిన్ 4.9 : 1000, చైనా 1.5 : 1000. మన దేశంలో నేటికీ ఆరు లక్షల మంది డాక్టర్లు 20 లక్షల మంది నర్సుల కొరత ఉంది. దీనికితోడు టెక్నీషియన్ల కొరత 15 లక్షల వరకు ఉంది. అంటే ప్రస్తుతం ఉన్నటువంటి వైద్య ఆరోగ్య సిబ్బందిని మినహాయిస్తే దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో 30 నుంచి 40 శాతం తక్కువగా ఉన్నారు. ఇలా సిబ్బంది కొరతతో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించడం కష్టంతో కూడుకున్నది.

## కార్పొరేట్, ప్రైవేటు దోపిడీ

మన దేశంలో ప్రస్తుతం ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు 75 శాతం కార్పొరేట్ ప్రైవేట్ వైద్య వ్యవస్థలే ఆధారంగా మారిపోయాయి. అనేక కార్పొరేట్ సంస్థలు వైద్య రంగంలో ప్రవేశించి వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశాయి. ఎందుకంటే అవసరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు అన్నింటినీ రాసి ఖర్చును తడిసి మోపెడు చేయడం మందుల రేట్లు 300 శాతం నుంచి

1000 శాతం వరకు అదనంగా వేసి దోచుకోవడం, డాక్టర్ల ఫీజులు కింద లక్షలాది రూపాయలు వసూలు చేయడం మొదలైన చర్యలతో మానవ విలువలు తుంగలో తొక్కి పేషెంట్లను దోపిడీ చేస్తూ ప్రజారోగ్యాన్ని ఓ పెద్ద వ్యాపారంగా మార్చేశారు. అందువల్ల మిగిలి ఉన్న ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు ప్రభుత్వ విధానాల పర్యవసానంగా రోజురోజుకు దిగజారిపోతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

## ప్రయి'వేటు' బీమాలు

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజారోగ్య రంగంలోకి అమెరికా తరహా ఆరోగ్య బీమాలు దేశం నిండా వచ్చిపడ్డాయి. ఐఆర్‌డిఏ చట్టం తెచ్చి భారతదేశంలోకి విదేశీ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు తలుపులు బార్లా తెరిచారు. భారతదేశంలో కూడా కొత్త కొత్త ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు పుట్టుకొచ్చాయి. ప్రభుత్వం ఇలాంటి చట్టాలను తెచ్చి ప్రభుత్వ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పించింది. వాస్తవానికి రాజ్యాంగం ప్రకారం ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల హక్కు. కానీ ప్రభుత్వాలు రాజ్యాంగ నిబంధనలు తుంగలో తొక్కి ప్రజారోగ్య బాధ్యత నుంచి తప్పుకోవాలని ఆరోగ్య పథకాలు ప్రకటించడం సిగ్గుచేటు. కేవలం అత్యవసర వైద్య అవసరాల కోసం ఒక్క శాతానికి ఉపయోగపడే ఇటువంటి పథకాలను ప్రవేశ పెడుతూ భారత ప్రజలందరి పేరుతో ప్రజా ధనాన్ని ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రులకు ధారాదత్తం చేయడం మన దేశ దౌర్భాగ్యం. ప్రభుత్వాలు ఇన్సూరెన్సు కంపెనీలకు చెల్లించే మొత్తం బడ్జెట్‌ను ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థల మీద ఖర్చు పెడితే అంతకు పది రెట్లు నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వ రంగంలోనే అందించే అవకాశం ఉంది.

## ప్రభుత్వాలు ఏం చేయాలి?

గత వందేళ్ల భారత ఆరోగ్య రంగాన్ని పరిశీలిస్తే మానవ మనుగడకే ప్రమాదకరంగా పరిణమించిన ఎన్నో తీవ్రమైన వ్యాధులు, ఆరోగ్య విపత్తుల సమయంలో కేవలం ప్రభుత్వ వైద్య ఆరోగ్య వ్యవస్థలు మాత్రమే భారత ప్రజల ప్రాణాలు రక్షించేందుకు కృషి చేశాయి. నేడు మన దేశాన్ని గానీ, యావత్ ప్రపంచాన్ని గానీ గడగడలాడిస్తున్న కరోనా (కోవిడ్-19) పై యుద్ధం చేస్తున్నది కూడా 99.9 శాతం ప్రభుత్వ వ్యవస్థలే. కాబట్టి 1. వైద్య ఆరోగ్య రంగాన్ని జాతీయీకరణ చేయాలి. అందులో భాగంగా భారత ప్రజలందరికీ ఆరోగ్యాన్ని ఒక హక్కుగా చట్టబద్ధత కల్పించాలి. 2. కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రుల నియంత్రణ చట్టాన్ని తీసుకు రావాలి. ఆ ఆసుపత్రులలో కూడా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ, అలాగే తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు ఉచిత వైద్యాన్ని అందించేలా నిబంధనలు విధించాలి. డాక్టర్ల ఫీజులు, వైద్య పరీక్షల ధరలు, మందుల ధరలను కూడా ప్రభుత్వమే నిర్ణయించాలి. అతిక్రమించిన ఆసుపత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. 3. అందరికీ సమానమైన నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలి. 4. ప్రభుత్వ రంగంలోని వైద్య ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అలాగే సర్ జోసెఫ్ విలియం భోర్ కమిటీ, డా॥ శ్రీనాథ్ రెడ్డి కమిటీలు సూచించినట్లు ఆరోగ్య బడ్జెట్‌ను దేశ జిడిపిలో కనీసం 6 శాతం కేటాయించాలి. 5. ప్రభుత్వ రంగంలోని వైద్య ఆరోగ్య వ్యవస్థ లన్నింటిలో డాక్టర్లు, నర్సులు, సాంకేతిక నిపుణులను, పారిశుధ్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలి. వారికి గౌరవ ప్రదమైన వేతనాలతో పాటు ఉద్యోగ భద్రతను కల్పించాలి. తద్వారా ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేసి భారతదేశం ఆరోగ్య భరితంగా వెలగాలి. ❑

## మతాలు కాదు, మనిషే ప్రమాదంలో ఉన్నాడు

**(54వ పేజీ తరువాయి)**

కూడా హింస ఉంది. ఉదాహరణకు 'నరహత్య చేయవద్దు' అన్న వాక్యం బైబిల్‌లో ఒకసారి కనిపిస్తే, 'నరహత్య చెయ్యి' అన్న వాక్యం వందసార్లు కనిపిస్తుంది.

"దేవుడి పట్ల సమర్పణ భావం లేకపోతే జరిగే నష్టం ఏమీ ఉండదు. కాని, నైతికత లేకపోతే... అన్నీ కోల్పోయినట్టే. నైతికత అనేది ప్రజల ఆస్థి" అని అన్నారు పెరియార్ ఇ.వి. రామస్వామి. తమిళనాడులోని శ్రీరంగపట్నంలో శ్రీరంగనాథ ఆలయం ఎదురుగా ఉన్న పెరియార్ విగ్రహం కింద పాలరాయి మీద చెక్కబడి ఉన్న సందేహం ఈ విధంగా ఉంది -

దేవుణ్ణి మరిచి మనిషికి కృతజ్ఞతలు చెప్పు
దేవుడు లేడు. దేవుడు లేడు. దేవుడు అసలే లేడు!!
సమర్పణ భావం వ్యక్తిగత విషయం
నైతికత ప్రజల సొత్తు -

ఇ.వి. రామస్వామి (17 సెప్టెంబర్ జయంతి)

దేశం నిండా వేల దేవాలయాలు కడితే నాస్తికుల మనోభావాలు దెబ్బతినలేదు. కాని ఒక దేవాలయం ఎదురుగా ఉన్న పెరియార్ సందేశం వల్ల ఆస్థికుల మనోభావాలు దెబ్బ తిన్నాయి. అందుకు కొందరు కోర్టుకెక్కారు. "భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎవరి అభిప్రాయం వారు కలిగి ఉండొచ్చు. అది నేరం కాదు" అని కోర్టు చెప్పడంతో కోర్టుకెక్కిన వారి నోళ్ళు మూతపడ్డాయి. ❑

# అడకత్తెరలో ఆధునిక మహిళ



డా॥ పి. సంజీవమ్మ

దేశ జనాభాలో సగం మంది మహిళలు అనే విషయం మరచిపోకూడదు. ఏ ఉద్యమం పోరాటం సాగినా అందులో మహిళలు పాల్గొంటున్నారు. ప్రస్తుతం సాగుతున్న దేశవ్యాప్త రైతు ఉద్యమంలో మహిళలూ పాల్గొంటున్నారు. అంతే కాదు, తమ ఊళ్ళ నుండి వచ్చి పురుషులు ఉద్యమంలో పాల్గొంటుండగా, తాము ఇళ్ళ దగ్గర పురుషులూ స్త్రీలు చేయగలిగిన రెండు పనులూ నెత్తికెత్తుకొని కష్టపడుతున్నారు మహిళలు. పొలాల్లో వ్యవసాయం పనులు చూసుకుంటున్నారు. శ్రామికులు రైతు కూలీలలో సగభాగం మహిళలే. రాయలసీమలో రైతు కుటుంబాల్లో మహిళలు కూలీలతో పాటు పొలాల్లో శ్రమిస్తారు.

పౌరసత్వ సవరణ చట్టాలతో, రైతులను కూలీలుగ మార్చే నల్లచట్టాలతో మన ప్రధాని బిజీగా వున్నారు. చేతులు తిప్పుతూ నాటకీయంగా హావభావాలు ప్రదర్శిస్తూ చతురోక్తులతో, సరసోక్తులతో ఉపన్యాసాలు దంచుతూ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నానని, ప్రతిపక్షాల్ని చిత్తు చేస్తున్నానని భ్రమించే ప్రధాన మంత్రి ఇప్పుడు మనల్ని పరిపాలిస్తున్నారు. ఆయన కంటె మరి మేధావులు లేరన్నట్లు ఆయన హావభావాలుంటాయి. ఆయన చెప్పే దేశాభివృద్ధి కబుర్లు వినటానికి మనకు రెండు చెవులూ చాలవు. ఆయన ఆర్‌యస్‌యస్ భావజాలానికి మహిళలంటే చిన్నచూపు. వరుస అత్యాచారాలతో హత్యలతో ఉత్తరప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాల లోనూ మహిళల పరిస్థితి దుర్భరమవుతుంటే ఆయన నోరు విప్పలేదు.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై నేరాలు 56 శాతానికి పెరిగాయి. మహిళలకు భద్రత లేదు. మన దేశం స్త్రీ పురుష సమానత్వ సూచికలో 112వ స్థానానికి దిగజారింది. 2019-20 సంవత్సరాల్లో మొత్తం మీద మానవాభివృద్ధి సూచికలో అన్ని విధాలా దిగజారుడే కనిపిస్తుంది. మన ప్రభుత్వం ఇచ్చిన వివిధ గణాంకాల ఆధారంగానే ఐక్యరాజ్య సమితి 2019-20 సంవత్సరాల మధ్య మన దేశ మానవాభివృద్ధిని అంచనా వేసింది.

ప్రతి సంవత్సరం మాదిరిగానే మన జాతీయ మహిళా కమీషన్ 2020 సంవత్సరానికిగాను మహిళలపై నేరాలకు సంబంధించిన తమ నివేదిక విడుదల చేసింది. అందులోని విషయాలు చూస్తే ఇంత ఆధునిక యుగంలోనూ స్త్రీల పరిస్థితి ఇంత దుర్భరంగా వుందా, ఆధునిక మహిళ అడకత్తెరలో నలుగుతూందా అని ఆశ్చర్యం వేయకమానదు. కమీషన్‌కు అందిన ఫిర్యాదులు 23,722 (అందనివి ఎన్నో) ఈ సంఖ్య గడిచిన ఆరు సంవత్సరాల్లో అత్యధిక సంఖ్య. అందులో గృహహింస కేసులు అధికం. మహిళలపై నేరాల విషయంలో ఈసారి బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలో వుందట. మహిళల రక్షణ కోసం ఎన్ని చర్యలు తీసుకున్నా ఎన్ని కొత్త చట్టాలు తెస్తున్నా వారిపై నేరాలు తగ్గడం లేదని కమీషన్ వాపోతూంది.

మహిళల్లో అభద్రతా భావం, మానసిక ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, ఆందోళన అన్నీ కలిపి గృహహింసకు దారి తీస్తున్నాయని కమీషన్ అధ్యక్షురాలు రేఖాశర్మ గారు చెబుతున్నారు. 2020 సంవత్సరంలో కోవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించడం వల్ల గృహహింస మితిమీరిపోయింది. ఇది మహిళల పట్ల రాక్షసం గా తయారయింది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు పెద్ద సవాల్‌నే ఎదుర్కొన్నారు. ఇళ్ళకే పరిమితం కావలసి వచ్చినందు వల్ల వేధింపులు అధికం అయ్యాయి. గృహహింస కేసులన్నీ నమోదు కాలేదు. అయ్యే అవకాశం కూడా మహిళలకు తగ్గిపోయింది అన్నారు రేఖాశర్మ గారు. అయినా అత్యాచారాలు లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు కుప్పలుతెప్పలుగా వచ్చినట్లు వారే చెబుతున్నారు. మహిళా కమీషన్ వారు మహిళల్ని చైతన్యవంతం చేస్తున్నట్లు, వారి హక్కులు సాధికారత కోసం 2021 సంవత్సరంలోనూ చిత్తశుద్ధితో కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు. మానవ హక్కులన్నీ మహిళల హక్కులు అని ప్రచారం చేస్తున్నారు. కానీ ఏటా దాదాపు కోటి మంది బాలికా భ్రూణహత్యలు జరుగుతున్నాయి.

మహిళా హక్కుల కార్యకర్త షమీనా హాఫిక్ గారు గృహ హింస గురించి ప్రభుత్వాలు కఠినంగా మాట్లాడవలసిన సమయం వచ్చిందని, మహిళల్ని కొట్టడం తమ హక్కుగా పురుషులు భావిస్తున్నారని, భార్యల్ని హింసించడం అత్యంత దుర్మార్గమనీ, మహిళల జీవితాల్ని నియంత్రించగలమని పురుషులు భ్రమపడుతున్నారని ఘాటుగా విమర్శించారు. మహిళల సమస్యల్ని మహిళలవి మాత్రమే కాదు. అది పొరపాటు అవగాహన. మహిళా సాధికారత, స్త్రీవాదం సామాజిక సమస్యలు. అవి పురుషులకూ పురుష సంస్కృతికీ సంబంధించి నవే. జనాభాలో 65 కోట్ల మందికి సంబంధించిన సమస్యలంటే అవి వారికి మాత్రమే ప్రత్యేకం ఎలా అవుతాయి? అవి దేశంలో అందరి సమస్యలు.

దేశాన్ని ఉద్ధరించేది పురుష పుంగవులే. మహిళలు ఇళ్ళకు పరిమితం కావలసిన వాళ్ళు అనే భావజాలం నేటి పాలకపార్టీది. స్త్రీలు బయటికి రావటం వల్లనే వాళ్ళకు సమస్యలన్నీ చుట్టుకుంటున్నాయని, హింస పెరుగుతుందని పాలకులు పదే పదే వక్కాణిస్తూ ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా సమాజంలో సంపదను సృష్టిస్తూ వున్నది పురుషులు మాత్రమే కాదు, స్త్రీలు కూడా అనే వాస్తవాన్ని గుర్తించాలి. ఇంటా బయటా కష్టం చేసేది స్త్రీలు. ఇంటా బయటా హింసకు గురి అయ్యేది కూడా స్త్రీలే. గుర్తింపు లేని వెల కట్టలేని ఇంటి పనులు వారివే. దేశ ఆర్థిక వ్యవస్థకు మహిళలు పురుషులకు తీసిపోనంత సేవలందిస్తున్నారు. ఇంటి పనులతో పాటు ఉద్యోగాలు, వ్యవసాయం పనులు, పరిశ్రమల్లో కార్మికులుగ, వ్యాపారాలు నిర్వహించడంలోనూ తమ శ్రమను పంచుతున్నారు.

ప్రపంచ ఆర్థిక పరిణామాలపై ఆక్స్‌ఫామ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతి సంవత్సరం సామాజిక ఆర్థిక అంశాల మీద నివేదికల్ని ప్రచురించి మన ముందు వుంచుతున్నది. ఈ సంవత్సరం ఆ నివేదికను పరిశీలించినప్పుడు మనకు తెలిసే వాస్తవాలు ఏమంటే ప్రపంచంలో సంపదా దరిద్రం రెండూ పెరుగుతున్నాయి. కొద్ది మంది చేతుల్లో అపార సంపదా, అధికారం కేంద్రీకృతం అవుతున్నాయి. శ్రమజీవులు శ్రమజీవులుగానే మిగిలిపోతున్నారు. ఈ అంతరం ప్రపంచాన్ని రెండుగా విభజిస్తున్నది అని.

మహిళలకు సంబంధించి ఇక్కడొక ముఖ్యమైన విషయం చెప్పాలి. వివిధ దేశాల్లో మహిళలు బాలికల చేత పని చేయించుకోవటం వల్ల అదనపు శ్రమదోపిడీ పెరిగిపోతున్నది. మహిళలకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నందు వల్ల 10 లక్షల 80 వేల కోట్ల డాలర్లు–అంటే దాదాపు 800 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి దారుల చేతుల్లో పడుతున్నాయి. ఇది ప్రపంచ టెక్నాలజీ పరిశ్రమల రంగానికి మూడు రెట్లు ఎక్కువ. ఇలా ఎగవేసిన శ్రమ విలువ కారణంగానే ప్రపంచ ఆర్థిక చక్రాలు వ్యాపారాలు నడుస్తున్నాయి.

2019లో ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 153కు చేరింది. 690 కోట్ల మంది ప్రపంచ ప్రజల సంపదకు రెట్టింపు సంపద కేవలం ఒక శాతం మంది చేతుల్లో కేంద్రీకృతమైంది. ఇవి ఆక్స్‌ఫామ్ సంస్థ బయటపెట్టిన విషయాలు. దీని వల్ల మనం గమనించ వలసిన విషయాలు ఏమంటే–ప్రపంచ సంపద సృష్టికర్తలు మహిళలు కూడా అనీ, వారు మరింత శ్రమ దోపిడీకి గురవుతున్నారనీ.

ఆక్స్‌ఫామ్ సంస్థ లెక్కలు చెప్పింది. కానీ పై వాస్తవాలన్నీ మన అనుభవాలకు తెలుసు. ప్రతి ఏడాదీ దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ఈసారీ జరిగింది. ఆ సదస్సు ముందు ఆక్స్‌ఫామ్ తమ నివేదికను వుంచింది. దేశాధినేతలకు ఒక హెచ్చరిక కూడా చేసింది. పెరుగుతున్న ఆర్థిక సామాజిక అంతరాలు అశాంతికి ఘర్షణలకు దారి తీస్తాయి. వాటిని పరిష్కరించే మార్గాలు చేపట్టింది అని.

పౌష్టికాహార లోపం మన దేశంలో అతి పెద్ద జబ్బు. ఆ జబ్బు పీడించేది ముఖ్యంగా మహిళల్ని. ఈ జబ్బుకు మూలం పేదరికం. పేద కుటుంబాల్లో స్త్రీలు శారీరక మానసిక ఒత్తిడికి ఎక్కువగా గురి అవుతారు. తమ సంగతి అలా వుంచి పిల్లల పోషణ విషయంలో ఏం చేయాలో తోచక ఒత్తిడికి గురి అవుతారు. పేద కుటుంబాల్లో కుటుంబ పోషణ మగవారిది మాత్రమే కాదు, స్త్రీలది కూడా. ఒక్కొక్క సారి పురుషుల కంటే ఎక్కువ బాధ్యత స్త్రీల మీదే పడుతుంది. తాగుడు వ్యసనం వున్న కుటుంబాల్లో స్త్రీలు పడే నరకయాతన అది వారికి మాత్రమే అర్థమయ్యేది. అలాంటి కుటుంబాల సంఖ్య ఎక్కువ.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ (WHO) ఇటీవల కోవిడ్–19 సంవత్సర పరిస్థితుల వల్ల సంభవిస్తున్న కష్టాల గురించి విడుదల చేసిన సమాచారం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మహిళలు పడుతున్న బాధలు ఎక్కువ అనీ, లాక్‌డౌన్ వల్ల నిరుద్యోగం, ఉపాధి లేకపోవడం వల్ల మహిళలకు పనిభారం పెరిగి కుటుంబాల్లో పురుషుల నుండి కూడా హింసను ఎదుర్కోవాల్సి వస్తుందనీ, శారీరక మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వెల్లడించింది.

నీటిని అరికట్టడానికి ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతి సంవత్సరం నవంబరు 25వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు సభ్య దేశాలన్నీ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి పలు కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని మరి మన దేశం ఎంత మాత్రం ఏమి చేసింది?

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2018లో 3 లక్షల 80 వేల మంది మహిళలు వివిధ రకాల హింసలకు గురి కాగా, 2019లో ఈ సంఖ్య 4 లక్షల 50 వేలకు చేరింది. ఇందులో వివాహిత మహిళలు కుటుంబంలో భర్తల నుండి, ఇతర సభ్యుల నుండి ఎదుర్కొంటున్న మానసిక హింస వేధింపులు అధికం అని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే వెల్లడించింది. కుటుంబం వెలుపల హింసను ఎదుర్కొంటున్న మహిళలు దళితులు గిరిజనులు వలస కూలీలు ముఖ్యం. మరొక వైపు బాలికల అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది. ఈ పెట్టుబడి దారీ వ్యవస్థలో ఆడవాళ్ళ దేహాలే పెట్టుబడిగా వ్యాపారం సాగుతోంది. ప్రేమ పేరుతో యాసిడ్ దాడులు, కిడ్నాపులు, కుల అహంకారంతో పరువు హత్యలు, పాఠశాలల్లో ఆశ్రమాల్లో, అనాథ శరణాలయాల్లో ఆఖరికి ఆధ్యాత్మిక కేంద్రాల్లో సహితం ఆడపిల్లలకు రక్షణ లేదు. వాళ్ళ మీద హింస లైంగిక దాడులు జరుగుతున్నాయి.

2012లో ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' వుదంతం ప్రపంచ ప్రజలనే కదిలించింది. ఆ ఘటన 'నిర్భయ' పేరుతో ఒక చట్టం

రావటానికి కారణమయింది. అలాగే హైదరాబాదు శివారులో ఒక మహిళా డాక్టరు మీద జరిగిన సామూహిక అత్యాచారం, హత్య మరింత సంచలనం కలిగించింది. ఆ దుండగులు ఎన్‌కౌంటర్‌కు గురి అయ్యారు. ఆ ఘటన 'దిశ' చట్టం రావటానికి దారి తీసింది.

జమ్ములోని 'ఉన్నావ్'లో ఎనిమిదేళ్ళ బాలిక మీద కిరాతక అత్యాచారం హత్య జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో 'కతువా'లో ఒక మైనర్ బాలిక మీద ఒక ఎమ్మెల్యే జరిపిన అత్యాచారం, అదే ఉత్తరప్రదేశ్‌లో హతాస్ గ్రామ దళిత మహిళ మీద అగ్రవర్ణ యువకులు జరిపిన అత్యాచార ఘాతుకం కారణంగా ఆమె జీవన్మరణ పోరాటంలో ఓడి తనువు చాలించిన ఘటన – ఎన్నని లెక్కలు చెప్పగలము?

ఎక్కడో ఒక చోట నిత్యం దుశ్శాసన పర్వాలు కీచక పర్వాలు జరుగుతూనే వున్నాయి. నిన్నటికి నిన్న (7–1–21) రాజస్థాన్‌లో రత్నాం జిల్లా బామన్ దేవరాజన్ గ్రామంలో నూరు మంది కౌరవుల్లా ఒక ముఠాగ ఏర్పడి మారణాయుధాలతో గ్రామం మీద దాడి చేసి 38 మంది మహిళల్ని చిన్నారుల్ని అపహరించుకు పోయారు. గొడవలకు కారణాలు ఏవైనా దుర్మార్గుల లక్ష్యం స్త్రీలు. వారిని నానా హింసలకు గురిచేసి పగ తీర్చుకుంటారు. ఇక్కడ సమయానికి పోలీసులు స్పందించి ఆ మహిళల్ని రక్షించారట.

ఇంత అభద్రతా భావ పరిస్థితులుంటే సమాజంలో మహిళల రక్షణకు ప్రభుత్వాలు ఏవో చట్టాలు చేస్తే సరిపోతుందా? చట్టాలు అధికారం గల వాళ్ళకు, డబ్బులున్న వాళ్లకు చుట్టాలు అని అందరికీ తెలుసు. ఆడవాళ్ళ మీద అఘాయిత్యాలు చేస్తున్న దుర్మార్గులకు ఎందరికి శిక్షలు పడుతున్నాయి? ఎందరు తప్పించుకుంటున్నారు?

మహిళా సాధికారత, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల గురించి కూడా ఇక్కడ మాట్లాడుకోవాలి. కాని ఈ విషయాల్లో ప్రభుత్వాల నిర్వాకం గమనించిన తర్వాత వీటి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదనిపిస్తూ వుంది. నాయకులు అందరూ మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే వున్నారు. ముఖ్యంగ ఎన్నికలు సమయంలో మరీ ఎక్కువ మాట్లాడుతూ ఉంటారు. మహిళా సాధికారతతోనే దేశం అభివృద్ధి చెందుతుందని వక్కాణిస్తూ వుంటారు. ఎన్నికల తర్వాత మరచిపోతారు.

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ గురించి కూడా అంతే బడాయితో మాట్లాడుతూ వుంటారు. ఎన్నికల సమయంలో తర్వాత షరా మామూలే. పంచాయతీ సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ కల్పించారు. అని తర్వాత 50 శాతానికి పెంచారు. కొన్ని రాష్ట్రాల్లో అందువల్ల మేలు జరిగింది. మహిళా చైతన్యం పెరిగింది నెమ్మదిగ.

మహిళా సాధికారతకు, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్‌కూ ఎంతో లింకు వుంది. మహిళా సాధికారత గురించి రాజకీయ పార్టీలు నాయకులు వూకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వకుండా, చట్టసభల్లో 50 శాతం (జనాభాలో సగం కాబట్టి) రిజర్వేషన్స్ కల్పించే చట్టం చేయాలి చిత్తశుద్ధి ఉంటే. నల్లచట్టాలు హడావిడిగ చేస్తారు కానీ, మహిళల విషయం వచ్చేటప్పటికి వారి రిజర్వేషన్స్ గురించి 'ఏకాభిప్రాయ సాధన' పాట పాడుతూ వున్నారు. మహిళా సంఘాలు, ముఖ్యంగ భారత జాతీయ మహిళా సమాఖ్య (NFIW) 30 ఏళ్ళ నుండి పోరాటాలు చేస్తూనే వున్నారు రిజర్వేషన్స్ కోసం. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఫలితం శూన్యం. అన్ని పార్టీల్లో పురుషాధిక్య భావన రాజ్య మేలుతూ వుంది. ప్రజాస్వామ్యంలో వున్నామా లేక పురుషస్వామ్య పాలనలోనా అని అనుమానం రాక మానదు.

మహిళా సాధికారత అంటే స్పష్టత లేకుండ ఏదేదో మాట్లాడుతూ వుంటారు మంత్రులూ, అధికారులూ. ప్రతి మహిళనూ లక్షాధికారిని చేస్తామంటారు. వడ్డీ లేని రుణాలు ఇస్తామంటారు. ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెడు తున్నారంటారు. 2001 సంవత్సరంలో UNO మహిళా సాధికారత అంటే ఏమిటో ప్రకటించింది. "దోపిడీరహిత సామాజిక ఆర్థిక వ్యవస్థను ఆవిష్కరించుకోవటానికి – ఆ దిశగ సమాజ గమనాన్ని నిర్దేశించే శక్తి సామర్థ్యాలను మహిళలు కలిగి వుండటం వల్లనే మహిళా సాధికారత సాధ్యం అవుతుంది" అని. అలాంటి సమాజంలోనే స్త్రీలు సంపూర్ణ వ్యక్తులుగా ఎదగగలుగుతారు. స్త్రీ పురుష సమానత్వం కార్యరూపం ధరిస్తుంది. స్త్రీ పురుషులిరువురికి సమాన బాధ్యత సమాన భాగస్వామ్యం వుండే సమాజం అది. అధికారం అంటే అణచి ఉంచేది కాదు. అధికారం అంటే అవినీతి రాజకీయ అధికారాన్ని దోపిడీని అంతం చేసేది. ప్రతి గృహిణి రాజకీయవేత్త కావాలి. పదవులు పొందటం కాదు. సరైన రాజకీయ ఆర్థిక తాత్విక దృక్పథాలను అలవరచుకోగలగాలి. నిత్యం తమకు ఎదురవుతున్న సమస్య మూల కారణాల్ని అన్వేషించగలిగిన జ్ఞానం ఆలోచన రావాలి.

ఇప్పట్లో కులాల గుంపులు, మతమూ రాజకీయాల్ని ఆడిస్తున్నాయి. పెట్టుబడిదారులు సరే సరి. వారు కుక్కలకు ఎముకలు పడేసినట్లు రాజకీయ పార్టీలకు ఎన్నికల అవినీతి ఖర్చుల కోసం డబ్బులు పడేస్తున్నారు. ఆ డబ్బు వారికి ఎక్కడిది? శ్రామికుల శ్రమ దోపిడీ సొమ్ము అది. బ్యాంకుల్ని మోసాలు చేసి అప్పులు ఎగగొట్టిన సొమ్ము అది. అనంతా శ్రామికులైన సామాన్య ప్రజల కష్టార్జితం. తీగ లాగితే డొంకంతా కదులుతుంది.

సరే, భవిష్యత్తులో అతి పెద్ద ఓటు బ్యాంకు అయిన మహిళా సమాజం చుట్టూనే రాజకీయ సమీకరణలు జరుగుతాయి. మనం గుర్తుంచుకోవాలి. ❑



# ఈ దీనత్వాన్ని తొలగించలేమా ?

**చందు సుబ్బారావు**
విశ్రాంత ఆచార్యులు ఆంధ్ర యూనివర్శిటీ

స్వేచ్ఛా వాణిజ్య జీవనంలో ధనికులు, పేదలు ఉంటారు. అవకాశాలు, శక్తియుక్తులు లేనివారు నిరుపేదలుగా మిగులుతారు. పేదలకు సుఖసంతోషాలు పరిమితంగా లభిస్తాయి. నిరుపేదలకు అందని ద్రాక్షపళ్లలా ఊరిస్తుంటాయి. పండగ వస్తేనే ఓ స్వీటూ, ఎవరైనా పెడితేనే ఓ హాటూ నిరుపేద పిల్లలకు లభిస్తాయి. అమ్మా, నాన్న అధిక శ్రమ చేసి పిల్లలకు ఏడాదికో జత బట్టలూ, తలకింత నూనె, దువ్వెన ముక్కా కొనిపెడతారు. పడిపోయే ఇంటిని నిలబెట్టడం, ఊడిపోయే గోడరాళ్లను తిరిగి కలబెట్టడం, పెచ్చులూడిన నేలకు సున్నం తెచ్చి రాయటం నిరుపేదల అవసరాలు. వారికి పౌష్టికాహారం లేకపోయినా రెండు పూటలా అన్నం, గంజి లేక మజ్జిగ, మిరపకాయ లేక ఉల్లిపాయల్తో పిల్లలకు తినిపిస్తుంటారు. కుటుంబం రోడ్డున పడకుండా గౌరవంగా బ్రతుకుతున్నట్లు కనిపిస్తారు. చేయిచాచి అడుక్కునే స్థితి నుండి తప్పించుకుంటారు. పొరుగువాళ్ళు, పీటనాయకులు, సమూహాధిపతులు కరుణించి ఏడాదికొకమాటు ఓ వంద రూపాయలు చేతిలో పెడితే పండగ చేసుకుంటారు. పిల్లల్ని బడికి పంపటం జరగదు. పంపినా వాళ్ళు ఇతర పిల్లల మధ్యన దిష్టి బొమ్మల్లా నిలబడలేక బడి ఎగ్గొడతారు. తల్లిదండ్రులు చూసీ చూడనట్లు ఊరుకుంటారు. అందులోనూ సర్కారు బళ్ళు కొంపలకు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పిల్లలు వెళ్ళలేరు. చదువుకోలేరు. మరో తరం వేలిముద్రలకు సిద్ధమవుతుంటుంది. లేదా చుట్టూ ఉన్న వ్యాపార ప్రపంచం ఊరిస్తే, కవ్విస్తే యితర పిల్లల్ని చూసి పోటీపడాలని భావిస్తే మగపిల్లలు నేరాలకు పాల్పడతారు. ఆడపిల్లలు శరీరాన్ని అమ్ముకోవటం నేర్చుకుంటారు. ఇది నిరుపేదలకు నిర్వచనం. వీరి క్రింద మరో తరగతి మన దేశంలో సాక్షాత్కరిస్తోంది. వారు నిత్య దరిద్రులు...!

తిండికీ, త్రాగే నీటికీ, కట్టే బట్టకూ, కునుకు తీసే నేలకూ కూడా కరువై చెట్టూ పుట్టను ఆశ్రయిస్తారు. ఆకూ, కాయ కోసి తినటానికి యత్నిస్తారు. చేపా, జెల్లా దొరికితే వండి (దినుసులు లేకుండా) తింటానికి ఆత్రుతపడతారు. పిల్లలు ఆకలికి తట్టుకోలేక రోడ్డు ప్రక్క కుండీల్లో వ్యర్థాలను తిని కుళాయిలో నీళ్ళు త్రాగుతుంటారు. తల్లిదండ్రులు రోజుకో మాటో, రెండ్రోజులకో సారో పిల్లలు బ్రతికున్నారని చూసుకుని సంతోషపడతారు. గుడి దగ్గర మెట్ల మీద, అంగడి దగ్గర వాకిట్లోనో చేతులు చాచి అడుక్కుంటానికి అలవాటు పడతారు. తాము తిని మిగిలితే అమ్మకూ, నాన్నకూ ఇస్తారు. తల్లిదండ్రులే అడుక్కుంటే పిల్లలకు తెచ్చిపెడతారు. అనారోగ్యం కాచుక్కూచుంటుంది. కనుక జబ్బులతో ఆకారాలు, ఆనందాలూ మాయమై, వికారుల్లా మాసిన బట్టల్తో ముసిరిన చీకట్లలా బ్రతుకు ఈడుస్తుంటారు. కనీస ఆరోగ్యాలు కరువయిపోవటం చేత వీరిని రోడ్డు ప్రక్క పరిచిన తుండుగుడ్డల్లానే చూస్తుండడం వలన పేదలు, నిరుపేదలు కూడా కలుపుకోరు. ఓ ముక్క నోటికందించరు. ఓ రూపాయి సాయం చెయ్యరు. ఎందుకూ.. పనులకు కూడా పిలవరు. ఏ రోగం అంటుకుంటుందో అని. అక్కడ ఆడపిల్లలున్నా అంతే. వీరిది సమాజ విషవాయువుల కాసరం కనుక బ్రతికినా, చచ్చినా ఎవరికీ పట్టదు. కానీ వారు బ్రతుకుతారు. వంతెనల క్రింద, చెట్ల తొర్రల్లో (ఆధునిక యుగంలో!!) పడిపోయిన ఇళ్ళ రాళ్ళ ప్రక్కన, శ్మశానాల దగ్గర్లో, భవనాల ప్రహరీ గోడల ప్రక్కన, శిథిలమైన శిల్పాల తొర్రల్లో, గుళ్ళ వెనక గోడల క్రిందా, కార్ల షెడ్లల్లో, చెడిపోయిన బస్సుల టైర్ల మధ్యా, కలవారి విశాల గృహాల కిటికీల ప్రక్కనా బ్రతుకుతుంటారు. వారిది కటిక దారిద్ర్యమనీ, నికృష్ట జీవనమనీ వారికి తెలియదు. గాలికి బ్రతకటం, వానకు తడవటం, వరదల్లో కొట్టుకుపోవడం, సముద్రాల్లో శవాలై తేలటం వారికి పరిపాటి. నిరుపేదల వర్గానికి, వీరికి ఒకటే తేడా. నిరుపేదలు చెమట మ్రింగి ఆకులు నమిలి, పురుగూ పుట్టా పట్టుకొని కాల్చుకు తిని మేము సైతం మనుషులం అంటారు. దరిద్రులకు చెమట పట్టదు. ఏ ఆకు తినాలో తెలియదు. ఏ పుట్టలో ఏ పాముందో గ్రహించలేరు. ఏది తినకూడదో గుర్తించలేరు. తినకూడనిది తిని ఏ రోగాన పడతారో వారికే తెలియదు. ఏ వైద్యుడూ ముట్టుకొని చూడడు. ఏ సన్యాసోత్తముడూ చేయి వేసి దగ్గరకు తీయడు. ఏ సమాజ సేవకుడూ దగ్గరకు రాడు. రోడ్డు ప్రక్క తిరుగాడే కుక్కలూ, పిల్లులూ, పందులూ, పందికొక్కుల్లో వీరు కూడా భాగం అనుకుంటారు. ఒక్కోసారి ఉద్ధరించడానికి బలవంతాన తీసుకెళ్ళినా, బంతిలో కూర్చోబెట్టి భోజనం పెట్టినా దుప్పటీ, దిండూ యిచ్చి పండబెట్టినా అర్ధరాత్రి చెప్పకుండా పారిపోగలరు.


సరేనయ్యా... మన దేశంలో వీరిది పది శాతమని పెద్దలు నిర్ణయించారు. నగరాల్లో కాసింత ఎక్కువ. పల్లెటూళ్ళలో బాగా తక్కువ. కారణం పల్లెటూరు ప్రజలు తిట్టీ, కొట్టీ వీరిని పనుల్లోకి దించి తిండి బట్టా యిచ్చి పాకల్లో పడుకోబెడతారు. భార్య

డొక్కుంటే నీళ్ళోసుకుందిరా నీ పెళ్ళాం అంటారు. నొప్పులొస్తే ఆ ఊరి చాకలి తల్లి మంత్రసానయి, మంచం అడ్డంపెట్టి పురుడు పోసి వెళుతుంది. 'ఆడి పెళ్ళాం కన్నది కాబోలు, నాలుగు శేర్లు బియ్య పంపండ్రా' అని ఊరిపెద్ద హుంకరిస్తాడు. ఆమెను మరో కాన్పు కోసం బ్రతికిస్తారు. వాళ్లాయన పుట్టిన పిల్లోడి కోసం సగం తిని, సగం భార్యాబిడ్డలకు మిగులుస్తారు.

ఈ దారిద్ర్య రూపం దేశంలో ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తుంది. అన్నం లేక దిష్టిబొమ్మ లాంటి తల్లీ పిల్లలు రోడ్డు ప్రక్క కూర్చుని చేయి చాచే దృశ్యాలు రోజూ పత్రికలలో కన్పిస్తుంటాయి. ఒక్కోసారి దూరదర్శనాలకు కథాకాలక్షేపాలుగా దివ్య దర్శనమిస్తాయి. సినిమాలు సైతం తీయబడతాయి. పది కోట్లు ఖర్చు పెట్టి ఒకకోటి హీరోకి, అరకోటి ఆయన భార్యగా నటించే నాయకికి యిచ్చి తీస్తారు. దారిద్ర్యాన్ని సైతం గొప్పగా చూపించిన నిర్మాతకు పదిహేను కోట్లు లాభమొస్తుంది. ఆయన యీ సారి పల్లెటూరి పిల్లల అమాయక జీవితాలపైన ఇరవై కోట్లలో నిర్మాణానికి తెర తీస్తాడు. వార్త వేస్తాడు. ఒక్క సినిమాకు, ఒక్క సీరియల్‌కు, ఒక్క ధనవంతుని బిడ్డ వివాహానికి, ఆడపిల్ల రజస్వల వేడుకలకు లక్షలు ఖర్చు పెడుతున్నాం. అందులో ఒక్క శాతం దారిద్ర్య దృశ్యాల నిర్మూలనకు కేటాయిస్తే మన సమాజం మారిపోదు. సమాజ ముఖచిత్రం మారిపోతుంది. అంటే మొన్న లాక్‌డౌన్‌ల నాడు...!

వలస కార్మికుల కుటుంబాల నికృష్ట యాత్రలను చూసి ప్రభుత్వ నేత, ప్రధానీ చలించలేదా... లావుపాటి హోంమంత్రికి కన్పించలేదా.. రాష్ట్రపతికి అగుపించలేదా.. పది విమానాల్లో వారిని తరలించమని ప్రభుత్వాన్ని ఆదేశించలేదా? జగజ్జెట్టి, లోకాధినేత అయిన ప్రదాని గారికి కాళ్ళు కనిపించలేదా. పది బస్సులు, నాలుగు హెలీకాప్టర్లు, సైన్యంతో పంపి క్షణాల్లో వాళ్లను నివాసాలకు తరలించలేదా? మౌనం వహించాడా? చూస్తూ ఊరుకున్నాడా? నడి వేసవిలో తారురోడ్డుపై నాలుగేళ్ళ పిల్లలు తెగిన చెప్పులు చేత పట్టుకొని, కాలే కాళ్ళతో నడవటమా..? అది చూసి సోనూసూద్ అనే సినిమా నటుడు తెగించి వారి కోసం లక్షలూ, కోట్లూ ఖర్చుపెట్టి ఆ దరిద్ర దృశ్యాన్ని రూపుమాపటమా? నేటికీ అతనికి తప్ప మిగతా ప్రభుత్వాధినేతలక ఎవరికీ ఎప్పుడు ఏ నిస్సహాయస్థితి నుండి రక్షించాలో తెలియటం లేదా? ఇటీవల ఒక్కో జిల్లాలో ఒక్కో అవినీతి అధికారి నుండి 'వందల కోట్ల రూపాయలు' నల్లధనం దొరుకుతుంది. ఒక్క అవినీతి అధికారిని జాతీయం చేస్తే చాలునే. వందల కుటుంబాలకు తిండీ, బట్టలూ, ఇల్లూ, వాకిలీ ఇవ్వవచ్చునే. అనంతరం వాళ్ళే శ్రమ చేసుకుని బ్రతుకుతారే..! అయ్యా జాతీయ పారిశ్రామికవేత్తలను అడగటం లేదు. టాటా, బిర్లా, దాల్మియా, అదానీలనడగటం లేదు. సైన్యానికి కేటాయించే 60 లక్షల కోట్ల బడ్జెట్ నుండి అడగటం లేదు. బాహుబలి సినిమా నిర్మాతల 500 కోట్ల లాభాల నుండి అడగటం లేదు. తన పిచ్చిప్రేమ సినిమాను బొంబాయిలో 15 ఏళ్ళు ఆడించుకున్న షారూఖ్‌ఖాన్‌నో, సల్మాన్‌ఖాన్‌నో అడగటం లేదు. చిరంజీవినో, అమితాబ్‌బచ్చన్‌నో అడగటం లేదు. నల్లధనం మూర్తుల నుండి తలో కోటీ దానం అడుగుతున్నాం. ఆ ధనం స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వారి ప్రజాహిత వాణిజ్యాన్ని కోరుతున్నాం. మీరు తలుచుకుంటే దేశంలోని దారిద్ర్యాన్ని, యీ నిస్సహాయ సన్నివేశాన్ని, నికృష్టమైన పేదరిక స్వరూపాల్ని కనపడకుండా చేయవచ్చును. సామ్రాజ్యవాద నిర్మూలనను, సామ్యవాద సమాజ సంస్థాపన కోరటం లేదు. పుట్టిన ప్రతి వాడికీ జీవించే హక్కును రాజ్యాంగంలో చేర్చమని అడగటం లేదు. మన దేశాన్ని ఓ సోషలిస్టు క్యూబాలానో, ఫ్రాన్సు, జర్మనీలానో, జపానులానో చెయ్యమని కోరటం లేదు. మూడు పూటలా తిండి పెట్టగల అవకాశాన్ని కల్పించడం కోసం వారిని ముందు మనుషుల్లా మార్చమంటున్నాం. వారు అంటే కార్మికులు, కర్షకులు, చిన్న వ్యాపారులు, చిరుద్యోగులు, పేదలు, నిరుపేదలు, నిరుద్యోగులు, ఆకలితో అలమటించే కళాకారులూ, అభాగ్యులైన శ్రమజీవులూ కాదు. వ్యవస్థలో గుర్తింపు లేని దరిద్రులు.. "అంతేలే పేదల బ్రతుకులు.. విశుష్కములు.. పరిపాండురములు.. విచలించెడి విషాదహేతువులు.." అన్నాడు శ్రీశ్రీ. ఆ జీవనులను ఆదుకోవాలి. వారిని మనుష్యులుగా గుర్తించాలి. నోరూ, వాయా లేని వారిని మానవ సమాజంలోనికి స్వీకరించాలి. సమాజ బహిష్కృతాల్లా చూడకూడదు. వారికి ఎవరిని అడగాలో కూడా తెలియదు. సామాజిక శక్తులు, నాయకులు, సిద్ధాంతులు, రాజకీయ మహిమాన్వితులు వారిని పట్టించుకోకపోవచ్చును. హృదయం వున్న చిరంజీవులూ, చైతన్యస్వరూపులూ, మేధావులూ గమనించాలి. ఆపరేషన్ ఖర్చులేక ఆరిపోయే దీపాలు, అండలేక అణగారిపోయే జీవాలూ, బ్రతుకొక నిరంతర బాధాసర్పమై కాటు వేస్తే కళ్ళు తిరిగి పడిపోతున్న కన్యకామణులూ, ప్రలోభంతో కాక ఆకలితో వ్యభిచారానికి లొంగిపోతున్న పడతులూ, వారిని వేధించే అవమానాలఘోరాలూ, జబ్బులతో కృంగిపోయే దీనాతిదీన స్థితులూ మనం గమనించాలి. దేశాధినేతలకు అవి పట్టించుకునే తీరిక లేకపోవచ్చును. 'పని లేని' ప్రతిపక్షాలు అరిచినా నడిచినా, అన్నీ మరిచినా, ధిక్కరించినా ఏమీ జరగక పోవచ్చును. సమాజ సంస్కరణ పై నుండి ప్రారంభమవుతుందని ఓ విశ్వాసం ఉంది మనకు. అలా కాక క్రింది నుండి ప్రారంభిస్తే ఆరోగ్యకరమైన పరిణామం తలెత్తుతుందని చెప్పగలం. అంటే

☞ మిగతా 80వ పేజీలో



# ఓ స్వేచ్ఛా ! గొంతెత్తి గర్జించు


బెంగాలీ మూలం : షంషుర్‌రెహమాన్
ఇంగ్లీషు : కబీర్ చౌదరి

తెలుగు అనువాదం : **కొత్తపల్లి రవిబాబు**
ప్రజాసాహితి సంపాదకులు


కోయిలల బాధామయ మూల్గులు మాత్రమే వినబడే
వికసించిన పూలు లేని వసంతాన్ని నేనేం చేసుకోను?
పక్షులేవీ వాలని తోటను నేనేం చేసుకోను ?

అబ్బ! ఎంత ఎగుడుదిగుడుగా వుంది నేల !
ఒంటరిదయ్యాల్లాగా వరుసగా నిలబడ్డ చెట్లమొండేలు ఎన్నో !
నాకు విషభీషకం ఇస్తూ, నా తలపై ముళ్ళ కిరీటం పెట్టే
ప్రేయసిని నేనేం చేసుకోనూ!

నగరంలో తెరలుతెరలుగా సాగే ఊరేగింపులూ,
రంగురంగుల ఐస్‌క్రీములు అమ్మే వర్తకులూ,
పాదచారులూ లేని ఈ రోడ్లెందుకు?
వీటి ప్రయోజనమేమిటి?

సూర్యాభిముఖులమై మనం ప్రారంభించిన ప్రయాణానికి
రమ్మనమని పిలిచాను ప్రియా నిన్ను
ప్రజలు గొంతెత్తి గానం చేస్తున్న పాటలను వినబడకుండా చేస్తుంది
వెనక్కు లాగుతున్న బూర్జువా ఆకర్షణ
నీవు ఇప్పటికీ ఆ భయంకర గ్రద్దీపంజీలో బందీవే !

ఏడు రంగుల తివాచీ పరచిన రోడ్డుపై
ఇప్పటికీ నీవు నడవలేవు
అబ్బ! నీవు నా చెంత లేకుండా
ప్రయాణం కొనసాగించడం ఎంత దుర్భరం !

గాఢాంధకారం వెదజల్లుతూ వస్తుందొక భయంకర పిశాచం
నవనాగరికత పునాదులు దాని పదఘట్టనతో
ఒక్క క్షణంలో నుజ్జు, నుజ్జు

వాడు పున్నమ చంద్రుడ్ని ఉరికంబానికి వేలాడేస్తాడు
గులాబీలు, తామరలు వికసించడం
చట్టవిరుద్ధమని ప్రకటిస్తాడు !
వాడు నా కవితలను ఒక్కొక్కటిగా నిషేధిస్తాడు
అట్టహాసమేమీ లేకుండా నిశ్శబ్దంగా
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని నిషేధిస్తాడు
నీ జుత్తు వెదజల్లే సువాసనల్ని నిషేధిస్తాడు

నెల్సన్ మండేలా కారాగారంలో
సుదీర్ఘ కాలం మగ్గినన్ని రోజుల పాటు
వంగిపోయిన నడుముతో ఒక యువతి
వృద్ధాప్యపు వరండాలో ఏకాంతంగా కూర్చుని
ఆనందపు ఉషోదయం కోసం వేచి వుంది

నూర్‌హస్సన్ వీరోచిత యువ అమరత్వం సాక్షిగా
ఓ స్వేచ్ఛా ! టైటాన్‌లాగా తల పైకెత్తి నిలబడు
పిడికిలి పైకెత్తి ఆకాశం బ్రద్ధలయ్యేలా గర్జించు
నిన్ను బంధించిన శృంఖలాలను త్రెంచివేసి
గర్జించు ! స్వేచ్ఛా ! గట్టిగా గర్జించు !

## ఈ దీనులను ఆదుకోలేమా?

**(79వ పేజీ తరువాయి)**

దానధర్మాలపై ఆధారపడ్డ 'సోనూసూదిజం' ప్రతిపాదిస్తున్నావా ఏమిటి అని అడగవచ్చును. సూద్‌ది దానం కాదు, జాలి కాదు, విచక్షణ, బుద్ధీ, జ్ఞానం వున్న మనం మన దగ్గరున్న కోట్ల రూపాయల్లో లక్షలూ, లక్షల రూపాయల్లో వేలూ, వేల రూపాయల్లో వందలూ సాటి మనుషుల కోసం వినియోగించటం పుణ్యం కోసమో, మరు జన్మలో ప్రధాని మోడీగా జన్మించడం కోసమో కాదు. ఈ సమాజం అందంగా ఆరోగ్యంగా కనిపించటం కోసం. అది ప్రారంభమైన మనకు వైజ్ఞానిక దృష్టి అలవడుతుంది. హేతువాదనా పటిమ అలవడుతుంది. ప్రాపంచిక సామ్యవాదం పలకరిస్తుంది. ఆరోగ్యకర సమాజం ఆవిర్భవించగానే ఆశయాలూ తలెత్తుతాయి. సిద్ధాంతాలు పలకరిస్తాయి. సమాజం ముందుకు అడుగులు వేస్తుంది. ఈ భావన కలగనంతవరకూ ఆశయాలు సినిమాల్లో, సిద్ధాంతాలు పార్టీల పుస్తకాల్లో న్యాయాన్యాయాలు రాజ్యాంగ పుటల్లో బాధ్యతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికల్లోకి చేర్చబడతాయి. మనం చేతులు కలుపుకుని 'సెల్'లో శృంగార సన్నివేశాలు చూసుకుంటూ పడకకుర్చీలో పడుకుని ప్రపంచ మానవాళి గూర్చి యోచిస్తుంటాం!? ❑


**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**

# S.V.K.P. ARTS & SCIENCE COLLEGE ASSOCIATION






Sri PITANI SURYANARAYANA
**President**



Dr.K.RAMACHANDRA RAJU M.D.,
**Secretary & Correspondent**



Sri VUDDAGIRI LAVAKUMAR, B.Com.,
**Treasurer**

## AND GOVERNING BODY MEMBERS & GENERAL BODY MEMBERS



DR.Y.V.V.APPA RAO
Principal degree college



K.V.R. SURYANARAYANA
Principal junior college

OUR INSTITUTIONS : **S.V.K.P & DR. K.S.RAJU ARTS & SCIENCE COLLEGE**

RECOGNISED BY UGC AS "COLLEGE WITH POTENTIAL FOR EXCELLENCE" ACCREDITED BY NAAC WITH 'A' GRADE,

Phones: 08819- 246126, 246926, EMAIL: svkp_penugonda@rediffmail.com (ATTACHED WOMEN'S HOSTEL AND SC & BC MEN'S HOSTEL)

Courses Offered : PG : MCA, MBA, M.Sc., : Organic Chemistry, Zoology & Botany UG : B.A., : History-Economics-Politics, History-Politics-Local self Government, B.SC., : Maths-Physics-Chemistry, Maths-Physics-Electronics, Chemistry-Botany-Zoology, Mathematics-Physics-Computer Science, Mathematics-Electronics-Computer Science, Chemistry-Zoology- Biotechnology, Microbiology-Biochemistry-Biotechnology, Mathematics-Chemistry-Computer Science B.COM : General and Computer Applications

**S.V.K.P & PITANI VENKANNA JUNIOR COLLEGE**

Phones: 08819- 246125, Attached SC & BC Men's & Women's Hostel

VOCATIONAL COURSES: Crop Production ( Ag ), Accounting & Taxation, Electronics Engineering Technology, Computer Science & Engineering, Medical Lab Technology, Desktop Printing Technology, Multipurpose Health Workers (MPHW),Automobile Engg., Technician (AET), Electrical Wiring and Servicing of Electrical Appliance (EWSEA)

INTERMEDIATE COURSES:
MPC ( EM & TM ),
BIPC ( EM & TM), HEC , CEC

**S.V.K.P & S.K.V.R GIRLS HIGH SCHOOL (TM & EM)**


**Jaateeya Spurthi,** Fortnightly Printed and Published by **N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**